బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి - 3

వచన కవితలు భాగం - 3

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి-3

వచన కవితలు: భాగం- 3

గిల్లి చెప్పుతున్నా, చివరి మెట్టుమీద శివుడు, ఒంటరి గొంతు

ప్రధాన సంపాదకులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

సంపాదకులు

ఆచార్య కర్రి సంజీవరావు 'శిఖామణి'

సహాయ సంపాదకులు

శ్రీమతి బోయి విజయేందిర

శ్రీ గనుమల జ్ఞానేశ్వర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

Boyi Bhimanna Samagra Sahityam
Volume 4 - Vachanakavitalu-Part -3
Padmabhushan Dr. Boyi Bhimanna - Sahitya Peetham
Potti Sreeramulu Telugu University
Hyderabad

డా॥ బోయి భీమన్న శతజయంతి ప్రచురణ

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ: డిసెంబర్ 2010
ప్రతులు : 1000
మూల్యం : రూ॥ 140/-
ISBN NO: 81-86073-201-4

ప్రతులకు:
రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004

ముద్రణ: చరిత ఇంప్రెషన్స్
అజామా బాద్, హైదరాబాద్

Grams: "TELVERS"

Phone: Off: 040-23234815
Tele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - 500 004

డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-2006న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి మాన్య శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డిగారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమ వంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచన కవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.

8. భీమన్న నాలుకోత్సవాల్ని నిర్వహించడం.
9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువాదం చేసే నిమిత్తం. ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి, పూర్తిచేయటం జరిగింది.

గడచిన మూడు సంవత్సరాలలో భీమన్న సమగ్ర సాహిత్యం పేరిట భీమన్న గేయ కావ్యాలు భాగం1, 2, భీమన్న పద్యకావ్యాలు భాగం 1,2, భీమన్న నాటకాలు 1,2, భీమన్న పీఠికలు భాగం 1,2, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న గ్రంథాలను ప్రచురించి విడుదల చేయడం జరిగింది. ఇది బోయి భీమన్న శతజయంతి సంవత్సరం.

డా॥ బోయి భీమన్న గారి వచన కవితా సంపుటులను అన్నింటినీ ఒకచోట చేర్చి కాలక్రమపద్ధతిలో విభజించి మూడు భాగాలుగా ప్రచురిస్తున్నాం. భాగం-1లో త్రిపదలు, అనాది కొన నుంచి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, 'ఓయి కవీ కవిత్వం రాయి!' కవితా సంపుటులున్నాయి. భాగం -2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్‌కు, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడిక్టులు కవితా సంపుటులున్నాయి. భాగం - 3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు కవితా సంపుటులున్నాయి. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ హక్కులు (2008) ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, పీఠం సలహామండలి సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

తేది: 6-12-2010

(అనుమాండ్ల భూమయ్య)

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ఆచార్య కె. సంజీవరావు
కన్వీనర్

గద్య కవితా విద్యాధరుడు బోయి భీమన్న

ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించి నిష్ణాతులనిపించుకొన్న కవులలో పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న ప్రథమ పంక్తిలోని వారు. వారి చేతిలో వచన కవిత కొత్త పోకడలను, ప్రయోగశీలతను సంతరించుకుంది. బయలుదేరిన చోటే ఆగిపోతే అది ప్రవాహము కాదు, అతను కవీ కాడు. నిత్య నజీవ స్రవంతిలా కవీ ముందుకు కదలాలి. పద్యరచనతో తన కవితా యాత్ర ప్రారంభించిన భీమన్న అటు తర్వాత గేయాన్ని, వచన కవితనూ సమాదరించాడు. తన సాహిత్య పరిణామ శీలత్వాన్ని గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో ఇలా వ్యక్తం చేసాడు.

ఆకాశంలో పద్యంగా ప్రవహించే వాణ్ణి
దూకి, గేయంలో పడ్డాను
అక్కడ నుంచి గెంతి, గద్యం మీద పడ్డాను.

ఆ గద్య కవితా ప్రక్రియ భీమ కవికి కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డును సంపాదించి పెట్టింది. 1973లో భీమన్న వెలువరించిన గుడిసెలు కాలిపోతున్నై గద్య కవితల సంపుటికి 1975లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలలో భీమన్న స్వీకరించిన సామాజిక ఇతివృత్త పరంపర భీమన్న వచన కవిత్వంలోనూ కొనసాగింది. ''కవిత్వంలో ఛందస్సుల మొక్కలు నాటను, భావనలో సామాన్యుని కామన దాటను'' అన్న కుందుర్తి మార్గానికి భీమన్న రచనలు దగ్గరగా ఉంటాయి. పద్యం రాయడం చేతగాక వచన కవిత్వం రాస్తున్నారన్న అపవాదును తొలగించిన వారిలో తిలక్, కుందుర్తి వంటి వారితో పాటు భీమన్న కృషి కూడా వుంది. తెలుగు కవిత్వంలో వచన కవిత ఇంకా పూర్తి స్థాయిలో ప్రవేశించని

కాలంలో భీమన్న 1962లో అనాది కొన నుంచి అనంతత్వంలోకి కవితా సంపుటిలో వచన కవితా రంగంలో ప్రవేశించారు. ''దాదాపు ఒక దశాబ్దానికి పూర్వమే శ్రీ బోయి భీమన్న గారు వచన కవితా రంగ ప్రవేశం చేసారు'' అని 14-3-1976 నాటి విశాలాంధ్రలో 'విస్తరిస్తున్న వచన కవిత' వ్యాసంలో పేర్కొన్నారు కుందుర్తి. 'అనాది కొన నుండి అనంతత్వంలోకి' కావ్యంతో మొదలైన వారి వచన కవితా యాత్ర 2006లో వారి మరణాంతరం ప్రచురించిన కుక్క మొరుగుతూనే వుంది వరకూ డజను కవితా సంపుటులలో విస్తరించింది.

దళితులగోడును తన వాణిగా వినిపించడం, ప్రకృతి పురుషుల ప్రణయం, ఆత్మ పరమాత్మల ఐక్యం, మూఢ దైవభావన తిరస్కరణ, రసాద్వైతం, జీవిత సత్యాలకు నిర్వచనాలు, తనదైన వ్యాఖ్యానాలు మొదలైన అంశాలు ఈ వచన కవితల నిండా పరచుకొని వున్నాయి. విస్తృతంగా రాయడం, ప్రతీచిన్న అంశాన్ని వస్తువుగా స్వీకరించడం, సూటిగా చెప్పాలనుకోవడం వల్ల ఈ వచన కవితల్లో కొన్ని చోట్ల వచనం పాలు ఎక్కువైనట్లుగా అనిపించవచ్చు. అయితే వస్తుబలం ఆలోపాన్ని కమ్మేస్తుంది.

భీమన్న వచన కవితా సంపుటులు మూడు భాగాలుగా వెలువడుతున్నాయి. మొదటి భాగం -1లో త్రివదలు, అనాది కొన నుంచి అనంతతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, ఓయి కవీ కవిత్వం రాయి కవితా సంపుటులు ఉన్నాయి. భాగం-2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్‌కు, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడిక్టులు, భాగం -3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు సంపుటులున్నాయి.

గిల్లి చెబుతున్నా: భీమన్న నఖక్షతాలు అనే ఉపశీర్షికతో ఉన్న ఈ మినీకవితల సంపుటి 1996లో అచ్చయింది. ధర్మసేన పేరుతో ఈ గ్రంథానికి కవి విపులమైన పీఠిక రాసుకున్నారు. గిల్లి చెప్పడం వెనక ఉన్న నఖక్షతాల పూర్వాపరాల్ని వివరిస్తూ, వర్ణాశ్రమ ధర్మాల్ని వ్యాఖ్యానించే ప్రయత్నం చేసారు. ఈ కావ్యం వసంత నఖం, గ్రీష్మ నఖం, వర్షా నఖం, శర న్నఖం, హేమంత నఖం, శిశిర నఖం, పునర్వసంత నఖం పేర్లతో ఏడు విభాగాలలో విస్తరించింది.

సమాజంలోని అనేక అంశాల మీద తనదైన వ్యాఖ్యానంతో ఈ మినీ కవితలు ఉన్నాయి. భీమన్న మినీకవితా ప్రక్రియను కూడా చేపట్టడం ఆయనలోని ప్రయోగశీలతను ప్రక్రియ వైవిధ్యాన్ని తెలియజేసే అంశం.

చివరి మెట్టుమీది శివుడు: ఇది 1998లో అచ్చయింది. ప్రాచీన ఆధునిక పద్యాలకు, పాటలకు భీమన్న గారు రాసిన పేరడీల సంకలనం ఇది. ప్రవేశికలో ''1934లో అంటే 64 సంవత్సరాల క్రితం కాకినాడ కాలేజీలో విద్యార్థిగా ఉంటున్నప్పుడు దేవులపల్లివారి ఏడుపు కవితలపై నేను రాసిన హేళన. అప్పుడు నాకు తెలియదు కాని ఇప్పుడనిపిస్తుంది. అదే నా తొలి పేరడీ అనవచ్చని.'' అని తన పేరడీ రచనకు ప్రేరణ చెప్పుకున్నారు భీమన్న. సహజంగా హాస్య చతురుడైన భీమన్న పోతన్నగారి అమ్మలగన్నయమ్మ పద్యంతో మొదలు పెట్టి రామదాను, గరిమెళ్ల, కుసుమధర్మన్న శ్రీశ్రీ మొదలుకొని పందలాది రచనలకు పేరడీలను కల్పించారు. ఇవి అధిక్షేపాన్ని, హాస్యాన్ని కలబోసుకుని పాఠకులకు గిలిగింతలు పెడతాయి.

ఒంటరిగొంతు: ఈ కవితా సంపుటి 2001లో అచ్చయింది. ప్రత్యూషం పేరుతో ఈ కావ్యానికి కవి రాసుకున్న ముందుమాటలో ''నాకు ఈ కోకిల ఎవరో ఒంటరిగా అరుస్తున్నదని, దానిగొంతు కూడా నా గొంతులాగే ఒంటరిగా స్పందిస్తుందని'' భావించి కావ్య రచనకు ఉపక్రమించారు. ఇందులో వసంత కోకిల, ఉపజ్ఞా కోకిల, మత్తకోకిల, శ్రావణ కోకిల, ఉన్మోదయ కోకిల, అనే ఐదు ఉపశీర్షికలతో మొత్తం 75 ఖండికలున్నాయి. కవి కోకిలను ఏకాంతంగా తనకేదో చెప్పవచ్చిన పరాత్పర వైతాళికగా భావిస్తాడు.

భీమన్న సమగ్రసాహిత్య సంపుటాలలో ఇతర సంపుటాలను ఆదరించినట్లే ఈ వచన కావ్య సంపుటాలను పాఠకలోకం ఆదరిస్తుందని నమ్ముతున్నాను.

బోయి భీమన్న గారి మొత్తం రచనలను సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతి భీమన్న గారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గుమ్మల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గుమ్మల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటిని గ్రంథముద్రణకు వీలుగా శుద్ధ ప్రతిని తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి, సహకరించిన డా॥ ఎమ్. కనకదుర్గ గారికి, శ్రీమతి సి. పుష్పలత గారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన చరిత ఇంప్రెషన్స్ వారికి కృతజ్ఞతలు.

తేది: 6-12-2010
హైదరాబాద్

కె. సంజీవరావు
సంపాదకులు

విషయ సూచిక

1.	గిల్లి చెబుతున్నా	1-335
2.	చివరిమెట్టుమీద శివుడు	337-524
3.	ఒంటరి గొంతు	525- 602

భీమన్న నఖక్షతాలు

గిల్లి చెప్తున్నా

(మినీ కవితల కదంబం)

(((((( ))))))

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1996

ప్రతులు : 1000

హక్కులు : రచయితవి

వెల : రూ॥ 116/-

కాపీలకు : భీమన్న సాహితీ నిధి
ఐసి 85, ఇరమ్ మంజిల్ కాలనీ
హైదరాబాదు - 82

కంపోజింగ్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్

ముద్రణ : బాగ్‌లింగంపల్లి
హైదరాబాదు - 44
ఫోన్: 660000

ఆదర్శ క్రియాదక్షులు, ఆత్మీయులు

బిళ్లవేదయ్యగారికి

భిల్లుడు ధర్మ వ్యాధుడు,
భిల్లుడు వాల్మీకి, శివుడు భిల్లుడు; ఆంధ్రన్
భిల్లయు బిళ్లయు నొకటే;
బిళ్ల కుటుంబ ప్రముఖ్య! వేద య్యాఖ్యా!

ప్రతిభకును, ప్రజ్ఞకును, ప్రాభవమ్మునకును,
శక్తి సామర్థ్యములకు, విధ్యుక్త ధర్మ
నిర్వహణ ధురీణతకు, సాంస్కృతిక కళల
సద్వినోదమ్ములకు వినోదమ్మ నీవు!

నైజ నిజ జీవితమున, రంగ స్థలమున
స్వచ్ఛతరము నీ పాత్ర, రాజస్వ వరము;
గిల్లి చెప్పెడి నా నఖాంకిత మనోజ్ఞ
కావ్య మంజరి గొను రక్తి కలదు నీకు!

అందుకె నా కావ్య కుమా
రిం దమి నీ కిత్తు గొనుము! ప్రీతిన్ గనుమా!
ఇందున సుందర కృతు లై
దొందల పై గలవు రసమయూఖా కృతులన్!

బిళ్ల వేదయ్యగా సామ వేద మూర్తి
నాకు దొరికిన సంతృప్తి నాకె కలదు,
లభ్యమౌ గాక లోక వాల్లభ్య కలశి
నీకు నీ వంశమునకు సుశ్లోక మధువు!

ఆది కాల మందు వేదాలవలె నేటి
కాలమునకు తగిన కవిత లివ్వి;
వచన కవిత లయ్యు వరణీయములు, భార
తీయ ధృతికి మానవీయ కృతులు!

-భీమన్న

ధర్మసేన

కాలాన్ని ఆరు రుతువులుగా గిల్లాను
అది ఇంకా సాగిపోతూ వుంటే – దాన్ని
అలా పునర్వసంతంగా వదిలేశాను
కాలం ప్రకృతి, నిరంతర శృంగార వతి!

గ్రంథానికీ, పీఠికకూ, వ్యాఖ్యకూ వేరు వేరు పేర్లు ఉంచడం మన సాహిత్య సంప్ర దాయంలో ఉంది.

ఒకే లక్ష్యం, ఒకే మార్గం, ఒకే శిక్షణ, ఒకే సిద్ధాంతం, ఒకే నాయకత్వం – ఈ పంచ సూత్రాలకూ కట్టుపడి, ముందుకు సాగే క్రమానుబద్ధ సమూహమే సేన అంటే.

సృష్టి ప్రణాళికలో పనికిరాని దంటూ ఏదీ లేదు. నిషిద్ధ మేదీ లేదు. దేని పరిధిలో అది ప్రతీదీ ధర్మ సేనే.

ప్రపంచంలోని అనేక సమాజాలలో కామం నిరసించబడింది. నిరసిస్తూనే అనుభవించే ఆత్మ వంచకత్వం, హిపోక్రసీ అనేక ప్రపంచ సమాజాలలో వుంది.

ఒక్క భారతీయ సమాజమే కామానికి గౌరవ స్థానం ఇచ్చి, ధర్మకామానికి దైవత్వం కల్పించింది.

అనేక ప్రపంచ సమాజాలలోని భావ ధోరణిలో దైవం ఏక వ్యక్తి. భారతీయ భావధోరణిలో దైవం బీజాంకురం.

అర్ధ నారీశ్వర తత్వం పరిధిలో లక్ష్మీ నారాయణులు, సరస్వతీ చతుర్ముఖులు, శివపార్వ తులు సంపూర్ణ దైవ భావానికి రూప కల్పనలు.

వృక్ష, జంతు వర్గాలలో కామానికి ఋతు నియమాలు వున్నై. మానవ వర్గానికి లేవు. సృష్టి సహజమైన ఈ కామప్రవృత్తిలో మానవులలో వచ్చిన ఈ విలక్షణతను కంట్రోలు చెయ్యడానికి ధర్మ కామాన్ని అంగీకరిస్తూ, స్వేచ్ఛా కామాన్ని నిషేధించారు సంఘ పెద్దలైన మన రుషులు.

అందువల్లనే మానవ సమాజం ఒక క్రమంలో వికసించగలిగింది.

మధ్య మధ్య రౌడీలూ, రాక్షసులూ సమాజాన్ని అల్లరి పెడుతూవున్నా, వాళ్లందర్నీ అణచివేస్తూ, మెజారిటీ సమాజం మెజస్టిక్‌గా పురోగమించగలుగుతున్న దందువల్లనే.

మానవాత్మ మహితాత్మగా వికసించడానికి మూలభూతం ఈ ధర్మ కామమే. ఒక ప్రక్క జ్ఞాన విజ్ఞానాలతో కూడిన మేధావిత, మరో ప్రక్క ప్రేమ సౌందర్యాలతో కూడిన హార్దికత సమానంగా ప్రవర్ధమైనై మానవతలో.

హృదయానికి సంబంధించిన ప్రేమ, సౌందర్యాలే సంగీత సాహిత్య చిత్ర శిల్పాది కళ లన్నిటికీ ఆధారాలు. ప్రేమ సౌందర్యాలతో జ్ఞాన విజ్ఞానాలు ఒరుసుకొన్నప్పుడు మెరుపులు వెలువడతై. ఆ మెరుపులే వ్యంగ్య వైభవాలు. అవే పరమాత్మీయ సౌందర్య నిశ్రేయ సానందం లోకి ద్వారాలు. ఎంత సూక్ష్మాలో అంత సువిశాలాలు.

మధుర బాధ

బాధలు అనేకం. అసలు శరీరమే ఒక బాధల రాశి. అనేక బాధల కలయికతో ఏర్పడ్డ రూపం.

ప్రతి జీవీ, ప్రతి క్షణమూ ఏదో బాధతో, బాధలతో సతమతమవుతూనే వుంటుంది. అది సహజం.

నామం, రూపం, గుణం – ఇందులో ఏ ఒక్కటైనా సరే అది పుట్టిందంటే, దానికి కారణం ఏదో ఒక సంఘటనమే. ఏ ఘటనాఘటన సంఘటన కైనా హేతువు రెండు శక్తుల ఘర్షణమే. స్నేహ శక్తుల ఘర్షణ సృష్టి. వైరశక్తుల ఘర్షణ లయం.

(వైజ్ఞానిక భాషలో చెపితే – స్నేహ శక్తులంటే ఒక పాజిటివు, ఒక నెగిటివు. వైర శక్తులంటే రెండూ ఒకే ముఖానికి చెందిన పాజిటివు లేక నెగిటివు.)

జీవితంలో బాధలు ఎన్నెన్ని రకాలుగా వున్నా, ప్రేమ శృంగారాలకు చెందిన బాధలనే మధుర బాధ లంటాం.

ఇతర బాధలకు మన అధీనంలో లేని దేశ కాల పాత్రాదులు కారణం కావచ్చు. మధుర బాధలకు మాత్రం కారణం మనమే. ఇవి మనం కోరి తెచ్చుకొన్నవే. ఈ

మధుర బాధలు రెండు విధాలు. సంభోగ శృంగారంలోని అష్టోపరతులు, విప్రలంభ శృంగారంలోని దశవిధావస్థలు. ఈ పద్దెనిమిదీ కూడ మధుర బాధలే.

ప్రసవ వేదన వంటిదే మరణ వేదన. ఒకటి ప్రవేశ ద్వారంలోని ఒరపిడి. రెండోది నిష్క్రమణ ద్వారంలోని తోపిడి. జగన్నాటక రంగంలోకి ప్రవేశం కనుక మొదటిది మధుర బాధ.

మరణం మూడు విధాలు

ఒకటి: సహజ మరణం. ఇది వృద్ధాప్యంలో ముగ్గిన పండులా రాలిపోవడం.

రెండు: దుర్మరణం. ఇది అనేక విధాలు, ప్రమాదాలు, పోరపాట్లు, వ్యాధులు, దురల వాట్లు, సాహసాలు, శత్రుత్వాలు, దౌర్జన్యాలు వగైరాల వల్ల మరణం సంభవించవచ్చు. హత్యలు, మానభంగాలు, బలులు వంటివన్నీ ఈ తరగతి కిందికే వస్తాయి.

మూడు: మధుర మరణం. విప్రలంభ శృంగారంలోని దశమావస్థ యిది. ప్రేమ కోసం ఆత్మార్పణ చేసుకోవడం, ఆమరణ నిరశన వ్రతం, బెంగపెట్టుకొని చచ్చిపోవడం, బ్రహ్మరంధ్ర భేదనం, జీవ సమాధి వంటి స్వచ్ఛంద మరణాలు ఈ కోవలోని.

ధర్మ సేన లక్ష్యం సమాజాన్ని, వ్యక్తిని, వ్యవస్థను ధర్మ మార్గంలో నడపడం. ఎక్కడైనా, ఎప్పుడైనా అధర్మం సంక్రమించినప్పుడు దాన్ని తొలగించడం. ఈ ధర్మ సేనను రసరంగం నుంచి రాజకీయ రంగానికి మార్చాలన్న నా ప్రయత్న రూపమే ఈ నఖక్షతాలు. గిల్లినందుకు కోపించకండి. గిల్లి హెచ్చరిస్తున్నందుకు సంతోషించండి.

నఖక్షతం

నఖక్షతం అనే మాట శృంగార శాస్త్రానికి చెందిన సాంకేతిక పదం.

సెక్సును పాశ్యాంశంగా బోధించాలని ఈనాడంటున్నాం. జ్ఞానం, విజ్ఞానం దృష్టిలో మానవ శరీరానికి సంబంధించి రహస్యంగాని, అసభ్యంగాని ఏమీ లేదు.

మనోజాడ్యాలతోను, శారీరక వికారాలతోను బాధపడే వృద్ధ సన్యాసు లెంతగా గోల పెడుతూ వెనక్కి లాగుతున్నా, సమాజం ముందుకు పోతూనే వుంది. దిగంబరోద్యమాలు మొత్తం మీద అన్ని దేశాలలోను కొనసాగుతూనే వున్నై.

బహుశా వాటన్నిటికీ మన శ్రీశుక, వేమన యోగులే గురువులేమో పరిశోధించవలసి వుంది.

"తల్లి కడుపు నుండి తా వచ్చి నప్పుడు
మొదల బట్ట లేదు, తుదను లేదు
నడుమ బట్టకట్ట నగుబాటు కాదొకో" అన్నాడు వేమన.

వేమన మహాయోగి. మహాకవి. మహాపురుషుడు. మహాప్రవక్త. వేమన మరో దేశంలో మరో జాతిలో పుట్టివుంటే – ప్రపంచ ప్రవక్త లంతా ఆయనలో లయించిపోయి, ఆయనొక్కడే పరమప్రవక్తగా విరాజిల్లే వాడు. మతాలన్నీ ఆయనలో విలీనమైపోయి, లోకంలో ఒక్క వేమన మతమే నిలిచివుండేది. మానవజాతికి అదృష్టం లేక, ఆయన కులవ్యవస్థా దూషితమైన నేటి హిందూ సంఘంలో పుట్టాడు.

అన్నాన్ని బ్రహ్మ స్వరూపంగా ప్రకటించి, యజ్ఞం ద్వారా అన్నంపై సమస్త జనులకూ సమాన హక్కుల్ని ప్రసాదించిన వాళ్లూ, కామానికి పురుషార్థాలలో సముచిత స్థానం కల్పించిన వాళ్లూ మన ఆర్ష ఋషులే. జీవితంపట్ల వాళ్ల దృక్పథం అంతటి వాస్తవికమూ, హేతు బద్ధమూను.

సంభోగ శృంగారం కంటె విప్రలంభ శృంగారమే ఉత్తమమైనదని చెపుతూ కూడ, మొత్తం మీద దేనికైనా ఆనందస్థాయి రతే కనుక, దానిని చేరుకొనే సోపాన క్రమాన్ని నిరూపించి చెప్పారు. భావప్రాప్తికీ, బ్రహ్మైక్యానికీ మార్గం చూపారు.

నఖం అంటే గోరు. క్షతం అంటే గాటు, నరుకు, గాయం. నఖక్షతం అంటే గోరు గుచ్చుకోవడం వల్ల అయిన గాయం.

అయితే – పిల్లలో, విరోధులో గిచ్చుకోవడం, రక్కుకోవడం, పీక్కోవడం వల్ల అయే గాయాలను నఖక్షతా లనం.

నఖక్షతా లంటే – ప్రేయసీ ప్రియులు ఒకరి నొకరు అనుభవించే కోరికతో, మైమరిచిన పెనుగులాటలో, ఉద్రేకోత్సాహాల పట్టు విడుపుల కారణంగా కలిగే గోటి గాటులు.

అవి అర్ధచంద్రాకారంలో పడే నెలవంకలు కావచ్చు. నెత్తురు చిందే గోరు వంకలూ కావచ్చు. వీటిని ఇంగ్లీషులో నెయిల్ మార్క్స్ (Nail marks) అనీ, హిందీలో నఖోంకె నిశాన్ అనీ అంటారు.

మిత్ర ధర్మం

మిత్రుణ్ణి ఒక ప్రమాదం నుంచి రక్షించాలనుకొన్నప్పుడు, శత్రువును సాధించాలను కొన్నప్పటి వలెనే, చతుర్విధోపాయాలనూ ప్రయోగించవలసి రావచ్చు.

మానవులు అనేక రకాలు, వాళ్ల వాళ్ల మెదళ్లు చెందిన పరిణతిని బట్టి ఆయా రకాలు వుంటై. అందులో మెజారిటీ వేళ్లు, ఆకులు, కొమ్మలు, ముళ్లు, మొగ్గలుగానే వుండి పోతుండగా – కొందరు పువ్వులుగా, మరికొందరు ఫలాలుగా వికసించడం, ఫలించడం జరుగుతూ వుంటున్నది.

ఈ వాస్తవం వికాసానికి సంబంధించిందే కాని, ప్రయోజనానికి సంబంధించింది కాదు. ప్రయోజనం, ప్రాధాన్యం వేళ్లకూ పుష్ప ఫలాలకూ సమానమే. వేళ్లు లేకుండా కందమూలాలు లేవు. మూలికల రూపంలో కూడ వేళ్లకు ప్రత్యేక ప్రయోజన ముంది.

ఈ అనేక రకాల మనుషులలో, మెదడు పరిపక్వతను బట్టి, ఒకోరకం మనుషులను ఒకో ఉపాయం ద్వారా సక్రమ మార్గంలో పెట్టవచ్చు. మరీ మూర్ఖుల విషయంలో దండో పాయం తప్పదు. ఈ నాలుగో ఉపాయాన్ని ప్రయోగించడం తప్పనప్పుడు అది రెండు విధాలు. మిత్ర పద్ధతి, శత్రు పద్ధతి.

ఒక మిత్రుణ్ణి దుర్మార్గం నుంచి మళ్లించాలనుకొన్నప్పుడు, అతడు మంచి సలహాలను వినగలిగి లేనప్పుడు – బెదిరించో, నిందించో, గాయపరిచో, నిర్బంధించో అతణ్ణి సరిదిద్ద యత్నించడం మిత్రధర్మం.

గాయపరిచి అయినా సరే మిత్రుణ్ణి కాపాడక తప్పదు. అయితే అట్టివాడు ఏ ఆయుధంతో అయితే తన మిత్రుణ్ణి గాయపరచదలిచాడో, ఆ ఆయుధానికి గాయాన్ని మానిపే మందును కూడ పూస్తాడు. ఆయుధానికి శత్రువు విషం పూస్తే, మిత్రుడు మాను మందు పూస్తాడు.

ఈ మాను మందునే సాహిత్యంలో ధ్వని, వ్యంగ్యం, వక్రోక్తి, వగైరా పేర్లతో పిలుస్తారు. అందుకే మిత్రుడిలా సలహా చెప్పే పురాణాలు అంత జనామోదం పొందాయి. ప్రియకాంతలా ఉపదేశం చేసే కావ్యాలు సహృదయ రంజకాలైనై.

''అయితే – ఇది పాతకాలపు మాట'' అంటాడు, మా యూత్ లీగ్ లీడరు.

''మరి, కొత్త కాలపు మాట ఏది?''

ఏది ఆధునికత

ఆజ్ఞాపించే వేదాలను, సలహా చెప్పే పురాణాలను, హృదయ పరివర్తన కలిగించే కావ్యాలను పాత చెత్తకుండీలో పారేద్దాం. సరే పారేద్దాం. చాలవరకు పారేశాం కూడ. ఎవరో కొద్ది మంది నాలాంటి వాళ్లు తప్ప, ఈ నాడెవరూ వాటి పేర్లెత్తడం లేదు. మంచిది.

పాతను రాల్చేస్తూ, కొత్త అందాలను విరబూస్తూ ముందుకు పోవడం ప్రగతి.

తరం వెంట తరంగా యువకులు పుట్టుకొస్తూనే వున్నారు కదా? ఈనాటి తరం యువకులు, నిన్నటి తరం యువకుల కంటె ఎంత ముందుకు పోగలిగారు?

ఆలోచించ గలిగిన వాళ్లెవరైనా వుంటే, ఆలోచించి చెప్పండి!

సాధారణ అవగాహన ప్రకారం తరం అంటే ముప్పై సంవత్సరాలు. మూడు తరాలు ఒక జీవితం. తొంభై యేళ్ల తాతకు అరవై యేళ్ల కొడుకు, ముప్పై యేళ్ల మనుమడు వుండాలి.

ఈ ప్రణాళిక ప్రకారంచూస్తే – ఒక మనిషి జీవిత కాలంలోనే మూడు తరాల కృషి కనిపిస్తుంది. కొడుకుతరం ముగింపుకు రాగా, మనుమడి తరం ఉజ్వలంగా వెలిగిపోతూ ఉంటుంది. ముని మనుమడు (వుంటే) పదేళ్ల లోపువాడుగా వుంటాడు.

ఇప్పుడు నేనడుగుతున్న ప్రశ్నలను అర్థం చేసుకోండి.

1. ఒక తొంభై యేళ్ల తాతగారు తన యౌవనంలో సాధించిన ఫలితాలకంటె ఆయన కొడుకు తన యౌవనంలో సాధించిన ఫలితాలు గొప్పవిగా వుండాలి. ఎక్కువ అభ్యుదయ కరమైనట్టివిగా వుండాలి. పాత కొత్తల మధ్య, భూత వర్తమానాల మధ్య

జనరేషను గేపు (Generation gap) స్పష్టంగా కనుపించేలా ఉండాలి. మరి అవి అలా వుంటూన్నయా?

2. సమాజాభివృద్ధి కోసం తండ్రి కంటె కొడుకు, తాత కంటె మనుమడు సాధిస్తున్న అధికతర విజయాలేమిటి?

3. మానవజాతి ఒక వ్యవస్థగా ఏర్పడి పురాణాలకు అందినప్పటి నుంచి దానిని పరిశీలించి చూచినా – నాటి నుంచి నేటి వరకు సాధించబడిన అభ్యుదయం ఏమాత్రం?

4. సహజంగా కాలానుగుణంగా పరిసరాలలో, పద్ధతులలో వచ్చే మార్పులను అలా వుంచితే – మానవ స్వభావంలో నాటికి నేటికి ఏమాత్రమైనా ఉత్తమత్వం, ఔన్నత్యం, సర్వజనీ నత్వం కనిపిస్తున్నదా?

5. ఉదాహరణకు రామాయణ కాలం తీసుకుందాం. ఆనాటి మానవ గుణశీలాలతో ఈనాటి మానవ గుణ శీలాలను పోల్చి చూద్దాం, స్త్రీ లోలత్వం, వాగ్దాన భంగం, పుత్ర వ్యామోహం, పక్షపాతం, మోసం, దగా, పగా వగైరా దుర్గుణాలలోనూ, స్త్రీ అపహరణలు, రేపులు, దొంగదెబ్బలు, అధర్మ యుద్ధాలు, శీల శంకలు, బంధు మిత్ర భ్రాతృ ద్రోహాలు వగైరా దుర్మార్గాలలోనూ ఈనాటి ప్రజాస్వామిక రాజకీయ పెత్తందార్లు ఆనాటి రామాయణ ప్రముఖ పాత్రల కంటె ఏం తక్కువ?

6. వేల సంవత్సరాల పూర్వపు రామాయణ కాలం నాటి మనుషుల కంటే ఈ నాటి ప్రజాస్వామికంలోని మనుషులు ఏ విధంగా ఉత్తములు?

సూక్ష్మంగా పరిశీలించి చూస్తే, గుణ శీల ప్రవర్తనల స్వభావంలో ఆదిమ కాలపు అనాగరిక మానవు డే స్థాయిలో వుండేవాడో, ఈనాటి అణు విజ్ఞానపు నాగరిక మానవుడు అదే స్థాయిలో వున్నాడనేది వాస్తవం. మౌలికమైన మార్పు ఏదీ రాలేదు.

అవే భావాలు, అవే స్వార్థాలు, అవే ఆవేశాలు, అవే రాగద్వేషాలు, అవే మోసాలు, అవే పోరాటాలు, అవే స్వపర భేద పక్షపాతాలు. ఏ మార్పూ లేదు.

ఆదిమ కాలానికీ, అణు యుగానికీ, సనాతనత్వానికీ, ఆధునికతకూ, ఆనాటి అహ ల్యకూ, ఈనాటి అంజనమ్మ (నిమజ్జనం సినిమా హీరోయిను)కూ ఏమిటి తేడా?

ఆయుధం అదే. దాని రూపంలోనే తేడా! మానవ హింస అదే. ఆయుధ ప్రయోగం లోనే తేడా!

కాగా, ఏ దేశంలోకాని, ఏ కాలంలో కాని, తరం తర్వాత తరంగా – వృద్ధుల కంటె యువకులు సాధిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొనే అభ్యుదయం ఏముంది? ఏం లేదు.

తాతగారి అడుగుజాడల్లోనే మనుమడు నడుస్తున్నాడు. అవ్వగారి ఆచారాలనే మనుమరాలు అనుసరిస్తున్నది. వేల సంవత్సరాల క్రితం పుట్టి పోయిన ప్రవక్త గారి తెలిసీ తెలియని సూత్రాలనే ఈనాటి అత్యాధునిక సైన్సు విద్యార్థి పట్టుకు వేలాడుతున్నాడు. ఇంకెక్కడి ప్రగతి. ఇంకెక్కడి అభ్యుదయం?

ఇక్కడ నేను చెప్పదలచిన విషయం క్లుప్తంగా ఇది–

(1) సనాతనత (Orthodoxy), ఆధునికత (Modernity) అనేదేం లేదు.

(2) జ్ఞాని, అజ్ఞాని, శక్తి, అశక్తి, బలవంతుడు, బలహీనుడు, క్రూరుడు, దయాళువు, స్వార్థపరుడు, దానశీలుడు, కలవాడు, లేనివాడు అనే భేదాలు తప్ప, మనిషికి జాతి మత వర్గ వర్ణ పరమైన భేదాలేం లేవు.

(3) మానవ బీజాణు నిర్మాణంలోనే సహజ సిద్ధమైన మౌలిక పరిణామం ఏర్పడ కుండా, మానవుడి గుణశీల ప్రవర్తనలు మారవు. దేశకాల పరిస్థితుల కనుగుణంగా తన ముట్టడి, రక్షణ, వ్యూహ, కవచాదుల్ని మార్చుకొంటూ వుంటాడంతే.

(4) మనిషి మారాలంటే అతడి జీవ లక్షణమే మారవలసి వుంది. అంతవరకు మనిషి మనిషే. అతడి మనుష్యత్వంలోని ఉద్దేశాలు, ఆవేశాలూ (feelings & emotions) అలానే వుంటాయి.

(5) మనిషి పరిణామ క్రమంలో తరువాతి మెట్టు మహేశ్వరత్వం. అది ఎప్పుడో, పరిణామ క్రమంలోనో, హఠాత్తుగానో జరగవలసి వుంది. సర్వజీవ సములూ, దయాధర్మ నిధులూ, జ్ఞాన జ్యోతిర్మయులూ, లోక సామస్త్య కళ్యాణ కాములూ అయిన

పరమ సాధువుల నుంచి అట్టి మహేశ్వర జీవజాతి మొగ్గదొడగ వలసి వుంది. అట్టి పరమోత్తమ జీవజాతి సృష్టికి మార్గం సరళతరం చెయ్యడం మొత్తం మీద నా సాహిత్య కృషికి లక్ష్యం. ప్రధానంగా ఈ వ్యంగ్యాత్మక మినీ కవితల ప్రకటనకు తక్షణ ప్రయోజనం అదీ.

మనిషి మనిషే

లోకంలోని వివిధ మానవుల గుణకర్మలను పరిశీలిస్తూ వున్నప్పుడు నాకొక సత్యం గోచరిస్తూ వుంటుంది. అది – డార్వీను మహాశయుడి పరిణామ సిద్ధాంతం సవరించవలసి వున్నదనేది.

ఎంతో పరిశీలన తర్వాత, నేను ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం ఇది –

మానవ జాతి అంతా ఏదో ఒక్క జంతు (మర్కట) జాతి నుంచి పరిణమించిన జాతి కాదు. ఏదో ఒక్క ప్రాంతంలో పుట్టిందీ కాదు.

ఒక్కొక్క జాతి జంతువు నుంచి ఒక్కొక్క జాతి మానవుడు పరిణమించాడు. వాళ్ల వాళ్ల గుణ కర్మలను, చేష్టలను, ప్రవర్తనలను, ఆలోచనలను పరిశీలించి చూడండి. ఒకో మనిషి ఒకో జంతువుకు వారసుడైనట్టు స్పష్టపడుతుంది.

ఇక్కడ జాతి అంటే నా ఉద్దేశం ట్రైబ్ (tribe) అని గాని, రేస్ (race) అని గాని కాదు. జాతి అంటే ఒకొక జంతు జాతి అని నా ఉద్దేశం. ఏ ట్రైబుకు, ఏ రేసుకు చెందిన వాడైనా సరే, ఒకో మనిషి వ్యక్తిగా ఒకో జంతు జాతికి చెందిన వాడని నా సిద్ధాంతం.

ఒక తల్లిదండ్రులకు పది మంది సంతానం వుంటే, ఆ పది మందీ పది జంతు జాతులకు చెంది వుండే అవకాశం వుంది. ఒకడు కుక్కలా ఎవరికో విశ్వాస పాత్రుడుగా బ్రతుకుతాడు. మరొకడు పులిలా రౌడీగా తిరుగుతాడు. వేరొకడు ఎద్దులా కాయకష్టం చేసుకుంటూ గడుపుతారు. ఇంకొకడు మనిషిలా పరోపకారిగా జీవిస్తాడు. ఈ మనిషిలా బ్రతికే వాడే నిజమైన మానవుడు. జంతుస్థితి నుంచి మానవ స్థితికి సంపూర్ణంగా పరిపూర్ణంగా పరిణమించిన వాడు.

తక్కిన వాళ్లంతా ఆయా జంతు వాసనలు వదలని వాళ్లే. అయితే ఈనాడు ఈ జంతు ప్రకృతులే మెజారిటీ కనుక – సిసలైన మానవుడు నూరు కాకుల్లో ఒక కోకిల వలె ఉపేక్షకు, హింసకు, అవమానానికి గురవుతున్నాడు.

జంతు సహజమైన ఉద్రేకాలు, దురాక్రమణలు, హింసలు, కామాంధతలు, పాము పగలు, హత్యలు ఇవన్నీ అందరు యువకుల్లోనూ, అన్ని కాలాల యువకుల్లోనూ వుంటున్నై.

వాళ్లు క్రమంగా వృద్ధులైపోతూ వున్నారు. కొత్త యువకులు పుట్టుకొస్తూ వున్నారు. మిడిసి పడుతున్నారు. వాళ్లూ వృద్ధులైపోతూన్నారు. పుట్టడం, విర్రవీగడం, వృద్ధులు కావడం, చావడం తప్ప ఇన్ని యుగాలుగాను ఈ నెత్తురు మండే యువకులంతా ఏం వుద్ధరించినట్టు?

కొన్ని వేల సంవత్సరాల పూర్వం, కృతయుగంలో, ఇంద్రుడు అహల్యను రేపు చేశాడు. రావణుడు రంభను రేపు చేశాడు. మరి ఈనాడు? ఈ రకమైన దురంతాలు మరీ ఎక్కువై పోలేదా? మనం రామాయణ కాలంనాటి కంటె నైతికంగా ముందుకు వెళుతున్నామంటారా? వెనక్కి వెళుతున్నామంటారా?

నెత్తురు పొంగులెత్తే ఆ కొద్ది సంవత్సరాల పాటు తోకలెత్తి గంతులేస్తూ అనుభవజ్ఞులూ, జ్ఞాన వృద్ధులూ అయిన మేధావులను ముసలి తాతయ్యలంటూ అవహేళన చేస్తూ – క్షణికా వేశాలతో బస్సుల మీదా, గురువుల మీదా, అమ్మాయిల మీదా రాళ్లు విసురుతూ పరుగులు తీసే యువకులు తమ యౌవనంలో సాధించిందీ, సాధిస్తున్నదీ ఏమిటి?

నవనాగరిక విద్యావంతుడైన నేటి యువకుడు ఈ ఒక్క ప్రశ్నా వేసుకొని జవాబు చెప్పుకోవాలి. ''నా తండ్రి కంటె, తాత కంటె, ముత్తాత కంటె నేను సాధించిన మానవాభ్యు దయం ఏమిటి?''

తన తండ్రి తాతకు తద్దినం పెడుతున్నాడు. తాను తండ్రికి తద్దినం పెడతాడు. అంతే కదా?

ఈ దేశంలో – పిచ్చిపనులూ, వెర్రి కేకలూ తప్ప, ఇన్ని శతాబ్దాలుగా మన యువకులు సాధించిందేమీ లేదు. ఈ సత్యాన్ని గుర్తింప జేయడం కోసమే ఇంతగా చెప్పుకొచ్చాను.

యువకులు తమాయించుకొని, ఆలోచనతో ముందుకు సాగవలసి వున్నదనేదే నా ఉద్బోధ.

ధనార్జనకూ, దర్పానికీ, అధికారానికీ, అవినీతికీ పరిమితులున్నై. తస్మాత్ జాగ్రత్త!

వేద యుగం నుంచి నేటి దాక మనిషి ప్రవర్తనలో, ప్రకృతిలో, ఆలోచనలో, ఆచరణలో ఏవిధమైన మార్పూ లేదు. మానవుడు ఉత్తమ మానవుడుగా పరిణమించాలి. అందుకు విప్లవాత్మకమైన మార్పు రావాలి. అందుకోసం ధర్మసేన ఏర్పడాలి.

నీతి సూత్రాలు, సుభాషితాలు, సామెతలు, నానుడులు మొదలైన జీవితానుభవ నిత్యసత్యాలు వేలకొలదీ, లక్షల కొలదీ వున్నై మన వాఙ్మయం నిండా. అందులో ఒక్కటైనా అమలు జరుగుతున్నదా అనేది నా ప్రశ్న.

సమాజం కొన్ని హద్దులకు కట్టుబడి వున్నదంటే, మానవుడు కొన్ని నియమాలను పాటిస్తున్నాడంటే, అందుకు కారణం ప్రతి క్రియా భయం మాత్రమే.

తా నొకటి కొడితే అవతలి వాడు రెండు కొడతాడనే భయమే మనిషిని అదుపులో వుంచుతున్నది. అదే సమాజ వ్యవస్థకు పునాది అయింది. మనిషి ఒక్క భయానికి మాత్రమే లొంగుతాడు. ఈ సత్యాన్ని పురస్కరించుకొని ఏర్పడినట్టివే పోలీసు, మిలిటరీ వ్యవస్థలూ, శిక్షా స్మృతులూ.

సారాంశం ఏమిటంటే – ఎంతమంది మేధావులు, రుషులు ఎన్నెన్ని జీవిత సత్యాలను, సుభాషితాలను ప్రకటించి హెచ్చరించినా, మానవుడు ఇంతవరకు నైతిక జీవి కాలేకపోయాడు. ధర్మజ్ఞాని కాలేక పోయాడు. జంతు ప్రవృత్తిని వదులు కోలేక పోయాడు. పైపెచ్చు – జన సంఖ్య పరిమితిని దాటి పెచ్చరిల్లడం వల్ల – తిండి కోసం, తిండిని కొనగల డబ్బు కోసం నీతి నియమాలన్నిటినీ వదిలేసుకొని ఏ గడ్డినైనా కరవడానికి సిద్ధపడుతున్నాడు.

అందుకే నేను హెచ్చరిస్తున్నాను. ఆగండి! ఆగి ఆలోచించండి! మనం ముందుకు పోతున్నామా? మళ్లీ పశు దశలోకి తిరోగమిస్తున్నామా?

వర్ణాశ్రమాలు - నాడు, నేడు

రాజరికం, సార్వభౌమత్వం, నియంతృత్వం ప్రజాపాలన చేసినప్పుడు - పరిపాలించే ప్రభు సింహుడు, ప్రజా గోవుల మంద మధ్య విగ్రహంతో అయినా నిలువ గలిగాడు కాని-

ఈనాడు ప్రజాస్వామికంలో గోవుల మంద మధ్య విహరిస్తున్నది ఒక్క సింహరాజే కాదు. వందలకొలదీ ఉప సింహాలు! వేల కొలదీ తోడేళ్లు! లక్షల కొలదీ నక్కలు!

ఆశ, స్వార్థం, ధనసేకరణ - తప్ప ఈనాడు పాలకులకు మరో ధ్యాస లేదు. మరో పని లేదు. దేశ శ్రేయస్సు, ప్రజా సంక్షేమం, పరోపకారం, ఔచిత్య జ్ఞానం, సహృదయత, మానవత్వపు విలువల పరిగణన - ఏం లేవు.

దేశాన్ని, దైవాన్ని, జ్ఞానాన్ని సొంతం చేసుకొని, వాటిని ప్రజలకు లేకుండా చేశారు బలవంతులైన దురాక్రమణదారులు. వేద కాలంలో వర్ణ వ్యవస్థ లేదు. ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ ఋషులు ఎవరికి తోచిన భావాలతో వారు గానం చేశారు. ఆ భావాలు వారి వారి ధ్యాన సమాధి నుంచి వచ్చినందువల్ల, వాటిని అపౌరుషేయాలన్నారు.

ఆ తర్వాత - ప్రకృతికి అతీతమైన, ప్రకృతినే నడిపిస్తున్న ఒక పరమ శక్తి ఉన్నదన్న సత్యాన్ని అరణ్యాలలో తపస్సు చేసుకుంటున్న ఋషులు గుర్తించారు. ఆ పరమ శక్తే పురుష శక్తి, సృజన శక్తి, బ్రహ్మ అన్నారు. బ్రహ్మను గుర్తించడమే బ్రహ్మ జ్ఞానం. బ్రహ్మ జ్ఞానం కల వాళ్లను బ్రాహ్మణులు అన్నారు.

బ్రాహ్మణము, బ్రాహ్మణ కులము, బ్రాహ్మణ మతము మొదలైనవన్నీ ''బ్రహ్మ'' అనే మాట నుంచి పుట్టినవే. అర్థాలు మాత్రం వేరు వేరు. బ్రాహ్మణము అంటే బ్రహ్మ జ్ఞానం గురించి చెప్పే శాస్త్రం. బ్రాహ్మణ కులం అంటే ఈనాడు హిందూ సమాజంలో వున్న అనేక కులాలలో ఒకటి. బ్రాహ్మణ మతం అంటే వర్ణాశ్రమ ప్రాతిపదికగా కల ఒక మతం.

బ్రాహ్మణుడు అంటే పూర్వకాలంలో వుండే అర్థం బ్రహ్మజ్ఞానం కలవాడు అని. అందుకే ఆ కాలంలో ఎక్కడ ఎలా పుట్టిన వాడైనా, బ్రహ్మజ్ఞానం కల ప్రతివాడూ బ్రాహ్మణు డైనాడు. తపస్సు చేసిన ప్రతివాడూ ఋషి అయినాడు. పుట్టుకతో కులం ఏర్పడడమనేది లేనే లేదు. కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఆనాడు లేనే లేవు.

వర్ణ ధర్మాలంటే వృత్తి ధర్మాలు. ఎవరు ఏ వృత్తిని చేబట్టిరో వాళ్లు ఆ వృత్తి నీతి నియమాలను పాటిస్తూ, అందులో పూర్తి నైపుణ్యాన్ని సాధించాలి. సాధారణంగా వృత్తిని మార్చుగూడదు. తాను ఎన్నుకొన్న వృత్తిలో విఫలుడై, మరొక వృత్తిలో ప్రబలుడైన వ్యక్తి వృత్తిని మార్చుకోవచ్చు. అంటే వర్ణాన్ని మార్చుకోవచ్చు.

అలాంటి మార్పిడులు అసాధారణ ప్రతిభావంతులైన వ్యక్తుల విషయంలోనే జరుగు తుండేవి. కాలేజీలు, ప్రభుత్వోద్యోగాలు లేని ఆనాటి గ్రామ స్వరాజ్యపు రోజులలో సామాన్య ప్రజలకు అలవాటైన కులవృత్తే ఫలప్రదంగా, సుభద్రంగా వుండేది. గొప్ప ప్రతిభావంతులు, సాహస వంతులు, మహర్షులు మాత్రమే కులవృత్తిని ధిక్కరించి అతీత శక్తితో భాసించ గలిగే వాళ్లు.

ఆశ్రమ ధర్మాలు సాంఘిక జీవితానికి సంబంధించి నట్టివి. వర్ణ ధర్మాలను, అంటే వృత్తి కర్తవ్యాలను అనుసరించి జీవిస్తూ, ప్రతి వ్యక్తీ కూడ తన సాంఘిక కర్తవ్యాలను యథావిధిగా నిర్వహించవలసి వుండేది.

చదువు, శిక్షణ పూర్తయ్యేదాకా ప్రతి యువకుడూ నిష్ఠగా బ్రహ్మచారిగా జీవించ వలసి వచ్చేది. అది చాల గొప్ప పద్ధతి. విషయ వాంఛలు మనస్సును చలింప చేస్తాయి. ఏకాగ్రత కుదరదు. చదువు నాశన మవుతుంది. బ్రతుకు సాఫీగా నడవదు. చెడుదారులు తొక్కుతాడు. సామాజిక శాంతి సౌఖ్యాలలో తన భాగస్వామ్యాన్ని పోగొట్టుకుంటాడు.

చిన్నతనంలోనే అమ్మాయిల మీదకు దృష్టి మరల్చే వాడు చదువును పోగొట్టుకుంటాడు. లేత వయసులోనే సెక్సులో పడేవాడు పడుచుదనంలోనే ముసలివాడై, నపుంసకుడై యౌవన దివ్య సుఖాలకు దూరమైపోతాడు.

చదువుకొని, వ్యాయామం చేసి, మానసికంగానూ, శారీరకంగానూ బలపడవలసిన టైంలో కర్తవ్యాన్ని వదిలి చెడు తిరుగుళ్లు తిరగడం పిచ్చిగా ఆత్మహత్య చేసుకోవడమే. అలా చేసుకొన్న మూర్ఖులే ఆ తర్వాత పెళ్లంటే భయపడేవాళ్లూ, పెళ్లామంటే భయపడే వాళ్లూ.

ఇరవై ప్రాంతపు వయసులో ఎవతె వెంటనో పడి రేప్ చెయ్యాలనుకొన్నవాడు (లేక, చేసిన వాడు) ఆ తర్వాత అందమైన సాంత పెళ్లాంను ఏమీ చెయ్యలేక ఏడుస్తాడు. ఎందు కని? బ్రహ్మచర్య ఆశ్రమ ధర్మాలను పాటించనందువల్ల.

యథావిధిగా బ్రహ్మచర్య వ్రత విధిని పాటించి చదువు ముగించుకొన్నవాడు గృహస్థు అవుతాడు. అతడి గృహస్థాశ్రమ ప్రవేశం అర్జునుడి కురుక్షేత్ర యుద్ధ రంగ ప్రవేశం లాంటిది. సర్వ సన్నద్ధమైనట్టిది. అపజయమే లేనట్టిది.

లౌకిక సుఖాలన్నీ అనుభవించిన తర్వాత, రిటైరు కావడం వాన ప్రస్థం. మోక్ష సాధనకు చేసే సర్వసంగ పరిత్యాగం సన్యాసం.

ఈ వర్ణ ఆశ్రమ ధర్మాలను వ్యక్తి యొక్క గుణ, కర్మ భేదాలను బట్టి అనుసరించాలి.

కుబేరుడూ, రావణుడూ ఒకే తండ్రి బిడ్డలు. గుణ కర్మలను బట్టే కదా ఒకడు దేవత అయితే, మరొకడు రాక్షసుడైనాడు?

శంకరాచార్యుడు ఎనిమిది సంవత్సరాల బాల వయస్సులోనే సన్న్యాసి అయినాడు. దశరథుడు పండు ముసలితనంలో కూడ పుత్రవాత్సల్య విమోహితుడై చచ్చిపోయాడు.

గుణ కర్మలను బట్టే వర్ణాశ్రమ ధర్మాలుంటై. వ్యక్తి స్వేచ్ఛకు భారతీయ వైదిక విజ్ఞానం యిచ్చిన విలువ ఇది. వేద, ఉపనిషత్, ఆరణ్యక (బ్రాహ్మణ) సాంప్రదాయం ఎంత కాలం నడిచిందో చెప్పలేం.

ఆ తర్వాత మానవ పరిణామ క్రమంలో ఏం జరిగిందో ఏమో! పూర్వ విజ్ఞానం అంతా మరిచిపోబడి, స్మృతి కర్తల పేరిట అమానుష, ఆత్మ వంచక, జాతి విద్రోహక

రచనలు పెచ్చురేగి, ఆర్ష మౌలిక విజ్ఞానం మట్టి గొట్టుకు పోయింది! ప్రగతి మూర్ఛపోయింది. ఈ నాటికీ మేలుకోలేదు!

స్మృతుల పుట్టుక నాటి పరిస్థితి ఈ 1996 నాటి పరిస్థితిని పోలి ఉండి వుంటుందని నేననుకొంటున్నాను. అదే స్వార్థం. అదే పరహింస, అదే అవ్యవస్థ.

"ఎంత చదువు చదివి ఏ నీతి విన్నను
హీను డవ గుణమ్ము మాన లేడు"

అనే వేమన్న పద్యంలోని రెండవ చరణాన్ని కొంచెం మార్చి "మనుజు డవగుణమ్ము మానలేదు" అంటే సత్య సమ్మతంగా వుంటుందని నా వుద్దేశం. హీనుడు అనేది సాపేక్షక (రిలెటివ్) పదం.

భూస్వామి దృష్టిలో వ్యవసాయ కూలీ హీనుడు. వ్యవసాయ కూలీ దృష్టిలో భూస్వామి హీనుడు. విభూతిరేఖలో, పంగనామాలో పెట్టుకొని కూర్చునే బ్రాహ్మణ పురోహితుల దృష్టిలో ఈ శూద్రులిద్దరూ హీనులే.

నిజానికి ఆంగ్లేయుడైన బ్రౌను మహాశయుడు పూనుకొనే నాటి దాకా బ్రాహ్మణ పండితుల దృష్టిలో వేమన్న కూడ హీనుడుగానే వుండి పోయాడు కదా!

ఉత్తమ జాతి-హీనజాతి, ఉత్తమ కులం-హీనకులం, ఉత్తమ వృత్తి-హీన వృత్తి అనే విభజన స్వార్థంతో కూడుకొన్నట్టిది. అధికార దౌర్జన్యం కారణంగా మానవ సమాజంలో బలవంతంగా ప్రవేశించిన అధర్మం అది. అందుకే హీన శబ్దం సముచితం కాదు. మనుజ శబ్దమే అక్కడ అతికేది.

మానవ జాతి పుట్టుక మొదలు నేటి దాకా ఏ విధంగానూ మారలేదు. అభివృద్ధిని సాధించలేదు. ఒక మహావృక్షంలా ఎదుగుతూ విస్తరిల్లుతూ వస్తున్నది. భూమికి, సృష్టికి భారంగా తయారవుతూ వున్నది.

ఇది ఇక నాశనమైపోవడమైనా జరగాలి. దీని నుంచి మరో నవ ఉత్తమ దివ్య జీవి ఉద్భవించడమైనా జరగాలి. ఇప్పుడున్న మానవుడు - వున్నవాడు వున్నట్టుగా ఏమీ చెయ్య లేడు. ఏ పనికీ పనికి రాడు. స్వభావంలో ప్రవృత్తిలో ప్రవర్తనలో మార్పు రావలసి వుంది.

ఏమిటి కథ?

ఈ నఖక్షతాలకు ఒక కథా లేదు, ఒక క్రమమూ లేదు.

సహజమే కదా!

ఉత్సాహం, ఉద్రేకం, ఆవేశం, ఆవేగం – ఈ విధంగా రసోద్వేగం పెరిగే కొలదీ ఏ నఖం ఎక్కడ గుచ్చుకొంటుందో ఎలా చెప్పడం? క్రమరాహిత్యమే నఖక్షతాల సహజ క్రమం.

ఏదో మానసిక ధోరణిలో, ఏదో సన్నివేశంలో ఏదో ఒక ఛలోక్తి విసురుతాం. అది కొందరికి హాస్యోక్తి అవుతుంది. కొందరికి మర్మ భేదకం అవుతుంది. తన రహస్యం ఏదో తెలిసే అతడలా అన్నాడని అలాంటి గురివింద గింజ అనుకుంటాడు. అలాంటి గురివింద గింజలలో సహృదయులు ఆ ఛలోక్తి తమకి గుచ్చుకొన్నా నవ్వేసి వూరుకుంటారు. ఆత్మ పరిశీలన చేసుకొని తమను తాము సరిదిద్దుకోడానికి ప్రయత్నిస్తారు. కనీసం పట్టుపడకుండా వుండేందుకైనా జాగ్రత్త పడతారు. అప్పుడా ఛలోక్తి వ్యంగ్యోక్తి అవుతుంది. మిత్ర సమ్మితమో, కాంతా సమ్మితమో అవుతుంది. ఇక్కడ ఈ నా కావ్య పరంగా నఖక్షతం అవుతుంది.

అలాంటి గురివింద గింజలలో పగబట్టే పాపగుణం గల రాజకీయ గ్రహాలు వున్నా రనుకోండి. అప్పుడు నఖక్షతాలు దంతక్షతాల తీవ్రతను కూడ దాటిపోయి కత్తులూ, బరిసెలూ, తుపాకి గుళ్లూ కూడా అవుతాయి. అందుకే విరసులకూ, అరసికులకూ, అధికార మత్తులకూ, ధన గర్వాంధులకూ, కుల మత వ్యాపార కుక్షింభరులకూ కవిత్వం వినిపించ వద్దనేది ఋషి వాక్కు. అయితే, వినిపించకుండా వుండడం న్యాయమా? వాళ్లు మాత్రం మారవద్దా? మానవులు కావద్దా? మానవుణ్ణి దివ్యత్వానికి ఎత్తే సాహిత్యాన్ని, సంస్కృతిని, కళలను, రసా నంద భాగధేయాన్ని, కుల మత ధన అధికార మాత్రోప జీవులై మిడిసి పడుతున్న వారి నుంచి దూరంగా వుంచి వేయడం మంచిదా?

''పంది ముందు ముత్యాలు పోసినట్లు'' అనేది ఒక ఇంగ్లీషు సామెత. ''ఆకలితో చస్తున్న వాడికి వేదాంతం చెప్పడం'' అనేది మరొక ఇంగ్లీషు సామెత.

ఈ నఖక్షతాలు ముత్యాలూ కావచ్చు. బ్రహ్మ సూత్రాలూ కావచ్చు. నా దృష్టిలో మానవులంతా ఒక్కటే కనుక, ఇవి ప్రతి మానవుడి ఆత్మ వికాసానికీ అవసరమైన అన్నం మెతుకులు కావాలని నా ఆకాంక్ష.

ఇవి వ్యంగ్య వైభవాలు కనుక, బి కాంప్లెక్సు బిళ్లల వలె మానవ జాతి సర్వతోముఖ అభివృద్ధికి ఉపయోగపడగలిగితే, నేను ఇంకా ఎక్కువగా సంతోషిస్తాను.

ఈ నఖక్షతాలకు ఒక క్రమం లేదు. అక్కర లేదు. సరే, మరి, కథ మాట?

ప్రతి మానవ జీవిత కథా ఈ నఖక్షతాలకు ఒక కథే. ఒక ఇతి వృత్తమే.

ఒకో నఖక్షతం ఒకో జీవితం అని కూడ చెప్పవచ్చు. విశ్లేషించి వివరించి చెప్పగలిగితే, ఒకో నఖక్షతం ఒకో జీవిత కథే అవుతుంది. మౌలిక ప్రతిభా వ్యుత్పత్తులు కల పండితులు ప్రయత్నించి చూడవచ్చు. (కుల తత్వ విద్వేష సైంధవు డెవడైనా అడ్డం కాకపోతే).

ఏ నఖ క్షతమైనా తీసికోండి

(1) దానిలోని వ్యంగ్యంవల్ల రసానందం కలిగితే ఆ వ్యక్తి స్వచ్ఛమైన ఉత్తమ జీవితం కలవాడన్నమాట.

(2) ఆ వ్యంగ్యం ఏ విధంగా నైనా మర్మ భేదకమై, తనలోని లోపాన్ని లేక అక్రమాన్ని ఎత్తి చూపితే, అతడు ఆత్మ పరిశీలన చేసికొని తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తే - ఆ వ్యక్తి ఉత్తమ మానవ లక్ష్యం కేసి పయనిస్తున్న మధ్యముడన్న మాట.

(3) అది మర్మ భేదకమై గుచ్చుకొన్నప్పుడు, అతడు కోపోద్రేకంతో కన్ను మిన్ను కానని విధంగా చిందులు తొక్కాడంటే - ఆ వ్యక్తి పులితోలు కప్పుకొన్న గాడిదలా, గోముఖ వ్యాఘ్రంలా మానవ శరీరంలో బ్రతుకుతున్న ఏదో జాతి జంతువున్నమాట.

ఇందులోని ఒకొక్క నఖక్షతాన్ని ఈ విధంగా విశ్లేషిస్తూ, వ్యాఖ్యానిస్తూ సమకాలీన ప్రముఖ వ్యక్తుల జీవితాలను నిర్భయంగా ఉదాహరిస్తూ ఏ సాహితీ బ్రహ్మ అయినా కలం పట్టి రంగంలోకి దూకితే – ఈ నఖక్షతాలు ఒకొక్కటి ఒకొక్క వాస్తవ రసావిష్కారక జీవిత చరిత్రే అవుతుంది.

ఆధునికతా దృక్కోణం నుంచి చూస్తే – ఈ నఖక్షతాలకు కథా లేదు, కమామీషూ లేదు. వీటికే కాదు, ఏ నఖక్షతాలకూ ఈ కాలంలో కథ లేదు. కమ్మదనం లేదు. మనోజ్ఞత లేదు. మధుర బాధ లేదు. పాశవికమైన సెక్సు తప్ప, రాగ మధురమైన శృంగారం లేదీనాడు.

ఈనాటి యువకులలో అధిక భాగం రాజకీయులు, కోడి పుంజులు. ఆరాటాలు, పోరాటాలూ తప్ప మరేవిధమైన ఉన్నత విలువలూ లేని వాళ్లు. ఉద్రేకాలు ఎక్కువ. ఉద్యోగాలు తక్కువ.

నిజమే మరి. బ్రతుకు తెరువు కోసం ఉరుకులూ, పరుగులూ మధ్య ప్రశాంతత ఎక్కడుంటుందీ? సరదాగా, తీరికగా సౌందర్యారాధనకూ, శృంగార క్రీడలకూ, రసాస్వాదనకూ, అవకాశం ఎక్కడుంటుందీ?

పాపం ఆధునికులు! కాలం గడుస్తున్న కొలదీ మానవులలో, ముఖ్యంగా యువకులలో ఆనందానుభవ అవకాశాలు పలచబడిపోతున్నై. తిండి కోసమే బ్రతుకుతున్నారా అని పిస్తున్నది.

తిండి కోసం డబ్బు కావాలి. ఎన్ని దురంతాలకైనా పాల్పడి డబ్బు గడించడం అనేదే జీవిత పరమార్థంగా కనకపు సింహాసన మెక్కేసింది.

ఈ దుస్థితి నంతా క్లుప్తంగా తేట తెలుగులో చెప్పాలంటే – మానవ జాతి మధుర జీవితానికి భావ కవుల యుగమే క్లైమాక్సు. అక్కడి నుంచి పతనం ప్రారంభమై, అతివేగంగా పాశవిక దశకు పడిపోతున్నది!

ఈ పాతిత్యాన్ని నిగ్రహించగల మహాశివుడు ఏడీ? ఎక్కడ?

జీవితంలో ప్రతి పదార్థమూ రెడీమేడ్‌గా కావలసి వస్తున్న కాలమిది. అన్నం పాట్లాలు, కుట్టిన దుస్తులు, ఇన్‌స్టెంట్ కాఫీలు వలెనే సెక్సు కూడ యాంత్రికంగా

అక్కడికక్కడ కావలసి వస్తున్నది. అది రక్తమాంస మానసాలు కల స్త్రీయో, రేబట్టో, రబ్బరు బొమ్మో వివేచన అక్కర లేదు. తన ఉద్రేకం చల్లారడం నేటి పురుషుని లక్ష్యం!

తాను, తన ఆకలి, అది తీరడం – ఇదే ఈనాటి మానవుడి జీవిత చరిత్ర.

చస్తున్న ముసలి వాడికి పడుచుపిల్ల ముఖారవిందం దేనికి? ఏ నిమిషంలో పదవి పోతుందో అని భయపడుతున్న నాయకుడికి నీతితో పనేమిటి?

అందుకే ఈనాడు రాజకీయ క్షేత్రంలోకి దూకి అందిన కాడికి నొల్లుకొంటున్నాడు ప్రతి ఒక్కడూ – విద్యార్థి, ఉపాధ్యాయుడు, ఉద్యోగి, వ్యాపారి, కంట్రాక్టరు, నాయకుడు అనే భేదం లేకుండా!

దోపిడీ హడావుడిలో మంచి చెడ్డలకు, మాన మర్యాదలకు, అభిరుచులకు, ఆనందాలకు తావుండదు.

నిజమే, ఈనాడు ప్రతి వాడి బ్రతుకూ అస్థిరంగానే వుంది. అరక్షితంగానే ఉంది. రామాయణ కాలంలో మునిపల్లెలకు రాక్షసమూకల దాడుల బెడదలా ఈనాడు ప్రజలకు రాజకీయాల పీడ దుర్భర మవుతూ వుంది. నిజమే. అయితే ఈ దుస్థితి ఎంతకాలం ఇలా కొనసాగుతుంది? మరణశయ్య మీద రోగి ఎంత కాలం అలా వుండగలుగుతాడు?

దృక్పథమే మారాలి

బ్రతకడం కోసం చచ్చేదాకా పోరాడడం జీవ లక్షణం. పుట్టుక నుంచీ కూడ జీవికి చావు అనేది నీడ, ఎల్లప్పుడూ కూడానే వుంటుందది. అందుకే జీవి నిత్య జాగరూకుడై తన రక్షణలో తాను వుంటూ వుంటాడు. బ్రతకడానికి ప్రధానంగా కావలసింది ఆహారం. కోటి విద్యలైనా కూటి కోసమే. కోటి దోపిడీలైనా కూటి కోసమే. కోటి పన్నులైనా కూటి కోసమే.

కూడు దొరకడం ఒక పెద్ద సమస్య కానప్పుడు కళలూ, కాంతులూ, జ్ఞానమూ, విజ్ఞానమూ వికసిస్తై. వాటికి ఏకాంతమూ, ఏకాగ్రతా, ధ్యానమూ, తపస్సూ అవసరం. ప్రయత్నం లేకుండా ఆహారమూ, అవసర సాకర్యాలూ లభించిన ప్రతిభావంతులే అట్టి

ఉన్నత విద్యలను సాధించగలుగుతారు. మానవ సమాజాన్ని ముందుకు నడిపించ గలుగుతారు.

ఎవరెన్ని చెప్పినా, ఎవరెంత అరిచినా సత్యం సత్యమే. ఇదిగో అది.

(1) నీవు గొడ్డలి పుచ్చుకొని నరుకుతానని మోర సాచి నిలబడి భయపెట్టినా, నిమ్మ చెట్టుకు మామిడి కాయలు కాయవు.

(2) ఏ పూట తిండిని ఆ పూట కాయకష్టం చేసి సంపాదించుకోవలసిన పార్థివ మానవుడు ఏ విధమైన అభ్యుదయాన్నీ సాధించలేడు.

(3) కార్మికుడు, కర్షకుడు, వర్తకుడు, పారిశ్రామికుడు, పదవీ పాలుడు, పైరవీ కారుడు – వీళ్లెవళ్లూ మానవ మిత్రులు కారు. స్వలాభం కోసమే ఆయా పనులు చేస్తున్న వాళ్లు.

(4) తిండి దొరక్క మాడవలసి వస్తుందేమో అన్న భయమూ, బెంగా వుండి కూడ – కళలనూ, కాంతులనూ, జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ సృష్టించి, ఉద్ఘాటించి, ప్రకటించి, మానవ జాతిని మరో మజిలీకి చేర్చాలన్న ఆత్రంతో, దీక్షతో, మనోమగ్న తన్మయత్వంతో కృషిచేసే తపస్వులే మానవ మిత్రులు. అట్టి వాళ్ల కృషి వల్లనే మానవ సమాజం ఈ మాత్రమైనా పెరుగుతూ వచ్చింది.

(5) కోట్ల ప్రజల మనుగడలను శాసించే రాజ్యాధినేతల కంటె అలసిన హృదయాలను సేద దీర్చగల ఒక పద్యాన్ని వ్రాసిన కవి, ఒక పాటను పాడిన గాయకుడూ, ఒక యంత్రాన్ని కనిపెట్టిన విజ్ఞానీ గొప్పవాళ్లు.

(6) ఏ రౌడీ అయినా పట్టపగ్గాలు లేకుండా స్థైర విహారం చేస్తున్నాడంటే అందుకు కారణం అతడి భగ్న హృదయమే. ఏదో ఒక జీవిత సన్నివేశంలో, పరీక్షలో ఓడిపోయిన వాడు అట్టి ఓటమిని స్ఫూర్తివ్ (విక్రీడితం)గా తీసుకోలేనంత హీన బలుడైతే, అట్టివాడు అవమానం ఫీలయి, అసూయ పెంచుకొని క్రూరుడవుతాడు. మాన మర్యాదలు విడిచి రౌడీ అవుతాడు. అట్టి వాళ్లంతా ఓడిన వాళ్లే. బలహీనులే. వాళ్లు సమాజానికి విష వ్రణాలు. కేన్సర్లు.

మృత గతారాధన

Flattery, Corruption, Misappropriation, భజన, అవినీతి, ప్రజాధన దుర్వినియోగం – ఇవి సాధారణంగా మానవ నైజ దుర్గుణాలే అయినా, ప్రత్యేకంగా భారతీయులకు, అందులోనూ మన తెలుగుజాతికి ఇవి పవిత్ర సంప్రదాయ గుణాలుగా తయారైనై. మన పాటలలో, కార్యాలయాలలో, పూజా మందిరాలలో నిత్యం మనం ఆరాధిస్తున్నట్టివే. అందుకు ఉదాహరణలు అసంఖ్యాకం.

ఒక్క రామదాసు వ్యవహారమే చూడండి –

ఆయన ప్రభుత్వోద్యోగిగా వుంటూ భద్రాచలంలో రామచంద్రుడికి ఆలయం కట్టిం చాడు. ఆ రామలక్ష్మణులకు, సీతమ్మకు పేరు పేరున ఆభరణాలు చేయించాడు. బాగానే వుంది. కాని ఆ డబ్బంతా ఎక్కడిది? ప్రభుత్వానిదే కదా! Misappropriation జరపబడిందే కదా!

''నీకు కలికి తురాయి చేయిస్తి! దాన్ని ధరించి కులుకుతూ తిరుగుతున్నావు. అది ఎవడబ్బ సొమ్ముతో వచ్చిందనుకున్నావు?'' అంటూ రామచంద్రుడ్ని ప్రశ్నిస్తాడాయన! ఆలయ నిర్మాణానికి, ఆభరణాలకు అయిన మొత్తం ఖర్చంతా కక్కమంటాడు!

ఈ రోజుల్లో అధికార పదవుల్లో ఉన్న గొప్ప గొప్ప వారికి జరుగుతున్న స్వాగతాలకు, సన్మానాలకు, విందులకు, వినోదాలకు ధనం ఎక్కడి నుంచి వస్తున్నది? రామదాసు మార్గం లోనే కదా? రామదాసు మార్గమంటే స్వాగత సత్కారాలు అందుకొన్న నాయకుడు అందుకయిన ఖర్చును తానే భరించడం. రామదాసు మార్గమంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యడం.

ఏ అధికారి అయినా పాగడ్తకు, లంచానికి కూడ లొంగకపోతే, ఇక ఆయన భార్యను ఆశ్రయించి పని చెయ్యించుకొనే సంప్రదాయం మనకుంది. అందుకు కూడ రామదాసే మనకు ఆదర్శం. ''నీ అబ్బ సొమ్మా?'' అని అడిగినా కూడ రాముడు పలక్కపోయే సరికి, దిక్కుతోచక ఆయన సీతమ్మ వారిని ఆశ్రయించాడు. ''నను బ్రోవమని చెప్పవే'' అంటూ!

పైగా తన గురించి చెప్పే ఆ సిఫారసును సీతమ్మ తల్లి శ్రీరామ చంద్రుడితో ఎటువంటి సమయంలో చెప్పాలో కూడ వివరిస్తాడు రామదాసు. శ్రీరాముడు ''మరుకేళి దేలి'' తృప్తి పడి వున్నప్పుడు చెప్పాలట! పరమ పతివ్రత, పవిత్ర చరిత్ర, జగన్మాన్య అయిన తల్లితో అంటున్నాడీ మాట రామదాసు. ఎంతటి దుస్సాహసం!

అంత అసభ్యంగా పైరవీలకు దిగే వాళ్లు నిజంగా వుంటారో వుండరో తెలియదు గాని, ఈ ప్రక్రియకు కూడ రామదాసే మనకు ఆదర్శం అనడానికి సందేహించక్కర లేదు. అయితే ఇంకా ఎంతకాలం ఈ దుష్టారాధన? ఇలాంటివే ఎన్నో. ఈ నిష్ప్రయోజక, మృత గతాచారాలన్నిటినీ మనం విదలించి వేసుకోవలసి లేదా?

పాగడ్త, పైరవీ, లంచగొండితనం, ప్రజాధనం దుర్వినియోగం వంటి వాటిని మానవ నైజగుణాలుగా గుర్తించి, వాటికి అనుగుణంగా మన చట్టాలను నిర్మించుకోవడం మంచిదేమో. వాటిని నేరాలుగా ప్రకటించడం గులాబి చెట్టుకు ముళ్లుండగూడ దనడమే.

మానవుడు జీవించడానికి వెలుగెంత అవసరమో, చీకటి కూడ అంతే అవసరం కదా.

ప్రకృతి నైజాన్ని సరిదిద్దలేం. కనుక మన చట్టాలను, సాంఘిక ప్రవర్తనా నియమాలను సరిదిద్దుకోవాలి.

స్వాభివృద్ధి, పరహింస, స్వాతిశయం, పరాక్రమణ, అసూయ, వంచన, దోపిడీ, ద్రోహం వంటి దుష్ట గుణ కర్మలన్నీ ఒక్క మానవ జీవిలో తప్ప మరే జంతువులోనూ లేవు. ఎన్ని విధాల, ఏ దృక్కోణం నుంచి పరిశీలించినా – జీవ సృష్టిలో మానవ జీవిని మించిన అధమ సృష్టి మరొకటి లేదనిపిస్తున్నది. విజ్ఞులు నిష్పక్షపాతంగా పరిశీలించి నిజం చెప్పండి!

మానవాతీతమైన దివ్య జీవన సృష్టి మానవుడి నుంచే పరిణమించవలసి వున్నదని ఏ మహాత్ముడైనా అంటే – అవునని నేనూ అంటాను. అయితే – అలాంటి ఆదర్శ మానవు లీనాడు ఎక్కడున్నారు? ఏరీ? ఎంత మంది?

అలాంటి మానవుల కోసమే ఈ నఖక్షతాలు! వీటి నుంచైనా అలాంటి వాళ్లు పుట్టు కొస్తారేమో చూడాలి.

పరిష్కారం

"నీతి శాస్త్రాల కుప్పపై నిల్చి, ధర్మ
నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు.
రేపు తిండి యెట్లను బెంగ బాపకుండ
దేవి! సంఘమ్ము నెటు చక్కదిద్ద లేవు!" -దీపసభ

నేను మొదటి నుంచీ నా సాహిత్యం నిండా ఇదే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వస్తున్నాను.

వేదకాలంలో నీతులు లేవు. ప్రబోధాలున్నై. భద్రంగా ఎలా బ్రతకాలో చెప్పబడింది. హిపోక్రసీ లేదు. తమకు పోటీ వచ్చేవాళ్లను నిర్దాక్షిణ్యంగా నిర్మూలించి పారెయ్య మన్నారు వాళ్లు. ఈనాటికీ జరుగుతున్న దదే కదా!

"ఆత్మవత్ సర్వభూతాని" అనే నీతి ఎప్పుడు అమలు జరిగింది?

మానవుడు సాంఘిక భద్రతతో సుఖంగా బ్రతకడానికి కొన్ని నీతి నియమాలను ఏర్పరచుకొన్నప్పటి నుంచీ కూడ, వాటిని బలహీనులకు వ్యతిరేకంగా బలవంతులు వాడు కొంటూనే వున్నారు.

శాంతి భద్రతలు, సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, గౌరవ సన్మానాలు అన్నీ అధికార బల దర్పాల తోడివి. అందుకే ధనవంతులు, సాహసవంతులు వాటికోసం అంతగా ఆరాట పడడం.

శాంత జీవన కాములైన నిరాడంబర మౌన కార్మికుల ప్రతిభను, క్రియా యోగశక్తు లను ఉచితంగా, లేక చవగ్గా సాంతం చేసుకొనడానికి వాళ్లు అంతగా పోటీపడడం కూడ అందుకే!

అవినీతి, హింస, అతిశయం, అధికార దర్పం ఒక ప్రక్క విజృంభిస్తూ వుంటే మరో ప్రక్క కేవలం ఆత్మరక్షణ కోసం, బ్రతికి వుండడంకోసం వినయం, విధేయత,

సహనం, దాస్యం బలహీనులైన మానవులకు తప్పనిసరి అవుతూ వున్నై. ఈ బలహీనులే మానవ లోకంలో మెజారిటీ కావడంవల్ల ఇదొక సమస్య అయింది.

మానవ గుణ వర్తనలలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఎన్ని తేడాలైనా వుండవచ్చు. నేను చెప్పేది కనీసావసరాలు సమస్త ప్రజలకూ ఉచితంగా అందాలనేది.

తిండి, బట్ట, వసతి, శిశుపోషణ, వైద్యం, విద్య, వృద్ధ సంరక్షణ - ఈ ఏడు అవసరాలూ ఎవరికి కావలసినంత వారికి ఉచితంగా లభించాలి. అందుకు ప్రజలందరూ ఎవరికి సాధ్యమైనంత సేవను వారు ప్రభుత్వానికి అందజెయ్యాలి. ప్రభుత్వంలోని వ్యక్తులెవ రైనప్పటికీ, వాళ్ల కర్తవ్యం ప్రధానంగా ఇదే అయి వుండాలి.

ప్రభుత్వం అనేది ఒక తప్పని సరి వ్యవస్థ. అది వ్యక్తి స్వేచ్ఛను అరికట్టగూడదు. అది చెయ్యవలసిన పనులు రెండే. ప్రజలందరూ పనిచేసేటట్టు చూడడం, ప్రజలందరికీ తత్ఫల సాయాన్ని పంచి పెట్టడం. ఇది జరిగిన తర్వాతనే ఏ విందులైనా, ఏ వినోదాలైనా.

ఇదీ నేను గిల్లి చెపుతున్న సత్యం. ప్రపంచ సమస్యలన్నిటికీ పరిష్కార మార్గం.

నైరం తర్యం

చంద్రగతిని అనుసరించి భూమి మీది ప్రకృతికి ప్రతినెలా ఒక రుతువే. ప్రతి రుతువూ ఒక మార్పే.

దర్శన, స్పర్శన మొదలైన అష్టవిధ క్రియల ద్వారా కళా స్థానాలను పీడించి, కళలను మేల్కొల్పి తృప్తి పరుస్తూ, ఆనంద శిఖరాన్ని అధిరోహించడం శృంగార ప్రయోజనం. అట్టి పనులలో నఖక్షతం ఒకటి.

ఆక్యుపంక్చర్ (occupuncture) అనే పేరు గల వైద్య విధానం ఒకటుంది. మన గ్రామీణ మైన సూది, పచ్చబొట్టు, గురి, వాత వగైరా చికిత్సా పద్ధతుల వంటిదే ఆక్యుపంక్చర్ కూడ. అయితే మన గ్రామీణ పద్ధతులు ప్రోత్సాహం లేక మూలపడినై. ఆక్యుపంక్చర్ పద్ధతి (ఇది కూడ సూది వైద్యమే) చైనీయులచే తమ జాతీయ వైద్యవిధానంగా అభివృద్ధి చేయబడింది.

నా కనిపిస్తుందీ –

కామ కళా ప్రేరణకు సంబంధించినంత వరకు మన నఖక్షతం ఆక్యుపంక్చరు వంటిదే నని!

ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాలు నాలుగింటిలోనూ కామం ఒకటి. కామానికి అంతటి గౌరవ స్థానం ఇచ్చారు మన పూర్వ ఋషులు. వాత్స్యాయన మహర్షి దానికొక శాస్త్రీయతనే కల్పించాడు.

నా ఈ నఖక్షతాలు వ్యంగ్య విమర్శలు. వీటికి ఆలంబన సమాజం. కళాస్థానాలు సమాజంలోని జీవ కేంద్రాలు. జీవితంలోని కీలక స్థానాలు. వాటిని గిచ్చి హెచ్చరించడం ఈ మినీ కవితల పరమార్థం.

నేను అప్పుడప్పుడు సరదాగా వ్రాసుకొంటూవచ్చిన చిన్నచిన్న కవితలన్నిటినీ పోగుచేసి, నఖక్షతాలు అని పేరు పెట్టి, పధ్నాలుగు సంవత్సరాల క్రితమే, 1982లో గ్రంథ రూపంలో ముద్రించాలి అనుకొన్నాను. ఈ పీఠిక కూడ అప్పుడు వ్రాసిందే.

కంట్రోలు రేటుకు పేపరు

1981లో, మలేషియాలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. మన విద్యాశాఖ సెక్రటరీ మామిడిపూడి గోపాలకృష్ణగారు ఆ సభలలోనే నాకు మిత్రులైనారు.

ఆ కాలంలో గ్రంథ ముద్రణ కోసం అడిగిన వాళ్లకు ప్రభుత్వం పేపరును ఫ్యాక్టరీ రేటుకు సప్లయి చేసేది. అప్పుడు సిరిపూర్ వైట్ ప్రింటింగ్ పేపరు టన్ను ఖరీదు నాలుగు వేల రూపాయలుండేది.

నేను 1982లో, నా గ్రంథాలు ముఖ్యంగా నఖక్షతాలు ముద్రణ కోసం రెండు టన్నుల పేపరు కోసం అప్లయి చేశాను.

నా అప్లికేషను ఏమయిందో కనుక్కోడానికి ఒక రోజు నేను సెక్రటేరియటుకు వెళ్లినప్పుడు, విద్యాశాఖ సెక్రటరీగా గోపాలకృష్ణగారే వున్నారు. ఆయన నన్ను నవ్వుతూ ఆహ్వానించి అన్నారు –

''మరి, దంత క్షతాలు ఎప్పుడు ముద్రిస్తారు?''

''ముందు నఖక్షతాలు కావాలి కదా?''

''వాటికి మీ రడిగిన రెండు టన్నులూ ఇస్తున్నాను. దంతక్షతాలు కూడ రెడీగా వుంటే-'' ఆగారాయన, ఏదో ఫైలు చూచుకొంటూ.

''రెడీగా వుంటే ఏంచేస్తారు?''

''రెండును మూడు చేస్తాను''

''అమ్మో, వద్దు. రెండు టన్నుల బరువే మోయలేను!''

''మీ యిష్టం! తర్వాత పశ్చాత్తాపపడే స్థితి రావచ్చు'' అని, కొంచెం ఆగి, ''సరే, ప్రింటు అయిన తర్వాత ఒక ప్రతిని నాకిస్తారుగా?'' అంటూ నాకు వీడ్కోలిచ్చారు.

సెక్రటరీ గారి దగ్గర జరిగిన దంతా చూచిన ఆయన పర్సనల్ సెక్రటరీ, నాకు మిత్రులూ అయిన రాఘవయ్యగారన్నారు, ''మీరు మూడు టన్నులూ తీసుకోవలసింది'' అని.

''ఎంత చెట్టు కంత గాలే క్షేమం'' అన్నాను నేను.

ఆ రెండు టన్నుల పేపరు 1983లో జరిగిన నా సాహితీ షష్టిపూర్తి ఉత్సవ ప్రచురణ లకు ఖర్చయిపోయింది. నఖక్షతాలు అలానే అముద్రితంగా వుండి పోయాయి!

గోపాలకృష్ణ గారన్నట్టు, ఆ తర్వాత నేను నిజంగానే విచారించాను. ఎందుకంటే, ఆ తర్వాత ప్రభుత్వ విధానాలే మారిపోయాయి. సరస్వతీ, సారస్వతోపాసకులూ క్లోజ్డ్ ఫైల్సే అయిపోయారు.

ఈలోగా ఈ నఖక్షతాలు ఎక్కడివక్కడే పడి వుండిపోలేదు. సంఖ్యలో పెరుగుతూ, ఇప్పటికి 523 అయినై.

ఆకాశవాణిలో ప్రసారమైనై.

''నఖోం కే నిశాన్'' అనే హిందీ పేరుతో జ్ఞానపీఠ్ వారి వివిధ భాషా కవితా సంకలనంలో చేర్చుకోబడినై.

అనేక కవి సమ్మేళనలలో హర్షధ్వానాలతో ఆస్వాదించబడినై.

అన్నిటిని మించి నాకు చాలా చాలా ప్రియమైనై!

మీరు కూడ ఆస్వాదించండి. మారండి. జాతిని మార్చండి. అభ్యుదయం కేసి మరల్చండి!

అంకితం గురించి

మిత్రులకు, సహృదయులకు, అభిమానులకు, నా గ్రంథాలను అంకితాలిస్తూ వుండటం నా అలవాటు. ఇందులో కొందరు రసజ్ఞులూ వుంటారు. ఏదో బలవంతపు పెళ్లిగా భావించేవాళ్ళూ వుంటారు. కృతి స్వీకర్తల స్వభావాలెలాంటివైనా, నేను మాత్రం ఎంతో ఆప్యాయతతో, ప్రేమతో, కొందరిపట్ల భక్తితో కూడ అంకితాలిస్తూ వుంటాను.

ఈ ''నఖక్షతాలు'' కావ్యకదంబాన్ని స్వీకరిస్తున్న బిళ్ల వేదయ్యగారు సమస్త సద్గుణ సంపన్నుడు. స్నేహం, సద్భావం, వదాన్యత పరోపకార పారీణతా, కార్యదక్షతా, సాంస్కృతిక కళాక్షేత్ర కృషీవలత వగైరా సమస్త ప్రజ్ఞలూ కలిగిన మిత్రుడు.

ఈయన పుట్టింది నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలంలోని రామాపురం గ్రామంలో. తండ్రి అంకయ్యగారు, తల్లి చెన్నమ్మగారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందో లేదో గాని, వేదయ్యగారు మాత్రం శైశవం నుంచి కూడ తన ప్రజ్ఞాదీధితులతో మాతాపితరుల్ని అలరిస్తూ వచ్చిన వాడు.

విద్యార్థిగా ఆయా స్కూళ్ళ, కాలేజీల సాంస్కృతిక సంఘాలకు లిటరరీ అసోసియేషన్లకు కార్యదర్శిగా, అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి, ఆయా సంస్థలకు కీర్తి ప్రతిష్ఠలు సాధించిపెట్టినవాడు ఈయన.

అకౌంటెంటు జనరల్ ఆఫీసులో పనిచేసినప్పుడు అక్కడి (హైదరాబాద్) తెలుగు నాటక సమితికి వైస్ ప్రెసిడెంటుగాను, కమర్షియల్ టాక్సెస్ డిపార్టుమెంటులో పనిచేసినప్పుడు అక్కడి సాంస్కృతిక సంఘానికి ఉపాధ్యక్షుడిగాను ఉండిన

వేదయ్యగారు సాంస్కృతిక రంగానికి, ముఖ్యంగా నాటక రంగానికి చేసిన సేవ అపారమైనట్టిది.

నటుడుగా ఈయన ప్రతిభ సాటిలేనట్టిది. ముఖ్యంగా ''తుఫాను'' నాటకంలో రాఘవరెడ్డి పాత్రలో ఈయన తెలుగు లోకానికి రాఘవరెడ్డిగానే నిలిచిపోయాడు. ఎన్నోసార్లు ఉత్తమ నటుడిగా నిర్ణయించబడి అవార్డులు అందుకున్నాడు, సన్మానాలు స్వీకరించాడు. రేడియో శ్రోతలకు ఈయన ''పిట్టలదొర''గా సన్నిహితుడు.

హైదరాబాదులో గౌతమ కళాసమితిని, గుంటూరులో అంబేడ్కర్ కళా సమితిని నెలకొల్పి నడిపిన వాడీయన. కమర్షియల్ టాక్సెస్ డిప్యూటి కమీషనర్‌గా గత సంవత్సరం రిటైర్ అయిన తరువాత, గుంటూరులో సాహితీ మిత్రమండలికి అధ్యక్షుడిగా వివిధ కార్య క్షేత్రాలలో కృషిచేస్తున్నాడు.

ఇలా వ్రాసుకుంటూ పోతే వేదయ్యగారి చరిత్ర ఒక పెద్ద జీవిత చరిత్రే అవుతుంది. నా కావ్య స్వీకర్త ఎటువంటి వాడో చెప్పడం మాత్రమే ఇక్కడ నా ఉద్దేశం.

ప్రచారమంటే ఇష్టం వుండదు. రంగస్థలం మీద తప్ప, వేదిక మీద తరచు కనిపించడు. ప్రజోపకార సేవాతత్పరుడైన ఉత్తమ పురుషుడి ఉత్తమోత్తమ లక్షణం ఇది. అయితే, ఈయన రిటైరైన తర్వాత, ఇప్పుడు సాంస్కృతిక రంగంలో తన ప్రతిభను పూర్తిగా వినియోగించదలి చాడు. శుభం.

86వ జన్మోత్సవం
భాగ్యనగరం

బోయి భీమన్న
19-9-1996

వసంత నఖం

ఆ వసంతోత్సవ మహాసభలో ఎవరో నీవు
నన్నలా రాసుకు పోయి నప్పుడు
నా కళ్లద్దాలు కిందపడి పగిలి పోయినై!

అప్పటి నుంచీ నాకు ఓ చెలీ!
నీవు తప్ప మరేదీ కనిపించడం లేదు!

2. దానిమ్మ పండ్లు

ఈ దానిమ్మ పండు బుగ్గపై ఒక్క నఖ క్షతంతో
ఎన్ని దంతక్షతాలు ఆవిష్కరించావు దాని నిండా!
నీ నఖాగ్రానికే ఇంత గమ్మత్తుంటే
దాని తను లతాంతానికి ఎంత మహత్తుందో!

ఈ బ్రహ్మాండా లన్నీ నీలాంటి
ఎవరి నఖక్షత పులకాంకు రాలో!

3. స్పర్శ

నాకు నీ స్పర్శ తగలక ముందు
ఒక నిస్తరంగ సరోవరంలా
ఎంత ప్రశాంతంగా బ్రతికాను నేను!

నీవు నాలో దిగి ఈత కొట్టినా
నా కేమీ అయేది కాదు, కాని
నీ వెక్కడో గట్టు మీద కూర్చొని
నాలో కేలు గుచ్చి మీటావు!

ఓహో, చిరు తరంగ వలయాలా అవి?
నా ఆత్మనే చుట్టు ముడుతున్న వలలు!

4. పర ప్రియులు

కోకిల మధుప్రియ, తుమ్మెద పుష్పప్రియ,
గాలి గంధప్రియ, రేయి రాజ ప్రియ;
ఆ ఎవరూ నా జోలికి రాలే దింత వరకూ!

కాని, ఆ సాయంత్రం నీ కళ్ళు నన్నలా
వెంటాడి గిచ్చి పోయి నప్పటి నుంచీ
ఆ పరప్రియ లంతా నా చుట్టూ చేరి
ఒకటే గిచ్చడం! గిల్లడం! గీరడం!

5. ఆకర్షణ

కోకిలకు మామిడి ఇష్టం.
గొంగళి పురుగుకు మునగ చెట్టు ఇష్టం.
వనస పండుది వేసవి కాలం
సీతా ఫలానిది వాన కాలం.
కలువ చంద్రప్రియ
కమలం సూర్య ప్రియ.

పరస్ప రాకర్షణే ప్రణయం
ప్రణయ ఫల రసాస్వాదనే జీవితం.

6. నా నా ముఖాలు

కొండపై ఒకే చోట కురిసిన వర్షమే
ప్రవహించవచ్చు నానా ముఖాలుగా;
అయినా కలుస్తా యవన్నీ మళ్లీ ఎక్కడో,
ఏ మేఘాలయంలోనో!

సృష్టిలో ఏదీ సమా నాంతర సరళ రేఖ కాదు,
మనమూ అంతే!
నీ పట్ల నాకున్న ఆశ అదే!

7. దేవత

ఒకొక్క అందం ఒకొక్క దేవత!
అన్ని అందాలూ కలిసిన పూర్ణ దేవతవు నీవు!
నీ మూర్తిని ఋగ్వేదమే వర్ణించ లేనప్పుడు
కేవలం ఉపనిషత్ సేవకుణ్ణి నేను
ఏ వ్యంగ్యంతో నిన్ను నిరూపించ గలను?
ఏ విగ్రహంలో నిన్ను నిబంధించ గలను?

ఏ ఋతువూ లోప రహితం కాదు
సర్వర్తు రాగ మధు రసాన్ని
ఏ కలశంలో నింపుకు రాగలను?

8. సౌందర్య

ఏది సౌందర్యం?
అది నీ ఇష్టం తోడిది!
సౌందర్యం ఎక్కడుంది?
అది నీ హృదయంలో వుంది!
ఏ దైనా నీవు సుందర మనుకొంటే సుందరం
కాదను కొంటే కాదు!

9. సందేహం

నిన్ను మించి పోవా లన్నది నా కోరిక.
కనీసం అందుకోగలనా అన్నది సందేహం!
కోరిక నీకేసి పరుగులు తీస్తుంటే
సందేహం నన్ను వెనక్కి గుంజుతున్నది!

కోరికకు నీ చిరునామా అయినా దొరక్కపోతే
సందేహానికి నా దేహం లొంగిపోక తప్పదు!

10. ఇజాలు

వసంతుడి కొలువులో, మామిళ్ల సదస్సులో
కోకిల పాడుతున్నది;
అది కోకిలకు రియలిజం
మనిషికి సిర్రియలిజం!
మామిళ్లకు ఎగ్జిస్టెంషియలిజం!

ఎన్ని ఇజాలైనా గానీ, నిజానికి
అవన్నీ నీ ఇమేజికి తేజీలే!

11. ఇష్ట వస్తువు

ఆపాద మస్తకం సత్య సుందరంగా
నేను వర్ణించగల ఇష్ట వస్తువు
ప్రియా, నీ ఒక్కతెవే!
నాలో కనిపించే వైరుద్ధ్యాలు
నీ వెనక ముందులు, నీ వెలుగు నీడలు
నీ బహిముఖ భావ భంగిమలు.

12. పుట్టిన రోజు

ప్రతి అమావాస్యా నా పుట్టిన రోజే,
ప్రతి పూర్ణిమా నా కళా ప్రపూర్ణత్వమే!
ఈ అర్ధనారీశ్వరతా పూర్ణ మూర్తిత్వంలో
శుక్ల పక్షార్ధం నీవు!
మిగిలిన కృష్ణ పక్షార్ధం
శివార్పణం!

13. నీ విలాసాలు

వికసిస్తూ, వాడిపోతూ వుంటాను నేను
ఎన్నడూ వాడిపోని నీ తోటలో;
నీ అడుగు జాడల వెలుగు నీడల్లో ఎల్లప్పుడూ
న న్నిలాగే ఆడుకోనీ!
నీ విలాసాలు పాడుకోనీ!

14. నా తాహతు

నాకు రాజకీయాలు లేవు
ఏ ఇజంతోనూ పాత్తు లేదు,
నేను పదవులిచ్చే నాయకుణ్ణో
మార్కులిచ్చే ఆచార్యుణ్ణో కాదు;
నేనొక మామూలు తోటమాలిని
నీకు నచ్చిన పూలుంటే కోసుకొంటూ వుండు!
ఇష్టమైతే ఇక్కడే వుండు!

15. నగ్నత

ఏ వర్గానికీ చెందిన వాణ్ణి కాను నేను.
విశ్వశ్రేయమే నా కవితాదర్శం,
అయితే - నిజం నా సహచరి కావడంతో
నిష్కారాలు నన్ను వేధిస్తూనే వున్నై,
నిజం నగ్నసుందరి కదా
రౌడీ మూకలు వెంటబడవా మరి?

16. నిలువు గీత

నా గురించి నీకు ముందే చెప్పు కోవాలి -
నాకు లోకం తెలియదు.
సమాజం లేదు
రాజకీయం గిట్టదు
సంపాదకుణ్ణి కాదు
నిర్భీతీ నిర్మొగమాటమూ నా గుణాలు!

ఇవన్నీ మైనస్ పాయింట్లే,
నా మధూన్మత్తత మరో పెద్ద మైనస్!
ఇదీ నా బయోడేటా!

ఇప్పుడు చెప్పు-
నా ఈ మైనస్ అడ్డ గీతకు మధ్యగా
నిలువు గీతవై నిలవగలవా?

17. మెరుపులు

మానవ మన శిఖరాలకు
ఎన్నో మెరుపు తీగలు ఒరుసుకు పోతుంటై,
అందులో మనం పట్టుకొనే వెన్ని?
నాటి పెంచి కొనే వెన్ని?
పూచే వెన్ని? ఫలించే వెన్ని?

18. నీవు

నా కంటి నిండా కాంతి
ఒంటి నిండా పరిమళం
గుండె నిండా అనురాగం
నింపుతున్న దెవరో నీవు?
కలిసి ఆడుకోడానికి
నీవు నా చుట్టూ లేకుండా
ఈ ఆనంద మాధి పత్యం నా కెందుకు?

19. పతంగ సూత్రం

నీ పాట వింటున్నాను బహు రాగాలలో
నీ ఆట చూస్తున్నాను వివిధ భంగిమలలో
నీ కోసం నా మనస్సు అన్వేషిస్తున్నది
నా హృదయం నిరీక్షిస్తున్నది!

ఒకే రాగంలో ఇమడ లేవా?
ఒకే భంగిమలో నిలవ లేవా?
ఎందుకంటే – నా జీవన పతంగ సూత్రం
చలిస్తున్న నీ చేతిలో వుంది!

20. ఏక శయ్య

నీ నా మధ్య దూర మెంత?
నీవు అనుగ్రహిస్తే – శూన్యం
ఆగ్రహిస్తే – అనంతం!

శూన్యానంతాలు ఏక బిందుగతాలు కదా?
మరి, ఏక శయ్యపై
ఈ విరహార్తి ఏమిటి?

21. అభిముఖ

నేను తూర్పుకూ, నీవు పడమటికీ తిరిగి
పరస్పర విరుద్ధంగా బ్రతకడం
ఏ విధంగానూ తప్పక పోతే
వెన్నుకు వెన్నే ఆనించుకోవాలా?
పెదవికి పెదవీ చేర్చుకోవచ్చు!

22. ఏకనారి

నీవూ, నేనూ – అటూ, ఇటూ
ఒకే నారికి పంచి కట్టిన రెండు విల్లులం!
నా ఉత్తరార్ధానికీ, నీ దక్షిణార్ధానికీ
ఏకనారి భూమధ్య రేఖే కదా?

మనం ఒకరి నొకరం కొట్టుకోక పోతే
నీవు నా మీదకు కొంచెం ఒరగగూడదా?

23. సరుదుకుపో

నీ వొక పట్నవాసపు కరెంటు దీపానివి
ఎప్పుడు వస్తావో, ఎప్పుడు పోతావో తెలీదు!
నా నిత్యావసర కార్యదర్శిని ఈ కొవ్వొత్తి,
దీని ప్రాణ పేటిక నా జేబులోనే వుంది
కంగారు పడి కళ్లెర్ర జేసుకోకు!
సత్యాన్ని గుర్తించి
సరుదుకు పో!

24. చేతనైనంత

వీలైనంత దీర్ఘకాలం బ్రతకడం కాదు
చేతనైనంత సమగ్రంగా బ్రతకాలి మనిషి!
వెలుగు చీకట్ల కష్ట సుఖా లేమిటో తెలిస్తేనే
నీ వెవరో తెలిసేది!

నిన్ను సేవించ గలది –
అడయారు మర్రి చెట్టే కాదు,
సంక్రాంతి బంతి చెట్టు కూడా!

25. వినబడని తావు

నేను గాయకుణ్ని కాదు, అయినా
పాడు కోవడం నా సరదా!
నేను పాడు కొనేది నీ గురించే, అయినా
నీవు వింటున్నా వేమోనని భయం!

అయినా, నా పిచ్చి గాని –
ఒంటరిగా పాడు కోడానికి
నీకు వినబడని తావెక్కడుంది నాకు?

26. నీ ఉనికి

ఊహలో వాస్తవాలో
అనుభూతులే కలలు!
అందులో నీ వుంటే, అది జీవితం!
లేకపోతే అది అన్వేషణ!

27. రిజల్టు

ప్రతి వాడూ జూద గాడే,
ప్రతి పనీ జూదమే,
జీవితమే ఒక పోటీ పందెం.
దాని రిజల్టు తెలిసేది ముగింపు వద్ద.
నిజానికి రిజల్టే ముగింపు
అంతవరకు అందరిదీ తెగింపే!

28. నీ మెవరో

లోకం నిండా ఎన్నో దేశాలు
ఒక్కో దేశంలో ఎన్నో నగరాలు
ఒక్కో నగరంలో ఎన్నెన్నో షాపులు
ఒక్కో షాపులో ఎన్నెన్నో చీరలు
ఒక్కో చీర చుట్టూ ఎందరో లతాంగులు!
అందులో నీ మెవరో
ఎలా పట్టుకోవడం?

29. ఎంచుకోవడం

అభిరుచులు వ్యక్తిగతం
ఒకొక్క వ్యక్తికి, ఒకొక్క అభిరుచి;
నీవు నా అభిరుచివి
అందుకే నీ కోసం ఈ తపన!

ఈ చరాచర వస్తు ప్రదర్శనంలో
అన్నీ అందరి కోసమూ కాదు,
ఇష్టాన్ని బట్టి ఎంచుకోవటం కోసం!

30. బ్రతుకు జూదం

ఎన్నికలు, పరీక్షలు, ఇంటర్వ్యూలు
పేకాటలు, రేసులు, పైరవీలు
వ్యాపారాలు, క్రీడలు, రాగ ద్వేషాలు
అంతా జూదమే, గేంబ్లింగే!

మనుష్యులు కలిసి, శరీరాలు బెడిస్తే
ఫేవరిట్ గుర్రం బోర్డుకు రాక పోవడమే!

31. కలర్ ఫోటో

మనస్సూ, శరీరమూ
పూర్ణ జీవితానికి ఈ రెండూ అవసరమే!
ఇందులో ఏదో ఒక్కదానినే ఎంచుకోమంటే
నేను శరీరాన్నే కోరుకుంటాను!

అందేం అంటావా?
మనస్సు పరమాత్మకు కలర్ ఫోటో,
అదొక నిరంతర పరంపర
శరీరం ఒకసారి పోతే – మళ్లీ రాదు మరి!

32. నిజ వైభవం

ఆ రాలిన ఆకుల్ని అలా తొక్కుకు పోకపోతే
పోగు చేసి కొంచెం నిప్పంటించ రాదా,
అప్పుడు దర్శించవచ్చు ఆ మంటల్లో
గత వసంతపు నవ పల్లవ రుచుల్ని!
ఆ పొగల్లో గత లక్ష్యాల వేడి నిట్టూర్పుల్ని!
ఆ బూడిదలో నిజ వైభవ చితా భస్మాన్ని!

33. రసాలంకారాలు

రసాలూ, అలంకారాలూ, వక్రోక్తులూ, ధ్వనులూ
ఈ సరంజామా అంతా ఎందుకోసం?
ఆర్ద్రతనూ, ఆనందాన్నీ కలిగించడం కోసం.
హింస, దోపిడీ, స్వార్థం చీకట్ల నుంచి విడిపించి
మనిషిని ఉద్యానాలలోకి నడిపించడం కోసం.

34. అన్నీ కావాలి

సుఖం, సౌందర్యం, ధనం, భోగం
అన్నీ కావాలి నాకు సమగ్రంగా;
తనువు క్షణ భంగుర మని తెలియక కాదు
ఆ క్షణమైనా సార్థకం చేసుకోవా లని!

35. దళితుడు

నా జీవితం ఒక సహస్రదళ పద్మం,
నా ప్రతి పూర్ణిమా నీ పూజలో ఒక దళం;
నా జీవ దళాలన్నీ నీ పాదాలపై దళితాలై పోగా
నన్ను దళితు డంటున్నా రంతా!

36. శిల్పం

అసిత, అస్మిత
లోకము, వ్యక్తి
దృశ్యము, దృక్కు
నీవు, నేను!
నీవు లేనప్పుడు నేను శిలను,
నీతో కలిసి నప్పుడు శిల్పాన్ని!

37. మెరుపు

నా చుట్టూ ఎండలు, మంటలు!
పైని మబ్బులు, తుపానులు, పిడుగులు!
మధ్య మధ్య ఆ మెరుపులే లేకపోతే
ఈ అంధకార అగాధాల్ని
నేనెలా దాటి రాగలుగుతున్నాను?

38. ప్రజాస్వామికం

నాకు నూరేళ్ల పాటు దాహం తీర్చే సరస్సును
పది మంది చేరి కలగ్గొట్టి పారవేయడమే
ప్రజాస్వామిక నీతి అయితే –
అది నాకు వద్దు, వద్దే వద్దు!

39. సైన్యాలు

ఆ నీ కమల వనం మీదకు
నా చకోర సైన్యం దండెత్తి నప్పుడు
అక్కడ తుమ్మెదలు పారి పోతున్నై!

అవి ధైర్యం తెచ్చుకొని
నా కలువ తోటపై విరుచుకు పడ్డప్పుడు
ఇక్కడి చకోరాలు తోక ముడుస్తున్నై

మన రెండు సింహాసనాలు బాగానే వున్నై,
మధ్య – సైన్యాలే కొట్టుకు చస్తున్నై!

40. పెండ్లి

నేనే రాధను అంటుం దొక ఏనుగు,
నేనే కృష్ణుణ్ని అంటా డొక పీనుగు!
అసలు రాధాకృష్ణులు పెళ్లి చేసుకోరు
వీళ్లు మాత్రం పెళ్లి కోసం ఏడ్చి చస్తారు!

41. వేల కోర్కెలు

నా దగ్గర వందల వేల కోర్కె లున్నై
అవన్నీ నానా ముఖ శిలీ ముఖాలై
బహు ముఖాలుగా నిన్నే వెతుకు తున్నై!
ఈ రిరంసా రసోదయ విశ్వోద్యానంలో
పట్టు పడకుండా ఎలా వుండగలవో చూస్తా!

42. బ్రతుకు రేసు

బ్రతుకు రేసులో ఒకొక్కప్పుడు
నీ ఫేవరిట్ గుర్రం గెలవక పోతే
గుర్రానికి పరిగెత్తే మూడ్ లేక పోవచ్చు
జాకీ పొరపాటో, మోసమో చేసి వుండవచ్చు
ఓనరు, ట్రైనరు వుద్దేశాలు వేరై వుండవచ్చు!

కారణా లెన్నైనా వుంటై
నీకు నష్టం వస్తే
భరించాలి, అంతే!

43. సుఖం

జీవితానికి పరమార్థం సుఖంగా జీవించడం;
సుఖం ఎక్కడ లభిస్తుంది?
సుఖం నీ లక్ష్య సిద్ధిలో వుంది
సుఖం నీ సంతృప్తిలో వుంది
నీ సుఖం నీలోనే వుంది.

44. రాజకీయ జూదం

తాను కాసిన గుర్రం గెలవక పోతే
తానొక్కడే నష్టపోతాడు
తన పార్టీ అభ్యర్థి గెలవక పోతే
మొత్తం పార్టీయే నష్టపోతుంది!
జూదాలలో రాజకీయ జూదమే రారాజు!
తాను ఓడినా పార్టీ గెలవా లనేదే ధర్మరాజు.

45. కవిత్వం

నా దేదో కవిత్వ మంటూ నిరాదరించకు,
అసలైన కవిత్వం అలసిన బ్రతుక్కు అమృత కలశం;
కవి అతిశయోక్తులు పలక వచ్చు,
అబద్ధా లాడడు!

తరులతాంగి ఒకర్తు తల మీద జల కలశంగా
ముక్కంటిని మోసుకు వచ్చిం ంటే–
అది అబద్ధం కాదు, పరమ నిజం!

46. నూపురం

మానవ ప్రగతికి అవసరమైన విద్యలు
అయి దన్నాడు నోబెల్ మహాశయుడు
భౌతిక, రసాయనిక, వైద్య శాస్త్రాలు,
సాహిత్యం, శాంతి!

మొదటి మూడూ భౌతిక ప్రగతికి
తక్కిన రెండూ ఆత్మ వికాసానికి!
అందులో శాంతి నా అంతఃపురం
సాహిత్యం నీ నూపురం!

47. లేదు - ఉంది

నాకు దేవుడు లేదు
అయినా ధ్యానిస్తాను,
నాకు విగ్రహాలు లేవు
అయినా పూజిస్తాను,
నాకు భక్తి లేదు
అయినా ప్రార్థిస్తాను!
ఎందువల్లనో తెలుసా?
నీ వుండడం వల్ల!

48. ద్వైతాద్వైతం

రెండు తీరాల మధ్య ప్రవహించి నప్పుడే
అది నది!
రెండు హృదయాల మధ్య స్పందించి నప్పుడే
అది ప్రణయం!
రెండు సేనల మధ్య జీవించి నప్పుడే
అది గీత!
రెండు కత్తుల మధ్య కొనసాగి నప్పుడే
అది సమైక్యత!
రెండు బాహువుల మధ్య ద్రవించి నప్పుడే
అది రసాద్వైతం!

49. అందడం

మహితమైన కృషీ, శ్రమా లేకుండా
మధురమైన అనుభూతులు లభించవు;
అందని ద్రాక్ష పళ్లు పులువంటే –
పులుపు పట్టి చేయికి,
చేతిలోని రాయికి కాదు!

50. సమయజ్ఞత

మొగ్గ ఎంతకాలం వికసించకుండా వుంటుంది?
పువ్వు ఎంతకాలం వాడకుండా వుంటుంది?
అందుకే ఏ కాలంలో సుఖాన్ని
ఆ కాలంలోనే అనుభవించాలి!

త్వరపడీ లాభం లేదు
తడవు చేసీ లాభం లేదు.

51. తెలివికి వెలి

నీ వెవరో, ఎక్కడున్నావో నాకు తెలుసు;
తెలియని వాళ్లు నీ కోసం వెతుకుతూ
నన్ను కూడ చేర మంటున్నారు తమతో!

వాళ్లతో ఎందు కని, ఎక్కడకని పరిగెత్తేది?
పరిగెత్తక –
ఎంత కాలమని ఇలా వెలిగా
విడిగా వుండి పోయేది?

52. మందిలో నేను

శ్రుతి సుందర మధు మందిరం నీ స్వరం,
వాళ్ల కెందుకు వినిపించదో!
నవ పల్లవ పీతాంబర దీపం నీ రూపం,
వాళ్ల కెందుకు కనిపించదో!

పరిగెడుతూనే వున్నారు వాళ్లంతా
నిన్ను వెతుక్కొంటూ –
నేనూ పరిగెడుతున్నాను వాళ్ల వెంట
నా ప్రతి అక్షరంలోనూ నీ
కలర్ ఫోటోకు ఫ్రేం బిగించు కొంటూ!

53. కొత్త చేయి

నేను పట్టుకొని నడిపించు కొచ్చిన చేయి
నా కూసర మైనప్పుడు
నన్ను వదిలేసి పోతుంది!

నే నెరగని మరేదో ఒక కొత్త చేయి
నా చేయి పట్టుకొని ముందుకు నడిపిస్తుంది!
ఇది నా జీవితానుభవం!
నిజానికి – నేను తీసి ఫ్రేం కట్టు కొంటున్నవి
నీ నెగిటివులు మాత్రమేనేమో?

54. మెదడు

సామాన్యుడి మెదడు రేడియో,
మేధావి మెదడు టెలిఫోను!
కవి మెదడు వైర్‌లెసు!

నా మెదడు మాత్రం నీ లాలనకు
నిరంతరం శ్రుతి చేయబడి వున్న
ఒక చిరు చాండాలిక!

55. నా కేమవుతావు

నిన్ను ముఖాముఖి దర్శించిన భక్తులకు
కోటి సూర్య ప్రభవు నీవు,
నిన్ను వెనక నుంచి చూచిన యోగులకు
నిర్వికల్ప సమాధివి నీవు!

నేను భక్తుణ్ణీ కాను, యోగినీ కాను –
మరి, నీవు నా కేమవుతావో, నీ దయ!

56. స్వభావం

పోకిరీ అవుతాడేమో అని
పాలివ్వడం మానుతుందా తల్లి?
ఏ గయ్యాళి తుంచుకు పోతుందో అని
పూయడం మానుతుందా మల్లి?

నీవు నాకు లభించ వేమో అని
ఆరాధన మానుకొంటానా నేను?

57. పై చేయి

నా కున్నన్ని అంద చందాలు, సుఖ శాంతులు
లోకంలో ఎవరి కున్నై నీకు తప్ప?
నీ దెప్పుడూ పై చేయే –
పైకి రావాలన్న నా కోరికకు హేతువదే!

నేను ముందుకు దూకడం
నీవు నా కంటె ముందుండడం వల్లనే!

58. నీ కొరకే

నా సృజన –
నిన్ను పూర్తిగా ఆవిష్కరించే వరకే,
నా ఉబలాటం –
నిన్ను నిండుగా చూచే వరకే,
నా ఆర్తి నీవు దొరికే వరకే,
నా మూర్తి నీవు మురిసే వరకే!

59. ప్రేమ, తృప్తి, విశ్రాంతి

లఘు దేవతలు, గురు దేవతలు, గణ దేవతలు
వీరే నేను పూజించే దేవతలు,
రసం, భావం, శిల్పం, ఆనందం
ఇవే నన్ను పోషించే తీర్థ ప్రసాదాలు
ప్రేమ, తృప్తి, విశ్రాంతి
ఇవే నేను కోరుకొన్న వరాలు!

60. ఊహాపోహలు

మానవ లోకం మృత్స్న,
మనోలోకం జ్యోత్స్న,
పంజరంతో పాటు చిలుక చస్తున్నది
బల్బుతో పాటు వెలుగు పోతున్నది,
ఇంతటి విజ్ఞానానికీ పర్యవసానం
మృత్యువేనా అనిపిస్తున్నది!
అలా అనిపించకపోతే
ఇన్ని ఊహాపోహలకు ఆస్కారమేది?

61. దినమణులు

ఈ జనం అందరికీ నా పేరు తెలుసు
నన్ను తెలిసిన వాళ్లు మాత్రమే లేరు.
తెలుసు నంటారు కొందరు,
తెలుసు ననుకొంటారు మరికొందరు!
అందరివీ అపోహలు
వాళ్లందరూ దిన మణులే కావచ్చు
వెన్నెల చల్లదనాన్ని ఎలా పొందగలరు?

62. ప్రతి నక్కా

రాజ్యపాలన చెయ్యా లనుకొంటున్నావా?
కోట్లాది మంది పాలితులు సిద్ధంగా వున్నారు.

ఇద్దరు పెట్టుబడి దొరల్ని నంపాదించి
నలుగురు రౌడీలను మేపగలిగితే
ప్రతి నక్కా నరేంద్రుడు కాగల డీ దేశంలో!

63. వ్యక్తిగతం

ప్రతి మనిషికీ వ్యక్తిగత జీవితం వుంది,
అది ఎంత రహస్యమైన దైతే
అంత ఆనంద రస ఫలంగా వుంటుంది;
ఆనందో బ్రహ్మా అనబడే దదే!
మనిషికి జన్మ కారకం అదే!
వృద్ధి స్ఫోరకమూ అదే!

64. విశ్వాత్మ

నీవు ఏ రూపంలో నన్ను ఆరాధిస్తే
ఆరూపంలో సాక్షాత్కరిస్తా నన్నది పరమాత్మ
వివిధ సంప్రదాయాల ఆరాధనలే
వివిధ మతాల అధి దేవుళ్లు!
మన అభిలాష ప్రతి బింబాలే
మనం కొలిచే దేవతా మూర్తులు!
గుడికి వెళ్లినా, గదిలో కూర్చున్నా ఒక్కటే,
కావలసింది ఆరాధనలో ఏకాగ్రత!

65. వారసత్వం

నా జన్మకు, నా జీవిత వికాసానికి
నా తల్లిదండ్రులు కారకులు కాదు.
కేవల నిమిత్త మాత్రులు మాత్రమే.
ప్రకృతి పురుష ద్వైతాద్వైత పరమాత్మ నుంచి
నా వారసత్వాన్ని నా కందజేసిన వాళ్లు.
నీ విషయం కూడా అదే
మన ఇద్దరి కర్తవ్యమూ అదే
ఏ వారసత్వానికైనా మూలనిధి ఒక్కటే,
సంపదలోని వైవిధ్యం
సంపాదించే పద్ధతిలోది!

66. పులి, నక్క, గొర్రె

పులి, నక్క, గొర్రె -
అనేది నా సాంఖిక సిద్ధాంతం!
గొర్రెల నుంచే నక్కలు పుడుతున్నై,
నక్కల నుంచే పులులు పుడుతున్నై!
పులులూ, నక్కలూ కలిసి
గొర్రెల్ని భోంచేస్తూ కూర్చున్నై!

67. భయమే బ్రతుకా?

క్షణ క్షణం భయం భయంగా బ్రతకడమే
నిజంగా బ్రతకడం అంటాడు గద్దర్!
నిజమే నేమో! కాకపోతే –
నక్కలూ, పులులూ పిచ్చి పిచ్చి ఆకళ్ళతో
వెర్రెత్తి తిరుగుతున్న ఈ అడవిలో
ఇన్ని అమాయకపు గొర్రెలు ఎలా బ్రతుకుతున్నై!
తమను తినేస్తున్న నక్కల కంటే, పులుల కంటే
శతాధిక శాతంలో ఎలా విస్తరిల్ల గలుగుతున్నై!

68. ఆత్మ, శరీరాలు

కవిత్వం ఆత్మ –
సాహిత్యోద్యమాలు శరీరాలు.

అజరామరమై నట్టిది ఆత్మ,
వస్తూ పోతూండేవి శరీరాలు.
శరీరాలు పేర్లతో ఆత్మను పిలుస్తున్నావా?

కట్టుకొన్న చీర్ల పేర్లతో పిలుస్తూ
సరస్వతిని వేధిస్తున్నావా?

69. సరస్వతి చీరలు

భావ కవిత్వం, అభ్యుదయం కవిత్వం
సంప్రదాయ కవిత్వం, విప్లవ కవిత్వం
పద్య, గేయ, వాక్య, వచన కవిత్వాలు

అన్నీ రకరకాల దుస్తులతో, అలంకారాలతో
సరస్వతి కనిపించే రూపాలు!

సనాతన కాలంలో సరస్వతి
కంచి పట్టు చీరలు కట్టింది!
అధునాతన కాలంలో ఇపుడు
అమెరికా జార్జెట్లు, రష్యా మిడీలు,
జపాను జీన్స్ ధరిస్తున్నది!

అంతమాత్రం చేత ఆమెను
"ఏ రిక్షా! ఏ టాక్సీ!" అన్నట్టు
దుస్తుల పేర్లతో పిలవ వచ్చునా?

70. కవిత్వం ఉద్యమాలు

కవిత్వం వేరు
ఉద్యమ సాహిత్యాలు వేరు.
కవిత్వం జీవనది,
ఉద్యమ సాహిత్యాలు దాని లంకలు,
శాఖలు, వరదలు, వెల్లువలు!

జీవనది ఒక నిత్య నిరంతర ప్రవాహం,
వెల్లువలు వస్తుంటై, పోతుంటై!

మానవుడా!
ఇరవై వరకు, అరవై పైనీ
నీవు జీవ నదివి, కవితా ధారవు!
నడుము నలభై యేండ్లూ నీ జీవితం
ఎండలు, తుఫానులు, హిమపాతాలు, ఉద్యమాలు!
కంకర రాళ్లు, రాత్రి విగ్రహాలు!
శ్రమ, స్వేదం, నెత్తురు!

గ్రీష్మ నఖం

ప్రియురాలు గిచ్చితే నఖ క్షతం
విషకన్య గిచ్చితే నఖా ఘాతం,
నఖ క్షతం స్వ పక్షం
నఖా ఘాతం పర పక్షం.
నఖం మాత్రం నిష్పాక్షిక సమ పక్షం!

2. తన కోసమే

మానవుడి కార్య కలాపా లన్నీ
సొంత సుఖ సంతోషాల కోసమే!
అది కళా సృష్టి కానీ, ప్రజాసేవ కానీ,
మత బోధ కానీ, రాజ్యపాలన కానీ.

3. ఇక్కడే వున్నా

నీ కోసం వెతుకుతూ
అందా లన్నీ చూశాను
ఆనందా లన్నీ అనుభవించాను
నిన్ను తల దాల్చిన అందాలు
నిన్ను మరిపించిన ఆనందాలు!

తిరిగి తిరిగి, వెతికి వెతికి, గుండ్రంగా
బైలు దేరిన చోటికే వచ్చినట్టున్నాను –
గుమ్మంలోనే నిలబడి వున్నావు నీవు
నా పూల సజ్జతో!

అవును, ఎక్కడికి వెళ్లాను నేను?
లేదు, ఇక్కడే వున్నాను
ఇక్కడే! నీ తోనే! నీ వున్న చోటే!

4. దృక్కోణం

ఉగాది ఒడలి నిండా –
నఖ క్షతాలా అవి?
మామిడి చిగు ళ్లంటాడు కాళిదాసు,
నెల వంక లంటాడు వాత్స్యాయనుడు,
ప్రభుత్వం ప్రకటించిన కొత్త పన్నుల
కాట్లంటాడు ప్రతి పక్ష నాయకుడు.
ఎవరి దృక్కోణం వారిది!

5. దూరమే అందం

సూర్యుడు అంత దూరంలో వున్నప్పుడే
అతడు లోక బాంధవుడు,
ముఖంతో పోల్చబడేది
దూరస్థ చంద్ర బింబమే!

నీవు గౌరవించే వ్యక్తి దైనందిన జీవితాన్ని
మరీ దగ్గరగా పరిశీలించకు,
ఎంత గొప్ప వెండి కొండైనా
దూరానికే అది నునుపు!

6. సహ జీవనం

భక్తి, నీతి, ప్రేమ, కామం –
సహ జీవనం చెయ్యాలి ఈ నాలుగూ!
భక్తి లేకుండా నీతి నడుస్తుంది, కాని
నీతి లేకుండా భక్తి నిరర్థకం!
ప్రేమ లేకపోయినా కామం ఫలిస్తుంది, కాని
కామం లేని ప్రేమ వట్టి గుడి దీపం!

7. ప్రేమ లేఖలు

ప్రేమికులు వ్రాసుకొనేవే ప్రేమ లేఖలు,
దంపతులు వ్రాసుకునేవి కావు.
దంపతులు ప్రేమించుకొన్న వాళ్లే కావచ్చు, కాని
అడ్రసు తెలిసినాక అన్వేషణ ఎందుకు?
నిండు కౌగిట్లో కలిసినాక నిరీక్షణ దేనికి?

8. ప్రేమ - కామం

ఆ అమ్మాయి నా వంకే చూస్తున్నప్పుడు
అది పవిత్రమైన ప్రేమ,
మరొకరి కేసి ముఖం త్రిప్పిందా
అది కేవలం అపవిత్ర కామం!

ప్రేమ, కామం - ఈ రెండిటికీ నడుమ
అంత దూరం వున్నది కనుకనే
సూర్యుడు, చంద్రుడూ బ్రతకగలుగుతున్నారు,
ఎండా, వెన్నెలా ఆనందకరాలే అవుతున్నై!

9. స్త్రీ స్వామ్యం

ఈ సంసార రథాశ్వాల కళ్లాలను
పట్టు కోవలసిన చేయి నీదా? నాదా?
సత్య ప్రమాణకంగా నీదే!
సంసార వ్యవస్థా నిర్వహణ సర్వ హక్కులూ
స్త్రీవే, పురుషుడివి కావు.

మాతృస్వామ్యం పితృస్వామ్యమైన దుర్ముహూర్తమే
మగవాణ్ణి ఇంటికుక్కగా మార్చింది!
విరాట్పురుషత్వాన్ని విరిచి పాయ్యిలో పెట్టింది!
పశు బలం తప్ప పురుషుడి కింకేం మిగిలింది?

10. పరదాలు

ఇల్లు స్త్రీది, రచ్చ పురుషుడిది,
రెండూ రెండు సామ్రాజ్యాలు!
పడతిని పరదాలో దాచిపెట్టే మగవాడు
మగసిరి కలవాడు కాడు నిజానికి!
అంత పురాలూ, అసూర్యం పశ్యలూ
అసలు సూర్యుడికే తల వంపులు!

11. వి.ఐ.పి.

స్త్రీకి రక్షణ అవసరమే, అయితే అది
విఐపీ సెక్యూరిటీ దళంగా వుండాలి
జైలు గార్డుగా కాదు.
ఎందుకంటే – ఆమె చూలింతగా, బాలింతగా
విఐపీ లకే విఐపీ!

12. మౌన వాదం

నేను వాదిని, నీవు ప్రతివాదివి
నీకు మౌనమే భూషణ మైనప్పుడు
నీ తరపున కూడ నేనే వాదిని!

వాదీ, ప్రతివాదీ, లాయరూ, జడ్జీ,
సాక్షీ కూడ ఒకే వ్యక్తి అయినట్టిది మన కేసు!
ఇక చెప్పే దెవరు? వినే దెవరు?
న్యాయం జరిగే దెవరికి?

13. వెతకడం

ఎప్పుడూ వెతుక్కుంటూ వుండే వాడికి
నిజంగా ఏదీ దొరకదు!
దొరికిం దేదీ అతడికి పనికి రాదు!

నేనూ అలాంటి వాణ్నే, కాకపోతే
నీవు దొరికిన తర్వాత కూడ
ఇలా వెతకడ మేమిటి నా ముఖం?

14. మామిడిని

పుట్టగానే పరిమళిస్తుంది దవనం
మొగ్గ గానే కీర్తి కెక్కు తుంది మల్లె
క్రమంగా వికసిస్తుంది గులాబి
ఇవన్నీ నీవు తల మీద పెట్టు కొనేవే!
నిన్ను తల మీద పెట్టుకొనేవి కావు!

ఇక నే నంటావా?
నీ పాదాల వద్ద పుట్టి, నీతో ఎదిగి,
నీకు గొడుగు పట్టిన మామిడిని!
ఆలస్యంగా వికసించినా
అజరామరంగా ఫలించిన నీ వాణ్ణి!

15. పరమాత్మ బీజం

పెట్టి పుట్టడం, పురాకృతం, తల వ్రాత
పంటి పూహలు,కేవలం అపోహలు
ప్రతిభా వికాస సాఫల్యాలు బీజం తోడివి,
బీజం పరమాత్మ నుంచి మనస్సు సేకరించే
బహు ముఖ సంపదలలో ఒకటి!
ప్రతిభ బీజం తోడిది
బీజం పరమాత్మ లోనిది.

16. ఏకాగ్రత

"మనస్సు వికలమైతే
పగిలిన అద్ద మవుద్ది బ్రతుకు, కనుక
స్థిరంగా వుంచుకో మనస్సును" అంటాడు యోగి!
ఏకాగ్రమైన మనస్సే కదా పరమాత్మలోని బీ జాత్మ?
బీజంలోని గుణా లన్నీ పరమాత్మలోవే కదా?
మరి మనోవైకల్యం ఎక్కడిది?
ఏకాగ్రత దేనికి?

17. పూరణ పూరకాలు

లోకాన్ని అర్థం చేసుకోకుండా
లోల మనస్కులం కాగూడదు,
మనం ఒకరి కొకరం
పూరణ పూరకాలం
అతికితే దంపతులం,
అతక్కపోతే సహ యాత్రికులం!

18. రిడిల్

తండ్రి గరగర, తల్లి పీచు పీచు
బిడ్డలు రత్న మాణిక్యాలు అనేది రిడిల్
తండ్రి బూర్జువా, తల్లి లేబరు
బిడ్డలు సోషలిస్టులు అనేది వాస్తవం!
ఆ రిడిల్ ఒక శాశ్వత వాస్తవం!
ఈ వాస్తవం ఒక చక్రభ్రమణ రిడిల్!
అది సహజం,
ఇది కృతకం!

19. ప్రేమ - పెళ్లి

ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోకు,
పెళ్లి చేసుకొంటే ప్రేమ నిలవదు.

ప్రేమ ఒక మధుర భావన,
పెండ్లి ఒక వాస్తవ సహజీవన ధర్మం.

ప్రేమ హృదయంలోనే దాచుకో వలసి నట్టిది
పెండ్లి లోక విహారం చెయ్య గలిగి నట్టిది.
ప్రేమను ఇంటి దాకా తేకు!
ఇంటిని వీధిపాలు చెయ్యకు.

20. అన్నం కావాలి

అన్నం కావా లనేది కోరిక,
కోరికకు హేతువు ఆకలి!
ఆకలిని చంపుకోవడ మెలా?
అన్నం కావాలి, తప్పదు!

21. అర్హత

నీవు శివు డంతటి సోషలిస్టువా?
వామను డంతటి పాలిటీషియను వా?
బుద్ధ డంతటి హ్యుమనిస్టువా?
అయితే, భిక్ష మెత్తే అర్హత నీ కుంది?

22. అన్నదానం

అందరికీ సమానంగా దొరకవలసింది అన్నం,
మొత్తం అన్నాన్ని ఏ ఒక్కడో సొంతం చేసుకొని
తాను కలవాడైతే, తక్కిన వాళ్ళు లేని వాళ్లు కారా?
లేనివాళ్ళకు అన్నదానం చేస్తాడా ఈ కలవాడు?

అన్నదానం చేసేవాళ్ళు దోపిడీ దొంగలు
అన్నదానం మహా పాపం!

23. లక్ష్య భేదం

ప్రవరు డంతటి నిష్ణాతి కూడ
వరూధినిని తోసి వెయ్యడానికి
చేయి ఎక్కడ వేశాడో చూశావా?
అతడే ఒక దొంగ అయి వుంటే
చేయి మెడలోని గొలుసుపై పడేది!

24. దేవుడే ఏడిస్తే

రాముడు సాక్షాత్తు దేవుడే అనుకొంటే
అత డేడిస్తే మనకు నవ్వు రాదా?
రాముడు మానవుడు కనుకనే
అతడి కష్టాల పట్ల మన కంత సానుభూతి!
మాయాసీత ఏమైపోతే మనకేం?
అసలు సీత బాధపడితేనే మనకు బాధ!

25. విశ్వ కుటుంబి

ఇతర్ల కోసం వండే ప్రజా హోటలు కాదు నాది,
నా కోసం నేను వండుకొనే స్వగృహం!
అయితే, నేను విశ్వ కుటుంబిని కనుక,
నేను వండుకొన్నది లోక మంతకూ సరిపోతుంది!

26. నా సాహిత్య విందు

నష్టం వచ్చిన లక్షాధికారి బిచ్చగాడు కావచ్చు,
నిధి దొరికిన బిచ్చగాడు లక్షాధికారి కావచ్చు.
మనం గుర్తించవలసింది కలిమి లేములను కాదు
మనిషిని! మనిషి అవసరాన్ని!
అందుకే నా సాహిత్య విందు అందరికీ,
కలిమి లేములు, దేశ కాలాలు లేకుండా
అందరికీ, మనిషైన ప్రతివాడికీ!

27. బ్రతుకుతున్న బొమ్మలు

మనిషి ఆకారంలో కనిపించే ప్రతి వాడూ -
అవును, మనిషే!
అయితే, మరి - ఈ మూర్ఖులూ, క్రూరులూ,
పందలూ, బానిసలూ అంతా ఎవరు?
మనం తయారు చేసిన విగ్రహాలు!
మట్టి, రాతి, కొయ్య, పీచు బొమ్మలు!
ఆత్మ జ్యోతికి దూరంగా వుంచబడ్డ
చీకటి నీడలు.
ఎందుకు తయారు చేశాం?
మన దురాశలు తీర్చడానికి,
మనకు చాకిరీ చెయ్యడానికి!

28. బలి

ఏకం సత్, సోహం, తత్ త్వమసి అనే సత్యం
తెలిసిన వాళ్లకు మానవత లేదు,
మానవులుగా వున్న వాళ్లకు సత్యం తెలియదు!
తెలిసిన వాళ్ల స్వార్థానికి
తెలియని వాళ్లు బలి!

29. నీరు - అల

సముద్రంలో అల లేచి పడే టట్టే
పరమాత్మలో ఆత్మ పుట్టి గిడుతుంది.
అన్ని అలల లోదీ నీరే, కాని
ఒకే నీరు కాదు, దేని నీరు దానిది!
విరిగి పడిన అల నీరే సిసలుగా
తిరిగి లేచిన అలలోకి రాదు,
నీటికి అలతో వచ్చిన క్రియాశక్తి
ఆ అలతోనే పోతున్నది!
ఏ జీవితాని కా జీవితం సర్వ స్వతంత్రం,
ఇరుగు పొరుగును గమనించుకొంటూ పద!

30. పొరుగు వాడు

నీ వేదైనా ఒక పని చేస్తున్నప్పుడు
చూస్తూ వూరుకోడు నీ పొరుగు వాడు!
తోడ్పడ వచ్చు, అడ్డు పడవచ్చు,
పోటీ పడవచ్చు!
స్వ శక్తినీ, పర శక్తినీ అంచనా వేసుకో,
ఆత్మీయమైన ఏ పనినీ బహిరంగంగా చెయ్యకు!

31. వాడి నాక

కాడపై కుసుమం వున్నంత వరకే
పోటీపడి చుట్టూ మూగుతై తుమ్మెదలు.
అది వాడినాక అవి ఎందుకు వస్తై?
విసర్జిత నన్న ఏడ్పు కాడకు దేనికి?

32. కోకిలవో, గొడ్డలివో

ఆరాధించే వాళ్లకు ఏ రాయైనా దేవుడే
ద్వేషించే వాళ్లకు ఏ దేవుడైనా రాయే!
రసాల మెప్పుడూ ఆనంద రసాల సాలమే
నీవు కోకిలవో, గొడ్డలివో నీవే తేల్చుకో!

33. అవిచక్షణ

ఉల్లీ పచ్చడికే, మల్లీ పచ్చడికేనా?
మేకా కూరకే, మేనకా కూరకేనా?
హలమూ దున్నడానికే, కలమూ దున్నడానికేనా?
బర్రెనూ కొనుక్కోవడమే, భర్తనూ కొనుక్కోవడమేనా?
అయితే, అలాటి వ్యవస్థ మనకు వద్దు!

34. ప్రతి పందీ

ఏ సంస్కారమూ లేని సారా కాంట్రాక్టరుకు
సర్వ విద్యలూ నేర్చిన విదుషి సెక్రటరీ!
నోట్లతో వోట్లను కొని గెల్చిన బడాచోర్‌కు
ఐపిఎస్ మహావీరుడు సెక్యూరిటీ గార్డు!
వేద వేదాంత విద్యా పండిత పీఠానికి
పండిత పుత్రుడైన పరమ శుంఠ వారసుడు!
రత్న గర్భ ఈ ధాత్రి! అయినా, దీన్ని
ప్రతి పందీ తొక్కుకు పోతూనే వుంది!

35. అనంత ముఖుడు

సృష్టిలో ఎన్ని వైరుధ్యా లున్నా
అ వన్నీ ఒకే కేంద్రానికి బహుముఖాలు,
ఏక ముఖులు ప్రజ లైతే
నానా ముఖులు వారి నాయకులు!
ఏ ముఖం వాడి నా ముఖంతో పలకరించే
అనంత ముఖుడే కేంద్రాధిపతి!

36. బ్రతికే వున్నాం

శత్రువుల ఒరల్లోని కత్తులు తుపాకులుగా
ఫిరంగులుగా, బాంబులుగా మారుతూ వచ్చినా
మన కత్తులు ఖడ్గాలుగా కూడ మారలేకపోయినై!
మనం శతాబ్దాలపాటు బానిసలుగా పడివున్నా
జాతి సమైక్యానికి ప్రయత్నమైనా చెయ్యలేకపోయాం!
అయినా బ్రతికే వున్నాం!
అదే మన గొప్పతనం!!

37. ట్రాన్సిస్టరు

మెద డొక చిన్న ట్రాన్సిస్టరు,
ప్రతి మెదడూ ఏదో ఒక కేంద్రానికి
ట్యూను చేయబడి నడిచే వ్యవస్థే.
మ రొక కేంద్ర మేదో అడ్డ మొస్తే
అప్పు డది విప్లవం!
ట్రాన్సిస్టరే ట్రాన్సి మ్టరు కూడ అయితే
అప్పు డది సృజనాత్మకత!

38. నీ పాత్ర

ప్రతి కుటుంబ చరిత్రా ఒక నవల
ప్రతి వ్యక్తి బ్రతుకూ ఒక నాటకం.
దేన్నీ మరీ సీరియస్‌గా తీసుకోకు
నీ పాత్రను నీవు ఔచితితో పోషించుకో!
పెద్ద, చిన్న, మంచి, చెడు అనే వేం లేవు
ఆస్వాదించే వాడికి అన్నీ అమృత పాత్రలే!

39. ఛే రస్తా

శూన్యం నుంచి సృష్టి చెయ్యలేక పోతే
జరిగిన సృష్టికి అక్షరాభ్యాసం చెయ్యి!
కుడి, ఎడమ, ముందు, వెనక, పైని, క్రింద
ఈ ఛేరస్తాలో నిలబడి
అభ్యుదయం ఎటువైపో చూపు!
పెట్ట వలసింది పెద్దలకు తద్దినాలు కాదు
పాపాలకు గోరు ముద్దలు!

40. నే నెటుపోతే

నా జీవితం ఒక షడ్రుచుల నౌక
నా మనస్సు ఒక నవరసాల సముద్రం
నే నెటు పోతే అదే నా మార్గం
నే నెట నిలిస్తే అదే నా గమ్యం!

41. రసాలంకారాలు

రసాలూ, అలంకారాలూ, శయ్యలూ
ఈ సరంజామా అంతా ఎందుకంటావా?
గ్రోలే వాళ్లకు, అలరే వాళ్లకు, చొక్కి సోలే వాళ్ళకు
వాళ్ల కోసం ఇవన్నీ!
ఆహార మాత్రుల కోసం కాదు!

42. దేవుడంటే

దేవుడంటే –
మేధావికి విశ్వశక్తి, భక్తుడికి ప్రసాదం,
కార్మికుడికి పని, కవికి ప్రేయసి,
దొంగకు ఒడుపు, దొరకు బాడీగార్డు,
సామాన్యుడికి సొంత వైద్యుడు.
నాకు నీవు!

43. విగ్రహాన్ని బట్టి

ఛందస్సు అంటే –
అ దొక రెడీమేడ్ దుస్తుల ఏర్పాటు,
అ దొక బ్యూటీ పార్లర్!
అక్కడ ప్రతి సైజుకూ యూనీఫారం లున్నై!
నీ విగ్రహాన్ని బట్టి దుస్తుల్ని ఎంచుకో!
మరీ ఎత్తరివైతే, కొత్తవి నిర్మించుకో!

44. సరస్వతి ఒక్కతే

ఆధునిక కవిత, ప్రాచీన కవిత అనేం లేవు,
సరస్వతి ఒక్కతే నాడూ, నేడూ.
ఆనాడు కంచి పట్టు చీరలు కట్టింది,
ఈనాడు మినీ స్కర్టులు వేస్తున్నది!

45. సమయ స్ఫూర్తి

జీవితం ఒక వింత జూదం,
పేకాట, రేసులు వంటివే కాదు –
రాజకీయాలు, వ్యాపారం, ధరలు,
ఎన్నికలు, ఇంటర్వ్యూలు అన్నీ జూదమే!
ఫేవరిట్ గుర్రం బోర్డు ఎక్కక పోవచ్చు!
లంచం మేపినా పని కాకపోవచ్చు!
గెలవడానికి చాణక్యం ఒక్కటే చాలదు
సమయ స్ఫూర్తి తోడ్పడాలి.

46. రసాద్వైతం

పెళ్లికి ముందు ద్వైతం
పెళ్లైన కొత్తలో అద్వైతం
పిల్లలు పుట్టిన తర్వాత విశిష్టాద్వైతం
ఈ అన్నిటి గుండా ప్రవహించే ఏకాత్మతే
మన రసాద్వైతం!

47. వెనక్కి చూచుకో

నీవు ఏ వయస్సులో ఏం చేస్తూ వచ్చావో
కొంచెం వెనక్కి తిరిగి చూచుకొంటూ వుండు!
అప్పుడు నీ జీవితంలో సుఖ శాంతులకు
ఏ దశలోను భంగం కలగదు!

48. వైయక్తికాలు

ఉత్తరాదికి ఉత్తరాయణం వలెనే
దక్షిణాదికి దక్షిణాయణం పుణ్యకాలం!
పుణ్య పాపాలు, స్వర్గ నరకాలు వంటివి
దేశ కాలానుగత వైయక్తికాలు,
విశ్వ జనీన సత్యాలు కావు!

49. నీ పట్టు

నేను బైటికి చూచి నప్పుడు
నా అంతవాడు లే డనిపిస్తుంది
లోనికి తిరిగి నప్పుడు
నాపై నీ పట్టు కనిపిస్తుంది
కాయను కాడ పట్టిన పట్టు!
పక్షిని గూడు పట్టిన పట్టు!
గాలి పటాన్ని దారం పట్టిన పట్టు!

50. ఎవ రెవరో

ఎవ రెవరో, ఎంద రెందరో-
ఏ రైల్లోనో, ఏ సభలోనో
కబుర్లాడి పోతారు.
ఏ బడిలోనో, ఏ గుడిలోనో
కలిసి మెలిసి పోతారు.
ఏ క్రీడల్లోనో, ఏ ఎన్నికల లోనో
పోటీ పడి పోతారు.
ఇంటి దాకా వచ్చి పోతారు
గుండెను కూడ తట్టి పోతారు!
ఎక్కడి నుంచి వస్తారో!
ఏమై పోతారో!

51. నాయక లక్షణం

స్వలాభం కనిపించనిదే
ఎవడూ ఎవడి చుట్టూ చేరడు,
అనుచరులు కావా అనుకొంటే
ఆశలేవో కల్పించు.
అప్పుడప్పుడు అనుగ్రహిస్తూ వుండు,
అరచేతిలో బెల్లం పొడి వుంచుకొని
మోచేతిదాకా నాకిస్తూ వుండు!

52. గ్లామరు

వధూమణులు వరించేదీ గ్లామరు నటుణ్నే
ఓటర్లు వరించేదీ గ్లామరు నటుణ్నేనా?
సీతాకళ్యాణమూ కావ్య వస్తువే
సినీతార ఆరోపెళ్లీ కావ్య వస్తువేనా?
నటవిటులే నాయకు లైతే
నరలోకం నక్కల పాలే,
ఆలోచించండి!

53. ఎర

అటు వెళ్ళకు, అది ఎన్నికల సభ.
అది ఆకలి తీర్చే అన్నదాత కాదు
మత్తుగొలిపే మాటల మదిర!
విస్తట్లో కూర కాదు
వాగురలో ఎర!

54. కోరిక

ఒకో మనిషికి ఒకో కోరిక
అది తీరడమే పురోగమనం.
కోరికను చంపుకొన్నవాడు సిద్ధుడు
కోరికను తీర్చుకొన్నవాడు శివుడు!

55. సత్య సూక్తులు

దైవభీతి ఒక నిత్య కర్ఫ్యూ
మతం ఒక జన్మ ఖైదు,
భక్తి ఒక వెట్టి చాకిరీ
ప్రార్థన ఒక అరణ్య రోదన,
ఎప్పుడైనా సరే
ఎక్కడైనా సరే.

56. రెండు సంధ్యలు

బాల్యం తెలియకుండానే గడిచిపోతుంది
వృద్ధాప్యం తెలిసి బాధిస్తుంది.
చీకటి నుంచి పుట్టేదీ
చీకటిలో కలిసి పోయేదీ
రెండు సంధ్య లవి!

57. బలహీనతలు

కామం, కనకం, మద్యం, ద్యూతం
నాలుగూ మానవ బలహీనతలు.
వీటిని నిషేధించగూడదు
నియంత్రించాలి.
నిషేధిస్తే చీకటిలోకి పోతాయి
భూతాలై చెలరేగుతాయి.
అప్పుడంతా భూతరాత్రే
పగలే వుండదు!

58. గర్జించు

కుడితే తేలు
కుట్టకుంటే కుమ్మరి పురుగు.
నీవు పురుగువు కావద్దు
కుట్టను కూడ వద్దు
గర్జించు!
కనీసం మొరుగు!!

59. ప్రజా కవి

ప్రజా కవి అంటే ఎవరు? ప్రశ్న!
ప్రజ లంటే ఎవరు? ప్రతి ప్రశ్న!
ప్రజ లంటే –
రైతులా? కూలీలా?
ధనికులా? దళితులా?
యజమానులా? కార్మికులా?
లోభులా? దాతలా?
ఎవరు?

ఏదో ఒక వర్గం ప్రజల కోసం వ్రాసేవాడు
అపరిమితుడు కాదు, పరిమితుడు
ప్రజాకవి కాదు, వర్గ కవి.

ఏ వర్గానికి చెందిన వాడైనా
మనిషి మనిషే!
మనిషి కోసం వ్రాసేవాడే కవి!
అతడే నిజమైన ప్రజా కవి!

60. తేడా

"ఏమిటి ఆస్పత్రికి వచ్చారు?" అడిగాడొక మిత్రుడు
"తల తిరుగుతున్నది" చెప్పాను నేను
"వృద్ధాప్యం, పాపం" జాలిపడ్డాడతడు
వృద్ధు డనిపించుకోవడం ఇష్టం లేదు నాకు,

"ఏమిటి ఆస్పత్రికి వచ్చారు?" అడిగాడు మరో
మిత్రుడు
"ఏదో వృద్ధాప్యం కదా" అన్నాను నేను
"ఆ, మీకు వృద్ధాప్య మేమిటి?" అన్నా డతడు!
ఎంతో సంతోషపడ్డాను ఆ రిమార్కుకు.

61. శత్రువులు కాదు

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు
ఆరూ మనిషికి శత్రువు లనడం
ఎంత అజ్ఞానం!
ఇవి శత్రువులు కావు
సెక్యూరిటీ గార్డులు!
ఇవి లేకపోతే
బ్రతకలేడు మనిషి
బ్రతక నివ్వదు లోకం.

62. అర్హత

సవర్ణులూ, హరిజనులూ ప్రక్కప్రక్కగా
ఒకే వీధిలో నివసించగల్గి నప్పుడే
ఈ దేశానికి స్వరాజ్యం వచ్చినట్టు
ఈ జాతి వీర్యవంతమైనట్టు
ప్రపంచ మానవ నాగరికత లోకి
ప్రవేశార్హత లభించినట్టు.

63. పామై

పదవీ రాజకీయాలు
తెల్లమార్కెట్ల నీడలలో నల్లపాములు!
కవి పాములవాడు కావాలి
తానే ఒక పామై ఆడ గూడదు.

64. చెంబెడు

మహా సముద్రంలో
బురద వాగూ కలుస్తున్నది
పవిత్ర గోదావరీ కలుస్తున్నది
మహాసముద్రంలో మార్పేమీ వుండదు.
అందులో చెంబెడు నీళ్లు పోసి
చెంబెడు నీళ్ళు తీయవచ్చు. కాని
అవీ ఇవీ ఒకటే కాబోవు.

65. కవి

నేను కవిని కాను కాని
కవి సమ్మేళనలలో పాల్గొంటాను!
నాకే సభ్యతా లేదు కాని
అన్ని సభలకు అధ్యక్షత వహిస్తాను!
నాకు ప్రజల భాష తెలియదు కాని
ప్రజానాయకత్వాన్ని డబ్బిచ్చి కొనుక్కొంటాను!

66. శపించడం

నేను శపిస్తే ఏం కాదు, అయినా
శపిస్తూనే వుంటాను మానవ మృగాలను.
మృగాలు కూడ నన్ను శపిస్తూనే వున్నై
నేను మానవుడిగా లేచి నిలబడినప్పుడెల్లా,
శపించడం, దీవించడం వట్టి అలవాట్లు
మురిగిపోయే వోట్లు!

67. లవ్ యూ లు

నేటి ప్రభుత్వ సంస్థల విద్యార్థులలో
కొద్ది మంది ఏకలవ్యులు,
చాల మంది అనేక లవ్యులు.
మొత్తం మీద అందరూ చెడిపోతున్నది
ఈ "లవ్యూ"ల (Love you) వల్లనే!

68. సాంకర్య భయం

వర్ణ వ్యవస్థకు కారణం
వర్ణ సాంకర్య భయం.
భయం నిజమే అయింది,
రామాయణ భారత పురాణ పురుషు
లందరికీ జననావకాశం కల్పించింది.
అప్పుడే కాదు, ఎప్పుడూ కూడ
విశ్వ నరు లంతా
స్వేచ్ఛా ప్రణయ ఫలాలే!

69. వధ్య శిలలు

ప్రేమించిన వ్యక్తిని ధర్మంగానో, అధర్మంగానో
అనుభవించా లనుకోవడం జీవ లక్షణం.
ఈ లక్షణం ఉభయులకూ సమానమే, కాని
ఎక్కువగా మగ గుండెలే ఆడ కోరికలకు
వధ్య శిల లవుతున్నా యెందుకో?

70. అడుక్కు తినడం

బ్రతకడానికి పనిచేస్తున్నావు, మరి
ఏం చెయ్యడానికి బ్రతుకుతున్నావు?
దాదాగిరీలు, వసూళ్ళు, పార్టీ ఫండు,
విరాళాలు, లంచాలు వంటి వన్నీ
అడుక్కు తినడాలే కదా?
అడుక్కు తినడానికా బ్రతుకుతున్నావు?
నీ బ్రతుక్కు సర్వజనీన పరమార్థం
ఏదేని వున్నదా?

71. పుత్రా దిచ్ఛేత్

"పుత్రా దిచ్ఛేత్ పరాజయం" అనే పురాణ వాక్కు
ఈ నాటికి ఫలించిందో యేమో....
అధికార పీఠ మెక్కిన ప్రతి తండ్రీ
కొడుకుల చేతిలో
చావు దెబ్బలు తింటున్నాడు!

72. భక్తులు

మూడో కన్ను తెరిస్తే ముల్లోకాలూ
భస్మమైపోతా యనుకొంటున్న ముక్కంటిని
మూడు ముక్కలుగా నరికి పోయాడు గబ్బీ!
మరి, భక్తు లేమైపోయినట్టు?
తమ దేవుణ్ని కాపాడుకోలేని నిర్వీర్యులు
ఏమైపోతే నేం లే!

73. కుండలిని

ఏ జీవికైనా
కుండలినీ శక్తే జీవ శక్తి.
సామాన్యులలో అది నిద్రాళువు
అప్పుడప్పుడప్పుడు ఉలిక్కిపడి లేచి
మళ్లీ నిద్రలోకి జారిపోతుంది.
మహాయోగి దానిని బలవంతంగా లేపి
చెరిపేట్టి ఊడిగం చేయించుకొంటాడు.
అదే తనకు తానై వరించి వచ్చినప్పుడు
అవడు యోధుడు, విజ్ఞాని, మహాకవి!

వర్షానఖం

చెయ్య వలసిన పనీ ఎంతో వుంది
తిండిలేని నిరుద్యోగులూ ఎందరో వున్నారు
పని చెప్పి తిండి పెట్టే నాయకుడే లేడు!

చేలోని పంట ఎండీ, తడిసీ పాడైపోతున్నది
గట్టు మీది జనం ఆకలో అంటూ చస్తున్నారు!
అన్నార్తులు చేలో దిగరు
అన్నం దానంత టది గట్టు పైకి రాదు.
పని కాదు, ఆకలి పోదు!
ఎవ డయ్యా ఇక్కడ దేముడు?

2. ఉద్యోగ మంటే

ఉద్యోగం పురుష లక్షణం, అవునా?
మరి, ఈ నిరుద్యోగు లంతా ఎవరు?
పాపం, వాళ్లూ పురుషులే, అయితే–
ఉద్యోగ మంటే ప్రభుత్వోద్యోగమే అనుకొని
మోస పోతున్న అమాయకులు!
ఉద్యోగ మంటే నౌకరీ కాదు
స్వప్రయత్నమూ, స్వయం కృషీ ను.

3. క్రియా శీలత

ఎంత పెద్ద ఆఫీసర్ అయినా నౌకరే
కిళ్ళీ కొట్టువా డైనా స్వతంత్ర పౌరుడే.
జీతం ఎంత పెద్దదైనా, యజమాని ఇచ్చేది
రాబడి ఎంత తక్కువైనా స్వయంగా ఆర్జించేది.
కనుక, ఓ నిరుద్యోగులారా
అపోహలు మాని, క్రియాశీలురు కండి!

4. నిరుద్యోగం ఎక్కడుంది

నిరుద్యోగం ఎక్కడుంది?
ఉద్యోగ మంటే సర్కారు కొలువు అనుకోడంలో వుంది.
కూటి కోసం కోటి విద్య లున్నా యన్న వాస్తవం
విద్యావంతులకు తెలియక పోవడంలో వుంది.
ప్రజల సంపదను అనేక రూపాల్లో కొల్లగొట్టి
రాజకీయ రంగం తనేయడంలో వుంది.
కార్మికుడైనా, కర్షకుడైనా, నాయకు డైన తర్వాత
భ్రమందుగా మారిపోవడంలో వుంది.
ఎవరో చెపితేనే కాని ఏ పనీ చెయ్యలేని మన
నిష్ప్రతిభలో వుంది, నిష్క్రియలో వుంది.
నిజానికి నిరుద్యోగం బై టెక్కడో లేదు
అది మన మస్తిష్కంలో వుంది!

5. యజమాని - బానిస

ఎంత కాలంగా బ్రతుకుతున్నా మనేది కాదు
ఎలా బ్రతుకు తున్నా మనేది ప్రశ్న.
బానిస తనకు తానుగా బ్రతకడు
యజమాని కోసం బ్రతికించి వుంచబడతాడు!
కుక్కలు, గొర్రెలు, బర్రెలు, గుర్రాలు
కోళ్లతో పాటు పెంచబడతాడు!
నీవు బ్రతుకు తున్నది బానిస గానా?
యజమాని గా నా?

6. పడి చావడం

డబ్బు కోసం పడి చచ్చేవాడు నిత్య దరిద్రుడు
కీర్తి కోసం పడి చచ్చేవాడు మృత జీవుడు
పదవి కోసం పడి చచ్చేవాడు పగటి దొంగ
సుఖం కోసం పడి చచ్చేవాడు దుఃఖితుడు
ముక్తి కోసం పడి చచ్చేవాడు మూర్ఖుడు!

7. నేటి యువకులం

మేం విజ్ఞాన యుగంలోని యువకులం!
నల్లి కుడితే మంచాన్ని విరగ్గొడతాం
ఎలక మెదిలితే ఇంటినే తగల బెడతాం!
నల్లిని చంపలేం,
ఎలకను తరమలేం!

8. సత్యాగ్రహం - యుద్ధం

యుద్ధం చెయ్యి అన్నాడు కృష్ణుడు
సత్యాగ్రహం చెయ్యి అన్నాడు గాంధి
ఇద్దరూ కరక్టే!
సాయుధుడైన వీరుడికి చెప్పా డాయన
నిరాయుధుడైన బానిసకు చెప్పా డీయన!

9. వీరుడవు కా

రౌడీకి భయపడే వాడివి
రాజ్య మెలా పాలిస్తావు?
రాజ్య మెప్పుడూ వీరభోజ్యమే, కనుక
నీవు ముందు వీరుడివి కా!

10. రౌడీ - రాక్షసుడూ

ఆనాటి రాక్షసుడే ఈనాటి రౌడీ,
వీరుడు నాడూ నేడూ వీరుడే!
మానవత్వాన్ని పెంచి
పోషించా లనుకొంటున్నావా?
రాజ్యాన్ని రౌడీ రహితం చెయ్యి!

11. దొర - దొంగ

దొరికితేనే దొంగ,
అంతవరకు దొరే!
ఆ ఇద్దరూ అదృష్ట వంతులే,
మధ్య ప్రజలే నష్ట భాగ్యులు!

12. గూండాలు

గూండాలను ఎవరు సృష్టిస్తున్నారు?
న్యాయం దొరకని ప్రజలు!
గూండాలను ఎవరు పోషిస్తున్నారు?
న్యాయానికి దొరకని దొరలు!

13. వీరభద్రుడివి కా

భిక్ష మడిగితే వామనుడిలా అడుగు
భిక్ష పెడితే బలి చక్రవర్తిలా పెట్టు
త్యాగం చేస్తే దధీచిలా చెయ్యి
అమానానికి ప్రతీకారం తీర్చుకోదలిస్తే
వీరభద్రుడిలా విజృంభించు!

14. అదే రాజరికం

రాజరికం, ప్రజాస్వామ్యం, నియంతృత్వం
ఏ పేరుతో పిల్చినా - ప్రభుత్వం అదే!
శక్తి కలవాడే రాజు, ప్రధాని, అధ్యక్షుడు, నియంత!
బలహీనుడే బంటు, పేద, కార్మికుడు, బానిస!

15. హరి హరులు

చట్టాలు, పోలీసులు, కోర్టులు
ఏవీ బలహీనుణ్ని రక్షించలేవు.
చక్రమో, త్రిశూలమో చేత లేకపోతే
హరిహరులు కూడ దాసానుదాసులే.

16. అతిశయ పూజ

రాముడు దొంగ దెబ్బలు కొట్టాడు
కృష్ణుడు స్త్రీ లోలు డయ్యాడు
ధర్మరాజు అబద్ధా లాడాడు
వామనుడు నమ్మక ద్రోహం చేశాడు
ఇంద్రుడు చెయ్యని పాడు పనే లేదు!
అధికులు స్వాతిశయం కోసం ఏ పని చేసినా
చెడు పని కా దనేదే మన సంప్రదాయం.

17. ప్రకృతి నైజం

పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణం పోకడ!
నిజమే, అది ప్రకృతి నైజం.
పిల్లికి చెలగాటం, మరో పిల్లికి ప్రాణం పోకడ
నైజమా, మానవుడా?
పశు పక్ష్యాదుల గుణాలను నీ గుణాలతో
పోల్చి చూచుకొని బాగుపడు, కాని
మరొక మనిషి నీపై పిల్లిలా దూకితే
ఎలకలా ఎందుకు వీగి పోతావు?

18. వద్దు పశ్చాత్తాపం

ఆలోచించ కుండా ఏ పనీ చెయ్యకు
చేసిన ఏ పనికీ పశ్చాత్తాప పడకు.
నీకు అవసరమైన పనినే నీవు చేస్తావు
అందుకు పశ్చాత్తాపం దేనికి?
పశ్చాత్తాపం అనేది ఒక దుర్బలత్వం
తప్పించుకోడాని కొక సాకు!

19. మనిషిగా బ్రతుకు

పట్టభద్రుడ వయింది ప్రభుత్వ సేవకేనా?
ప్రజాసేవ చేసేది పదవి కోసమేనా?
వనజాక్షిని ప్రేమించింది వంట వనికేనా?
తండ్రి ఆస్తి తగలేసేది తాగడానికేనా?
అయితే, ఇక నీవు
మనిషిబ్రతికే దెప్పుడు?

20. ఏది దగ్గర

నీకు చేతనైన పనిని చేసుకొంటూ
ఆనందంగా ఆత్మీయులతో బ్రతుకు.
స్వర్గానికి రైతు గృహం కంటె
రాజ భవనం దగ్గరేం కాదు!

21. కోరవలసిన వ్యవస్థ

అడిగితేనే కాని అమ్మైనా పెట్టదు
అనే సామెత మారాలి.
ఆందోళన చెయ్యకుండానే
అవసరా లన్నీ తీరాలి.
ఏడుపుకుండానే ఈప్సితార్థం లభించాలి
అదీ మనం కోరవలసిన వ్యవస్థ!

22. నిరోధక నీతి

నీతులు మూడు వర్గాలు –
ప్రకృతి వైరుద్ధ్యాల నుంచి రక్షించేవి
సంఘ సహజీవనానికి తప్పనివి
వ్యక్తిత్వ వికాసాన్ని నిరోధించేవి!
నేను నిరసించేది ఈ నిరోధక నీతిని!

23. ఇంగిత జ్ఞానం

ఇంటి గుట్టు పొక్కే రావణుడు చచ్చాడు
అబద్ధాన్ని నమ్మే ద్రోణుడు చచ్చాడు
ప్రతి పక్షంతో పరీక్షై భీష్ముడు చచ్చాడు
మిత్ర ద్రోహం చేసి కర్ణుడు చచ్చాడు
రాజకీయ రంగం ఎప్పుడూ ఇంతే!
నిన్ను రక్షించేది నీ ఇంగిత జ్ఞానం!

24. ప్రతి వాడూ

ప్రతి శిశువూ మన్ను తినేవాడే
ప్రతి విద్యార్థీ అల్లరి చేసేవాడే
ప్రతి యువకుడూ దారు కాసేవాడే
ప్రతి ప్రౌఢుడూ పైసలు పోగు చేసేవాడే
ప్రతి వృద్ధుడూ అసంతృప్తుడే
ప్రతి తరంలోనూ ఇంతే!
ఇక మన ప్రత్యేకత ఏమిటి?

25. ఉద్యోగి కథ

కాపీ కొట్టి పాసయాడు
ఉత్తర దక్షిణాలతో ఉద్యోగి అయాడు .
వెంటనే హక్కుల పోరాటం మొదలు పెట్టాడు.
ప్రశ్నలు వేసి ఫైళ్లను తిప్పేస్తూ
ప నేమీ చెయ్యకుండానే జీతం పుచ్చుకుంటాడు,
పని చేసినందుకు లంచం గుంజుకుంటాడు.
ఇదీ ఒక ఉద్యోగయ్య కథ!
కథ కంచికి పోకుండా
మన కే మంచీ జరగదు!

26. ఏం మిగిలింది

ప్రతిభ పరా రయింది
కాపీ కొట్టడం కళ అయింది
స్వార్థం రాజనీతి అయింది
అవినీతి బ్రతుకు తెరు వయింది
త్యాగం అణగద్రొక్క బడింది!
ఇక, ఈ జాతి బ్రతికే వున్న దనడానికి
నిదర్శనం ఏం మిగిలింది?

27. బానిస మనస్తత్వం

అసూయా ద్వేషాలు, క్రోధ లోభాలు,
మద మాత్సర్యాలు బానిసకే వుంటై -
తన నోటి దగ్గరి ముద్దను మరొకడు
గుంజుకు పోతా డన్న భయం అది!

28. ఆలోచించు

బార్లకు వెళ్లే వాళ్లంతా తాగుబోతులు కారు
భిక్ష మెత్తే వాళ్లంతా దరిద్రులు కారు
డిగ్రీ లున్న వాళ్లంతా విద్వాంసులు కారు
ఎన్నికైన వాళ్లంతా ప్రజా ప్రతినిధులు కారు
నీతులు చెప్పే వాళ్లంతా నిజాయితీ పరులు కారు.

29. కొత్తేం కాదు

పైకెక్కేసి నిచ్చెనను తోసెయ్యడం
ఏరు దాటి తెప్పను తగలెయ్యడం
పాలు తాగి రొమ్ము గుద్దడం
తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టడం
దివాలా తీసి శ్రీమంతు డైపోవడం
ఆశ్రయ మిచ్చిన ఇంటికే నిప్పు పెట్టడం
కొత్తేం కాదు లోకానికి!
నీ జాగ్రత్తలో నీ వుండడమే నీ సంక్షేమం.

30. పిల్లి పిల్లలు

పిల్లి పిల్లల్ని కనేసి
ఇళ్ల మీదకు వదిలేస్తుంది,
ఆ మీద అవి చేసే న్యూసెన్సుకు
ఆ ప్రాంతాలలో సుఖ శాంతు లుండవు!
ఇక – కుక్కల రంగ ప్రవేశం కూడ దేనికో?

31. గొర్రెలు కనుక

ప్రతి మనిషీ అనుకొంటాడు –
తాను రైటూ, తక్కిన అందరూ రాంగూ అని!
నిజమే కావచ్చు! అయితే
మనుషుల్లో మెజారిటీ గొర్రెలు కనుక
నక్కల ముందు నోరెత్తరు!
పులుల ముందు తలెత్తరు!

32. కొడవలి

పరదా వెనుక దాచబడిన రత్నం కంటె
పంటచేలో అరిగి పోయిన కొడవలి విలువైంది!
మొదటి దాన్ని సమాజం రక్షిస్తుంటే
సమాజాన్నే రెండోది రక్షిస్తున్నది!

33. మా జేబులు

ఇక్కడ అనావృష్టి కరువా?
నోట్ల వర్షం కురిపిస్తాం,
అక్కడ అతి వృష్టి ముంపా?
నోట్ల కట్టలతో కరకట్టలు బాగుచేస్తాం,
కరువూ - ముంపూ ఒకదాని వెనక ఒకటి రాకపోతే
మా జేబులు పండే దెట్టా?

34. కోట్లు - వోట్లు

కరువు పనులూ, ముంపు పనులూ
ప్రతి యేడూ అవే పనులు!
కరువు కమిటీలూ, ముంపు కమిటీలూ
ప్రతి సారీ అవే కమిటీలు!
ఈ అన్నిటికీ ఖర్చు కోట్లు,
జమ వోట్లు!

35. అవే మళ్లీ మళ్లీ

అవే వానలు, అవే నదులు, అవే వరదలు
అవే పల్లపు ప్రాంతాలు, అవే ముంపులు
అవే ప్రజల యేడ్పులు, అవే పలాయనాలు
అవే ప్రతి యేడూ, అవే మళ్లీ మళ్లీ!
వీటికి శాశ్వత పరిష్కారం లేదా అంటే
వుంది, కాని -
ఇ వన్నీ నిజంగానే పరిష్కార మైపోతే
ఇక, మా ముఖ మెవడు చూస్తాడు?
మాకు వో ట్లెవ డిస్తాడు?

36. నీతి - అవినీతి

నీతికీ, అవినీతికీ తేడా ఏం లేదు
తనకు దక్కిన సుఖం నీతి,
మరొకడికి దక్కిన సుఖం అవినీతి!
లోక దుఃఖా లన్నిటికీ కారణం
ఈ దక్కని బియ్యపు గింజలే!

37. భిక్ష

నీ కెవడో ఏదో చెయ్యలే దని విమర్శించకు,
నీ వెవడికైనా ఏదైనా చేశావేమో ఆలోచించుకో!
ఇతరుల నుంచి ఆశించేవాడు క్షుద్రుడు,
ఇతరుల కిచ్చేవాడు రుద్రుడు!

38. సమస్య కాదు

పరిష్కరించ లేని సమస్యలతో చచ్చే కంటె
అవి సమస్యలే కా వనుకొని బ్రతకడం మేలు.
వెలుగుకు నీడ సమస్య కాదు
వనస పండుకు కడుపు కోత సమస్య కాదు
పచ్చిక బీడుకు ఆల మంద సమస్య కాదు.
రవి చంద్రులకు రాహుకేతువులు సమస్య కాదు.

39. వేట

అత డెవరో నీకు తెలియదా?
నీ కోసం వల పన్ని కూర్చున్న వేటగాడు!
వేట అతడి వృత్తి -
నీ జాగ్రత్తలో నీ వుండడం నీ విధి.

40. మేధావి - రౌడీ

మేధావి పిరికి వాడు, కారణం
తన కున్న దేదో పోతుందని భయం!
రౌడీ సాహసికుడు, కారణం
తనకు లేని దేదో దొరుకుతుం దని ఆశ!

41. అధికార మూర్ఖత

వీధిలో తనకు గిట్టని వాడొక డున్నా డని
వీధినే రద్దు చెయ్య మన్నాడొక నియంత,
చెరువులో నీరు తన శత్రువు కూడ తాగుతున్నా డని
చెరువునే పూడ్చెయ్య మన్నాడొక హంత!

42. వేళ్లు నమ్మె చేస్తే

మట్టి నుంచి మస్తిష్కం దాకా వికసించిన
ఈ అడవికి తోటమాలి లేడా?
మట్టి లోతుల్లోని వేళ్లకు
పుష్ప పరీమళం అందడం లేదు.
వికసిత పుష్ప ఫల భోగ భాగ్యాలకు
అసలు తా మెవరో తెలియడం లేదు!
కింది వేళ్లు నమ్మె చేస్తే
పై రంగు లే మవుతై?

43. అక్షర జ్యోతి

అక్షర లక్షల ధన తైలాన్ని మింగేస్తూ
అక్షర జ్యోతి వెలిగి పోతున్నది!
దాని నీడలోని నిరక్షర కుక్షుల
గుడుంబా మత్తును సొమ్ము చేసుకొంటూ
ఫైవ్ స్టార్ హోటళ్లు వండగలు చేసుకొంటున్నై.
ఆ వండగల విందుల పరిశిష్టం కోసం
పక్క సందుల్లో ప్రతీక్షిస్తున్న పంది కొక్కులు
సెక్సు క్రైం థ్రిల్లర్లతో
కడుపులు నింపుకొంటున్నై.
ఓహో! అక్షర జ్యోతీ!
నీ కాంతి కిరణ సంపుటాల క్రీనీడల్లో
ఎంత శ్రేయో చీకటి సంపన్నత!
ఎంత సంపన్న సంక్షేమ కార్యక్రమం!

44. శ్రమ - సన్మానం

"సారాహార సమార్జన వేళ్లది
సన్మానము పువ్వులది"
అంటూ విమర్శించింది నేనే; అయితే -
పూలకు సన్మానాలు పెరిగే కొలదీ
వేళ్లు మరీ ఉత్సాహంతో పని చేస్తున్నాయి!
ఏమిటీ మైపరీత్యం?
మైపరీత్యం ఏం లేదు -
వేళ్లూ తానే, పువ్వూలూ తానే అనే జ్ఞానం
చెట్టు కుంది, మానవులకు లేదు!

45. పులుల పెత్తనం

సత్యం, అహింస, త్యాగం, పరోపకారం
నీతి శతకాలు, వేదాంత సూక్తులు ఎన్నెన్నో!
అందులో ప్రతి సూక్తీ ఒక ప్రగతి ప్రణాళికే!
ప్రణాళికలు లేక కాదు ప్రజలు చస్తున్నది,
వాటి అమలును పులులు చేబట్టడం వల్ల!

46. ఊడ

ఎంత ఎత్తులో పుట్టినా
ఊడ క్రిందకే దిగుతుంది,
ఎంత క్రిందులో పుట్టినా
కొమ్మ పైకే ఎదుగుతుంది.
ఎక్కడ పుట్టా వన్నది కాదు ప్రశ్న,
ఎలా పెరిగా వన్నది!
పైన పుట్టిన ఊడల్ని పైపైకి ఎక్కిస్తూ
క్రింద పుట్టిన కొమ్మల్ని క్రింది క్రిందికి తొక్కేస్తూ
సహజ ధర్మాన్ని అరికడుతున్న కులతత్వ వాదీ!
నీ సనాతన మహా వృక్షం
పుల్ల విరిగి పోతూ వుంది
గమనిస్తున్నావా?

47. కళాభిజ్ఞ

కళాకారుడివి కావాలనుకొంటే
ఏదో ఒక కళను ఆరాధించు,
కళాకారులకు నాయకుడివి కావా లనుకొంటే
ప్రతి కళ గురించీ ఏ కొంచెమైనా తెలుసుకో!

48. సేవకుడు

ఎవరు నీవు?
నేనా? తెలియదు
ఏ వూరు? – తెలియదు
నీ తలిదండ్రులు? – తెలియదు
నీ కులం? – తెలియదు
నీ మతం? – తెలియదు
ఏం చదివావు? – తెలియదు
ఏం కావాలి? – అన్నం!
లేదు, పో! – పోను!
సేవకా! వీణ్ని బైటికి గెంటు!
నేనే సార్ ఆ సేవకుణ్ని!

49. ఆత్మ స్థైర్యం

ఏదో ఒక రాయి ఎక్కడైనా దొరుకుద్ది,
ముందు సూటిగా విసరడం నేర్చుకో!
గురుమెవరైతే నేం -
సాధించ వలసింది గురి!
ఆయుధ సంపత్తి కాదు ప్రధానం,
ఆత్మ స్థైర్యం!

50. ప్రభుత్వ హుండీ

ధరలు పెరుగుతై, పెరిగి
ఉద్యోగుల జీతాలను పైకి గుంజుకొంటై,
అవి మళ్లీ పెరుగుతై
వీటిని మళ్లీ గుంజుకొంటై!
ఈ వానర మార్జాల పోటీ పందాలను తిలకిస్తూ
ఉద్యోగేతర మానవ కోట్ల ఆకటి చావులు
ప్రభుత్వ హుండీకి జమ అయిపోతై!

51. బాబావు కా

నీవు దృఢంగా, పొడుగ్గా వుంటావా?
ముఖం విలన్ ముఖంలా వుంటుందా?
అయితే - గడ్డం పెంచి, పూసలు ధరించి,
రేఖలు చూస్తూ చేతులు దువ్వటం నేర్చుకో!
అప్పుడు నీ నిరుద్యోగ సమస్య తీరిపోగా
నీవే లక్ష మందికి ఉద్యోగా లిప్పించ గలవు!

52. గుణం మార్పిడి

సమస్త గుణ సమగ్రమైన పరమాత్మలో
ఒకొక్క గుణం ప్రధానంగా
ఒకొక్క బీజాణువు పుడుతుంది.
అచంచల ధ్యానం ద్వారా
ఆత్మ గుణాన్ని మార్చగలం,
నేరేడు గింజను పాతి
మారేడు చెట్టును మొలిపించ గలం!
బీజం ఏదైనా బ్రహ్మం నుంచి పుట్టేదే
పని ఏదైనా పైసలుగా మారేదే!

53. గోముఖం

నీ లక్ష్యం సుఖజీవన మైతే
నిశ్చింతగా వ్యవసాయం చేసుకో,
నీ లక్ష్యం రాజ్యపాలనం అయితే
గోముఖం ధరించి ప్రజాసేవలో దూకు,
నీ లక్ష్యం కేవలం బ్రతకడ మైతే
ఏదో ఉద్యోగంలో చేరు!

54. చేప - పంది

విష్ణువు మత్స్యావతారం తాల్చాడని
చేపల్ని తినడం మానేస్తామా?
వరాహావతారం ఎత్తాడని
ప్రతి పందికీ మ్రొక్కుతామా?

55. మూర్ఖ మానవం

దైవ భీతి ఒక శాశ్వత కర్ఫ్యూ,
మతం ఒక జన్మ ఖైదు,
భక్తి ఒక పెట్టి చాకిరీ,
ప్రార్థన ఒక అరణ్యరోదన!

56. ఎవరు

దేవుడి పేరు చెప్పుకొంటూ
అతడి సృష్టిని దోచుకుతింటాడు ఆస్తికుడు,
దేవుడి ఉనికిని ప్రశ్నిస్తూనే
అతడి సృష్టిని గౌరవిస్తాడు నాస్తికుడు.
నేను తోటకూర చెట్లను తింటాను
వాటిని గౌరవంతోనూ పెంచుతాను!

57. ఏమీ లేకుండా

మాంత్రిక, తాంత్రిక, యాంత్రిక, నైష్ఠిక, వైజ్ఞానిక
శక్తులే మానవ మహాయాన మార్గదర్శకలు.
ఏ శక్తీ లేకుండా ఏ దిక్కూ తోచదు
ఏ శక్తినీ పొందకుండా ఏ ఫలమూ దక్కదు.

58. ప్రజల రాజ్యం

మంచికి చెడ్డ ప్రతిపక్షం
చెడ్డకు మంచీ ప్రతిపక్షమే.
ఏది మంచీ – ఏది చెడ్డా అనేది కాదు ప్రశ్న
ఈ ప్రజల రాజ్యంలో
దేనికి మెజారిటీ వున్నదీ అనేది!

59. స్వాతంత్ర్య ఫలం

స్వాతం త్ర్యానంతరం కుడి యెడములు పోగొట్టుకొన్న
భారత మహా సాధించిం దేమిటి?
తెల్లదొరల స్థానంలో నల్లదొరలను ప్రతిష్ఠించింది
జాతిపిత గాంధీజీని చంపేసింది
ఆయనకు ప్రియమైన హరిజనను నిషేధించింది
నవ భారత పిత అంబేడ్కరును తరిమేసింది
వోటు బేంకులను సృష్టించింది
కాల్మొక్కే బానిసల ఉత్పత్తిని పెంచింది.

60. యువ కోరిక

వోట్ల కోసం వాగ్దానాలు కురిపించేస్తాడు
నోట్లతో రాజరికాన్ని కొనేస్తాడు
పదవి కోసం ఎంత పవిత్రతనైనా తొక్కేస్తాడు
అందితే జుట్టూ, అందకుంటే కాళ్లూ పట్టు కుంటాడు
వేట కుక్కల్ని కట్టేసి మరీ పెంచుతాడు –
"ఎవరు, సార్? ఎవరు? కాస్త చెప్పండి!
ఆయనకు పి.యే కావాలేమో వెళతాను."

61. నా పోరాటం

నా పోరాటం నా వారసత్వ హక్కుల కోసం
అందులో ఒకటి వేదవ్యాసుడి సారస్వత పీఠం,
రెండోది మత్స్యగంధి అనువంశిక
మహాభారత సింహాసనం!
ఇప్పుడు తెలిసిందా నే నెవరినో?
నేను మేల్కొన్న వేద విరాట్టును!

62. బడ్జెట్టు

కుల వ్యవస్థ లాంటిది మన బడ్జెట్టు,
ప్రపంచంలో ఎన్ని మారినా ఇది మాత్రం మారదు!
ఇందులో ఏ ముంది న్యూసు వేల్యూ -
ప్రజల ఆకటి మంటలపై ప్రభువులు
పరమాన్నాలు వండుకుతినే
నిత్య తాజా వైనం తప్ప?

63. ఎవ డుద్ధరించాడు?

ఏ వర్గ నాయకు డా వర్గాన్ని ఉద్ధరించాడు?
ఏ మత నాయకు డా మతాన్ని సుఖ పడనిచ్చాడు?
గొర్రెల నాయకుడు నక్క, నక్కల నాయకుడు సింహం
ఇదీ నర నాయకుల పరిణామ క్రమం
రాజూ కానీ, నియంత కానీ, ప్రజాస్వామి కానీ!

64. బహుముఖ

సృష్టిలో ఎన్ని వైరుద్ధ్యా లున్నా
అవన్నీ ఒకే సమరసాత్మకు బహుముఖాలు.
ఒక్కొక్క ముఖం ఒక్కొక్కడిది అయితే
అట్టి బహు సంఖ్యాక ఏక ముఖుల తీర్థంలో
ఏకైక బహుముఖుణ్ణి నేను.

65. స్వర్గానికి

ఇతర జీవుల కంటె ఎన్నో సౌకర్యాలూ
శక్తులూ నీకు కలిగించిన దేవుడు
నీ దుష్ట ప్రవర్తన పట్ల అసంతృప్తు డై నప్పుడు
ఓయి మానవుడా!
నీ వికచచ్చి స్వర్గాని కెలా వెళ్ళగలవు?

66. బుద్ధి

నీవు-
దేవు డున్నాడని నమ్ముతున్న వాడివేనా?
అయితే, నీకు దేవుడు
బుద్ధి నెందు కిచ్చా డను కొంటున్నావు?
ఇతర జీవులకు లేని ఎన్నో ప్రజ్ఞలు
నీ కెందుకు కలిగాయను కొంటున్నావు?
అవన్నీ వెర్రివాడి చేతి రాళ్ళేనా?

67. అసూయకు దూరంగా

నూరు కాకుల్లో ఒక కోకిల
నూరు గొర్రెల్లో ఒక గుర్రం
నూరు గుడిసెల్లో ఒక మేడ
నూరు మట్టి తలల్లో ఒక విద్వత్కళ
సుఖంగా బ్రతకడం కష్టం.
ఒంటరిగా నైనా –
దూరంగా బ్రతకడం సుఖం!

68. శాడిజం

పిల్లికి చెలగాటం
ఎలక్కి ప్రాణ సంకటం
అవి రెండూ రెండు జాతుల జీవులు.
అధికార గర్వపోతుకు చెలగాటం
అ దే మన్న ధీశాలికి ప్రాణసంకటం
ఈ ఇద్దరూ ఒకే జాతి యువకులు.
పిల్లి ఎలకను తినడానికి చంపుతుంది
అధికార గర్వపోతు ధీశాలిని తినదు
కాని, చంపుతాడు!
అది జంతు నైజం
ఇది జంతు చిత్తుడి శాడిజం!

69. కర్మణ్యేవ

"కర్మణ్యే వాధికార స్తే
మా ఫలేషు" అన్నాడు కృష్ణుడు.
ఒక్క కృష్ణుడే కాదు –
ప్రతి యజమానీ అదే అంటాడు.
పని భారం ప్రజలది
ఫలాహారం యజమానిది!
ప్రజల అధికారం ఓట్లివ్వడం వరకే
దాని ఫలం రాజ్యాధికారం
అది యజమానులది!
ఇక ప్రజాస్వామిక మంటావా
అది "ప్రజల అధికారం"
అనే మాటలో వుంది.

శరన్నఖం

రెచ్చ గొట్టేది రాజకీయం
కలత తీర్చేది కవిత్వం.
రాజకీయం కురుక్షేత్రం
కవిత్వం యమునా తీరం!
రాజకీయం పగటి కాయకష్టం
కవిత్వం రాత్రి మెన్నెల విహారం!

2. ప్రభుత్వ తత్వం

ప్రభుత్వం విష్ణువు లాంటిది
అంతటా వుంది, ఎక్కడా కనిపించదు,
అందరి లోనూ ప్రభుత్వం వుంది
ఏ ఒక్కరూ ప్రభుత్వం కాదు.
చట్ట గ్లాని ఎక్క డేర్పడితే
అక్కడెల్లా అది అవతరిస్తుంది,
ఎవరి కే రూపంలో కావలిస్తే
ఆ రూపంలో సాక్షాత్కరిస్తుంది!

3. క్లీన్ అడ్మినిస్ట్రేషన్

వంటింటిలో దూరిన పిల్లి అక్కడి పాత్రలకు
క్లీన్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాదిస్తున్నది!
మరి, వాళ్ల కుక్క ఏం చేస్తున్నది?
తోకాడించు కొంటూ యజమాని చుట్టూ
సెక్యూరిటీ ఇస్తున్నది!

4. పని తీరు

మా మురికి పేటకు రోడ్డు మంజూ రయింది
కంకర తోలి సంవత్సర మయింది
మబ్బులు కనబడినై
పని మొద లయింది
వాన వెలిసింది
మురికి మిగిలింది!

5. పచ్చిక

ఏ ప్రభుత్వమైనా ప్రజలను తినేదే
పార్టీలు మార్చడం పదవుల కోసమే
నటించడం నేర్చిన దొంగలే దొరలు
కోసిన కొలదీ పెరిగే పచ్చికే ప్రజ!

6. హృదయం - మెదడు

హృదయం ప్రజలు
మెదడు రాజు.

పరిపాలించేది రాజే, కాని
ప్రజలు తిరగబడితే
రాజు చెయ్యగలిగిం దేం లేదు.

రాజూ ప్రజల
పరస్పర సదుగాహనే శ్రేయో రాజ్యం.

7. పంచు కోవడాలు

దొంగలు పూళ్లు పంచుకొంటారు
దొరలు పదవులు పంచుకొంటారు
ఎలకలు పంట పొలాలు పంచుకొంటై
గొర్రెలు పచ్చిక బీళ్లు పంచుకొంటై
అంత మాత్రం చేత ఏమవుతుంది లే -
గొర్రె చస్తుంది కాని, గరిక చస్తుందా?

8. నా కొత్త భావాలు

నేను బేంకులో ఎప్పుడు పైకం కట్టినా
రెప రెప లాడే నోట్లనే జమ కడతాను.
నే నెప్పుడు బేంకు నుంచి పైకం తీసుకొన్నా
మాసి చినిగిన పాతనోట్లే వస్తాయి నాకు!
మరి, నా కొత్త నో ట్లేమై పోయినట్టు?
అవి ఎక్కడో ఏ కార్యకర్త చేతిలోనో
చెలామణీ అవుతూనే వుంటై,
అవనీ!

9. ఉమ్మడి నిధి

నా మనస్సు ఒక నిత్య వ్యవసాయి
నా సృష్టి మౌలిక భావ సంపద.
నా కెక్కడా సొంత అకౌంటు లేదు
నా దైన దంతా ఉమ్మడి నిధికే జమ.
నా లాంటి ఎంద రెందరో మౌన భావకులు
పరమాత్మ క్షేత్రంలో నిత్యమూ తీసే ఫలసాయం
చేరేది ఉమ్మడి విశ్వనిధికే.
శక్తీ రక్తీ గల ఎవడో ఒకొక విశ్వశోధకుడు
డ్రా చేస్తూ వుంటాడా నిధి నుంచి
లోక కళ్యాణం కోసం!
ఏ ఒక్క విజయమూ ఏ ఒక్కడి కృషి ఫలమో కాదు,
ఎందరి శ్రమ ఫలితమో అందులో వుంది!

10. ఘోస్ట్ రైటర్

ప్రజల వోట్లు అమ్మకం సరుకు కాగానే
ప్రభువుల నోట్లకు విముక్తి లభించింది!
రాజకీయ పదవులు రౌడీల పరం కాగానే
చదువుల రాణి ఘోస్ట్ రైటర్‌గా మారింది!

11. లక్ష్మికి రక్షణ

నీవు ధనం సంపాదిస్తున్నావా?
అందులో కొంత శాతం కళాపోషణకు వాడు!
లక్ష్మిని రక్షించేది సరస్వతి,
పోలీసులు కాదు.

12. దొంగల ఉత్పత్తి

దొంగల్ని కని పెంచి పోషిస్తున్నది
ధనవంతుల లోభత్వమే.
శక్తికి మించి పై కెక్కకు
భుక్తికి మించి దాచుకోకు!

13. మూడు వర్గాలు

మానవులంతా మూడు వర్గాలు
గొర్రెలు, నక్కలు, పులులు.
ఈ అందరికీ బ్రతుకు తెరువులు మూడు
దాస్యం, దగా, హింస!
వీళ్లంతా ఒకళ్ల నుంచి ఒకళ్లు పుట్టుకొస్తూ
ఒకళ్ల నొకళ్లు తినేసుకొంటూ
నీతి బోధలు చేస్తున్న వాళ్లే!

14. సమ శక్తి

చేతి అయిదు వేళ్లూ సమానంగా వున్నాయా?
లేవు, నిజమే కాని -
వాటి అసమత్వం సైజులలోనే
ప్రయోజనంలో కాదు,
పోషణలోనూ కాదు.
అయిదు వేళ్లూ కలిసిందే హస్తం
అందరికీ అదే హస్తం
నోటి కైనా, పోటు కైనా!

15. ఎందుకు చేయరు?

ఈ జీవ చైతన్య మహా వారాశిలో
ఒక అల మాత్రం మానవ జాతి!
ఏ రంగు నేలలో ప్రమిస్తే
ఆ రంగులో వుంటుం దది!
దాని మనుగడకు అవసరాలు మూడు
కూడు, గుడ్డ, కొంప!
వీటిని మూడు చట్టాలతో తీర్చవచ్చు!
మరి ఎందుకు తీర్చరు?
ఎవరు?

16. అధికస్య అధికం విపత్

ఎంత ఎక్కువ మంది భార్యలుంటే
అంత ఎక్కువ అవకాశం కుట్రలకు,
ఎంత ఎక్కువమంది అభ్యర్థులుంటే
అంత ఎక్కువ ప్రమాదం ఆ ఎన్నికకు!

17. యథా రాజా

యథా రాజా తథా ప్రజా
ప్రభుత్వంలో నీతి లేకపోతే
ప్రజలు నీతిమంతు లెలా అవుతారు?
అవినీతితో, అక్రమాలతో
దుష్టులతో, దురాక్రమణలతో
రాజు రాజీపడుతూ వచ్చినందు వల్లనే
ప్రజానీకం పతనమౌతూ వచ్చింది!

18. థ్రిల్లర్

ప్రభుత్వ బడ్జెట్
సిబ్బంది జీతాలకే చాలదు
ఇక మంచి పుస్తకా లెలా వస్తై?
అందుకే లైబ్రరీలు
క్రైం సెక్సు థ్రిల్లర్లతో
కడుపులు నింపుకొంటున్నై!

అవి చదివిన పాఠకులు
అంతకంటె భిన్నంగా ఎలా వర్తించగలరు?

శాంతి భద్రతల కోసం
కోట్లు ఖర్చుపెట్టే ప్రభుత్వానికి
లైబ్రరీలలో మంచి పుస్తకా లుంచడానికి
పందలు కూడ ఎందుకుండమో?

19. ఎందులో పేద

"మనది పేద దేశం" అన్నాడు నాయకుడు
"ఎందులో పేద" అడిగాడు శ్రమజీవి
"బుద్ధిలో" జవాబిచ్చాడు కవి!
అంగడిలో అన్నీ వున్నై, లేని దొకటే –
అందరం కలిసి బ్రతకా లన్న బుద్ధి!

20. వ్యక్తి కొక రూలు

వ్యక్తి కొక రూలు, కులాని కొక న్యాయం
మతాని కొక చట్టం నడిచే దేశంలో
శాంతి బ్రతికి వున్న దంటే
మనిషి చచ్చిపోయా డన్న మాట!

21. ముస లాబోతీయం

రాజకీయ పదవులు ఎదోయిన పెయ్యలు,
వాటి చుట్టూ పులి ముఖాల ఆబోతులు,
ఆత్రంగా కోర చూపులు చూచే కోడెలు.
ప్రపంచ రాజకీయం
ఒక ముస లాబోతీయం!

22. బోర్లించిన మూకుళ్లు

ప్రతిపక్ష సభ్యుల నోళ్లకు కళ్లెం
పదవి రాకడ,
అధికార పక్ష సభ్యుల నోళ్లకు మోక్షం
పదవి పోకడ!
మరి, ప్రజల నోళ్లు?
తరువాతి ఎన్నికల దాకా అవి
బోర్లించిన మూకుళ్లు.

23. పక్కలో బళ్లెం

కలక్టరో, కమీషనరో తీర్చవలసిన తగవులో
మంత్రి జోక్యం చేసుకొన్నా డంటే
న్యాయ దేవత పక్కలోకి
బళ్లెం చేరిం దన్న మాట!

24. పెద్దలకు దాసోహం

నెమలి నెక్కి దొడు తీసినా లాభం లేదు
ఎలక నెక్కి ఈడిగల బడినా ఫర్వాలేదు
నీవు జనగణాధిపతివి కావా లనుకొంటే
పెద్దల చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యి!

25. మితిమీరిన తమో గుణం

శివు డంటే నాకు ఆరాధన
ఆ సంగతి ఆయనకీ తెలుసు.
ఆ మధ్య భస్మాసురుడు శివుడి వెంట పడ్డప్పుడు
నేను వాడికి అడ్డం వెళ్లి
చీవాట్లు పెట్టబోయాను
కృతఘ్నత ఎంత పాపమో చెప్పబోయాను.

"ఓరి, నువ్వా? పోరా, పో!
రాజకీయాలు కవిగాడికేం తెలుసు?"
అంటూ వాడు నన్ను తోసివేసి
మళ్లీ శివుడి వెంట పడ్డాడు.

"కేశవా, శివుడు! శివుడు" అంటూ
నేను అక్కడే సొమ్మసిల్లి పడిపోయాను.

తర్వా తెప్పుడో లేచి, కాళ్లీడ్చుకొంటూ
నేను కైలాసానికి చేరి చూస్తే –
శివుడు ఆనందంతో పొంగిపోతున్నాడు
భస్మాసురుడి అనుచరు లంతా
చుట్టూ మూగి భజనలు చేస్తున్నారు.!

అది లోక నైజం
అందుకు కాదు నేను బాధపడింది –
నన్ను చూచి శివుడు ముఖం
అటు తిప్పుకొన్నందుకు!
తన శత్రువైన భస్మాసురుడితో
నేను మాట్లాడా నన్న కోప మట!

26. నిరాశ్రయుడు

అదొక స్కూలు ప్లే గ్రౌండు
సాయం సమయం
పిల్లలంతా ఆటల్లో మునిగి వున్నారు.

చీకటి పడుతున్నది
ఒక్కరొక్కరే ఇళ్లకు మళ్లసాగారు.
కొంతసేపట్లో గ్రౌండు ఖాళీ అయింది
ఒకే ఒక పిల్లవాడు తప్ప!

"అమ్మా, ఎవరా నిరాశ్రయుడు?"
ప్రశ్నించింది పక్క చెట్టు మీది కాకిపిల్ల
అప్పుడే గూటికి తిరిగి వచ్చిన తల్లిని.

"అతడా, పాపం, అతడు
తన దంటూ ఏమీ లేని
ఇండియన్ తరహా సెక్యులరిస్టు!"

27. అరవై ఆబోతుల రథం

దేశాధ్యక్షుడు రెండు గుర్రాలతో నడిపించిన రథానికి
అరవై ఆబోతుల్ని పూన్చావా, రాష్ట్ర సారథీ!
రథం కదలడం సంగతి దేవు డెరుగు–
ఈ అన్నిటికీ గడ్డీ గాదం ఎక్కడ తెస్తావు?

28. అరణ్య రోదన

గుడుల్లో, ఆఫీసుల్లో, శాసన సభల్లో
లోనా, బైటా పరిశీలించి చెపుతున్నాను –
బైటి దంతా గొర్రెల ఎడారి రోదన!
లోని దంతా తోడేళ్ల అరణ్య శోధన!

29. నాయకుల జన్మ హక్కు

యువకులను ముందుకు నడిపించడం
ప్రజలకు నైతిక విలువలు బోధించడం
మేధావుల, కవుల కర్తవ్య మట!
జాతి సంపద నంతా మేసేయడం
విదేశీయ సంతల్లో విహరించడం
నాయకుల జన్మ హక్కట!

30. అవస్థా భేదం

నువ యువకుడా!
నీ కళ్లల్లో ఏమిటా మంటలు?
కుమిలి పోతున్నావో ఏ అన్యాయానికో?
వెతికి వేసారావో ఏ ఆత్మీయత కోసమో?
కాల్చి పారేస్తావో మాలోని అవినీతి నంతా?
నీ ముందున్న ప్రతి ముదురాకూ
నువ పల్లవంగా వున్నప్పుడు
చెయ్యాలను కొన్న పనులే అవన్నీ!

31. అధికార దేవత

ప్రజా స్వామిక మైనా, నియంతృత్వ మైనా
అధికారం చేసేది ఒకే ఒక వ్యక్తి!
అధికార దేవత బహు భర్తృక కాదు!

32. కావాలి మృగేంద్రులు

మేధావులు గోవుల్లా సాధువులై కూర్చుంటే
రౌడీలు మృగేంద్రులై విహరిస్తారు!
మేధావులే మృగ రాజులు కాలేరా అంటే
కాగలరు; కాని, కావడం లేదు!

33. ఎవరు - ఎటు

ఎవరు పాలిస్తున్నా రన్నది కాదు ముఖ్యం.
ఎలా పాలిస్తున్నా రనేది!
ఎవరు ముందు నడుస్తున్నా రన్నది కాదు ప్రశ్న,
ఎటు నడిపిస్తున్నా రన్నది!

34. ప్రతిభ

వధువులు వరించేది అందగాణ్ని
వోటర్లు వరించేదీ అందగాణ్నేనా?
అందం పనికి వచ్చేది పడకగది వరకే,
పరిపాలనకు కావలసింది రాజస ప్రతిభ!

35. ఎంత పోరాటం

నా గుడిసెకూ, నీ మేడకూ మధ్య ఎంత దూరం?
కేవలం పది బారలు!
ఆ మాత్రం గడిచి నీ ప్రాంగణం చేరడానికి
ఎంత ప్రతిఘటన! ఎంత పోరాటం!

36. బడ్జెట్ కోట్లు

"హరిజనుల కోసం కోట్లు కోట్లు అంటున్నారు
అవేవో మన దాకా వచ్చేనా?" అడిగాడు
ఒక గుడిసెవాసి హరిజనుడు!
అయ్యో, అవి బడ్జెట్ కోట్లనీ
ప్రదర్శన కోసం పెట్టిన షోరూం నరుకనీ
వోట్లను ఆకర్షించే ఎర లనీ
ఆ క్షుధార్తుడి కెలా చెప్పను?

37. రాబందులు - నక్కలు

పగలు రాబందులు అధికార పక్షం
నక్కలు ప్రతి పక్షం,
రాత్రి నక్కలు అధికార పక్షం
రాబందులు ప్రతి పక్షం.
ప్రజ లెప్పుడూ శవ జీవాలే!

38. వాగ్దాన మోహిని

"రోడ్లు ప్రయాణీయకంగా లేవు, కనుక
రోడ్డుకు పది అడుగుల ఎత్తున ఎగిరే
బస్సులను ప్రవేశపెట్టండి!"
మహా మంత్రికి వోటర్ల వినతి.
"అ దెంత పని?
వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం,
ఆ తర్వాత వారంలో పని మొదలు పెడతాం"
మంత్రిగారి వాగ్దానం!
వోటరు మహాశయుల హర్షధ్వానాలు!!

39. సాహిత్య సభలో

ఒక సాహిత్య సంస్థ వారి
వార్షికోత్సవానికి వెళ్లాను.
ముఖ్యమంత్రి అధ్యక్షులు,
గవర్నరు గారు ముఖ్య అతిథి
మహాకవి కృష్ణశాస్త్రి ప్రధాన వక్త.
మరునాటి పత్రికలలో పెద్ద వార్త –
వరదల గురించీ, వరద నిధుల గురించీ
అధ్యక్షులూ, అతిథులూ చేసిన
గంభీరోపన్యాసాలతో!
చివర్లో ఒక వాక్యం వుంది:
''కృష్ణశాస్త్రిగారు కూడ మాట్లాడారు'' అని!

40. స్వశక్తి

పులి తిరిగే అడవి లోనే
లేడి కూడ తిరుగుతుంది
స్వశక్తిని నమ్ముకొని!
పోలీసు రక్షణ లేకుండా
బైటికి రాలేని వాడు మానవు డొక్కడే!

41. ఏ కుక్కైనా

కుక్కంటే దొరగారి ఆల్సేషియన్ కుక్కేనా?
ఊర కుక్క కూడ కుక్కే!
కట్టేసి పెంచితే ఇది కూడ-
కుర్చీ లెక్క గలదు
రాజసాలు చూపగలదు
రాజ్యాలు పాలించగలదు.

42. బలంగా బ్రతకాలి

మృగాలను చంపగలవాడే మృగేంద్రుడు
మనుజుల్ని వంచగలవాడే మనుజేంద్రుడు
అది జనపదం కానీ, జంగిల్ కానీ.
భద్రంగా బ్రతకా లంటే
బలంగా బ్రతకాలి!

43. రాజకీయ వడ్డన

పంచ భక్ష్య ప్రణాళికలతో పంచాననాలు
కంచాల పద్ద కూర్చు న్నప్పుడు
నీతీ, భక్తీ, దారిద్ర్య నిర్మూలన దీక్షా,
దైవ భీతీ ఏం చేస్తున్నై?
కుర్రలకు గంజాయి మేపుతూ
గొర్రెలను వండి వడ్డిస్తున్నై!

44. పులి వేషం

మన వోటర్లు వట్టి గొర్రెలు కదా?
వాళ్లు కత్తిని నీ చేతి కిచ్చా రంటే
దానితో తమనే కోసుకు తినుమని కాదు,
తోడేళ్ల నుంచి రక్షణ కల్పించ మని!
నీవూ గతంలో గొర్రెవే కదా?
మరి, పులి వేషం కడతా వెందుకు?

45. బలం

బలవంతుడు రాజు
బలహీనుడు బానిస
బానిసగా బ్రతక లేవా?
బలం సంపాదించుకో!

46. ప్రజాస్వామికం

గూండాకు సాధువు తలొగ్గడం
కోకిల స్థానంలో పిల్లల కోడి చేరడం
నాయకుణ్ని సృష్టించవలసిన ప్రజలు
నాయకుడి చేతిలో కీలుబొమ్మలు కావడం
పన్నుల్ని పెంచుతూ, జీతాల్ని పెంచుకొంటూ
ప్రజల చేతిలో పైసా నిలవకుండా చెయ్యడం
ఇదేనా ప్రజాస్వామిక మంటే?

47. రాళ్లు - దేవుళ్లు

పండగ ఊరేగింపుపై రాళ్లు
ఊరేగింపుల్ని నిషేధించాలి!
ప్రార్థన మందిరం నుంచి రాళ్లు
ప్రార్థనల్ని నిషేధించాలి!
బస్సులపై రాళ్ళు
బస్సుల్ని నిషేధించాలి!
బియ్యం నిండా రాళ్ళు
బియ్యాన్ని నిషేధించాలి!
ఓహో రాళ్లు!
మన దేవుళ్లు!

48. రుతురాజు లా

సృష్టిలోని సౌందర్యాన్నంతా సేకరించి
పంచుతుంది వసంతం ప్రతి లవానికీ!
ఋతు రాజులా పాలించాలి ప్రతి రాజూ,
లభించాలి అందరికీ అభ్యుదయం ప్రతి రోజూ

49. అధికారుల ఆయుధాలు

కేపిటలిజమో, కమ్యూనిజమో –
సగటు మనిషి కే ఇజమైనా ఒకటే;
తెలుగులో అడిగినా, ఇంగ్లీషులో అడిగినా
లభించే వస్తువు అదే;
కుడి నుంచి వ్రాసినా, ఎడమ నుంచి వ్రాసినా
ప్రభుత్వం ఇచ్చే నోటీసూ అదే!
అధికారం కోసం పోటీ పడే వాళ్ల
ఆయుధాలు ఈ భేదాలన్నీ,
ప్రజలకు కావలసింది కేవలం సుఖశాంతులు!

50. బలమూ - బుద్ధీ

పోటున్న ప్రతి వాడికీ
పోటీచేసే అర్హత వుంది.
పోటీలో గెలవడానికి
కోటి ఉపాయాలు పన్నుతాడు.

అందుకే చెబుతున్నాను-
నమ్మక ద్రోహం, వెన్ను పోటు వంటి మాటల్ని
రాజకీయాలలో వాడకు!
నీకు బలమూ, బుద్ధీ వుంటే
మరొకడు నిన్నెలా మోసగిస్తాడు?

51. రాజసం వుంటేనే

ధనం, జనం కలవాడే నాయకుడు
ఎత్తు పై ఎత్తులే రాజకీయం
గెలిచిన వాడే ప్రభువు
అ దే రకం వ్యవస్థ అయినప్పటికీ!
రాజసం వుంటేనే రాజకీయాలలో దిగు!
లేకపోతే నాకులా కవిత్వం చెప్పుకో!

52. ఏ బడ్జెట్టైనా

ఏ బడ్జెట్టైనా, ఎవరు ప్రతిపాదించినా
దోపిడీ ధరించిన కాషాయ వస్త్రమే
అంచనాలు, కేటాయింపులు, వాగ్దానాలు అన్నీ
బంగారు లేడి శృంగార లీలలే!
సొమ్ము ప్రజలది
సోకు ప్రభువులది!

53. దొంగలున్నారు

దొంగలున్నారు అని ప్రాయవలసింది
రైళ్లలోని మరుగు దొడ్లపై కాదు,
రాజకీయాల నొసళ్ల మీద!
ముఖ ప్రియుల వీపుల మీద!

54. దురాక్రమణ దారు

నీరు, నిప్పు, నేల, గాలి వీటిపై
ప్రతి ప్రాణికీ సమాన హక్కులున్నై.
ఇందులో దేన్ని ఏ ఒక్కడు సొంతం చేసుకొన్నా
అతడు దురాక్రమణదారే,
శిక్షార్హుడే.

55. పంచతంత్రం చదువుకోండి

సింహాలూ, నక్కలూ రాజ్యమేలే లోకంలో
మీరు క్షేమంగా బ్రతక దలుస్తున్నారా?
అయితే, ఓ గొర్రెల్లారా! బర్రెల్లారా!
పంచతంత్రం చదువుకోండి!

56. కూడు పెట్టేది కృషి

చదువు కూడు పెడుతుందా?
సద్వినియోగ పరచుకోకపోతే
ఏదీ కూడు పెట్టదు.
పాలం, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం వలెనే
విద్య కూడ ఒక సాధనం.
కూడు పెట్టేది సాధనం కాదు,
దానితో మనం చేసే కృషి!

57. మెజారిటీ రూలు

ఏది మంచి? ఏది చెడ్డ?
మెజారిటీ అవు నన్నది మంచి,
కాదన్నది చెడ్డ!

58. సెక్యులరిజం అంటే

మానవుల మధ్య సహజీవనం అంటే
గూండాకు సాధువు తలొగ్గడం కాదు,
ప్రజాస్వామిక విధానం అంటే రిగ్గింగు కాదు,
సెక్యులరిజం అంటే
దేవుడికి సెక్యూరిటీ పెట్టడం కాదు.

59. పులుల పెత్తనాలు

గణ తంత్రాలు, రాజరికాలు, ప్రజాస్వామ్యాలు
ఎప్పుడు ఎక్కడ ఏ పేరుతో పిలవబడినా – అవన్నీ
తోడేళ్ల నుంచి గొర్రెల్ని రక్షించడానికి
పెద్ద పులులు చేపట్టిన పెత్తనాలే.

60. రౌడీలను మేపగలిగితే

ఇద్దరు పెట్టుబడిదారుల్ని సంపాదించి
నలుగురు రౌడీల్ని మేపగలిగితే
ప్రతి నక్కా నరేంద్రుడు కాగల రాజ్యంలో
శాంతి ప్రియత్వం పిరికితనం
సత్యాగ్రహం చేతగానితనం.

61. దౌర్భాగ్యులు

మనిషి తన సాటి మనిషిని నమ్మని ఫలితమే
పోలీసులూ, న్యాయ పీఠాలూ.
స్వశక్తిపై విశ్వాసం లేక చేసే పనులే
దౌర్జన్యాలు, దురాక్రమణలూ.
ఏ సుఖాలకూ నోచని దౌర్భాగ్యులే
రోడ్డు రోమియోలు, బజారు రౌడీలూ!

62. దృక్కోణాలు

తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలు
క్రిందు మీదులు పరస్పర విరుద్ధాలు,
వాటి మధ్య బిందువును నేను.

చూచే వాళ్ల ఉనికి తోడిది నా స్థితి!
నాలో నీకేవైనా వైరుద్ధ్యాలు కనిపిస్తే
అవి నీ దృక్కోణానివి,
నావి కావు.

63. మంచితనం

నీవు మరీ మంచివాడివా? అయితే
నీ మంచితనం బలహీనతగానో
అమాయకత్వంగానో కనిపిస్తుంది
నీ చుట్టూ వున్న వాళ్లకు!
వాళ్లు నిన్ను రకరకాలుగా దోచుకుంటారు!
సరే, దోచుకోనీ, ఏం చేస్తాం?

భరించలేక ప్రతిఘటించావో?
వాళ్లకు కోపాలొస్తై?
అప్పుడు వాళ్లు నిన్ను లోభి వంటారు,
స్వార్థపరుడి వంటారు, వంచకుడి వంటారు,
అహంకారి వంటారు, అపకారం తలపెడతారు!
తట్టుకోవాలి మరి!
మంచితనానికి మూల్యం అది!

64. మందిలో ఒకడు

ఎవరో వండి పెట్టేరులే అని సంతోషిస్తూ
అదే తింటూ బ్రతుకుతాడు సామాన్యుడు,
గతానుగతిక మేనా జీవిత మంటే?
మన ప్రయత్నమంటూ, మన సొంత మంటూ
ఏదీ అక్కర లేదా?

మందిలో ఒకడివిగా బ్రతకడం
సుఖ వంతమే కావచ్చు,
మందికి మార్గదర్శకుడివి కావాలనే కాంక్షలో
అధి మానవ మహనీయత వుంది
గుర్తించు!

65. బెల్లం ముక్క

కుక్కకు అతిగా తీపి తినిపించకు
దానికి పిచ్చెక్క గలదు.
కుక్కను అతిగా విశ్వసించకు
బెల్లం ముక్కకే అమ్ముడు పోగలదు.
కుక్కను సింహాసన మెక్కించకు
సుమతినీ, వేమన్ననూ గుర్తుంచుకో.
కుక్కతో అతిగా ఆడకు
దాని దంత క్షతమూ ప్రమాదకరమే,
నఖ క్షతమూ ప్రమాదకరమే!

66. పరంపరా పాతిత్యం

తన గురువు నుంచి నేర్చుకొన్నదే
మా గురువు నాకు నేర్పుతున్నాడు,
మా గురువు నుంచి చేర్చుకొన్నదే
నేను నా శిష్యులకు నేర్పుతున్నాను!
ఈ గురు పరంపరకు ఆద్యంతాలు లేవు,
నేర్పుతున్న దానిలో కొత్తదనమూ లేదు!

67. కోకిలత్వం

నీవొక గరిక పోచవా?
అసంఖ్యాకమైన నీ జాతి మొత్తం
నీ చుట్టూనే వుంటుంది!
నీవొక వట వృక్షానివా?
మరొక చెట్టే నీ దరిదాపుల్లో కనిపించదు!
నూరు కాదు, వెయ్యి కాకులు నిన్ను తరిమి కొట్టినా
నీ కోకిలత్వాన్ని వదులుకోకు!

68. సమాధి రాయి

అధికార శక్తిగల నీ వోటు ఒక రాయి,
దాన్ని వెర్రివాడి చేతికిచ్చావంటే
అది నీ సమాధి రాయే కావడం తథ్యం!
తస్మాత్ ప్రజాస్వామికమా! జాగ్రత్త!

69. శాంతి ప్రియత్వం

శాంతి ప్రియులైన గొర్రెల మందలు
ఎన్ని కోట్లుండి ఏం లాభం?
ఒక్క నక్కకు సరితూగలేవు,
ఒక్క తోడేలును కాదనలేవు,
ఒక్క పులి పంటి కిందకు రావు!
శాంతిప్రియత్వం పిరికి తనానికి మరో పేరైతే
అది నా జాతికి వద్దు, వద్దు, వద్దు!

70. దురద కాళ్లు

వోట్లమ్ముకొనే పేద లున్నంత కాలం
నోట్లు వెదజల్లే పెత్తందార్లు వుంటారు
సర్దుకుపోయే నిర్లిప్తులున్నంత కాలం
స్వప్రయోజకులైన గూండా లుంటారు
కాల్మొక్కే బానిస లున్నంత కాలం
మొక్కించుకొనే దురద కాళ్లూ వుంటై.

71. దైవం

మంచినీ చెడ్డనూ తానే చేసినవాడు
మంచీ చెడ్డా తానే అయినవాడు
మంచికి రక్షా, చెడ్డకు శిక్షా ఎలా యిస్తాడు?
మంచి చెడ్డలు సాంఘికమైనట్టివి,
దైవపరమైనట్టివి కావు.

72. జాలి

సంతాప సభలకు దేవుడే హాజరైతే
జరిగిన దుర్ఘటనకు దేవుడే సానుభూతి చెపితే
ఇక అతడు దేవు డెలా అవుతాడు?
జాలిపడేవాడు సర్వసమర్థుడు కాడు.
సర్వ సమర్థుడు జాలి పడగూడదు!

73. కుల నిర్మూలన

అయ్యా, నన్ను మీరెరుగరు, కాని
నేను మీ కులం వాణ్నే!
జాతీయ కుల నిర్మూలన పార్టీ అభ్యర్థిని!
ఈ ఒక్క తడవకూ నన్ను మీ ఓట్లతో
ఢిల్లీ పంపేశా రంటే
ఇక మళ్లీ ఈ ప్రాంతాల్లో చచ్చినా కనిపించను
మీ మీద ఒట్టు!

74. చేటు పెయ్యలు

రేడియో విప్పాం, పాటల నిండా హరిజనులు!
పత్రిక తెరిచాం, వార్తల నిండా హరిజనులు!
సభకు వెళ్లాం, ప్రసంగాల నిండా హరిజనులు!
సంక్షేమ పథకాలూ, నిధి నిక్షేపాలూ
అన్నీ హరిజనులకే నట!
"పాపం, చేటుపెయ్యలు" అన్నది మా ఆవిడ!

75. మనస్సాక్షి

మంచీ, చెడ్డా, పాపం, పుణ్యం
వంటివేమీ లేవన్నానని
ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించకు!
నీ మనస్సాక్షి నీలోనే వుంది,
అది పరమాత్మీయ ప్రతినిధిగా
నీ ప్రతి చర్యనూ గమనిస్తున్న వేగు!

హేమంత నఖం

నీ ముందెక్కడో ఏదో ఒక వెలుగు లేకపోతే
నీవు ముందు కెలా పోగలుగుతున్నావు?
నీ వెనక కూడ లోకం చాల వుంది,
నీ వీపును మరీ చీకటి చేసుకోకు!

2. ప్రజలను అధిగమించి

ప్రజాభిప్రాయం గతానుగతికం
అదెప్పుడూ ప్రగతి నిరోధకమే,
సత్యద్రష్ట అయిన ప్రతి ప్రవక్తనూ
ఆనాటి ప్రజ వ్యతిరేకించినట్టిదే,
నీవు ప్రజలకు అభ్యుదయం తేవాలనుకొంటే
ప్రజాభిప్రాయాన్ని అధిగమించి వెళ్లు!

3. ఏకాకిత

నాకు దేవుడు లేడు అన్నాను
ఆస్తికులు నన్ను వదిలేసి పోయారు!
పరమాత్మ వుంది అన్నాను
నాస్తికులు వదిలేసి పోయారు!
ఉన్నదీ, లేదూ అనేదొక వూహ,
నన్ను అందరూ వదిలెయ్యడం మాత్రం నిజం!

4. అంతా నా వాళ్లు

ఈ రిక్షాలు తొక్కే వాళ్లు
ఈ ఆటోలు నడిపే వాళ్లు
ఈ పొలాలు దున్నే వాళ్లు
ఈ ఫ్యాక్టరీలు నడిపే వాళ్లు
వీళ్లంతా ఏ కులాల వాళ్లో
ఏ మతాల వాళ్లో! అయినా
వీళ్లంతా నా వాళ్లు
నా దేశం వాళ్లు.
వీళ్ల కోసమైనా
నా దేశాన్ని దేశంగా వుంచాలి!
ఒక్క అంగుళమైనా వదులుకోగూడదు!

5. మనవాళ్లు

నీ పాలు తాగి రొమ్ము గుద్దే వాళ్లను
నోట్లో ముద్ద పెడితే వేళ్లు కొరికే వాళ్లను
మౌనంగా భరించడమే సహజీవనం.
బాధతో అరిచావో-
ప్రాణాలే తీసేస్తారు!
ఎవళ్లు? మన వాళ్లే!

6. ప్రగతి కర్షకులు

కవి, మేధావి, కళాస్రష్ట, సంస్కర్త
ఈ నలుగురే ప్రగతిని పండించే కర్షకులు.
తక్కిన వాళ్లంతా కోనేవాళ్లు, తినేవాళ్లు
దోపిడీలు చేసే వాళ్లు
దొరతనాలు నెరపే వాళ్లు!

7. మహా మర్కటం

మానవ సమాజం ఒక మహా మర్కటం;
తలకూ, తోకకూ మిన్నూ, మన్నూ అంత దూరం!
తల గ్రహాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటే
తోక విగ్రహాల చుట్టూ ప్రాణాచారాలు పడుతోంది!

8. వోట్ల గోపికలు

రంగం మీది కృష్ణ పాత్రధారి
అదే వేషంతో ఆడియన్సులోకి వస్తే
వాళ్లందర్నీ గోపిక లనుకొంటే
ఏ మవుద్దీ?
ఏం కాదు-
వాళ్లంతా నిజంగానే గోపికలై
వరించి వోట్లిచ్చేస్తా రంతే!

9. గుడ్డి బిచ్చగాడు

చర్చి, మసీదు, మందిరం, గుడి–
దేవుడంటూ వుంటే అన్నిటా వుంటాడు,
లేకుంటే ఎక్కడా వుండడు.
దేవుడి కోసం మతాలు మార్చేవాడు
దీపావళి వీధిలో గుడ్డి బిచ్చగాడు

10. ధైవ వేటగాళ్లు

పుర్రెకో బుద్ధి, జిహ్వాకో రుచి;
నిజ మెరుగని పుర్రెలు, నిలకడ లేని జిహ్వాలు!
బయల్లో స్వేచ్ఛగా విహరించే ఈ పతంగాలకై
తల కొక వలా పట్టుకొని పరుగులు తీసే
ఈ వేటగాళ్ల ఆంతర్యమేమిటో?

11. ఘంటసాల గొంతు

"కృష్ణా" అంటూ గొంతెత్తి పాడిన ఘంటసాల
గొంతు కాన్సరుతో మరణించాడు!
దేవుడున్నాడా లేడా అనేది కాదు ప్రశ్న,
ఉంటే, ఎవరికి ఎందుకు వనికి వస్తున్నాడనేది!

12. వ్యర్థ భజన

"రామా!! రణభీమా! కోదండ రామా!"
ఎవరినయ్యా, అంత గొంతెత్తి పిలుస్తున్నావ్?
ఆయన గనక నీ పిలుపు విని, నీకేసి వస్తే-
ఒకసారి ఆ పాతబస్తీకేసి వెళ్లి రమ్మను!

13. డబ్బే ప్రాణం

లేని వాడికి డబ్బు కావాలి
కడుపు నిండా తిండైనా తినడానికి,
కలవాడికి డబ్బు కావాలి
జీవిత సుఖా లనుభవించడానికి!
సృష్టికి మానవుడు చేసిన ప్రతి సృష్టి డబ్బు
మానవుడి ప్రాణానికే ప్రాణమై కూర్చుంది!

14. ఊర్వశి - రామాయణం

ఊర్వశి విశ్వ ప్రేయసి కనుక
ప్రతి కుర్ర కవీ ఆమె వెంట పడ్డాడు,
రామాయణం విశ్వకావ్యం కనుక
ప్రతి పండిత కవీ దీని వెంట పడ్డాడు!

15. కనీసావసరాలు

కోటీశ్వరుడెంత తింటాడో
కూలివాడూ అంతే తింటాడు.
శీత వాతా తప బాధలూ
ఇద్దరికీ సమానమే.
అందుకే చెపుతున్నాను –
మానవుణ్ని సుఖ పెట్టాలంటే ముందుగా
అతడి కనీసావసరాలు తీర్చు!

16. బలహీనుడి ఓర్పు

పేదవాడి వస్తు ఉపవాసం కాదు
బలహీనుడి ఓర్పు సహనం కాదు
పిరికివాడి నిష్క్రియ తాటస్థ్యం కాదు
సేవకుడి బ్రతుకు జీవితం కాదు.

17. దేవుడొకడే అయితే

అన్ని మతాలూ దేవుడివే అయినప్పుడు
దేవుడి కోసం మతం మారక్కర లేదు.
సుఖం బుద్ధిబలం తోడిది
శాంతి భుజ బలం తోడిది.
ఈ రెండు బలాలూ నీకుంటే-
నీ వెక్కడుంటే అదే స్వర్గం!

18. చిరిగే నిరోధ్

మతం ఒక నిరోధ్
మానవోత్తర జీవ సృష్టికి.
సంప్రదాయం ఒక నిరోధ్
సర్వ సద్భావనా వికాసానికి.
నిరోధ్ ఎంత గట్టిదైనా చిరుగుతూనే వుంది!
నవ ధర్మం యుగే యుగే పుడుతూనే వుంది!

19. దేశం మంటే

దేశ మంటే మనుషులు కారోయ్,
దేశ మంటే మట్టి యౌనోయ్!

ఇదీ నేను చెపుతున్నది,
గురజాడ చెప్పింది వాస్తవం కాదు.

దేశ మంటే ఒక భూభాగం
అక్కడ మనుషు లెవరున్నా సరే
అస లెవరూ లేకున్నా సరే!

అక్కడి మనుషులు ఏ జాతి, ఏ మతం
ఏ రంగు అనేది కాదు ముఖ్యం,
ఆ భూభాగం నీదై వుంటే
ఎంత త్యాగమైనా చేసి
దాన్ని రక్షించుకో!

20. ఎవరు నీవు

ఏ ప్రాణి అయినా
మనిషో, గొర్రో, పులో అవుతుంది.
ఏ మతం మనిషైనా
హిందువో, క్రైస్తవో, ముస్లిమో, మరేదో అవుతాడు.

నీవు మతాతీతుడ వైనా సరే
నీవు నాస్తికుడ వైనా సరే
లోకంలోని మెజారిటీ మనుషులు
మతం పేరుతో స్వజాతి రక్షణకై
పరజాతి హత్యలకు పాల్పడు తున్నప్పుడు
నీవూ అదే ఆయుధంతో
నీ జాతిని రక్షించుకోక తప్పదు.

విశ్వ మానవతా జ్ఞానం
ప్రతి మానవుడికీ కలిగే దాకా
నీవూ ఒక మతం వాడివే,
నీవూ ఒక జాతి వాడివే,
మరచి పోకు!

21. ఆయుధ పూజ

రైల్లో ముందెక్కి పడుకొన్న వాణ్ణి
వెన కెక్కిన వాడు లేపడం సులభమా?
భూ మత సాంఘిక సంస్కరణలు కూడ
అలానే కష్ట సాధ్యం.

పదవుల పెత్తనాలు రుచి మరిగిన పెద్దపులి
పేరంటాలకి పెడుతుందా తేలికగా?
అన్యాయం తొలగాలంటే
ఆయుధ పూజ జరగాలి!

22. సమదృష్టి

భాషకు లిపి అక్కర లేదు
భావానికి భాష అక్కర లేదు
దైవానికి భావం అక్కర లేదు
మానవత్వానికి దైవం అక్కర లేదు.
సృష్టిలోని సమస్త జీవ కోటినీ
సమ దృష్టితో చూడడమే మానవత్వం.

23. సూర్యుడు కాదు

ఏ ప్రవక్తనైనా బ్రతికుండగా కంటె
చచ్చిన తర్వాతనే జనం కీర్తిస్తారు.
ఏ పురుషోత్తముడినైనా సజీవ మూర్తిగా కంటె
విగ్రహ రూపంలోనే జనం పూజిస్తారు!
జనానికి కావలసింది వెలుగు –
సూర్యుడు కాదు!

24. ఆధునిక ప్రగతి

పల్లెల్లోని ప్రతి గుంట నీరూ
పాలై ప్రమిస్తున్నది!
పర్రలోని ప్రతి మట్టి నలుసూ
బియ్యం బస్తాల కెక్కేస్తున్నది!
రోడ్ల ప్రక్క ప్రతి కంకర్రాయీ
బస్సులనే బద్దలు కొట్టి పారేస్తున్నది!
రాజ్యాధికారాన్ని సాధించవలసిన ప్రతి వోటూ
కరెన్సీ నోటుగా మారిపోతున్నది!
ఓహో! మానవుడు సాధిస్తున్న ప్రగతి!

25. పదును

కత్తి వంటిది ప్రతిభ,
ఎప్పుడూ పదును పెడుతూనే వుండాలి దానికి.
కత్తి అరిగినా సరే
పదును తరగ గూడదు!

26. అవస రారోహణ

నేను ఢిల్లీకి
సెకండు క్లాసులో వెడదా మనుకొన్నాను
ఫస్టు క్లాసు టికెట్టు రిజర్వు చేశాను
చివరి క్షణంలో దాన్ని రద్దు చేసుకొని
విమానం ఎక్కాను!

27. సమకాలీనత

వాల్మీకికి రఘురాముడు తెలుసు
నాకు పాలేరు వెంకన్న తెలుసు,
సమకాలికం కానిది సత్యమ్యం కాదు
స్వానుభవం లేనిది సాహిత్యం కాదు.

28. పూర్వోత్తర జన్మలు

పువ్వు పుట్టగానే పరిమళించవచ్చు
మనిషి పుట్టగానే ప్రతిభ చూపవచ్చు
అది బీజ గుణ వైచిత్రి!
పరమాత్మ బీజం పాటమరించి నప్పుడు
అది గుణాధికమూ కావచ్చు
గుణ హీనమూ కావచ్చు!
అందుకు ప్రత్యేక కారణం ఏదీ లేదు
ఆత్మకు పూర్వోత్తర జన్మలంటూ ఏం లేవు
జన్మలు తాత్కాలిక రూప గుణాలు.

29. నీ పక్షం

ధైర్యం, దెయ్యం, అదృష్టం, శని
అదేదైనా నీలోదే, బైటది కాదు.
వైరిశక్తుల క్రీడారంగంలో
అవన్నీ నీ పక్షమే.
క్రమశిక్షణ ప్రాతిపదికగా
కంట్రోలులో వుంచుకోవాలన్నిటినీ.
నీ మెదడు బల్బుకు గల క్రాంతి నైశిత్యమే
నీ జీవిత గమనంలోని విజయ వైశిష్ట్యం.

30. దేవుడి అస్థిత్వం

ఈ సమస్త విశ్వాన్నీ దేవుడు సృష్టించాడంటే
అంతకు ముందతడెక్కడున్నట్టు!
ఏంజేస్తున్నట్టు?
ఆది మానవుడి భావుకతకు
దేవుడనే వ్యక్తిని కల్పించడం ఒక ఉదాహరణ!
పరమాత్మే తనను తాను సృష్టించుకొంటున్నదని
నేనంటున్నాను, ఆలోచించండి!

31. ప్రతిపక్ష బలం

దేవుడు అధికార పక్షం,
సైతాను ప్రతిపక్షం, అయితే
ప్రతిపక్ష బలమే అత్యధికంగా వున్న సృష్టిలో
దేవుడింకా అధికారంలో వున్నాడా?
దేవుడు సర్వ సమర్థుడే అయితే
సైతానుకు, కర్మకు, మృత్యువుకు
ఇంత ప్రాబల్యం ఎందుకు?

32. చూపు బాణం

నా చూపు – బాణంలా
చీకటి గుండెల్ని చీల్చుకు పోతుంటే
స్రవిస్తున్న రక్తాన్ని చూచి
ఎవరైనా ఎందు కేడవాలి?
చీకటి వట్ల కనికరమా?

33. చీకటి భూతం

చీకట్లో నీకు నీ పక్కవాడు భూతం,
నీ పక్క వాడికి నీవు భూతం!
అందుకే –
మీ ఇద్దర్నీ వెలుగులోకి రమ్మంటున్నాను!

34. చౌర్యం కూడ కళే

చౌర్యం కూడ కళే, క్రౌర్యం శక్తే,
పైత్యం రసమే, ప్రభంజనం ప్రాణమే!
సృష్టికి గుణ దోషాలు లేవు
అవి మానవుడి సుఖ దుఃఖాల తోడివి!

35. దురాశా పూరిత వ్యవస్థ

సహజ ధర్మంతో ఘర్షణ పడే విధంగా
సాంఘిక నీతిని రూపొందించావు,
ప్రజల పురోహితం దెబ్బతినే విధంగా
వాళ్ల సంపదపై పన్నులు విధిస్తున్నావు,
లోకం నిండా అశాంతిని వెదజల్లిందెవరు?
నీ దురాశా పూరిత వ్యవస్థే కాదా?

36. దైవం చేటు పెయ్యా

ప్రజా సంపదను పిండుకోవడం కోసం
దైవాన్ని చేట పెయ్యగా వాడుకొంటున్న రాజా
నీవు వేస్తున్న గడ్డి గోవు కందడం లేదు-
కట్టు తాడు కొంచెం వదులు చెయ్యి!

37. ఏది పులో, ఏది నక్కో

మతం, భక్తి, భజనలు అన్నీ
ప్రయోజనం లేని వట్టి కాలక్షేపాలు.
ఏది పులో, ఏది నక్కో కనిపెట్టు!
మనశ్శక్తిని పెంచుకొని మనిషిగా బ్రతుకు!

38. యుద్ధానికి భయపడితే

యుద్ధానికి భయపడితే శాంతి వుండదు,
శాంతి కావాలంటే యుద్ధం చెయ్యవలసిందే.
నీకు న్యాయం చేకూర్చేది నీ స్వశక్తే,
ఇతరుల న్యాయ బుద్ధి మీద ఆధారపడి
స్వశక్తిని చంపుకోకు!

39. కావలసింది

జనానికి కావలసింది
చౌక బియ్యపు దుకాణం
రత్నాల షాపు కాదు.
జనాభ్యుదయానికి కావలసింది
రాజకీయ విప్లవం
ఓదార్పు కాదు.
లోభికి కావలసింది బ్యాంకెకౌంటు
సాహిత్యం కాదు!

40. లోక మానవుడు

ప్రతిభే బీజం ఎన్ని వ్యక్తిత్వాల కైనా,
ఏ క్షేత్రంలో, ఏ రూపంలో, ఏ కళలో కానీ
ప్రతిభ వికసించినవాడే నాయకుడు
వికసించని వాడు సామాన్యుడు.
ప్రతిభ ప్రత్యక్ష పరమాత్మ
అది ఎక్కడ ఏ రూపంలో ఉన్నా
అందరికీ ఉమ్మడి ధనం.
ప్రతిభావంతుడు లోకమానవుడు
అతడిని ఉపేక్షించకు!

41. నాస్తికుడే ఉత్తముడు

ఆస్తికుడా, నాస్తికుడా అనేది కాదు ప్రశ్న,
ధర్మపరుడా కాదా అనేది.
స్వార్థపరుడైన ఆస్తికుడి కంటె
ప్రజాక్షేమం కోరే నాస్తికుడే ఉత్తముడు!

42. లక్ష్యానికి దారి

మంచిని బుజ్జగిస్తూ, చెడ్డను ఉజ్జగిస్తూ
ముందుకు సాగిపోవడమే జీవితం!
ఎటు, ఎక్కడికి అనుకొంటూ నిలబడిపోకు,
నీవెటుపోతే అదే నీ లక్ష్యానికి దారి!

43. మానవజాతి చరిత్ర

అవిద్య, పేదరికం, భయం ఇవి
ప్రజల నుంచి ఎన్నటికీ తొలగించబడవు.
ఇవి నిజంగానే తొలగించబడితే
ఆపైని పులులకు గొర్రెలు దొరకవు!
మానవజాతి పురోగమన చరిత్ర ఇదీ!
అర్థం చేసుకొని అడుగులు వెయ్యి!

44. హంస-సింహం

హంస వాహన హంసకేనా తిండి కావలసింది?
సింహ వాహన సింహానికీ కావాలి తిండి!
ధర్మ సూక్ష్మాలు తెలియాలంటే
ఆశ్రయించవలసింది ధర్మ వ్యాధుణ్ణి
శుష్క నీతి బోధకుణ్ణి కాదు!

45. పాత గొంగళి

దేవు ళ్ళవతరించారు, ప్రవక్త లుద్భవించారు,
నెత్తురు చిందించారు, నీతులు బోధించారు,
అయినా ఏం జరిగింది?
మానవ సైజం మాత్రం పాత గొంగళిలా
ఎక్కడి దక్కడే పడి వుంది!

46. మేక - మేక పాలు

ఏ పనీ చెయ్యని సర్వోదయ నాయకుడికి
మేక పాలు చాలు.
అన్ని పనులూ తానే చెయ్యవలసిన కార్మికుడికి
మేకే కావాలి!

47. శాసకుడెవరు

తల రాతలు రాసే వాడు
తన రాతకు తానే విచారపడితే-
ప్రజల ఆకటి చావులకు
ప్రజాపతే సంతాపం ప్రకటిస్తే-
ఇక ఈ సృష్టిని శాసించేదెవడు?

48. గతం నుంచి నేర్చుకో

పేరు తెలియకుండా ఏ పంటైనా తినేస్తారు
కులం తెలియకుండా ఏ జంటైనా కనేస్తారు
అగస్త్యుల్నీ, వశిష్ఠుల్నీ, పరాశరుల్నీ
ఆదర్శ పురుషులుగా ఆరాధిస్తున్న నీవు
గతం నుంచి నేర్చుకోవెందుకు?

49. ఘాట్ రోడ్

ఈ జీవితం ఒక వలు వంపుల ఘాట్‌రోడ్,
నీకెంతో కింద వున్నట్లు కనిపించే వాళ్లు
నీ వెంట వస్తున్న వాళ్లే!
లక్ష్యం కొండ శిఖరం,
క్రిందు మీదుల ఉచ్ఛ నీచాల
తల నొప్పి దేనికి?

50. ఒకే పనికి

వెంకన్న సామి హుండీలో వేస్తే – అది ముడుపు
వెంకన్న దొర గారి కిస్తే – నజరానా
వెంకన్న మంత్రికి సమర్పిస్తే – పార్టీ ఫండు
వెంకన్న వరుడికి ధారపోస్తే – కట్నం
వెంకన్న గురువు కర్పిస్తే – దక్షిణ
వెంకన్న ఆఫీసరు కిస్తే – లంచం!
ఎందుకో ఒకే పని కిన్ని పేర్లు!

51. అన్నదానం పుణ్యమా?

అందరికీ సమంగా అందులసిన అన్నాన్ని
మొత్తం ఒక్కడే సొంతం చేసుకొని
తాను కలవాడైన వ్యక్తి
లేని వాళ్లకు అన్నదానం చేస్తాడట!
అన్నదానం పుణ్యమనే వాళ్లకంటే
అభివృద్ధి నిరోధకు లెవరు?

52. సైనిక శిక్షణ

మంచివాడు మౌనం వహించాడు
చెడ్డవాడు చెలరేగాడు
ఫలితం –
రౌడీలకు రాజ్యం
మేధావులకు సేవకత్వం!

గత్యంతరం?
మంచివాడు విజృంభించాలి
చెడ్డవాడు శిక్షించబడాలి

అందుకు –
దేశంలోని ప్రతి మనిషీ
సైనిక శిక్షణ పొందాలి!

53. ఏది ప్రగతి

ఆనాటి రామాయణ కాలం నుంచీ
ఈనాటి రాకెట్ల యుగం దాకా
మానవుడు సాధించిన ప్రగతి ఏమిటి?
అదే కామక్రోధాదుల నిరంకుశ పాలన!

యంత్రరంగం పెరిగింది!
అంతరంగం తరిగింది!
బకాసురత్వం విజృంభించింది,
ప్రతిపల్లే ఒక ఏకచక్రపురం అయింది!

54. దెయ్యం తట్టు

దైవం మంచి, దెయ్యం చెడ్డ
దైవం ప్రకృతి, దెయ్యం వికృతి
దైవం వెలుగు, దెయ్యం చీకటి
దైవం ధర్మం, దెయ్యం దోపిడీ
దైవం జీవం, దెయ్యం మృత్యువు
మంచివాడు పూర్ణకుంభం
చెడ్డవాడు దెయ్యం తట్టు.

55. పరిమితి

ప్రతి మతమూ జీవనదికి కట్టిన ఒక ఆనకట్ట,
వరద నీటి విడుదలకు అవకాశం ఎంతగా వుంటే
అంతగా వుంటుంది ప్రయోజనం దాని నిలవనీటికి!
కట్ట ఎత్తు పెంచే కొలదీ
కరకట్టలు కొట్టుకుపోతై,
నీరు పొంగి పారే కొలదీ
ఏళ్లూ వూళ్ళూ ఏకమవుతై!

56. నేటి రాజకీయం

ఈనాడు స్వతంత్ర భారత్‌లో
ప్రతివాడికీ ప్రధాన వృత్తి రాజకీయమే!
ఆకలి దప్పులు సరికొత్త పాత సమస్యలే!
అందులో కొంత ముస లాభోతీయం,
కొంత నపుంసక వధూ కాంక్షీయం.

57. హరిహరా ద్వైతం

ఈ సృష్టి, ఈ గమనం, ఈ నియంత్రణ
రెండు విరుద్ధ శక్తుల నిత్య ఘర్షణ ఫలాలు!
అవి స్నేహంతో కలిస్తే పడక గది
వైరంతో కలిస్తే కాటిదిబ్బ!
ఈ స్థితి లయాల సమైక్యతే
హరి హరాద్వైతం.

58. ఎమర్జెన్సీ

తాను నాటిన కంచెలే తన చేలను మేసేస్తుంటే
ఎమర్జెన్సీ ప్రకటించాడు రైతు.
ఎమర్జెన్సీ రక్షణలో రైతుభయం కూడ పోయి
భూసారాలనే పీల్చేసినై ఆ కంచెలు!

59. పదవీ లక్ష్మి

ప్రతి అవతారమూ ఒక ఎమర్జెన్సీయే,
దుష్ట శిక్షణ లక్ష్యంగా వచ్చినట్టివే.
అయినా – ఏం చెయ్యగలిగాడు వైకుంఠుడు?
పెరికెయ్యలేక, నరికేసి పోయాడు!
మళ్లీ మళ్లీ తలెత్తుతూనే వుంది ప్రతి మోడూ!
వైకుంఠుడే లేచి రాలేకపోతున్నాడు
పదవీ లక్ష్మికి పాదా లొత్తుతూ!

60. పులిమేషం

మన వోటర్లు వట్టి గొర్రెలు కదా?
వాళ్లు ఖడ్గాన్ని నీ చేతిలో పెట్టా రంటే
దానితో తుమనే కోసుకు తినుమని కాదు,
తోడేళ్ల నుంచి రక్షణ కల్పించుమని!
నీవూ గొర్రెవే ఖడ్గం చేతికి రాకముందు,
పులివేషం కడుతున్నావు, జాగ్రత్త!

61. నమ్మకం

పులిని నమ్మి లేడి బ్రతుకుతుంది అదే అడవిలో,
మనిషిని నమ్మి తన పొరుగు మనిషే బ్రతుకలేడు
పోలీసులూ, జైళ్లూ లేకుండా!
మనిషి స్వశక్తిపై నమ్మకం లేకపోవడమే
కారణం అక్రమాలకూ, హత్యలకూ, దుఃఖాలకూ.

62. ఈశ్వర అల్లా

"ఈశ్వర్ అల్లా తేరే నాం
సబ్‌కో సన్మతి దే, భగవాన్"
గాంధీజీకి ప్రియమైన ఈగేయాన్ని
ఉభయ దైవ మందిరాలలోనూ పాడించు!
అప్పుడు దానంతట అదే ఏర్పడుతుంది
జాతి మత సమైక్యం.

63. గొర్రెలు

మెజారిటీ మానవులు గొర్రెలెలా అయ్యారు?
ఇదిగో – ఇలా – అయారు –
దుశ్శాసకుల సాహసాలను ఎదిరించలేక
మంచివాళ్లు బానిసలయ్యారు,
బానిసలు నిర్వీర్యులు చేయబడ్డారు,
వాళ్ల బుర్రల నుంచి మెదడు తీసివేయబడి
దేహంలో కొవ్వు పెంచబడ్డారు.

64. వెన్నెల

నీకు వెలుగు కావలసింది
ఇంట్లోనే కాదు, వీధిలో కూడ.
నీవు అధికారం చూపవలసింది
పెళ్లాంపై కాదు, పండితలోకంలో.
నీ కీర్తి చంద్రికలు వెన్నెల కాయవలసింది
నీ కులం మీదో, పేట మీదో కాదు
మొత్తం లోకం మీద!

65. మెజారిటీ

ఎంతటి గొప్ప వస్తాదులూ, మేధావులూ అయినా
తాము మైనారిటీగా వున్నప్పుడు
మెజారిటీ అభిమానాన్ని పొందాలి, లేక
మెజారిటీకి తా విచ్చి పక్కకు తప్పుకోవాలి.
మెజారిటీ ఏంచేస్తే అదే చట్టం
మొత్తం అందరూ దాన్ని శిరసావహించడం విధి.

66. నిరాశ

సెక్సు పాట లెందుకు పాడుతున్నావంటే
శ్రోతలు కోరుతున్నా రన్నది అశరీరి!
సెక్సే కోరతారు – ఇస్తావా అంటే
నా కంత అదృష్టమూ అంది, పాపం!

67. విగ్రహ మతం

జగ్జీవనరాం హిందువుడే, కోటీశ్వరుడే,
భారత ఉప ప్రధానే, అయినా
ఆయన ఆవిష్కరించిన విగ్రహం మైలపడిందని
గంగా జలంతో శుద్ధి చేసుకొన్న మతంలో
ఆయన స్థానం ఏమిటి?
ఆర్థికాభివృద్ధీ అధికార పదవులూ
సాంఘిక సమత్వాన్ని సాధించలేవు.

68. రైటూ, రాంగూ

ప్రతి మానవుడూ అనుకొంటాడు
తాను రైటూ, తక్కిన అందరూ రాంగూ అని.
అయితే మానవుల్లో మెజారిటీ గొర్రెలు కనుక
నక్కల ముందు నోరెత్తరు
పులుల ముందు తలెత్తరు.
తమలో తాము కుమ్ముకు చస్తుంటారు!

69. నిర్వచనాలు

కారాగారం అంటే
దుర్జనులకు ఉచిత భోజనశాల.
కూలిపేట అంటే
సజ్జనులకు శ్మశాన ద్వారం.

రాజకీయం
ఎడాపెడా సంపాదించే ఒడుపు.
దేశభక్తి
ఏ దేశంలో వుంటే ఆ దేశం పట్ల రక్తి.

పల్లెటూర్లో మేడ
ఆకలి చూపుల్లో ఎడారి ఓడ.
పట్టణంలో గుడిసె
భద్రత ప్రక్కలో బరిసె!

70. చుట్టలు

మీరు ''చుట్ట చుట్టుకొనే పడుకుంటారా?''
అన్నానొకసారి మహాకవి కాటూరి వారితో-
రాత్రి పడుకునే ముందు పక్క మీద కూర్చుని
ప్రొద్దుటి కోసం పొగచుట్ట చుట్టుకొంటుండగా.

కృష్ణశాస్త్రిగారు చుట్టలు
పిఠాపురం నుంచి తెప్పించుకునే వారు,
కాటూరి వారు తమ చుట్టలు
తామే చుట్టుకునే వారు.

అపుడు వెంటనే కాటూరి వారన్నారు-
''నేనే కాదు, ఆ వేయి పడగల వాడు కూడ
చుట్ట చుట్టుకొనే పడుకుంటాడు''
కవి చేతి పొగచుట్టకు కూడ అంతటి భోగం!

71. దూరమే సారం

ప్రకృతి పురుష సంబంధం ఎంత దూరమైందైతే
అంత వీరజాతి పుడుతుంది దాని నుంచి!
వర్ణాంతర సంబంధాలను బహిష్కరించి
పుట్టు కులానికి పట్టం కట్టినప్పటి నుంచే
భారతజాతి నీరసజాతి అయింది!

72. లోక మూఢత

వర్గపోరాటం తెస్తామంటున్నాం యువకులం
వర్ణాలను పునరుద్ధరిస్తామంటున్నాం వృద్ధులం.
ఈ దేశంలో మనమే ఇంత మూఢులం కదా?
ఇక అంత లోకమౌఢ్యాన్నెలా తొలగించగలం?

73. డబ్బు

డబ్బంటే ఏమిటి?
నోట్లా? నాణాలా?
అవి కొనగలిగిన తిండిగింజలే డబ్బు.
తిండి గింజలను పండించే రైతు కూలీలే
జాతికి డబ్బిచ్చే శ్రీనివాసులు!

74. రక్తపాతం

రక్తపాతం లేకుండా భారతకు
స్వాతంత్ర్యం వచ్చిందని బొంకకు,
అంతకంటె ఎన్నో రెట్లు రక్తపాతం
ఆ తర్వాత జరిగింది
ఇంకా జరుగుతూనే వుంది!

75. విలువలు

మహితమైన కృషీ, శ్రమా లేకుండా
మధురమైన అనుభూతులు లభించవు.
రాబడి పోయినప్పుడు ఆదుకొనేవి
బేంకులలోని నిల్వలే
కనిపెంచిన పిల్లలు కాదు.

కనుక–
వృద్ధాప్యంలో సుఖశాంతులు కావాలంటే
ఇప్పుడే కృషిచెయ్యి, శ్రమపడు, దాచుకో!

76. తేడా

సూర్య గమనం మిథ్య
భూమి గమనం సత్యం.

మనకు సూర్యుడు ఉదయించడం లేదు
మనం సూర్యుడి కుదయిస్తున్నాం.

సూర్యుడు లోక బాంధవుడు కదా?
మన ఆరాధ్య దైవం కదా?
మరి, మనం ఇలా తన్నుకు చస్తున్నామేం?

77. శివ మోహిని

నా అనుభవాలు చేదు కషాయాలు
నా జ్ఞాపకాలు పులి తేన్పులు.
హలాహలం మింగి, అమృతం వంచిపెట్టే
జగద్ధిత శివమోహిని నా జీవితం!
లోకంతో కలిసి వినోదిస్తూ
లోకాతీతంగా ప్రమోదించే మౌన మురళి!

78. అరూపత

నా కంటి నిండా కాంతి, నా ఒంటి నిండా పరిమళం,
నా గుండె నిండా అనురాగ రసం కదా?
కేళీ వినోదాలకు నా చుట్టూ
రూప లతలు లేకపోతే – మరి –
అరూప సౌందర్యమే నా ఆనంద నందనం!

శిశిర సఖం

బాల్యం లాలిస్తుంది
వృద్ధాప్యం పీడిస్తుంది.

బాల్యం పోటు
వృద్ధాప్యం ఆటు.

ఏట్లనూ, పూళ్ళనూ తోసుకుపోతూ
సృష్టికే ఆశాదీప మవుతుంది బాల్యం
ఒక్కొక్క శక్తే ముక్తమై పోతూ
మూలబ్రహ్మలో కలిసిపోతుంది వృద్ధాప్యం.

2. ఆటు పోటులు

పరమాత్మ ఒక శక్తి సముద్రం
దాని నుంచి వచ్చే పోటే జీవనం,
తిరిగిపోయే ఆటే మృత్యువు.
ఈ ఆటు పోటులు నిత్యానుభవాలే అయినా
ఈ మధ్యలో ఎంత కల్లోలం!
ఎంత ఉద్వేగం! ఎంత నిర్వేదం!

3. తెలుసుకో

కోట్లు సంపాదించడం ప్రధానం కాదు
నీవు గెలవకపోతే మునిగే కొంపేదీ లేదు.
నీ స్వార్థం కోసం దేశద్రోహులతో షరీకు కాకు,
జాతి రక్త మాంసాలతో
నీ అధికార తృష్ణను తీర్చుకో జూడకు.

4. కాదేమో

దుర్మార్గుడి దుశ్చేష్టలకూ
సన్మార్గుడి సత్‌క్రియలకూ
గమ్యం ఒకే శ్మశానమా?
కాదేమో అనిపిస్తుంది నాకు – ఈ
పురుగుల్నీ, పువ్వుల్నీ చూస్తున్నప్పుడు!

5. దిగుడు మెట్లు

లక్షలు దోచుకొంటూ
పైసలు దానం చేస్తే - అవి
స్వర్గానికి నిచ్చెన మెట్లా?
నరకానికి దిగుడు మెట్లా?
స్వర్గ నరకాలు ఎక్కడో వుంటే
ఇక్కడ ఈ తాపత్రయాలు దేనికి?

6. కుగ్రామాల రద్దు

మంచి నీళ్లు, కరెంటు, కాలేజీ, గ్రంథాలయం,
ఆస్పత్రి, సినీహాలు, టెలిఫోను, రేడియో,
బేంకు, బస్ రోడ్డు, న్యాయ స్థానం
ఈ మాత్రం సౌకర్యాలైనా ప్రతి మనిషికీ
అందుబాటులో వుండాలంటే -
కుగ్రామాలను రద్దుచెయ్యి!
ఆదర్శపట్టణాలను వృద్ధి చెయ్యి!

7. పూల వనంలోనే

తుమ్మల్లో పొద్దు గూకితే
సూర్యుడి వొళ్లంతా కంటక క్షతాలే,
పూల వనంలో ప్రొద్దు గూకితే
చీకటే పరిమళిస్తుంది, చూడు!
తుమ్మల్లో పొడిచినా పర్వాలేదు
పొద్దు పూల వనంలోనే గూకనీ!

8. నలుపు

శివుడి కంఠం నలుపు
పార్వతి వొళ్లంతా నలుపు!
ఆ నలుపు జగద్రక్షణకు సంకేతం
ఈ నలుపు జగత్తుకే సంకేతం!

9. అక్షర జ్ఞానం కాదు

శంకరుడు ఎనిమిదేండ్లకే పండితుడు,
అతడి గురువు చండాలుడికి అక్షరాలు రావు.
వాల్మీకికి వచ్చిన భాష ఎవరు నేర్పింది?
కావలసింది ఆత్మజ్ఞానం, అక్షర జ్ఞానం కాదు!

10. కాలువ మీద లాకులు

సమాజం ఒక గోదావరి కాలువ,
వర్గాలు దాని పొడవునా వున్న లాకులు.
క్రింది లాకు కంటె పై లాకు గొప్పదేం కాదు
మెరక భూమి కంటె పల్లపు భూమి తక్కువా కాదు.

11. విశ్వాసం

ఎవడి విశ్వాసం వాడి దైవం,
ఎవడి పిచ్చి వాడి కానందం.
ఒకడి సమాధి మరొకడి దేవాలయం,
ఒకడి పుర్రె మరొకడి భోజన పాత్ర!

12. జీవ లక్షణం

కోరిక జీవ లక్షణం,
కోరికే జీవోజ్జీవన హేతువు;
జీవి కర్తవ్యం నిత్య కార్మికత్వం,
నిత్య కార్మికత్వమే సచ్చిదానందం.

13. సూక్తుల ప్రయోజనం

వేదాలను, వివిధ మత గ్రంథాలను
ప్రవక్తల సూక్తులను, నీతి సూత్రాలను
శోధించిన మేధావుల్ని అడుగుతున్నాను –
అందులో ఏ ఒక్కటైనా అమలు జరిగిందా?
మరి, అవి మన కెందుకు పనికి వస్తున్నట్టు?

14. పాపం దేవుడు

దేవుడు - మానవుడి
భావ లతలకు ప్రాపు,
పాపాలకు విరుగుడు,
బాధలు తీర్చే డాక్టరు,
ఇంటికీ, ఒంటికీ కాపలాదారు,
పిలిచినప్పుడెల్లా పలికే నౌకరు!
పూజ గదిలో చిక్కుకు పోయిన ఖైదీ!
పాపం, దేవుడు!

15. వృద్ధాప్యం - బాల్యం

వృద్ధాప్యం రెండో బాల్యం,
మరణ శయ్యే పురిటి మంచం.
అయితే - అతిథిని
వచ్చేటప్పుడు ఎంతో ముద్దుచేసి
పోయేటప్పుడు ఈసడించడం ఏం న్యాయం?

16. కన్నవాళ్లు

శిశువు సేవ అతణ్ని కన్నవాళ్లు చేస్తారు,
వృద్ధుడి సేవ అతడు కన్నవాళ్లు చెయ్యాలి!
శిశువూ, వృద్ధుడూ ఒక్కరే –
రాక పోకల్లో తేడా!

17. కరెంటు పోతే

బల్బులోని కరెంటు లోకానికి వెలుగిచ్చేది
అది బల్బులో వున్నంతసేపే!
కరెంటు పోతే –
వెలుగెక్కడికి పోయినట్టు?

18. వెలుగుండగానే

వెలుగుండగానే ఇల్లు సర్దుకోకపోతే
చీకట్లో దేవులాట తప్పదు!
పడుచుతనంలోనే పది కాసులు వెనకేసుకో!
బ్రతుకు బరువుల తిరునాళ్లలో
స్వాగత సంరంభాలే తప్ప
వీడ్కోలు ముచ్చటలుండవు!

19. ధీరోదాత్తత

అంతర్ముఖుడై కూర్చున్న మేధావికి
బహిః ప్రపంచం బాధాకరమైనప్పుడు
ఎవరి పక్షం వహిస్తావు?
ఆ ఒక్కణ్నీ వదిలేస్తావా?
ప్రపంచాన్నే ఎదిరిస్తావా?

20. నిజాయితీ

ఎంత దరిద్ర దేశాన్నైనా సంపన్నం చెయ్యడానికి
రెండు పంచవర్ష ప్రణాళికలు చాలు –
పేదల కోసం కేటాయించిన పైసల్ని
పై వాళ్లు మేసెయ్యకుండా వుంటే,
నీతులూ, నినాదాలు కాక
నిజాయితీ రాజ్యమేల గల్గితే!

21. పని చెయ్యడమే

పనిచేసినంత కాలమే జీవిత కాలం,
తక్కిన దంతా నడ పీనుగ తనం!
యువకుడా, వృద్ధుడా అన్నది కాదు ప్రశ్న
పని చేస్తున్నాడా, లేదా అనేది!

22. చిరంజీవులు

వేల సంవత్సరాలుగా జీవిస్తున్న
చిరంజీవు లున్నా రంటై పురాణాలు!
ఉంటే వుండవచ్చు, కాని
ఏమిటి ప్రయోజనం?

23. కలలు

నాకొక అందమైన కల వచ్చింది
అది వాస్తవ మన్నంత స్ఫుటంగా వుంది.
మళ్లీ నే నందులోకి వెళ్లాలని వుంది
వెళ్లజాల నందుకు చింతగా వుంది!

కల కూడా ఒక అనుభవమే,
వ్యక్తి బయోడేటాలో ఒక అంశమే.

కాల ప్రవాహంలో అలల వలెనే
కలలు కూడ వచ్చి పోతూ వుంటై!

24. సత్యం - మిథ్య

లేని దాని నుంచి ఏదీ పుట్టదు,
పుట్టిన దేదీ లేనిది కాదు.
బ్రహ్మ సత్యం జగత్తు మిథ్య అనడం అపోహ,
రెండూ ఒకటే రాగా లాపన!

25. అలా - అంబుధీ

అల పుట్టి పెరుగుతూ క్లైమాక్సు చేరడానికి
పట్టే కాలాన్ని నిర్ణయించే దెవరు?
దాని బీజ శక్తా? పరిసర ప్రభావమా?

అది క్షణి కావేశ రస బిందువా?
సహస్ర చంద్ర పూర్ణ కలశమా?
ఏదైతే నేం? ఎంతైతే నేం
దాని పరిధిలో అది పరిపూర్ణమే!

26. సూపర్ మేన్

భౌతిక శక్తి బాగా వున్నంత మాత్రాన
ఎవడూ సూపర్ మేన్ కాడు.
విష్ణువును పురుషోత్తముణ్ని చేసింది
దుష్ట శిక్షణ కాదు,
శిష్ట రక్షణ!

27. వృద్ధాప్యంలో

నే నే వృద్ధుడి ముఖంలో కైనా చూచినప్పుడు
నాకు కనిపించేది అతడి యవ్వనంలోని ఔద్ధత్యం.
శరీరం శుష్కించే కొలదీ
మేధావిత పెరుగుతూ వుంటుంది!

జాతి అగ్రేసరం కావాలంటే
యువ దేహాలకు వృద్ధ మస్తిష్కాలను జోడించు!

28. గీతా సోషలిజం

నీకే పనిలో ఆసక్తి వుంటే
అదే నీ ప్రతిభా, లక్ష్యమూ,
ఆ పనిలోనే లగ్నం చెయ్యి నీ సర్వశక్తుల్నీ.
నీ పని ఫలితాన్ని పంచుకో
తోటి పనివాళ్ల పని ఫలితాలతో
అదే భగవద్గీత!
అదే సోషలిస్టు వ్యవస్థ!

29. గాంధీ తాత కాదు

ఏ వ్యక్తినైనా మనం ఎందుకు ఆరాధిస్తాం?
అత డేదో లోకోపకారం చేసినందుకు!
ఆ పని అతడే వయస్సులో చేశాడో
ఆ వయస్సు రూపాన్నే నిల్పుకోవాలి
చిత్తంలోగాని, శిల్పంలోగాని.

గాంధీజీని తలచుకోవలసింది
స్వాతంత్ర్యోద్యమ నాయకుడుగా
తాతగా కాదు.

30. దొంగా - వాల్మీకీ

మనం ఆరాధించేది రామాయణ వాల్మీకిని,
దారులు కొట్టి బ్రతికిన ఆటవికుణ్ణి కాదు!
ఆనందించేది సీతాకోక చిలుకను చూచి
దాని పూర్వాశ్రమపు గొంగళిని చూచికాదు!
వికృతిని పరిహరించి
సుకృతిని పరిగ్రహించడం రసజ్ఞత!

31. చీకటిని ద్వేషించకు

నీకు వెలుగు కావాలా?
ఎంతైనా వుంది, తీసుకో!
అయితే -
చీకటి కావలసిన వాళ్లు కూడ వున్నారు,
దాన్ని వాళ్లకు వదిలెయ్!

వెలుగు చీకట్ల సహజీవనమే
సుఖ జీవనం!

32. ముందున్నవాడే

మానవుడుగా పుట్టి, మహాత్ముడిగా బ్రతికి,
మానవోద్ధరణకు కృషిచేసిన ఏ గొప్పవాణ్ణీ
దేవుణ్ని చేసి దూరం చేసుకోకు!

దీపం ఎంత చిన్న వెలుగిచ్చినా
అది కరదీపం, సూర్యబింబం కాదు!
మనిషికి మార్గదర్శకుడు
తనకంటె ముందున్న పెద్ద మనిషే!

33. పిడికెడు మెదడు

మానవుడి మెదడు పిడికెడు
అది సాధించగల విజ్ఞానం దోసెడు
నింపుకోవలసిన పొట్ట జానెడు
కావలసిన జాగా బారెడు!
మరి, ఈ దొంగ డబ్బంతా దేనికి?

34. వి.ఐ.పీలూ - కార్మికులూ

ఆ సైంటిస్టు, ఆ ఆచార్యుడు, ఆ వి.ఐ.పి
తిండి కోసం కార్మికుడి వలె పని చెయ్యవలసి వుంటే
అంతటి గొప్ప వాళ్లయ్యే వాళ్లేనా?
మరి, కార్మికుణ్ని దోచుకు తింటున్న వాళ్లకు
ఈ విగ్రహాలూ, సన్మానాలూ ఎందుకు?

35. అన్నీ శవాలే

గిల్లి పారేసిన గోరు
లాగి పారేసిన దంతం
గొరిగి పారేసిన వెంట్రుక
కోసి పారేసిన అవయవం
అన్నీ శవాలే కదా?
అందులో ఏది కుళ్లి మట్టయిందో
ఏది కాలి బూడిదయిందో

ఎవరికి గుర్తు?

36. వృద్ధాప్య తత్వం

కొందరు పుట్టుకతోనే వృద్ధులు
కొందరు చచ్చినా వృద్ధులు కారు
బ్రహ్మ వృద్ధుడు -
అతడి బాబు యువకుడు!

37. ఉదయం చేసిన కృషి

సాయంకాలం హాయిగా సుఖపడాలంటే
ఉదయం పూట బాగా శ్రమపడాలి
సాయంత్రం సంతలో నీకు విలువ తెచ్చేది
ఉదయం నీవు పొలంలో చేసిన కృషే!

38. ఎంత పాతదైతే

కళాఖండం ఎంత ప్రాచీనమైనదైతే
అంత ఎక్కువగా వుంటుంది దాని విలువ,
ప్రతిభకూ వర్తిస్తుందీ వాస్తవం. -
కనుక, మిత్రమా!
యవ్వనాన్ని వ్యర్థం చేసుకోకు!

39. రేడియో సెట్టు

సహజమైన రేడియో సెట్టు ఈ మెదడు,
ఆను చేసి ట్యూను చేసి వుంచు ఎల్లప్పుడూ -
వాణి వాద్యమో, లక్ష్మి గాత్రమో, వేణు గానమో
ఎక్కడి నుంచి ఎప్పుడేది లభిస్తుందో యేమో!

40. నా ప్రగతి

చీకటికి తోడుగా పుట్టాను
మట్టితో నేస్తం కట్టాను.
ఎటో ఎందుకో తెలియకపోయినా
నేను వేసిన ప్రతి అడుగూ
ముందడుగే అయింది!
నన్నాకర్షించిన ప్రతి తారా
ఉదయం కేసే నడిపించింది!
నేను చేసిన ప్రతి పనీ
పంట చేనే అయింది!

41. వెంకటేశ్వరుడు

"వెంకటేశ్వరుడు మిమ్మల్నడిగాడు" అన్నాడు
తిరుపతి వెళ్లి వచ్చిన ఒక మిత్రుడు నాతో
"ఆయన నిన్న నా సభకు వచ్చాడే,
మీరు కలిసినట్టు చెప్పనే లేదు!"
అన్నాను నేను ఆలోచిస్తూ.

42. సొమ్ము చేసుకోవడం

చచ్చిన వాడి శవంపై పూలగుత్తులు,
గొప్ప వాళ్ల సమాధులకు నిత్య పూజలు!
ఇది గతం పట్ల మూఢ భక్తా?
చావును సొమ్ము చేసుకొనే కుయుక్తా?

43. బ్రహ్మైక్యం వద్దు

నేను –
పండే వరకూ పచ్చికాయను,
పండగానే రాలిపోతాను!
ఇక –
పండిన ఆనందం నాకేది?
నేను కోరేది –
రాలి నీలో కలిసి పోవడం కాదు
రాలకుండా నీతోనే వుండిపోవడం!

44. పాతకు భద్రత

పాత కట్టెను శుభ్రపరచి
ఒక మూల భద్రపరస్తూ వుంటే
అ దెంత కాలమైనా అలానే వుంటుంది!
దానితో ఏ పనైనా చెయ్యబోయావో
విరిగి చక్కా బోతుంది!
ఏ కట్టైనా, అ దెంతటి గట్టి దైనా
పాతబడే కొలదీ ప్రత్యేక శ్రద్ధ అవసరం.

45. రాక్షసులు - ఛాందసులు

పరబ్రహ్మ ఆనాడే కాదు
ఈనాడు కూడ వుంది,
పరమ ఋషులు ఆనాడే కాదు
ఈనాడు కూడ వున్నారు,
వేదాలు ఆనాడే కాదు
ఈనాడు కూడ పుడుతున్నై.
నాటికీ, నేటికీ తేడా ఒకటే -
నాటి వేద విరోధులు రాక్షసులు
నేటి వేద విరోధులు ఛాందసులు!

46. సుఖం ఎక్కడ వుంది

జీవిత పరమార్థం సుఖంగా జీవించడం!
సుఖం ఎక్కడ వుంది?
సుఖం నీ లక్ష్యంలో వుంది,
నీ కృషిలో వుంది, దాని సిద్ధిలో వుంది,
నీ తృప్తిలో వుంది, నీలోనే వుంది!

47. వృద్ధోపదేశం

పుట్టి పెరిగి పెద్దదైన అల
విరిగి తరిగి లయించి పోతుంది
ఇది సహజ క్రమం.

మృత్యువు ఒక హఠా ద్ఘటన కాదు
అమావాస్య హఠాత్తుగా రాదు
అదొక క్షణక్షణ క్షీణానుక్రమణిక.

ఒకొక్క శక్తే ముక్తమై పోతూ తుదకు
మూలశక్తిలో కలిసిపోతుంది.
ఎలా వచ్చిందో అలానే పోతుంది జీవితం,
తర్వాతేం లేదు తన్మయత్వం తప్ప!

వృద్ధులకిదే నా సిద్ధోపదేశం –
ఆందోళన పడకండి!
ఆత్మైక్యం సహజ మండి!

48. మంచి చెడ్డల రహస్యం

మంచినీ, చెడ్డనూ తానే చేసిన వాడు
మంచీ చెడ్డా తానే అయిన వాడు
మంచికి రక్షా, చెడ్డకు శిక్షా ఎలా ఇస్తాడు?
మంచి చెడ్డలు మానవ కల్పితాలు,
దైవ దత్తాలు కావు.

49. సర్వ ధర్మాన్ పరిత్యజ్య

సర్వ ధర్మాలనూ వదిలేసి
తననే ఆశ్రయించు మన్నాడు భగవంతుడు!
వ్యక్తి ధర్మం, వర్ణ ధర్మం, కుల ధర్మం, మత ధర్మం
అన్నిటినీ వదిలెయ్యాలి కదా ఏ భక్తులైనా?
మరి, ఏదీ? ఎక్కడ?

50. వ్యక్తిగతం

ప్రతి వ్యక్తికీ వ్యక్తిగత జీవితం వుంటుంది
అదే అతడి పరధ్యాన పరమైశ్వర్యం!
దాని వివరాలను గురించి అడగకు
అది అతడిది, నీది కాదు
అతడు చెప్పినా నీ కర్థం కాదు!

51. కురుక్షేత్రం

చార్వాకుడో, కృష్ణుడో, క్రైస్తో
మార్క్సో, మహాత్ముడో, అంబేడ్కరో
ఒకొక్క మహా పురుషుడి జీవితం
ఒకొక్క కురుక్షేత్రం!

52. ఇచ్చేవాడు

ఇచ్చే వా డుంటే అతడి వెంట
పడతారు కోరే వా ళ్ళసంఖ్యాకంగా!
అందుకే కాబోలు -
ఇచ్చేవాడు కనబడడు,
కనబడే వాడు ఇవ్వడు!

53. మాలిన్యం

మానవుడున్న చోటనే మాలిన్యం
పనిచేసే వాడికే పొరపాట్లు
పైకెక్కే వాడికే పడిపోయే ప్రమాదం
కనుక, ప్రకృతి ధర్మం తెలిసి
ప్రశాంతంగా బ్రతుకు!

54. జనరేషన్ గేప్

తండ్రి చెప్పినట్టు వినడం
తండ్రి లాగే జీవించడం
జనరేషన్ గేప్ కాదు.
తండ్రి మాట వినకుండా
గాలికి తిరగడమూ
జనరేషన్ గేప్ కాదు.
సంప్రదాయాన్ని ప్రశ్నించడం
కాలదోషాలను పరిహరించడం
జనరేషన్ గేప్.
స్వార్థ కులతత్వాన్ని నిర్మూలించి
సోషలిస్టు కావడం
జనరేషన్ గేప్!

55. దండ ధరుడు

దేవుడున్నాడా, లేడా అనేది కాదు ప్రశ్న
న్యాయం ఉన్నదా, లేదా అనేది.
ఒకణ్ని అణగద్రొక్కి మరొకడు పైకి పోయే సంఘంలో
తులాదండ ధరుడు దండధరుడు మాత్రమే!

56. ఒక పి.ఏ. కథ

తెలివైన పేద విద్యార్థిని చేరదీసి
అతడి సాయంతో ప్యాసై, ఆఫీసరై
అతడికి తన వద్ద పియే పని ప్రసాదించాడు
ఒక దొరగారి మొద్దబ్బాయి!
అదీ తొలి కథ!
ఆఫీసరు ప్రధాని వరకు ఎదిగి పోయాడు
పియే తన బాస్‌కు నిచ్చెనగా నిలబడి
వెన్ను విరిగి పడిపోయాడు!
ఇది మలి కథ!

57. వృద్ధ సంపద

వృద్ధుల్ని అవమానించే యువత
ఎన్నటికీ వృద్ధి పొందదు.
వృద్ధాప్యాన్ని సుఖవంతం చెయ్యని జాతి
ఎప్పటికీ ఫలవంతం కాదు.
ఏ జాతి కీర్తి గౌరవ సుఖ సంపదలైనా
ఆజాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే.

58. వార్ధక్య లక్షణం

ఇరవై ఏళ్ల వాడికి ముప్పై ఏళ్లవాడు వృద్ధుడు
ముప్పై యేళ్ల వాడికి నలభై ఏళ్లవాడు వృద్ధుడు
ప్రతి వాడికీ తనకంటే ముందున్నవాడు వృద్ధుడు!
నా దృష్టిలో మాత్రం
పనిచేసే ప్రతివాడూ యువకుడే,
పని చెయ్యని ప్రతివాడూ వృద్ధుడే!

59. కర్రలు

జీవిత సాఫల్యానికి జ్ఞానం ఊత కర్ర
వ్యాపారం చేతి కర్ర
కృషి ములు కర్ర
రాజకీయం కాటి కర్ర.

60. నిచ్చెన

ప్రశ్న నిచ్చెన ఎంత పెద్దది అనేది కాదు,
పండబెట్టి వున్నదా నిలబెట్టి వున్నదా అనేది
ఎన్ని మెట్లు గడిచా వన్నది కాదు,
క్రింద నడుస్తున్నావా, పై కెక్కుతున్నావా అనేది.

61. రెండు తలలు

నేడు దేశాన్ని పట్టి పీడిస్తున్నది
ఒక రెండు తలల మహా సర్పం.
పై తల రాజకీయ పదవీ వ్యామోహం
క్రింది తల కులమత మూర్ఖోద్రేకం.

62. కుల తత్వం

పూర్వం కులా లున్నై, కుల తత్వం లేదు
స్వార్థం ఒదిగి, మెరిట్‌కు తావిచ్చేది.

ఇప్పుడు కులాలు లేవు, కులతత్వం వుంది
జాతి జీవశక్తి సమస్తమూ పీల్చేస్తూ,
సస్య సుక్షేత్రాలను
ఎడారులుగా మార్చేస్తూ!

63. హేయ కృత్యాలు

పెళ్లి వంట చెయ్యడం కోసమే
చదువు ఉద్యోగం చెయ్యడం కోసమే
రాజకీయాలు పదవుల కోసమే
దేవుడు అడిగిన వరా లివ్వడం కోసమే
అయితే –
అవి నాకు వద్దు.

64. సాప్తిక పర్వం

కలెక్టరో, కమీషనరో తీర్చవలసిన తగవులో
మంత్రి జోక్యం చేసుకొన్నాడంటే
ధర్మం జయించవలసిన కురుక్షేత్రంలో
సాప్తిక పర్వం ప్రవేశించిందన్న మాటే!
న్యాయానికి నడుం విరిగిందన్న మాటే!

65. ఇంజనీరు?

మట్టి నుంచి మస్తిష్కం దాకా వికసించిన
ఈ సంక్లిష్ట జీవ యంత్రాంగానికి ఇంజనీరెవరు?
పుష్పం పరిమళానికి మట్టిలోతు అందుతున్నదా?
మట్టిలోని వేళ్లకు మింటి ఫలం దక్కుతున్నదా?
పరిమళాన్ని పీల్చేస్తూ, మట్టిని తొక్కేస్తూ
ఎవరయ్యా ఆ ఇంజనీరు?

66. మన దేశంలో?

నరమాంస భక్షకుల నుంచి
బానిస వ్యాపారుల నుంచి
భూస్వామిక కర్కోటకుల నుంచి
మతమిచ్చి పిశాచాల నుంచి
మానవతను విడిపించుకొంటూ యువకులు
మహా విప్లవాన్ని సాధిస్తున్నారు విదేశాలలో.
మరి మన దేశంలో
మన యువకులో?

67. అవే పాత కత్తులు

మహమ్మద్ ఘోరీ ఫిరంగులు,
పృథ్వీరాజు పరాజయం.
తర్వాత వందేళ్లకు
అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఫిరంగులు,
చితోడ్ కోట ధ్వంసం.
మళ్లీ రెండు వందల పాతికేళ్లకు
బాబర్ ఫిరంగులు,
సంగ్రామ సింహుడి ఓటమి.
తదుపరి ఎనిమిదేళ్లకు
బహదూర్ షా ఫిరంగులు,
మనవద్ద అవే పాత కత్తులు!
గతం నుంచి ఏం నేర్చుకొన్నాం?
ఇప్పుడేం నేర్చుకొంటున్నాం?
మీసాలు కాదురా, బ్రదర్!
ఎదగవలసింది రాజసం!
విరియవలసింది ప్రతిభ!

68. శిశిర వాగ్దానాలు

అకాడమీలను మూసి వేస్తా
కళాక్షేత్రాలను కల్లు కాంపౌండ్లుగా మారుస్తా
కవుల చేతికి గొడ్డ ళ్లిస్తా
ఉద్యోగులందర్నీ ఊడ బీకేస్తా
పరీక్షలు రద్దు చేస్తా
వోటుంటే చాలు ఉద్యోగ మిస్తా
ఏ పనీ చెయ్యక్కర లేకుండానే
ఉచిత భోజన వసతులు కల్పిస్తా–
ఇవి నా ఎన్నికల వాగ్దానాలు!
ఆరుకోట్ల అంధ మహాశయులారా!
తెండీ, తెండీ మీ వోట్లన్నీ!
గెలిపించండీ, మీ అభిమాన నాయకుణ్ణి నన్ను!

69. ఆడా, మగా?

దైవం ఆడదా? మగవాడా?
చర్చిస్తున్నారు ప్రపంచ మేధావులంతా!
నీవు నే నంటున్నావు,
నేను నీ వంటున్నాను!
మనిద్దరమూ కలిసిందే కదా దైవం అంటే!

70. అత్యాశ

సృష్టి క్రమవికాసం చెందుతున్నదా?
జీవధర్మం మారుతున్నదా?
మానవ ప్రతిభ ఉత్తుమ తర మవుతున్నదా?
లే దనేది చరిత్ర చెప్పే జవాబు.
కారణం –
మానవుని అత్యాశ!

71. రాజకీయం

రాజకీయం, అదెవడి రాజకీయమైనా
రాజమార్తాండుల దైనా
ప్రజానాయకుల దైనా
అది కేవలం అధికార పదవి కోసమే.
అది పులి కానీ – నక్క కానీ,
గొర్రెల్ని ఆకట్టుకొనేదే!

72. శరణాగతి

పరమ నిరంకుశ నియంతృత్వంలోని
ప్రజల దాస్యానికి రూపకల్పనే
సంపూర్ణ శరణాగతి సూత్రం.
దొరల ముందు గ్రామీణుల
దాసోహదాస వైఖరి.
రౌడీలకు కాల్మొక్కే
నిర్వీర్యుల వినయ శీలత.

73. తిరుపతి గుండు

మతం మార్చ గలవు
దేముణ్ని మార్చగలవు
యజమానిని మార్చగలవు
తల్లి దండ్రుల్ని మార్చగలవా?
చెట్టు సంతానం తల్లిని మార్చగలదు
నీ వదీ చెయ్యలేవు!
పదవి కోసం పార్టీలు మారిస్తే
స్థిరత కోసం తిరుపతి గుండే గతి అవుద్ది
ఆలోచించి అడుగెయ్!

74. రాబందులు

"సర్వాత్మా సుఖినః సంతు"
అనే ధర్మలక్ష్య మే మయింది?
అంత ఎత్తు ఆదర్శ శిఖరం నుంచి
ఇంత లోతు అవినీతి కూపంలోకి
పడిపోయాం కదా–
మళ్లీ ఆ ఎత్తుకు ఎక్కగలమా?
ఇక్కడే ఇలాగే ఒకళ్ల నొకళ్లం తినేస్తూ
నశించి పోతామా?

ఎవడి మట్టుకు వాడు చివరకు
తానే మిగులుతా ననుకొంటున్నాడేమో
అదిగో ఆపైన ఆకాశంలో
మనం పట్టువదిలిన లక్ష్య శిఖరం ప్రాంతంలో
ఆశగా తిరుగుతున్నై ఏమి టవి?
దిక్కుమాలిన దేశి గొడ్లను తిని బలిసిన
అణుబాంబుల రాబందులు!

75. పరమాత్మనే

నేను పరమాత్మ నుంచి పుట్టాను
పరమాత్మనే పీలుస్తూ, తాగుతూ, తింటూ
తన్మయమై ఆనందిస్తూ పెరిగాను,
పరమాత్మలోనే కరిగిపోతున్నాను
నీటిలో మంచు బొమ్మలా!
పరమాత్మనే అయివున్నాను
ఎల్లప్పుడూ!

76. కరెంటు పోతే

ఆకాశవాణి, దూరదర్శిని, ఉపగ్రహ తారలు
అందరూ నీ గృహ సేవకులే,
లైట్లు, ఫ్యాన్లు, మిక్సీలు, హీటర్లు
అందరూ నీ సేవా సైనికులే,
నీ అదృష్టం స్వర్గ తుల్యమే, కాని –
అవన్నీ కరెంటు పోతే పోయేవి!
నీ ఆధునిక జీవిత మహాసౌధంలో
స్థిరమైన వే మున్నై?
అక్షర కృతు లెన్నున్నై?

77. విషాదాంత

మానవుడు భావుకు డైనప్పటి నుంచీ
ప్రపంచ సాహిత్యం సృష్టించిన
కావ్య నాయకులలో
అత్యుత్తమ పాత్ర దేవుడు!
అత్యంత విషాదాంత కావ్యం రామాయణం!

78. బహుత్ అచ్ఛా

జేబులో పర్సు
సూదితో నర్సు
పెదవిపై వెర్సు
నుదుటిపై కర్సు
బ్రతుకె బేవార్సు!

ఒక చిరుగాలి కెరటా స్తైనా
ఇటు మళ్లించగలనా ఇప్పుడు?
ఇప్పుడు నాలో మిగిలి వున్నదొక్కటే – ఆశ!
నిర్గుణ నిరాకార నిరాలంబమైన ఆశ!
బుగ్గపై ఎవరా గిచ్చింది?
ఒళ్లంతా పులకాంకురాలు!
ఎక్కడి వీ ఎర్రని గాట్లు!
చిలుక ముక్కుల్లా చివుళ్లు, మొగ్గలు!

77. విషాదాంత

మానవుడు భావుకు డైనప్పటి నుంచీ
ప్రపంచ సాహిత్యం సృష్టించిన
కావ్య నాయకులలో
అత్యుత్తము పాత్ర దేవుడు!
అత్యంత విషాదాంత కావ్యం రామాయణం!

78. బహుత్ అచ్ఛా

జేబులో పర్సు
నూదితో నర్సు
పెదవిపై వెర్సు
నుదుటిపై కర్సు
బ్రతుకె బేవార్సు!

ఒక చిరుగాలి కెరటా స్నైనా
ఇటు మళ్లించగలనా ఇప్పుడు?
ఇప్పుడు నాలో మిగిలి వున్నదొక్కటే – ఆశ!
నిర్గుణ నిరాకార నిరాలంబమైన ఆశ!
బుగ్గపై ఎవరా గిచ్చింది?
ఒళ్లంతా పులకాంకురాలు!
ఎక్కడి వీ ఎర్రని గాట్లు!
చిలుక ముక్కుల్లా చివుళ్లు, మొగ్గలు!

2. ఊహా పోహలు

"చంచలం హి మనః కృష్ణ"
అంటూ వాపోయాడు అర్జునుడు,
"ఔను, నిజమే" అన్నాడు కృష్ణుడు, కామ్ గా!
ఏమిటీ అర్జునుడు?

కన్ను చూస్తుంది, చెవి వింటుంది,
మనస్సు ఆలోచిస్తుంది,
ఇవి ఆయా జ్ఞానేంద్రియాల గుణ కర్మలు
ఇందులో వింత ఏముంది?

మనస్సు చంచరీకంలా చంచలం కాకపోతే
విశ్వ విశ్వాంతరాలలో విహరించ జాలదు
వివిధ రసాలను సేకరించి
ఆత్మకు అందీయ జాలదు!

6. అనుబంధం

విత్తనం చెట్టు నుంచి రాలేవరకే
చెట్టుకు విత్తనంతో సంబంధం,
విత్తనం రాలిపోయినాక
అవి రెండూ దేని కదే
సర్వ స్వతంత్రాలు !

తన విత్తనం మొలకై, చెట్టై
తనకు ప్రాపుగా నిలవా లని
ఏ చెట్టూ అనుకోదు.

ఏ చెట్టుకైనా –
తన స్వార్జిత నిధి నిక్షేపాలే
తన జీవిత విధి విక్షేపాలు.
కనుక, మనిషీ!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించు!

2. ఊహా పోహలు

"చంచలం హి మనః కృష్ణ"
అంటూ వాపోయాడు అర్జునుడు,
"ఔను, నిజమే" అన్నాడు కృష్ణుడు, కామ్ గా!
ఏమిటీ అర్జునుడు?

కన్ను చూస్తుంది, చెవి వింటుంది,
మనస్సు ఆలోచిస్తుంది,
ఇవి ఆయా జ్ఞానేంద్రియాల గుణ కర్మలు
ఇందులో వింత ఏముంది?

మనస్సు చంచరీకంలా చంచలం కాకపోతే
విశ్వ విశ్వాంతరాలలో విహరించ జాలదు
వివిధ రసాలను సేకరించి
ఆత్మకు అందీయ జాలదు!

6. అనుబంధం

విత్తనం చెట్టు నుంచి రాలేవరకే
చెట్టుకు విత్తనంతో సంబంధం,
విత్తనం రాలిపోయినాక
అవి రెండూ దేని కదే
సర్వ స్వతంత్రాలు !

తన విత్తనం మొలకై, చెట్టై
తనకు ప్రాపుగా నిలవా లని
ఏ చెట్టూ అనుకోదు.

ఏ చెట్టుకైనా –
తన స్వార్జిత నిధి నిక్షేపాలే
తన జీవిత విధి విక్షేపాలు.
కనుక, మనిషీ!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించు!

7. చావు - బ్రతుకు

చావునూ, బ్రతుకునూ విడదీసేది
ఒక చిన్న తటస్థ సీమ
ఆ సీమే సుషుప్తి.

మేల్కొన్న జీవుడు
ఇటు దిగివస్తే బ్రతుకు,
అటు దిగిపోతే చావు.
ఇటు అమ్మ ఒడి,
అటు నాన్న మడి.
ఇదొక నిరంతర వ్యవసాయ వృత్తి!

11. శాంతి శాంతి శాంతి

ఒక శాంతి సుషుప్తి,
దాని కవితల సచ్చిదానంద జీవితం
రెండో శాంతి.
దాని కవితల బ్రహ్మైక్యం
మూడో శాంతి.
ఎందుకీ శాంతులు?
వీటి కోసమేనా మనం పుట్టింది?

12. వ్యక్తి, రక్తి

నామ రూప గుణాలతో అంకురించి
వికసించిన పరమాత్మ బీజమే వ్యక్తి,
దాని మనోరథ విన్యాసమే రక్తి,
దాని పూర్ణోపశమనమే ముక్తి.

ముక్తి కాదు వ్యక్తి లక్ష్యం,
వ్యక్తి లక్ష్యరి ఆనంద రక్తి!

7. చావు - బ్రతుకు

చావునూ, బ్రతుకునూ విడదీసేది
ఒక చిన్న తటస్థ సీమ
ఆ సీమే సుషుప్తి.

మేల్కొన్న జీవుడు
ఇటు దిగివస్తే బ్రతుకు,
అటు దిగిపోతే చావు.
ఇటు అమ్మ ఒడి,
అటు నాన్న మడి.
ఇదొక నిరంతర వ్యవసాయ వృత్తి!

11. శాంతి శాంతి శాంతి

ఒక శాంతి సుషుప్తి,
దాని కవితల సచ్చిదానంద జీవితం
రెండో శాంతి.
దాని కవితల బ్రహ్మైక్యం
మూడో శాంతి.
ఎందుకీ శాంతులు?
వీటి కోసమేనా మనం పుట్టింది?

12. వ్యక్తి, రక్తి

నామ రూప గుణాలతో అంకురించి
వికసించిన పరమాత్మ బీజమే వ్యక్తి,
దాని మనోరథ విన్యాసమే రక్తి,
దాని పూర్ణోపశమనమే ముక్తి.

ముక్తి కాదు వ్యక్తి లక్ష్యం,
వ్యక్తి లక్ష్యం ఆనంద రక్తి!

13. వైకల్యం

నీవు మత విశ్వాసివా?
మతం పేర్కొంటున్న దేవుణ్ని నమ్ముతున్నావా?
అయితే, ఆ ఒక్క దేవుడికే
విశ్వాస పాత్రుడివై జీవించు!

చచ్చిన తర్వాత ఆత్మ శాంతికై
అన్ని మతాల దేవుళ్లనూ ప్రార్థించడం
ఏ ఒక్క దేవుడికీ చెందక పోవడమే!

ఏకాగ్రతను చంపుకొని
లక్ష్య రహితంగా పయనించడం
ఏ ఎడారిలోనో అంతరించి పోవడమే!

17. సణుగుడు

అస్తమిస్తున్న సూర్యుడూ
ఉదయిస్తున్న సూర్యుడూ –
అతడు వృద్ధుడు,
ఇతడు బాలుడు,
అతడి వెనక చీకటి
ఇతడి ముందు వెలుగు,
అతడి పట్ల ఉపేక్ష
ఇతడి పట్ల ఆపేక్ష,
అతడు పోతున్న వాడు
ఇతడు వస్తున్నవాడు!
తెలిసి కూడ ఎందుకా సణుగుడు?

13. వైకల్యం

నీవు మత విశ్వాసివా?
మతం పేర్కొంటున్న దేవుణ్ని నమ్ముతున్నావా?
అయితే, ఆ ఒక్క దేవుడికే
విశ్వాస పాత్రుడివై జీవించు!

చచ్చిన తర్వాత ఆత్మ శాంతికై
అన్ని మతాల దేవుళ్లనూ ప్రార్థించడం
ఏ ఒక్క దేవుడికీ చెందక పోవడమే!

ఏకాగ్రతను చంపుకొని
లక్ష్య రహితంగా పయనించడం
ఏ ఎడారిలోనో అంతరించి పోవడమే!

17. సణుగుడు

అస్తమిస్తున్న సూర్యుడూ
ఉదయిస్తున్న సూర్యుడూ –
అతడు వృద్ధుడు,
ఇతడు బాలుడు,
అతడి వెనక చీకటి
ఇతడి ముందు వెలుగు,
అతడి పట్ల ఉపేక్ష
ఇతడి పట్ల ఆపేక్ష,
అతడు పోతున్న వాడు
ఇతడు వస్తున్నవాడు!
తెలిసి కూడ ఎందుకా సణుగుడు?

18. అఖండత్వం

పాంచభౌతిక జీవ యంత్రం ఈ శరీరం
ఏక జాతి స్వతంత్ర రాజ్యాల ఫెడరేషన్
ఈ యంత్రాన్ని యథావిధిగా నడిపించడంలో
ఒకో రాజ్యానిది ఒకో బాధ్యత!

ఏ ఒక్క రాజ్యమూ స్వయం పోషకం కాదు
ఏ ఒక్క దానికీ సర్వాధికారం లేదు.
గుండె ఆహారాన్ని అందజేస్తుంది
మెదడు శాంతి భద్రతల్ని పాలిస్తుంది.

ఇది ఫెడరేషనే అయినా
యూనిటరీ వ్యవస్థగా నడిచి నప్పుడే
ఆరోగ్యమూ, ఐశ్వర్యమూను.

అఖండత్వమే అస్తిత్వం
నీ యంత్రం మీద పర పెత్తనం సహించకు,
నీ మట్టిలోని ఒక రేణువునైనా
పరాధీనం గానీయకు!

19. ప్రాణేంధనం

నీ జీవ యంత్రాని కివ్వబడిన ప్రాణేంధనం
నూరు వసంతాలకు సరిపోగలట్టిది!
ఆదా చేసి యాత్రావధి పెంచుకొంటావో
దుబారా చేసి దారిలోనే పడిపోతావో
అది నీ చేతిలో వుంది!

20. ఉదయ సాయంత్రాలు

ఉదయ సంధ్యకూ సాయం సంధ్యకూ
తేడా ఏం లేదు,
ఉదయ సంధ్య చైతన్య రథం
సాయం సంధ్య విశ్రాంతి సౌధం!

ఉదయం రెక్కలు విప్పి వయసమ్మైన చైతన్యం
ఏవేవో అనుభవాలు పొంది, అనుభూతులు గడించుకొని
సాయంత్రం హాయిగా గూటికి చేరుకొంటుంది.
చైతన్య రథమూ, విశ్రాంతి సౌధమూ ఒక్కటే
ఆగితే సౌధం, సాగితే రథం!

21. నేను రాలిపోతే

నా ఈ కన్నీటి బొట్టు ఆ
రాలి పడిన పండుటాకు కోసం కాదు,
నా కోసమే.
ఆ పండుటాకు అక్కడే ఎరువై
వచ్చే వసంతంలో ఆ చెట్టుకే
చిగురాకై వెలయవచ్చు!
మరి - నేను రాలిపోతే?

22. త్రి ధా

ఎక్కడో వుండే దేవుడి కోసం
తపస్సు చేశాను.
ఆయన ప్రత్యక్షం కాగానే
అభయం కోసం ప్రార్థించాను.
అభయం లభించగానే
నేనే దేవుడినై కొలువు తీరాను!

23. నుత్తి

ఎన్నో సందర్భాలలో, సభలలో
ఎంతో మంది నన్ను పొగుడుతూ వుంటారు.
నేను వింటూ వుంటాను.
అది పొగడ్త అని కూడా అనుకోను
నాకు ఏ ఫీలింగూ వుండదు.

అయితే, ఆ పొగడ్తల నుత్తిని వాళ్లు
అక్కడే వదిలేసి పోతే మాత్రం
దాని కంటిన నెత్తురు నన్ను చూచి
బెదురుతుంది,
బాధపడుతుంది.

24. అల్ప సంతోషి

అల్ప సంతోషి అన్నారు నన్ను,
సంతోషానికి అల్పం, అనల్పం అనేదేమి?
ఎంత చెట్టు కంత గాలి
గాలి ఒకటే, చెట్లలోనే తేడా!
నేను మర్రి చెట్టును కాదు
మల్లె తీగను!

25. చెట్టు మెదడు

చెట్టుకు మెదడున్నదా?
లేకపోతే – అది
తన విత్తనాలనే సృష్టించుకొంటున్న దెలా?

పరువంలో పూచిన్ని పూలను
కాచిన్ని కాయలను
ముసలిదై పోయే కొలదీ వెలయించ దెందుకు?
క్రమంగా ఎండిపోతూ
తానేమై పోతున్నదో చెట్టుకు తెలుసు,
మనిషికి తెలియదు!

చెట్టుకు మెదడుంది
కాని, కనిపించదు.
మనిషికి మెదడున్నట్టు కనిపిస్తుంది
కాని, లేదు!

26. విత్తనాల వైవిధ్యం

ఒక్క కార్తెలో పుట్టి పోయేవి
ఆరుద్ర పురుగులు
ఒక్క ఋతువులో పూచిపోయేవి
ఆస్టరు పువ్వులు
ఆరు నెలలలో పండి పోయేవి
వరి మొక్కలు
ఆ రేండ్ల నుంచి ఫలితం ఇచ్చేవి
కొబ్బరి చెట్లు
వందల సంవత్సరాలు బ్రతికేవి
రావి, మర్రి వృక్షాలు
అన్నీ ఒకే మడిలోని విత్తనాలు
విత్తనాల వైవిధ్యమే
సృష్టిలోని సౌందర్యం.

27. ఇదీ నాదంటే

నాకు తెలిసిన సంస్కృతి ఋగ్వేదికం
నాకు తెలిసిన వేదాంతం రసాద్వైతం
నాకు తెలిసిన చరిత్ర కురుక్షేత్రం!
నాకు తెలిసిన భారతదేశం
ఉత్తర కురు భూముల నుంచి
మాలదీవుల వరకు,
బలి ద్వీపం నుంచి
సింధు సముద్రం వరకు!
నేనెంత విశ్వాత్మనైనా
నా వ్యాప్తి ఇదే
నా వేళ్లు ఇక్కడివే!

28. భయపడేది

మనిషి భయపడేది మృత్యువుకు కాదు
మృత్యు సమయంలో కలిగే బాధకు!
బాధ ఆ వ్యక్తికి తెలియకపోవచ్చు
తెలుసుకొనే స్పృహే లేకపోవచ్చు!
అయితే-
చూచే వాళ్లను మాత్రం
ఆ బాధ బెదర గొట్టి పారేస్తుంది!
చావును చావగొట్టా లనిపిస్తుంది!

29. పురోగమనం

ఏ ప్రాణి అయినా
ప్రపంచంలో ప్రవేశించిన క్షణం నుంచే
ప్రారంభ మవుతుంది దాని ప్రయాణం
ఎటో, ఏ దారి వెంటనో, ఏ గమ్యం వైపో!
మానవుడు కూడా ఒక ప్రాణి మాత్రుడే
గమ్యం చేరడమే యాత్రకు పరమార్థమైతే
గమ్యం చేరు మవుతున్నప్పుడు
సంతోషించక ఏడ్వడం దేనికి?

30. ముగ్గిన పండు

జీవిత వృక్షాగ్ర శాఖల్లో
ఎర్రగా ముగ్గిన పండును నేను!
ఏ కాకి అయినా ముక్కుతో పొడిచి
క్రిందికి పడద్రోయగలదు నన్ను,
ఏ చిరుగాలి కైనా రాలి పడిపోగలను కూడ!
రాలిపోక ఎలాగూ తప్పదు, కాని, దేవీ!
నేలపై పడి చిట్లిపోకుండా
నీ పమిటె కొంగులో పట్టుకోలేవా నన్ను?

31. వేట

అతడెవరో నాకు తెలియదా?
నా కోసం వలపన్ని కూర్చున్న వేటగాడు!
వేట అతగాడి వృత్తి
తప్పుకొంటూ ముందుకు సాగడం
నా శక్తి యుక్తుల ప్రతిపత్తి!

32. రక్షణ

పరదా వెనక సుఖించే భాగ్యశాలిని కంటే
ప్రజల మధ్య కష్టించే పేదరాలే గొప్పది.
మొద టామెను సమాజం రక్షిస్తున్నది
సమాజాన్ని రెండో ఆమె రక్షిస్తున్నది!

33. గుర్తింపు

నీ ఉత్సవం పాడుగునా పోలీసు బందోబస్తు లేకపోతే
నిన్ను నీవు రక్షించుకోలేవా, గణనాయకా?
మైకూ, లౌడు స్పీకరూ లేకపోతే
నీ ప్రార్థన దేవుడికి వినపడదా, మత నాయకా?
ఏదో ఒక రాయి వెయ్యడానికి కాకపోతే
ప్రజల మధ్యకు వెళ్లలేవా, మంత్రి వర్యా?
దూర దర్శినిలో ముఖం కనబడకపోతే
నిన్ను సరస్వతి గుర్తించదా, మహాకవీ?

34. నా తాత

ద్రౌపదికి ఐదుగురు భర్తలుండవచ్చు నన్నా డొకచోట!
బహుభర్తృక బంధకి అవుతుంది కనుక
సభలో అవమానించవచ్చు నన్నాడు మరో చోట!
వ్యాసుడు సాక్షాత్తూ నారాయణుడు కదా?
అతడేమి చెపితే అది వేదం,
ఏమి వ్రాస్తే అది తలరాత!
వైరుద్ధ్యాల సృష్టిలో వాస్తవాల నేత!
ఆయన నా తాత!

35. కన్ను

లూయీ బ్రెయిల్ తాను గుడ్డివాడైనా
గుడ్డి వాళ్లకు కళ్లిచ్చాడు!
మాల వెంకడు మాన్యశ్రీ వెంకట్రాముడై
మళ్లీ తన పేటమంక కన్నెత్తి చూడలేదు!
కన్నుండ వలసింది మనుష్యుకు,
మనో నేత్రం కలవాడే మానవుడు!

36. కర్తవ్యం

దేశాన్ని పాలించడమంటే
రూల్సు ప్రకారం తింటూ కూర్చోవడం కాదు.
జాతిని శాసించడమంటే
సర్వజన సంపన్నత వైపు నడిపించడం.
ప్రజా నాయకుని కర్తవ్యం
ప్రజలు చెప్పినట్టెల్లా చెయ్యడం కాదు
తాను మార్గదర్శకుడై ముందుండడం!

37. ఉత్తముడు

ఆస్తికుడా, నాస్తికుడా అని కాదు ప్రశ్న
సత్యవాదా, అసత్యవాదా అనేది,
సన్మార్గుడా, దుర్మార్గుడా అనేది,
పరోపకారా, పర పీడకుడా అనేది.
స్వార్థ సంకుచితుడైన ఆస్తికుడి కంటె
సంఘ సంక్షేమం కోరే నాస్తికుడే ఉత్తముడు.

38. అదుపు చెయ్యి

లంచానికి బాధ్యుడు లంచం ఇచ్చేవాడే,
పుచ్చుకొనేవాడు నిమిత్త మాత్రుడు!
లంచాలూ, లాభార్జనలూ ఎప్పుడూ వుండేవే
వాటికి మంచి పేర్లు పెట్టి చట్టబద్ధం చెయ్యి!
మానవ బలహీనతలను నిషేధించడం వ్యర్థం
అదుపుచేసి అభ్యుదయం సాధించు!

39. అనుభూతి

మెదడొక దీపం –
దీపం వెలుగుతూ వున్నప్పుడు
దాని శక్తిని బట్టి ఆవిష్కరిస్తూ వుంటుంది
ఎన్నో ఎన్నో దృశ్యాలను!

దీపం ఆరిపోయినప్పుడు
దృశ్యాలన్నీ దానితో పోతాయా?

పరమాత్మ కూడ
ఆత్మానుభూతి నుంచి జాగృతమవుతూ
ఉన్నవోన్నవంగా వికసిస్తూ వున్నది!

40. వంశోద్ధారకులు

రాజకీయ స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలో
అవతరించిన భారత వంశోద్ధారకులు
రవి తేజులా? పైరవీ దాసులు!
రోమియోలా? రైనోలు!
ఫలవృక్షాలా? బదనికలు!

41. నెగిటివులు

హరిశ్చంద్రుడు, రఘురాముడు, ధర్మరాజు
పదవీరాజకీయాలకు నమూనాలు!
ఇంద్రుడు, సుగ్రీవుడు, కర్ణుడు, వామనుడు
హిపోక్రసీకి ప్రతిబింబాలు!
దుర్యోధనుడు అరసికతకు
రావణుడు మూర్ఖ పట్టుదలకు ప్రతీకలు!

42. జాలి కాదు

చీకట్లో బ్రతికే వాళ్ళకు సానుభూతి చెప్పడం
ఆకలితో చచ్చే వాళ్ళపై జాలి పడడం
కాదు నా కవితా లక్ష్యం.
వాళ్లను నయానో, భయాననో, బలవంతాననో
అక్కడి నుంచి వెలుగులోకి రప్పించడం!
మార్కెట్‌లోని భోజన శాలల వైపు
వేలెత్తి చూపించడం!

43. ధర్మవైరుద్ధ్యాలు

ప్రకృతిని అనుసరించి సాగేదే ధర్మం
యంత్రం, మంత్రం, తంత్రం ఏదైనా పరిమితమే,
అది ఎంతో కాలం ధర్మాన్ని నిరోధించలేదు.

నీతులు, నియమాలు, నిష్టలు, నిర్బంధాలు
అన్నీ దెబ్బతిని పోవడానికి కారణం
అవి సహజ ధర్మాన్ని అరికట్టే లాఠీలై
ప్రజలపై విరుచుకు పడడమే!

44. బంగారు లేడి

బంగారు లేడి నిజం లేడి కాదని
రాముడికీ తెలుసు, మారీచుడికీ తెలుసు.
మరెందుకా పరుగు పందెం?
భూమి పుత్రికోసం
భూమి పుత్రులం మనకోసం!

ఓ మాయలేడీ!
పరిగెత్తు! పరిగెత్తుతునే వుండు!
నీ రక్షణ కోసమే మా సమస్త నిధులూ,
మా సర్వసైన్యాలూ!

45. కుక్కా పిల్లీయం

కుక్కకూ, పిల్లికీ స్నేహం కలుసుద్దా?
మేం కలపడాని కొచ్చాం!
అన్నాడొక నాయకుడు.

పులీ, మేకా ఒక రేవులో నీళ్లు తాగుతయా?
మేం తాగించడాని కొచ్చాం!
అన్నాడు మరొక నాయకుడు.

అందుకు కోట్ల రూపాయలు ఖర్చు
మంజూ రయిం దన్నారు
అదంతా బస్తీ వాళ్లే పెట్టుకోవా అన్నారు.

అనగానే కలకలం బయలుదేరింది
చర్చలు ప్రారంభమైనై.

ఈ గొడవంతా చూస్తున్న
ఒక అమాయకుడు లేచి అన్నాడు –
"అయ్యా! తమరు చెబుతున్నది
పలు తెగల జంతువులను గురించి.
మరి, ఈ బస్తీ వాళ్లంతా మనుషులే కదా!"

46. నేర కారణం

అఘాయిత్యాలు, అక్రమాలు, అత్యాచారాలు
జరుగుతున్నా యంటే - కారణం
నేరస్తుల దౌర్జన్యం కాదు
సజ్జనుల పిరికితనం.

సంఘంలోని ప్రతి వ్యక్తికీ
ఎదుర్కొనే ధైర్య సాహసాలుంటే
నేరాలు వుండవు
నేరస్తులూ వుండరు.

సహన గుణమే మనిషిని
చావగొట్టి పారేస్తున్నది.

47. కాలం

కాలం ఒక్కటి కాదు
విశ్వ మంతటా ఒకేలా వుండదు,
ఆయా గ్రహతారాదుల గతుల్ని బట్టి
కాలప్రమాణం మారుతూ వుంటుంది.
మన సూర్య కుటుంబంలోనే
కాలం గ్రహాని కో రకం.
మన భూగోళం మీదనే
కాలం క్షణానికో విధం!

కాలం స్థిరం కాదు, శాశ్వతం కాదు
వ్యక్తి కాదు, శక్తి కాదు
దాని కే విలువలూ లేవు.

48. ప్రవక్తలు సర్వజ్ఞులు కారు

సృష్టిస్థితి లయాలను గురించి
ఈనాడు మనకు తెలిసినంత భోగట్టా
ఆనాటి వేద ఋషులకు తెలియదు.
మధ్య మధ్య అవతరిస్తూ వచ్చిన
మత ప్రవక్తలకూ తెలియదు.

భూమి తిరుగుతున్నదో, సూర్య తిరుగుతున్నదో
తెలియని కాలంలో పుట్టిన ఎవడైనా
సర్వజ్ఞులని అనుకో నక్కరలేదు.

మారుతుండే కాలంలో
ఒకానొక మార్పుకు నాయకుడైన ప్రముఖుడు
ఆ కాలానికి ప్రవక్త కావచ్చు.
అతడి ప్రవక్తత్వం
మరొక మార్పు వచ్చే వరకే.

ప్రపంచంతోపాటు ప్రజలూ మారతారు
ప్రజలతోపాటు ప్రవచనాలూ మారతై
మారేది పురోగమిస్తుంది
మారనిది నశిస్తుంది.

49. మనో బలం

దేవుడంటే ఎవరు?
నీ మనస్సే నీ దేవుడు!

నీ మనస్సు ఎంత బలమైనదైతే
నీ దేవుడు అంత బలంగా వుంటాడు!

నీ శత్రువుల దేవుణ్ని
నీ దేవుడు గెలవా లనుకొంటున్నావా?
నీ శత్రువుల దీక్షను మించిన దీక్షను
నీ మనస్సుకు సంపాదించుకో!

మనస్సే దేవుడు
ఎవడి మనస్సుకు వాడే దేవుడు!
మతం కూడా అంతే
ఎవడి అభిమతం వాడి మతం!

50. నినాదం

ప్రపంచ గొర్రెల్లారా! ఏకం కండి!
ఎవరి దా నినాదం?
పులుల పెట్టుబడితో
నక్కలు చేస్తున్న నినాదం!

పదండి, తోసుకు పదండి అంటూ నక్కలు
గొర్రెల్ని లారీల కెక్కించేస్తున్న నినాదం!

గొర్రెల రాజ్యం అంటూ నక్కలే పులులై
ఎక్కడి కక్కడే సింహాసనా లధిష్ఠించి
గొర్రె నెత్తురు బ్రాందీగా సేవిస్తూ
మత్తెక్కి కక్కుతున్న నినాదం!

51. రామిగాడు కాదు

ఏం రోయ్, రామిగా!
యేసం మార్చావ్! ఏంటి కత?
గోచిపాత తీసేసి
గళ్ల లుంగీ కట్టావే?

చిత్తం, దొరా!
ఇపుడు నా పేరు రామిగాడు కాదండి!
రహీం భాను!
తురక మతంలో చేరావా యేంటి?
రాముడి కంటె రహీం
గొప్పో డముకొంటున్నావా?

అంతే కదండి, మరి?
రామున్నిగాడు అంటున్నారు,
గాడిదా అని తిడుతున్నారు!
రహీంని అనగలరా?

అంటే నో?
ఈ గళ్లలుంగీ
అందుకే కదండి, మరి?
మీ అంబేద్కరు
బౌద్ధ మతంలో చేరమన్నాడుగా?

అది పారపాటని
మీ దొరలేగా నిరూపిస్తున్నారు?
ఏది ఏమైనా – ఈ పిరికి దేశంలో
గళ్ల లుంగీలు కట్టుకుండ బ్రతకడం
సాధ్యం కాదు లెండి!

52. చచ్చి స్వర్గానికి

ముగ్గురు భక్తులు చచ్చి
స్వర్గానికి బైలు దేరారు.

ఆ ముగ్గురి ధ్యానాలు ఇలా ఉన్నై
ఈశ్వర్ అల్లా తేరే నాం –
ఈశ్వర్ ఏకీ తేరే నాం –
అల్లా ఏకీ తేరే నాం.

స్వర్గ ద్వారం దగ్గర ఎకె 47తో
ఎవరో అపరిచిత ఆజానుబాహువు!
అప్రతిభులై మూగపోయా రా ముగ్గురూ!
వాళ్ల రాక ముందే తెలిసిన వాడిలా

చిరునవ్వు నవ్వి అన్నాడా ద్వార పాలకుడు
"ఇస్సలాం, ఫకీర్ జీ!
తమరు ఈ రస్తాలో వెళ్లండి,
అక్కడ సింధునదీ ముఖ ప్రాంగణంలో
ఏర్పాటై ఉంది మీ స్వర్గం"

"నమస్కారం స్వామీజీ!
మీరు ఆ మార్గంలో వెళ్లండి,
అక్కడ గంగాపాద పద్మాలయ సీమలో
వుంది మీ స్వర్గం"
అల్లా ఏకీ గారూ, ఈశ్వర ఏకీ గారూ
లోపలికి వెళ్ళిపోయారు.

మూడో ద్వారం లేదు!
స్వర్గలోకాలకు దిగువగా, దూరంలో
వైతరణీ నది ఒడ్డున, గుడ్డిగా
గుడారాలేవో కనిపిస్తున్నై!

చంచల మనస్కులకు
ద్వంద్వ ప్రకృతులకు
గోడమీద పిల్లులకు అట!

అటుకేసి చూస్తూ నిలబడ్డాడు
ఈశ్వర్ అల్లా అస్థిత ప్రజ్ఞుడు!
భారత రాజకీయ మేధావుడు!

53. గణపతి పై రాళ్ళు

"గణపతి ఊరేగింపుపై
రాళ్లు పడుతున్నై, బాస్!
ఎక్కడి నుంచో తెలీడం లేదు"

"సందులు, గొందులు గాలించండి!"
"పక్క సందులు, ప్రార్థన మందిరాలు కూడ
ఏదీ వదలిపెట్టలేదు, బాస్!

"క్లూలు?"
"రాళ్లు నూటిగా
తొండాలకు తగులుతున్నై
సాగర్ చేరే ఏ విగ్రహానికీ
తొండం వుండడం లేదు"
"విగ్రహ విధ్వంసక వర్గం నాయకులను
అదుపులోకి తీసుకోండి"
"ఆవిధంగా గురి చూచి కొట్టడం
ఒక్క కుమారస్వామికి తప్ప
మరెవరికీ సాధ్యం కాదంటున్నారు వాళ్ళు"

"ఆయనెవరు?"

"గణేశ్వరుడి తమ్ముడట, బాస్!"

"ఆయనెందుకు విసురుతాడు రాళ్లు?"

"ప్రైమాఫేసీ కేసుంది, బాస్!
న్యాయంగా ఓపెన్ కాంఫిటీషన్‌లో
ఆయనకు రావలసిన గణాధిపత్యాన్ని
పైరవీ ద్వారా ఈయన కొట్టేశాడుట!
అప్పటి నుంచీ కోపావేశుడైన ఆయన
ఈయన పట్ల టెర్రరిస్టే అయాడట!"

"హరి దేవుడా! ఇపుడేమిటి చెయ్యడం?"

"ఏం చెయ్యక్కర లేదు, బాస్!
ఆయన పనులకు ఈయన విఘ్నాలు కల్పించడం
ఈయన ఊరేగింపులపై ఆయన రాళ్లు రువ్వించడం
ఇదంతా అన్నదమ్ముల మధ్య
కుటుంబ రాజకీయాలు, బాస్!
మనం చెయ్యవలసిం దేం లేదు"

54. ఏ జాతి పితవు?

బాపూజీ! మహాత్మా! జాతిపితా!
జిన్నాగారి ద్విజాతి సిద్ధాంతం నిజమైనాక, ఇపుడు
నీవు ఏ జాతికి పితవు?

స్వాతంత్ర్యోద్యమ నిర్మాతవు
ఉద్యమ సారధివి, విజయభద్రుడవు
నీవే భారత రాజ్య పట్టభద్రుడవై యుంటే
మా అదృష్టం ఎలా వుండేదో యేమో!

జీవిత సుఖ శాంతులన్నిటినీ త్యాగం చేశావు
జైలే నిత్యనివాసంగా తపించావు
రవి అస్తమించని సామ్రాజ్యపు అస్త్ర శస్త్రాలను
చేతి కర్రతో చిన్నాభిన్నం చేశావు
నీ అహింసా సత్యాగ్రహాలే లేకపోతే
బ్రిటిష్ సింహాన్ని తరిమి కొట్టగలిగే వాళ్లమా?

"వందే మాతరం" అని నీ వంటే?
అదే మాకు సమర నినాదమయింది.
"రామరాజ్యం తెస్తా"నని నీవు ఉద్ఘాటిస్తే
మేమంతా రామదండుగా నీ వెంట కదిలాం.
"ఈశ్వర్ అల్లా తేరే నాం" అని నీవు గానం చేస్తే
తన్మయత్వంతో నీకు తాళం వేశాం.
ఖద్దరు టోపీలు పెట్టుకొని బుర్రలు
బద్దలు కొట్టించుకొన్నాం కాదా?

కృతజ్ఞతగా నిన్ను చంపి
నీ కృషి ఫలితాన్ని అందుకొని తింటున్నాం!
నీ ఆనవా ళ్లన్నింటినీ తుడిచివేస్తూ
హరిజన పదాన్ని అంటనే కూడ దంటూ
నిన్ను మళ్లీ మళ్లీ చంపుతున్నాం!
ఇపుడు మా జాతి ఏది?
జాతి పితా!
నీ విపుడు ఏ జాతికి పితవు?

55. భూతాలు

గాలి, దెయ్యం, ఘోస్టు, స్పిరిటు, సైతాను
వంటి మాటలతో పిలువబడే వన్నీ భూతాలే
ప్రకోపించిన పంచభూతాలు.
ఇవి శరీరం బైటా, లోపలా కూడ వుంటై
కనుక –
దేవుడు లేడు అనగలం కాని
దెయ్యం లేదు అని ఎలా అనగలం?
ప్రకృతి శక్తులన్నీ పరమాత్మ గుణాలే
అందులో ఏది ఉద్రేకించినా ఉత్పాతమే
ఏది ప్రకోపించినా దెయ్యమే!

56. నిరుద్ధ వేద భారతం

సంపంగి పువ్వును
ఎన్ని షట్పదాలు ఎంతగా నిషేధించినా
బంగారానికి తావి అబ్బిన
స్వర్ణ పుష్పం అదొక్కటే!
నా కథ కూడ అలాంటిదే
నిరుద్ధ వేద భారతం!

57. దొర - దోమ

దొరకు దొరసాని ప్రియురాలు
దోమకు దోమసాని ప్రియురాలు!
దొర చస్తే ఎంతో
దోమ చచ్చినా అంతే!
శివుడు బిచ్చగాడు
నేనూ బిచ్చగాణ్నే!
అయితే...
శివుడికి కోరికలు లేవు
నాకున్నై!

58. రాబందు

ఎవరు నేస్తం!
ఏమిటి చేస్తున్నావక్కడ?
పావురాన్ని దువ్వుతూ ముద్దుగా
ముద్దు పెట్టుకుంటున్నావే!
ఏమిటి కథ?
ప్రేయసికి ప్రేమ సందేశమా?
ప్రపంచానికి శాంతి సందేశమా?
ఈ నీరెండ వెలుగు నీడలలో
సరీగ్గా కనిపించడం లేదు నాకు –
ఎవరు నీవు?

ఏ కులం వాడివో!
ఏ మతం వాడివో!
ఏ పార్టీ వాడివో!
ఏ ప్రాంతం వాడివో!
ఎవరునీవు?

ఎవరి వైతే నేం లే-
నీవు మనిషివి!
అంతే నాకు కావలసింది!
మనిషి నా నేస్తం!
"మనుషుల్లా కనిపించే అందరూ
మనుషులు కారు" అంటున్నావా?
నా అంచనా పొరపాటైతే -
అందుకు నేనేమీ చెయ్యలేను
తెల్లనివన్నీ పాలు అనుకునే శిశువును నేను.

ఇంతకూ, నేస్తం!
నీ చేతిలోది పావురమేనా?
అలా కనిపిస్తున్న డేగ కాదు కదా!
ఎంత గొప్పవాణ్ణైనా వంచించవచ్చు!
రాముడంతటి మహిమాన్వితుణ్ణే
మారీచుడు వంచించాడు!
మన జాగ్రత్తలో మనం వుండాలి!

సరే, నేస్తం!
నీ కృషి ఫలించుగాక
నీ కోరిక తీరుగాక!

అయితే - నేస్తం -
అటు చూశావా?
ఆ ప్రక్క తాటిచెట్టుపై చేరి
సాధు సుభగమైన నీ పావురం కేసి
ఆకలిగా చూస్తున్న ఆ రాబందును
గమనించావా?

నీ వద్ద -
చంపే తుపాకీ వుండదులే.
కనీసం -
బెదిరించే ఉండేలు బద్ద అయినా వున్నదా?
లేకపోతే -
నీ పావురం ఎలా బ్రతుకుద్ది?

59. తప్పేమిటి?

నమ్మక ద్రోహం, వెన్నుపోటు పొడవడం
వంటి మాటలు గొంగళిలో వెంట్రుకలు.

రాజకీయ మార్కెట్లో అవి
పనికి రాని పుచ్చులు.
వోటున్న ప్రతి వాడూ ప్రధాని కాగలవాడే,
అందుకతడు ప్రయత్నిస్తే తప్పేముంది?

నీకు తగు బలమూ, బుద్ధీ వుంటే
మరొకడు నిన్నెలా మోసగిస్తాడు?

60. అన్న - తమ్ముడు

దేవుడున్నాడనే వాడు నా అన్న
అతడికి నేను నచ్చ చెప్పలేను.

దేవుడు లేడనే వాడు నా తమ్ముడు
ఇతడు నా మాట వినిపించుకోడు.

ఉన్నాడనే వాడు ముక్కుమూసు క్కూచున్నాడు
లేడనేవాడు తన నీడ వెంట తానే పడ్డాడు.
వీణ్ణి ఆపి, వాణ్ణి లేపడం కోసమే
ఈ నా కుడి ఎడమల ధనుర్బాణాలు!

61. కృషిని బట్టి

కొందరు తము కష్టానికి ప్రతిఫలం
అడిగి పుచ్చుకుంటారు.
కొందరు ఇస్తే పుచ్చుకుంటారు,
కొందరు ఇస్తామన్నా పుచ్చుకోరు.

మరికొందరు ఏ పనీ చెయ్యకుండానే
దేశ సంపద అంతా తమకే కావాలంటారు!
కృషిని బట్టి సంపదను పంచాలి ప్రభుత్వం
అప్పుడే అది ప్రజల ప్రభుత్వం.

62. నిత్య సత్యం

ఇదేదో కవిత్వం అంటూ తీసివెయ్యకు
నిజమైన కవిత్వం నిరంతర సత్యం
సత్యం విశ్వైక జీవస్రవంతి.

దేశాన్ని బట్టి పేరూ, కాలాన్ని బట్టి రంగూ
వేగాన్ని బట్టి గుణమూ ఏర్పడవచ్చు.

సత్యం ఆకాశం, నక్షత్రాలు కవితలు
అవి భూమికి నిత్య సత్యాలు.

63. అవే

నాలుగు వర్ణాలన్నది హిందూయిజం
రెండు వర్గాలన్నది కమ్యూనిజం
మూడు అంతరాలంటున్నాను నేను.
ఇది – పులీ నక్కా గొర్రే ఇజం!

వేదయుగం మనిషికీ, నేటి మనిషికీ
తేడా ఏముందు గుణకర్మలలో?
అదే పులీ, అదే నక్కా, అవే గొర్రెలూ!

64. విలువలు

లక్షపూలు పెట్టుకొన్న గయ్యాళి కంటె
ఆ పూలలో ప్రతి ఒక్కటీ కమనీయమే,
కోటి గొంతులు కోసిన కత్తి కంటె
ఆ గొంతులలోని ప్రతి ప్రాణమూ కమనీయమే!

65. మళ్లీ వసంతం

ప్రతిభ పరారయింది
కాపీ కొట్టడం కళ అయింది
స్వార్థమే రాజనీతి అయింది
అవినీతే బ్రతుకు తెరువయింది
నిరసనలే నిత్యకృత్యాలైనై!

ఇప్పుడు మళ్లీ వసంతం వచ్చింది
ఎందుకు? ఎవరు గుర్తిస్తారని?

66. లోభీ

జేబులో పైసల కంటే ఎన్నో రెట్లు
బేంకులో వున్నప్పుడే అతడు ధనికుడు.
ఉన్నదంతా జేబులోనే వుండకూడదు
మొత్తమంతా బేంకులోనూ వుండకూడదు.

సముద్రజలం వర్షంగా మారినప్పుడే
పంటలూ, ఫలసాయాలూ!
కనుక – లోభీ
ఊబి నుంచి బైటికి రా!

67. వెలుగులోకి

భగవంతుడు వేదకాలం నాడే కాదు
ఈనాడు కూడా వున్నాడు
ఋషులు నాడే కాదు, నేడూ వున్నారు.
కనుక – వేదాలు ఆనాడే కాదు
ఈనాడు కూడ పుడుతున్నై
కనుక – ఛాదస్తుల్లారా!
చీకటి ఊబి నుంచి
వెలుగులోకి రండి!

68. విపత్తులు

భూకంపం కలిగితే కూలేవి మేడలే
తుఫాను వస్తే విరిగేవి మహావృక్షాలే
దొంగలు పడితే పోయేవి ధన కనకాలే!

కనుక గుడిసెల్లోని ఓ పేద మొక్కల్లారా!
అలాంటి విపత్తులు పైని పడతాయేమో నని
మీ రెక్కడి వాళ్ళక్కడే వుండిపోతారా?

69. వలలు

వద్దు మతం, వద్దు మతబోధలు
వద్దు భక్తి, వద్దు భజనలు.
అవేవీ నిన్ను రక్షించలేవు
అవన్నీ నీకోసం పన్నిన వలలు.
ఏది పులిదో, ఏది నక్కదో కనిపెట్టు!
మనశ్శక్తిని పెంచుకొని మనిషిగా బ్రతుకు!

70. అవసరాలు

అడిగితే కాని అమ్మైనా పెట్టదు
ఏడిస్తేనే ఏదైనా లభిస్తుంది
ఆందోళన చేస్తేనే కాని
అవసరాలు గుర్తించబడవు –
కవిరాజైనా అంతే,
కూలిరాజైనా అంతే!
అది జీవ నైజం!

71. బతకమ్మ

వేద ఋషులు ఆరాధించిన ప్రకృతి శక్తులే
నేడు మే మారాధించే గ్రామదేవతలు.
ఆనాడు అవి హోమ జ్వాలలు
ఈనాడు ఇవి నిప్పు కణాలు.
ఆనాటి హవ్యాలే
ఈనాటి బోనాలు!
ఆనాటి విజయదుర్గమ్మే
ఈనాటి మా బతకమ్మ!

72. అహింసా మెహర్బానీ

రక్తం రుచి తెలిసిన నక్కలకు
తెలియని గొర్రెలు కాల్మొక్కడం ఎందువల్ల?
మన అహింసా మెహర్బానీ నాయకుడు
నక్కలకు కాల్మొక్కుతూ
మనల్ని గొర్రెలుగా మార్చుకోవడం వల్ల!

73. పారమ్యం

ఈ పారమాత్మిక శక్తి సముద్రంలో
నా మనస్సు ఒక మైనాకం!
నా పరిధి గుండా పోయే విప్రలంభ సందేశాలకు
నిలిపి నీడ నిచ్చే అశోకం!
ఈ నా మనోగతాలన్నీ
ఏత త్సందేశాల హృదయ స్పందనలే!
ఒకొక్క స్పందన ఒకొక్క క్షతం
మధుర బాధే ఆనంద ఋతం!

74. స్పష్టత

భావం ఎంత స్పష్టంగా వుంటే
భాష అంత నిశితంగా వుంటుంది,
భావం తన సొంతం అయినప్పుడే
భాష తన స్వాంతాన్ని అర్పిస్తుంది.

75. ఆత్మవిశ్వాసం

ఆత్మ విశ్వాసమే శక్తి
ఆత్మ విశ్వాసమే రక్తి
ఆత్మ విశ్వాసమే భక్తి
ఆత్మ విశ్వాసమే భుక్తి, ముక్తి.

గ్రీష్మంలో ఎండిపోయినా
వర్షంలో పొంగిపోయినా
హేమంతంలో గడ్డకట్టుకుపోయినా
తిరిగి నీకు వసంతాన్ని ఇచ్చేది
నీ ఆత్మ విశ్వాసమే!
నీ ఆత్మకు పరమాత్మ
నీ విశ్వాసమే!

76. అస్తిత్వం

శిశిరంలో నీ అవస్థ ఏమిటి?
గడ్డకట్టుకుపోయావా?
పచ్చదన మంతా దళితమై
మ్రోడై పోయావా?
జీవమే పోయిన ఎండు కట్టె వయావా?

ఏమైనా పర్వాలేదు
నీలో నీదైన అస్తిత్వ ముంటే
కరిగి ప్రవహించగలవు
విరిసి విస్తరించగలవు.
గుడిలో, బడిలో, మడిలో అంతటా
వెలుగు జిలుగులు పండించగలవు!
నీ కోసమే కదా
వసంతం మళ్లీ వచ్చింది?

77. స్వార్థ రూపం

నేను, నాది, నాకు, నా వాళ్లకు అనే వైఖిరిని
స్వార్థమని నిరసించకు.
స్వార్థమే కృషికి ప్రోత్సాహకం
స్వార్థమే పరమాత్మకు ఆత్మ.
వైయక్తిక స్వార్థాల సమన్వయమే సమాజం
వాటి వికారాల పరాక్రమ యత్నమే విధ్వంసం,
మనం వద్దనేది విధ్వంసక స్వార్థాన్ని
అవసరానికి మించి కూడ బెట్టుకునే వికారాన్ని.

78. రూపగుణాలు

పువ్వు, ముల్లు, పులి, లేడి, మనిషి
వంటి మన్నీ భౌతిక రూపాల పేర్లు.
వాటి ఆత్మ చైతన్యం ఒక పరమాత్మది,
గుణాలు మాత్రం రూపాలను బట్టి సంక్రమిస్తై.

మనిషి ప్రత్యేకత ఏమిటంటే –
అన్ని జీవాత్మల గుణాలూ మనిషిలో వుంటై
వైరుద్ధ్యాలూ, వైరాలూ, హింసలూ, హత్యలూ
ఆయా గుణప్రకోపాల ఫలితాలే!

79. మానవత్వం

మానవత్వం అంటే ఏమిటి?
మానవత్వం దైవత్వం లాగే ఒక దురూహ!

మానవత్వం ఒక బంగారు లేడి
అది స్వాతంత్ర్యోద్యమ వాగ్దానం వలె
భూపుత్రులను మోసగిస్తుంది
భూస్వాములకు తోడ్పడుతుంది.

లేడికీ, బాణానికీ
సమానావకాశాలు కల్పించేది దైవత్వం,
బాణంతో లేడిని చంపడం మానవత్వం.

మానవ గుణ చర్యలే మానవత్వం
అది ప్రతి మనిషికీ సహజధర్మం.
కావలసింది మానవత్వం కాదు
స్వపర పక్షపాతం లేని సాంఘిక న్యాయం!

80. వందే మా ''తరం''

అరుణోదయ వదనంతో
ఉదయారుణ తిలకంతో
కను దమ్ముల కాటుకతో
చిరునవ్వుల వేకువతో
నీవు వస్తున్నావని గుర్తించిన ఈ యెడారి
వసంతోద్యానంగా లేచి నిలబడింది!

నీ మణి మంజీరాల గలగలలే
ఈ శుక పిక శారీకా సరిగమలు!

అప్పుడు నీతో నిష్క్రమించిన వైభవం
సుజల సుసుమ సుఫల పుష్కల శోభ
ఇపుడు మళ్లీ వచ్చింది నీతోనే!
ఇక నిన్ను పోనీయం
ఈ తోటను ఎడారి కానీయం!

81. కావ్యానందం

కావ్యం చదువడం రసానందం కోసం
అందులోని పాత్రలను
అనుసరించడం కోసం కాదు.
దృశ్య కావ్యం కనుక, హరిశ్చంద్రుడితో పాటు
ప్రేక్షకులూ ఏడుస్తున్నారు
నిజ జీవితంలో అయితే-
నక్షత్రకుణ్ణి చంపి
విశ్వామిత్రుణ్ణి జైలుకు పంపేవాళ్లు!

82. మళ్లీ మళ్లీ

ఇపుడు నేను చెపుతున్న మాటలన్నీ
గత వసంతంలో నేను పాటలుగా పాడినవే,
గత శరత్తులో పద్యాలుగా పలికినవే,
నాటకాలుగా, నాట్యాలుగా ఆడినవే.
అవే అక్షరాలు, అవే వాక్యాలు, భావాలు
అవే రాగాలు, అభినయాలు మళ్లీ మళ్లీ!

ఈ మళ్ళీ మళ్ళీ లోనే వుంది ఎంత సొగసైనా,
రసజ్ఞులకు ఎంత మధువైనా!

83. పుట్టపర్తి బాబా

నే నెవరికీ భక్తుణ్ణి కాదు
భక్తి తత్వం నా స్వభావంలోనే లేదు.
అయితే, తమకు
బీజాత్మకంగా లభించిన శక్తి యుక్తులను
ప్రజలకోసం వినియోగించే ఉదారులపట్ల
నాకు గౌరవం వుంది.
అట్టి ఉదార చరిత్రుడు పుట్టపర్తి బాబా!

విష్ణువు దశావతారా లెత్తి
ప్రజలకు చేసిందేమీ లేదు.
విష్ణువు కంటె గొప్పవాడు
పుట్టపర్తి సత్యసాయి!

84. ఎవరు భర్త

తానే పరమాత్మకు ఆత్మీయ ప్రతినిధినని
మనస్సుకు మహా అహంకారం!
అందుకే నేమో –
నా మనస్సు నా మాట వినదు.
విశ్వ విశ్వాంతర వివణి వీధుల్లో
విచ్చలవిడిగా సంచరిస్తూ
తన గయ్యాళి గంప నిండా ఏమేమో
తెచ్చి నా ముందు పోస్తుంది!
ధర్మంగా నేను దాని భర్తను, కాని
అదే నాకు భర్త అయి కూర్చుంది!

85. అపకారం వద్దు

ఉపకారం చేస్తే అది ప్లస్ పాయంటు,
అపకారం చేస్తే మైనస్ పాయంటు.
ప్లస్ పాయంటు సెక్యూరిటీ గార్డు
మైనస్ పాయంటు కేన్సర్!

86. చావు లేకుండా

చావు లేకుండా పుడుతూనే వుండడం
పుట్టుక లేకుండా చస్తూనే పోవడం
ప్రొద్దు గూకకుండా పొడుస్తూనే వుండడం
ఎక్కడైనా వుంటుందా?
అందుకే –
కొడుకు పుట్టాలంటే
తాత చనిపోక తప్పదు!

87. ముఖ్య అతిథి

ఏ సాహిత్య సభకైనా ముఖ్యాతిథిగా
ఒక పూజ్య విఐపి గార్ని పిలవడం
తమ సర్వజ్ఞతను ప్రదర్శించి
ముందే లేచిపోవడానికి కాదు.
సభలో పాల్గొనే పండిత గజేంద్రులు
ప్రజల గోడును వినిపిస్తుంటే – ఆలించి
తమ ఆర్తత్రాణ ప్రాభవం చూపడం కోసం
చివరి వరకూ కూర్చోవా లని!

88. హృదయవీణ

లతలన్నీ ఒక తోటలోనివే,
పూలన్నీ అందమైనవే,
రుచులన్నీ తృప్తినిచ్చేవే.
నీ జీవితంలో ఏదైనా అసంతృప్తి కనిపిస్తే
అది నీ హృదయ వీణ పలికే అపశృతే!
వీణ తీగలు సరిదిద్దుకో!

89. ఆశీర్వాదం

దశ దిక్కులు, నవ రత్నాలు
అష్ట లక్ష్ములు, సప్త స్వరాలు
షట్చక్రాలు, పంచ భూతాలు
చతురుపాయాలు, త్రిధాతువులు
సూర్య చంద్ర గ్రహ తారాదులు
ఏకేశ్వరీయ మైన సమస్తమూ
మీకు ప్రసన్నమై, ప్రపద్యమై
ఆయు రారోగ్య విద్యా సౌభాగ్యాలతో
ఆశీర్వదించుగాక!

❋ ❋ ❋


భీమన్న పేరడీలు
చిలకి మెట్టు కీడి
శివుడు
బోయి భీమన్న

ప్రథమ ముద్రణ	సెప్టెంబర్, 1998
ప్రతులు:	1000 కాపీలు
హక్కులు	రచయితవి
మూల్యం	రూ॥ 125/-

ప్రతులకు

భీమన్న సాహితీ నిధి,

ఐ.సి. 85, ఇరమంజిల్ కాలనీ,

హైదరాబాదు - 500 004

ముఖచిత్రం

రవిచంద్ర పొన్నాడ

లేజర్ టైప్ సెట్టింగ్ మరియు ప్రింటింగ్

రవిచంద్రజవ గ్రాఫిక్స్ మరియు క్రియేషన్స్

1-80/2, కూకట్ పల్లి,

హైదరాబాదు - 72

ఫోన్: 3068708

అంకితం

జాతిరత్న డా॥ ఎస్. ఎన్. బూసి గారికి

గాంధీ అంబేడ్కర్ ల గ్రంథాల సారంబు
కలబోసి నిండు పాల్కడలి జేసి,
వ్యాసుని రీతిగా స్వాతంత్ర్య సమరేష్టి
గీతా సుధను తీసి జాతి కొసగి,
కృతక భాషా వర్ణ కుల శృంఖలలు త్రెంచి
ఆసేతు శీతాద్రి కభయ మిచ్చి,
గతమెల్ల గతము, ఆగతమెల్ల ప్రగతిగా
గమ్యైక్యము నకు స్వాగతము పలికి,

నేటి రాజనీతికి లక్ష్యనిధిగ వెలయు
ప్రాజ్ఞ గ్రంథము వ్రాసిన పండిత మణి
శ్రీ సుభామణి నాగన్న బూసి ద్యుమణి
కిచ్చు వాడ నీ కృతి నమస్కృతుల తోడ!

2

వైది కార్ష తపో వాటి, వ్యాస వనము,
బాల యోగుల కనిపెంచు పాలవెల్లి,
కోటి తారల హరివిల్లు కోనసీమ,
గౌతమీ తీర పినపళ్ల గ్రామ భూమి!

సాంఘిక న్యాయమునకు నిస్సంగ సేవ,
బూసి వంశాగ్ర గామియై వాసి గాంచె;
భారతీయత నొక జాతిగా రచించి
ఘనత గొనె నేడు శ్రీ సుభామణి మనీషి

3

మూర్తి, కూర్మయ్య, ధర్మన్న, వున్నయాది
ఆది ఆంధ్రోద్య మాగ్ర నాయకుల స్ఫూర్తి
మూర్తిగొన్న సుభామణి బూసి నేడు
దళిత జనతా ప్రభాస విద్యా ప్రకీర్తి!

-భీమన్న

ప్రవేశిక

ఇప్పుడు జ్ఞాపకం వస్తున్నది 1934లో, అంటే 64 వసంతాల క్రితం, నేను కాకినాడ కాలేజీలో విద్యార్థిగా వుంటున్నప్పుడు దేవులపల్లి వారి ఏడుపు కవితలపై నేను వ్రాసిన హేళన. అప్పుడు నాకు తెలియలేదు కాని ఇపుడనిపిస్తున్నది – అదే నా తొలి పేరడీ అనవచ్చునని!

ఆ రోజుల్లో కాలేజీలో రెండు వర్గాలుండేవి. ఒకటి బ్రహ్మ సమాజం, ప్రభుత్వ వర్గం. ఉచిత విద్యా సౌకర్యంగల హరిజన విద్యార్థులు సహజంగా ఈ వర్గానికి చెంది వుండేవాళ్లు. ఈ వర్గానికి నాయకుడు కృష్ణశాస్త్రి గారు.

రెండో వర్గం కాంగ్రెసుకు చేరువుగా ఉండేది. దాని నాయకుడు బోటని లెక్చరరు గోరాగారు. ఆయన నాస్తికుడు.

నేను గోరా గారితో వుండే వాణ్ణి. స్వేచ్ఛగా కవితలు వ్రాసుకొనే వాణ్ణి. కృష్ణశాస్త్రి గారి శిష్యుల కవితలతోపాటు నా కవితలు కూడ పత్రికలలో పడుతుండేవి.

శాస్త్రిగారి శైలి, భావుకత, గాన సరళి నాకు బాగా నచ్చేవి. కాని ఆయన లోని విషాదం, ఏడుపు, భక్తి ప్రదర్శన లోని కౌటిల్యం నాకు గిట్టేవి కాదు.

''కన్నీరు మున్నీరుగా ఏడ్వనీరు నన్ను'' వంటి ఆయన ఒక కవితను ఆక్షేపిస్తూ నేను అప్పుడు వ్రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇవి:

ఏడుపే నీకు ముఖ్యమవునేని తండ్రి
వెక్కి వెక్కి ఎంతో ఏడ్చి వేయగలను
కాని, మగటిమి చచ్చి నీ కాళ్ళను బడి
సేవ చేయు మటన్న నే చేయలేను!
బహుశా ఇదే నా తొలి పేరడీ.

కృష్ణపక్షానికి శుక్లపక్షం

కృష్ణ శాస్త్రిగారి పాటలకు పేరడీలు వ్రాద్దామనుకొన్నపుడు, నాకనిపించిందీ – అసలు కృష్ణశాస్త్రి ఆ కాలానికి ఒక పేరడీ అని. ఆ సత్యాన్ని ఆనాటి దిజ్నాగుడు అక్కిరాజు ఉమాకాంత పండితుడు స్పష్టంగానే ప్రకటించాడు. ఆ పండితుడి దృష్టిలో నన్నయాదులు కూడా కవులు కారు. అది వేరే విషయం.

కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్ష కావ్యాన్ని వెక్కిరిస్తూ అనంత పంతులు రామలింగస్వామి శుక్లపక్షం అనే కావ్యం వ్రాశాడు. కృష్ణపక్షానికి శుక్లపక్షం ఒక పేరడీ.

నేను పేరడీలు మొదట విన్నదీ, అలాంటివి వుంటాయని తెలుసుకొన్నదీ జల సూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారి దగ్గర. తెలుగులో పేరడీలకు బహుశా జరుక్ శాస్త్రి గురువేమో?

ఈ మధ్య ఎవరో పేరడీలు మీద రీసెర్చి చేశారని, డాక్టరేటు కూడ తీసుకున్నారని, దాని వివరాలు త్వరలో తెలియజేస్తానని ఆ మధ్య ఆచార్య ఆపదరావుగారు నాతో అన్నారు – అది అంతే.

ధర్మన్న – గరిమెళ్ళ

ఒకసారి ఒక చిత్రం జరిగింది. మైకు ముందుకు వెళ్లి, నా పద్ధతిలో ''సభా సరస్వతికి నమస్కారం'' అంటూ వుంటే సహస్రారంలో ఒక మెరుపు మెరిసి, ఒక కొత్త భావం ఆవిష్కారమయింది. అనుకొన్న పథకం అదృశ్యమైపోగా, కొత్త భావావేశంతో ఫ్రీగా మాట్లాడేశాను – బహుశా, ఒక గంట సేపట! సభలో వున్న మిత్రుడు పి.జె.ఆనంద్ ఆ తర్వాత చెప్పాడు నాతో

నా ఆ ప్రసంగం సార బిందువు లివి –

1. రాజకీయంగా దేశ నాయకులు ఇద్దరు. గాంధి, అంబేడ్కరు.

ఒక ఖైదీ వున్నాడు. అతడు రోగిష్టి వాడు. జైలులో అనేక హింసలకు గురి అవుతూ

వున్నవాడు, అతని కాళ్ళు రెండు చచ్చుబడి పోయాయి. నడవలేడు. ''అతన్ని విడుదల చెయ్యండి, మేం బాగుచేసుకుంటాం'' అంటాడు గాంధీ.

''ముందుగా అతన్ని బాగు చెయ్యండి. ఆ కాళ్లలోకి కొంతైనా శక్తి రాకుండా అతడెలా నిలబడగలడు? పక్షపాతంతో బైటికి వచ్చి ఏం లాభం?'' అంటాడు అంబేడ్కరు.

''లోపల అతడికి భద్రతలేదు''

''బైట కుక్క చావు చస్తాడు''

ఆ ఇద్దరి నాయకత్వాలకూ ఇదీ తేడా. మూడవ వాడు సర్దార్ పటేల్. భారత్ అనేక శత్రు దేశాలుగా చీలిపోకుండా కాపాడిన మహా నాయకుడు పటేల్.

ఈ పోలికను స్వాతంత్రోద్యమ సాహిత్యానికి వర్తింపజేశాను.

పోలిక గరిమెళ్ల సత్యనారాయణకు గాంధీతో, కుసుమ ధర్మన్న కవికి అంబేడ్కరుతో, బహుశా ఆంధ్రలో స్వాతంత్రోద్యమం గరిమెళ్ల వారి దేశ భక్తి ప్రబోధ గేయాలతోనే ప్రపుల్లమయిందన్నా అనవచ్చు. తమిళంలో మహాకవి భారతిని మించిన వాడు తెలుగులో గరిమెళ్ళ. 1922 నాటికే వందల కొలదీ గేయాలు వ్రాసి ప్రచారం చేసి, విజాతీ ప్రభుత్వం చేతిలో నరకయాతనలు పడి రెండేళ్ళు జైలు శిక్ష అనుభవించిన స్వాతంత్ర్య మహాకవి ఆయన.

ఆయన గేయాలలో రెండు బహుజన ప్రచారంలో ఉన్నట్టివి.

1. మాకొద్దీ తెల్లదొరతనము 2. దండాలండోయి బాబు దండాలండోయి.

కుసుమ ధర్మన్నగారు ఆ కాలంలో హరిజనోద్ధరణ కృషిలో తలమున్క లవుతున్న హరిజన నాయకుడు. ఆజాను బాహువు. భీమకాయుడు. గొప్పవక్త.

మాల, మాదిగ, రెల్లి మొదలైన అస్పృశ్య కులాలు చండాల, పంచమ, నిమ్న, డిప్రెస్డు, ఆది ఆంధ్ర వగైరా పేర్లతో పిలువబడుతున్న రోజులవి. హరిజన అనేది తర్వాత వచ్చింది. దళిత అనేది అప్పటికి లేదు.

ధర్మన్నగారు తమ ప్రచారోద్యమానికి ఉపన్యాసాలతోపాటు గద్య పద్య గేయ ప్రక్రియలను విశేషంగా వాడుకొన్నాడు. ఆ ప్రక్రియలలో వందలకొలది రచనలను చేశాడు.

ఆశువుగా చెప్పేవాడు. శ్రావ్యంగా పాడేవాడు. అవసరమైనప్పుడు హావ భావ నాట్యాల ద్వారా, హాస్య చమత్కార చాతుర్యాల ద్వారా తన సాహిత్యాన్ని ప్రచారంలో పెట్టేవాడు.

కవి, రచయిత, వాగ్గేయకారుడు, గాయకుడు, నర్తకుడు, వక్త, ఆయుర్వేద వైద్యుడు, సాముద్రికుడు, స్నేహశీలి, కావ్య పురాణేతి హాసాలను గురించి క్షుణ్ణంగా తెలిసిన వాడు. వీటిని సామాజిక స్పృహతో విమర్శించగల పండితుడు, సరసుడు, జనరంజకుడు ధర్మన్నగారు.

శిష్ట కావ్యాల నుంచి కామ శాస్త్రాల వరకు ఆయనకు సుపరిచితాలు. రాజమండ్రికి వచ్చే అన్ని రంగాల నాయకులు ఆయనింటికి వచ్చేవారు. ఆయనింట రాజాస్థానంలో వలె నిత్య గోష్ఠి నిరంతరంగా ఒప్పారేది. తర్వాత పత్రికాధిపతి అయ్యాడు. జయభేరి పత్రికను నడిపి, ఆనాటి కులతత్వ వాదుల గుండెల్లో సింహగర్జనలు చేశాడు.

నిండైన విగ్రహం, కొండంత ఎత్తుమనిషి, పెద్దతల, తలపై కాశ్మీరీటోపీ. ముతక షరాయి, మోగాళ్ళ వరకు గౌను. అనుచరులతో రోడ్డు మీద నడుస్తుంటే ''ఎవరో ఒక పాదుషాహి'' అంటూ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి గురించి దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు వ్రాసిన పద్యం సాక్షాత్కరించేది. అయితే, నాయుడుగారి కంటే ధర్మన్నగారు బాగా పాడుగు.

ధర్మన్న కవి వ్రాసిన రెండు సుదీర్ఘ గేయ రచనలలో

ఒకటి ''మాకొద్దీ నల్ల దొరతనం'', రెండు ''దండాలండోయి బాబు, దండాలండి''.

గరిమెళ్లవారు తెల్లదొరతనం వద్దన్నారు. ధర్మన్నగారు నల్ల దొరతనం వద్దన్నారు. అలా వద్దనడానికి ఎవరి కారణాలు వారికుంటై. నేను తెలియగోరిన అంశం ఎవరి గేయం ముందు అనేది. అయితే, రెండూ స్వతంత్రగేయాలే కనుక, వాటి వెనుక ముందులకు ఎక్కువ ప్రాధాన్యముండదు. నాకు కావలసింది ఏది దేనికి పేరడి అని.

ఒకదాని కొకటి పేరడీ. అంతే!

ఇంకా కొన్ని పేరడీలు వ్రాయాలనుకోవడానికి, ఇదివరలో వ్రాసిన హాస్య ఆక్షేపక

కవితలను వాటికి చేర్చి ప్రకటిద్దామనుకోడానికి మూలమైన భావ భూతం నాలో ఇలా ఆవిర్భవించింది.

ఇక మూడో కవి చిలకమర్తి వారు. ఆయనొక్కడే భారతీయులను హిందువులని ధైర్యంగా ప్రకటించిన మహాకవి. ఈ ముగ్గురూ మినహా, ఆకాలంలోని తక్కిన కవులంతా గొప్పలు చెప్పుకున్న డాంబికులే. ధర్మన్న, గరిమెళ్ల ఒకే ప్రాంతానికి చెందిన సమకాలీనులూ, మిత్రులూ కనుక వారి మధ్య నేను కల్పించిన డైలాగు అనుచితం కాదు.

పేరడీ అంటే

తెల్ల దొరతనానికి నల్ల దొరతనం ఒక పేరడీ. ఎంత గొప్ప సత్యావిష్కారం అది!

ఆకలి మంటలలో దహించుకుపోతున్న వాళ్లు అన్నం కనబడగానే ఎలా ఎగబడి లాక్కుతింటారో, వేల సంవత్సరాలుగా విజాతీయ పాలకులకు దాస్యం చేస్తున్న భారతీయులు అలానే ఎగబడి, స్వతంత్ర భారతిని పీక్కు తినసాగారు.

పేరడీకి ఇంత శక్తి వున్నదని గమనించి తదుపరి, ఆ మాటను గురించి ఆలోచించాను.

పేరడీ అనేది ఆంగ్ల పదం. ప్రసిద్ధమైన ఒక పూర్వ రచనను ఆక్షేపించే ఒక రచన. వక్రానుకరణను కూడా పేరడీ అనవచ్చు. ఒక ప్రసిద్ధ రచయిత రచనకు వంక పెట్టి వెక్కిరించడం పేరడీ. పులిని చూచి నక్క వాతలు పెట్టుకోవడం పేరడీయే.

తెల్ల దొరతనానికి నల్ల దొరతనం ఒక గుడ్డి అనుకరణ. ఒక పేరడి. కాళిదాసు నేషం కట్టిన నటుడికి కాళిదాసు అవార్డు ఇవ్వడం ఒక పెద్ద పేరడీ.

అనువాదాలు పేరడీలు కావు. అనుకరణలు మాత్రం నిజంగా పేరడీలే. ఒక మహా పురాణంలోని కథలను తీసుకొని కావ్యాలుగా వ్రాయడం పేరడీలు కావు. అందరి భావాలను దొంగిలిస్తే అవి పేరడీలు.

రామాయణానికి తెలుగులో సిసలైన అనువాదం లేదు. అనుకర్తల పేర్లతో అనేక రామాయణాలు వెలిసినై. అవన్నీ పేరడీలే.

అలాగే ప్రజాస్వామికంలో వ్యక్తి ఆరాధన ఒక నికృష్టమైన పేరడీ. వ్యక్తుల పేర్లతో వెలసిన రాజకీయ పార్టీలన్నీ పేరడీలే. అలా భాగ్యనగరానికి హైదరాబాదు పేరడీ. క్విట్ ఇండియా పోరాటంలో సాధించుకొన్న స్వాతంత్రాన్ని తిరిగి ''టేక్ ఇండియా'' అంటూ, ఆ దేశాలకు అమ్మివేయడం నిర్వీర్య జాతీయతా పేరడీ. ప్రతిభను అవమానించి పైరవీ సింహాసనమెక్కి దోచుకొనే స్వార్థ విజయాలన్నీ పేరడీలే.

నిజానికి ఈ అధునిక భారతంలో మెజారిటీ ప్రజలకు బ్రతుకే ఒక పేరడీగా బ్రతుకుతున్నదంటే అది దురపిల్ల వలసిన పరమ సత్యం.

మహా భారత యుద్ధాన్ని అసత్యం జయించింది. రామాయణ యుద్ధాన్ని అధర్మం జయించింది. ఏ యుద్ధాలనైనా జయించేవి సత్యధర్మాలు కావు, వ్యూహాలు.

ప్రజాస్వామ్య ఎన్నికలలోని విజయాలకు రిగ్గింగులు పేరడీలు.

''అబద్ధం అడ గూడదు'' అని పిల్లవాడికి బోధిస్తూ, ''నా కోసం ఎవరైనా ఫోనుచేస్తే ఇంట్లో లేడని చెప్పు'' అని పురమాయించడం నిత్య వ్యవహారంలోనే కదా?

భారత పార్లమెంటులో సుమారు 550 మంది సభ్యులున్నారు. వాళ్లు దేశం మొత్తం మీద 550 నియోజక వర్గాల నుండి తిరిగి ఎన్నుకోబడడానికి తమ నియోజక వర్గ ప్రజల ప్రత్యేకాభిమానం కావలసిన వాళ్లే. ప్రతి ఒక్క సభ్యుడు తన నియోజక వర్గమే మొత్తం దేశం అనుకునేటంత స్వార్థం వుండేవాడే.

అట్టి పరిస్థితిలో ఒక నియోజక వర్గపు ప్రతినిధి మొత్తం దేశాన్ని ఏలా పాలించగలడు?

ప్రతి నియోజక వర్గంలోను ఏదో ఒక మైనారిటీ వర్గపు వోట్లు ఫలితాన్ని నిర్ణయిస్తూ వుంటాయి. అతడు మళ్ళీ మళ్ళీ ఎన్నిక కావాలంటే ఆ మైనారిటీని పోషించుకొంటూ రావాలి. మెజారిటీ ప్రయోజనాలను బలిపెడుతూ రావాలి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక క్రూరమైన పేరడీ కాదా? దేశాన్ని పాలించేవాడు దేశంలోని అందరిచేత ఎన్నుకోబడాలి కదా?

అనౌచిత్యాన్ని సహించలేను

నా చిన్నప్పటి నుంచి ఇప్పటి దాకా నన్ను వదలని ఒకే ఒక గుణం అనౌచిత్యాన్ని సహించలేకపోవడం. ఆత్మీయుడు, అభిమాని, శ్రేయోభిలాషి, యజమాని అనే విచక్షణ లేకుండా, వాళ్ల చర్యల్లో లోపాలు కనిపిస్తే నిస్సంకోచంగా వాటిని ఎత్తిచూపడం.

ఈ సూటిదనం కారణంగా నేను పోగొట్టుకొన్నది అపారం. అయినా అందుకు నేనెప్పుడూ విచారించలేదు.

ఆక్షేపణ, హేళన, విమర్శన నాకాలవాటయిందీ విధంగానే. నేను ఎదిగే కొలదీ ఈ గుణాలు కూడా నాలో ఎదుగుతూ వచ్చాయి. ఇందుకు ఒక ఉదాహరణ–

సరసాక్షర రమ్యంగా పద్యం వ్రాయడంలో నాకు ఆదర్శం బమ్మెరపోతన్నగారు. కొంతకాలం వరకు ఆయన రచనల్లో నాకెలాంటి లోపాలు కనిపించలేదు. ఔచిత్యం, హేతుబద్ధత ఇవి రెండూ సాహిత్యానికి రెండు ప్రాణ నాడులు నా దృష్టిలో.

ఈ దృష్టితో పరిశీలించినపుడు పోతన్నగారి పద్యాలు కొన్నిటిలో మహాఘోరమైన దోషాలు కనిపించినాయి. వాటిని దిద్దుకొని పాడుకోవడమో పేరడీలు వ్రాసుకోవడమో చెయ్యక తప్పలేదు.

పోతన్నగారి ఈ పద్యం చూడండి:

అమ్మలగన్న యమ్మ, ముగు
రమ్మల మూలపుటమ్మ, చాల
పెద్దమ్మ, సురారు లమ్మ, కడు
పారడి పెట్టెడి యమ్మ, తమ్ములో
నమ్మిన వేల్పు టమ్మల మ
మ్ముల సుండెడి యమ్మ, దుర్గ మా
యమ్మ

''చాల పెద్దమ్మ'' అనడం వరకు బాగానే వుంది. ''దుర్గమాయమ్మ'' దగ్గర నుంచి ముగింపూ బాగానే వుంది. ఆ మధ్యలోని రెండు వాక్యాలలో ఒకటి జాతి ద్వేష పూరితమూ, రెండోది స్వజన పక్షపాత దూషమూ కాదా?

పైగా అంతటి పెద్దమ్మ మరొక అమ్మ కడుపులో చిచ్చు పెట్టగలదని పోతన్న గారెలా అనుకొన్నారు? వేలుపుటమ్మలలో కూడా తనను నమ్మిన వారిని మాత్రమే రక్షిస్తుందా?

ఒక అమ్మ శిష్టుల్ని రక్షించవచ్చు, దుష్టుల్ని చంపవచ్చు. సురలకు శత్రువులైతే తనకేం? సుర అసుర ఉభయులకూ జగన్మాత మాతే కదా?

అందుకే ఆ రెండు వాక్యాలనూ నేను ఇలా మార్చి వ్రాసాను.

సురా సుర ప్రకృతి కంతకు జీవ ఘనమ్మ, తన్నులో
నమ్మిన లోకులందరి మనమ్ముల నేలెడి అమ్మ

ఈ విధంగా పరిశీలిస్తూ పోతే పోతన్నగారి చాల పద్యాలలో అనౌచిత్య దోషాలు కనిపిస్తై.

అంతేకాదు పూర్వ కవులందరిలోనూ అనౌచిత్య దోషాలు కనిపిస్తై. ఇక ఆధునికుల రచనలు కులాల వారీగా, వర్గాల వారీగా విభజించబడ్డ కాలనీలు. నిర్మాణాలన్నీ ఒకే అచ్చు. వైవిధ్యం కూడా వుండదు. నాకు తెలిసిన కొన్నిటికి మాత్రమే పేరడీలు వ్రాశాను. ఇందులో కీర్తనలు, సినిమా పాటలు, లలిత గేయాలు ఎన్నోవున్నై.

ఇందులో హాస్య ప్రధానమైన వెక్కిరింపులేకాక ఆక్షేపణలు, నిరసనలు, ఖండనలు, వ్యంగ్యాలు, ధ్వనులు వంటి వనేకం వుంటై. చేదుగా వున్నా కాకర కాయలు ఆరోగ్యకరాలే.

నా వృత్తి సాహితీ చికిత్స. ఇవి పేరడీలైనా సరస కవితలు గానే వ్రాశాను. ప్రజల నాలుకలపై నిత్యం నాట్యమాడే బాణీలను మాత్రమే ఎంచుకున్నాను. మూలాలు అందరికీ తెలిసినవే కనుక ప్రత్యేకంగా పేర్కొనలేదు.

''రామచంద్ర'' అంటే నా చిరకాల మిత్రుడైన స్వర్గీయ తిరుమల రామచంద్ర అనికూడ అనుకోవచ్చు. ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో 1945 నుండి 1955 వరకు కలిసి పనిచేసిన అతి సన్నిహితులం మేము.

ఇంటి నుంచి ఆసుపత్రికి

భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంవత్సరం కదా ఇది! ఈ సంవత్సరం పాడవునా, 50 ఏళ్ళ స్వరాజ్యం అనే విషయంపై సభలూ, సమావేశాలూ, సమారోహాలూ వగైరా ఉత్సవాలు వేలం వెర్రిగా జరుగుతూ వున్నై. ఆర్గనైజర్లకు డబ్బు కూడా పుష్కలంగానే లభిస్తూ వున్నట్లు వుంది. విషయంలో వైవిధ్యం లేకపోయినా, ఈ యాభై ఏళ్ళలోనూ జరిగిన పురోగమనం గురించి కానీ, తిరోగమనం గురించి కానీ నిష్పక్షపాతంగా చర్చలు జరక్కపోయినా ఉత్సవాలు మాత్రం జరుగుతూనే వున్నై. ఊకదంపుడు ఉపన్యాసాలు సాగుతూనే వున్నై. ఎక్కడో వెనకబడివున్న సంస్థలు కూడా ముందుకి వచ్చి సభలు చేస్తూ వున్నై. నాలాంటి వాళ్ళను కూడా అప్పుడప్పుడూ అలాంటి సభలకు ఏదో స్థానం చూపి పిలుస్తూనూ వున్నై.

మద్రాసులో వుండే అలాంటి ఒక సంస్థ వారు ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమి నుంచి అనుజ్ఞ పొందామంటూ, హైదరాబాదులో ఒక సమావేశం ఏర్పాటుచేసి నన్ను ముఖ్య అతిథిగా పిల్చారు. అది 1998 జనవరి 18వ తేదీ. సభ మధ్యాహ్నం 11 గంటలకు ప్రారంభం. తీసుకువెళ్ళడానికి వస్తున్నామంటూ, సిద్ధంగా వుండమంటూ 10.30 గంటలకు ఫోను చేశారు. అలాగే నేను సిద్ధపడే ప్రయత్నంలో నిలబడి ప్యాంటు వేసుకొంటూ తూలి పడిపోయాను. ప్యాంటులో ఒక కాలు చిక్కుకుని వుండడంవల్ల సదురుకోడానికి వీలులేక అమాంతం కూలపడిపోయాను. తుంటి ప్రాంతం చుట్టూ నలిగి పోయింది. కమిలి పోయింది. నిజానికి వెన్ను విరగవలసింది. అయితే తుంటి చుట్టు సలుపు, బాధ తప్ప బొవికలు విరిగినట్లు కానీ, బెసిగినట్లు కానీ అనిపించలేదు. అలాగే 25వ తేది వరకు మంచం మీద పడివున్నాను.

నన్ను సభకు పిల్చిన వారు కారు తీసుకుని వచ్చి, అయ్యో అనుకుంటూ వెళ్ళి పోయారు. తర్వాత పరామర్శించే తీరిక కూడా వారికి లేక పోయింది.

అలాగే బాధపడుతూ, ఇక భరించలేక ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు గారికి ఫోను చేశాను. నేను డెత్ బెడ్ మీద నుంచి మాట్లాడుతున్నాననీ, నాకొక ఆర్థోపెడిక్ డాక్టర్ సహాయం అవసరమనీ, నాకు జరిగిన ప్రమాదం గురించి వివరించాను. ఆయన జోక్యంతోనూ, వైద్యశాఖ కార్యదర్శిగారి ప్రమేయంతోనూ జంటనగరాలలోని ప్రధాన ఆసుపత్రులన్నీ నాకు తమ సహాయం అందిస్తామంటూ ఫోన్లు చేశారు. గాంధీ ఆసుపత్రి నుంచి ఒక ఆర్థోపెడిక్ డాక్టరు సత్యగౌడ గారు ఆంబులెన్సుతో సహా వచ్చేశారు. ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మా ఇరంమంజిల్ కాలనీకి దగ్గరగా వుంటుందన్న కారణంగా నన్ను నిమ్స్‌లో చేర్పించారు. నిమ్స్ వారి ప్రత్యేక ఏర్పాట్లతో నేను అదే నెల 27వ తేదీన నిమ్స్ వివిపి వార్డులో మూడవ నెంబరు గదిలో చేరాను. ఆ గది మరీ పాడుగా వుండడంవల్ల 8వ నంబరు గదిలోకి మారాను.

నేను నిమ్స్‌కి వెళ్ళినపుడు నా కూడా చంద్రబాబు అనే విద్యార్థి, రవి చంద్ర అనే కంప్యూటర్ గ్రాఫిక్స్‌కి చెందిన ఒక విద్యార్థి, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న వాణీపతి, అడ్వకేటు రమేష్, మా ఎదురింటి పిల్లవాడు శ్రావణ్, మా ఆవిడ హైమవతి వున్నారు. ఆ తర్వాత మా అమ్మాయి పల్లవి, అబ్బాయి డా. వర్మ, సెన్సెస్ డిపార్టుమెంటుకు చెందిన సన్నిహితులు రామకృష్ణ, మరియన్న కూడా వచ్చి కొంతసేపుండి వెళ్ళారు. ఆ రాత్రి నాకు సహాయంగా ఆసుపత్రిలో వున్నవారు చంద్రబాబు, రవిచంద్ర.

నేనుంటున్న ఇరంమంజిల్ దగ్గరగా వుంటుందన్న దొకటి తప్పితే నేను నిమ్స్‌లో చేరడానికి మరో కారణం ఏదీ లేదు. పైగా నిమ్స్‌లోని ఏర్పాట్ల పట్లా, చికిత్సా విధానాల పట్లా ప్రజలలో అంత మంచి అభిప్రాయం లేదు కూడా. అయితే నేను అంబులెన్సులో వెళ్ళి ఆసుపత్రిలో దిగిన దగ్గర నుంచీ కూడా, అన్నీ సమస్యలే ఎదుర్కోవలసి వచ్చింది. నిజానికి నేను ఆసుపత్రిలో వున్న నెల రోజుల పాటూ జరిగిన విశేషాలన్నీ చిత్రమైనట్టివీ, ఆసక్తిదాయకమైనట్టివీ, కొన్ని కొన్ని అపూర్వమైనట్టివీ. వీటన్నిటినీ నాశైలిలో వ్రాయాలంటే ఒక చక్కని అవార్డు పొందగల నవలే అవుతుంది. అది వేరే ప్రాజెక్టు. అందుకే ఇక్కడ వివరాలు ఇవ్వడం లేదు. ఒక యాభై, అరవై పేరడీలు ఒక చిన్న గ్రంథంగా

ప్రచురించాలనుకొంటున్న స్థితిలో నాకీ ప్రమాదం జరగడం చాల చిత్రమనిపించింది. పేరడీల వరకూ గతానుభవాలే. ఈ గ్రంథంలో కొత్త అనుభవాలు వుండాలన్న నిర్ణయంతోనే విధి నన్నీ ఆస్పత్రికి పంపిందేమో అనిపించడంలో వింత ఏమీ లేదు. మానవ మనస్తత్వ ప్రవృత్తి ఇది. దేవుడు లేడు పరమాత్మ వుంది అనే వాడికి విధి ఏమిటి అనుకోవద్దు. పరమాత్మలోని వైవిధ్యమే దాని జీవ ప్రవంతికి మూలభూతం. వైవిధ్యంలోని వివిధ శక్తుల ఘర్షణయే ప్రమాదాలకు గానీ, ప్రమోదాలకు గాని హేతువు. అదే విధి, దైవికం అనబడేది.

ఆసుపత్రి అనుభవాలు

నన్ను ఎక్సరేల దగ్గర నుంచి ఎమర్జన్సీ వార్డుకు తెచ్చినప్పుడు అక్కడ ఒక మంచం మీదకి నలుగురు పట్టి ఎక్కించారు. 'అయ్యా! ఇదెక్కడ మంచం అండీ? మంచం అంటే కూర్చున్నప్పుడు కాళ్ళు నేలకు తగలాలి. ఇదేదో రాక్షస మంచం లాగుంది. నన్ను నలుగురు పట్టి ఎక్కించారు, దింపటానికి నలుగురు మనుషులు కావాలి కదా?' అన్నాను.

''ఇక్కడ మంచాలన్నీ ఇంత ఎత్తుగానే వుంటాయి'' అన్నారెవరో. ఆ మంచం మీద ఉంచే రెండు మూడు టెస్టులు ఏవో చేశారు. నాకు అక్కడి విషయాలు ఏమీ నచ్చక ఇంటికి వచ్చేయ్యాలనుకున్నాను గానీ వాళ్ళు వెంటనే మరొక ఫ్లోరులోని ఒక ప్రత్యేక గదికి పంపించారు. ఒక గంట పోయిన తర్వాత ఇంకొక ఫ్లోరులోని వి.ఐ.పి. రూము నెం.3కి చేర్చారు. ఆ రూము రూపాన్ని వర్ణించడం కష్టం. ఎందుకంటే దానికి ఏ రూపమూ లేదు కనుక. అక్కడా ఒక రాక్షస మంచం, రోగి సహాయుల కోసం ఒక మామూలు (దివాన్) మంచం, ఒక చిన్న టేబులూ వున్నై. నేను దివాన్ మీద కూర్చున్నాను. పెద్ద మంచాన్ని చంద్రబాబు, రవిచంద్రలకు వదిలేశాను. మరునాటికి ఎక్సరేలు వచ్చాయి. అందులో నాకు తగిలిన దెబ్బ సంగతులేవీలేవట. ''ఎముకకూ కండకూ నడుమ వుండే పొర నలిగి వుండవచ్చు'' అన్నారు ఒక యువ ఆర్థోపెడిక్ డాక్టరు జయభారత రెడ్డిగారు. అదే నిజం కావచ్చు అనుకున్నాను. అవసరమైన టెస్టులన్నీ

చేయవలసిందిగా కోరాను. ఆ సాయంత్రమే స్కానింగ్‌కు ఏర్పాటుచేశారు. మూడో రోజున స్కానింగు ఫలితం వచ్చింది. వెన్నెముక చివరిలోని పూసలలోను మొదటి పూసకు చేరివుండే ఎడమవైపు ఎముక వంగినదనీ అది సరికావడానికి పూర్తి బెడ్‌రెస్టు అవసరమనీ చెప్పారు. అది సరికావడానికి కనీసం 3 వారాలు పడుతుందట. ఆస్వాదనలూ, విసర్జనలూ అన్నీ వెల్లకిలా పరుండే జరపాలట. కదలకూడదట.

మూడు వారాలు కాదు కదా మూడు రోజులు కూడా ఆ రూములో వుండలేని దుస్థితి. మూడవ రోజున మరొక రూములోకి మారే ప్రయత్నం చేస్తున్నప్పుడు, ఆ సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావుగారు వచ్చారు. చిన్న మంచం మీద నా పక్కనే కూర్చున్నారు. అప్పటికి నా రూములో ఉన్న నలుగురైదుగురు విజిటర్లలో జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు ఒకరు. మాధవరావుగారు ఒక అరగంటకు పైగా కబుర్లు చెబుతూ కూర్చున్నారు. అక్కడ చేరిన డాక్టర్లకు, నర్సులకు నాగురించి చెప్పారు. ''మా బావగార్ని జాగ్రత్తగా చూసుకోండి'' అన్నారు. ఈ చిన్న మంచం మరీ ఇరుకుగా ఉన్నదనీ, అవసరమైతే రెండు మంచాలు కలిపి వెయ్యమనీ, అందుకు తగిన మరొక రూములోకి మార్చమనీ సలహా యిచ్చారు.

తనకు అందుబాటులో కనిపిస్తున్న ఒక కాగితాన్ని అందుకుని, దానిపై అంతకు ముందే నేను చెప్పగా మా పల్లవి రాసిన ఒక పద్యాన్ని చూస్తూ ''పద్యం చాలా బాగున్నదే'' అన్నారు మాధవరావుగారు. అదేదో పైకి చదవమన్నారు పున్నయ్యగారూ, విజిటర్లూను. అది నా నోటికి వచ్చును గనుక నేనే పైకి చదివాను.

''జలజాతాసన వాసవాది'' – అనే ముక్కు తిమ్మన్నగారి పారిజాతాపహరణ పద్యానికి నేను రాసిన పేరడీ. ఇక్కడ పేరడీ అంటే అధిక్షేపణ కాదు, అభినందన.

నేను పూర్వ కవుల కొన్ని కొన్ని పద్యాలకు, కీర్తనలకు, సినిమా పాటలకు అనౌచిత్యాలను పరిహరిస్తూ పేరడీలను, విమర్శలను వ్రాస్తున్నాను. కొన్ని మంచి పద్యాలకు ఆధునికాలను వ్రాయాలనే సంకల్పం నాకు చాలా కాలంగా వుంది. ఈ మధ్యనే దానిని కార్య రూపంలో పెట్టడానికి పూనుకున్నాను. అందులోదే ఈ పద్యం కూడ.

నిత్య సత్య పద్యాలు

అయితే, నాలుగు వారాల పాటి మా ఆసుపత్రి అనుభవాలు, పేరడీలను మైనారిటీగా మార్చేసి, నా సొంత అనుభవ పద్యాలను బాగా మెజారిటీగా మార్చేయడం జరిగింది. ఇందుకు పున్నయ్యగారి దైనందిన ప్రోత్సాహం బాగా తోడ్పడింది.

నేను వెల్లకిలా పడుకొని ఉండి, తేనెటీగల్లా ముసురుకుంటున్న అనుభవాలు తేనె బిందువుల వంటి పద్యాలుగా మారుతున్నప్పుడు, కాగితం పైకెత్తి వ్రాయవలసి వచ్చేది. పైకి పట్టుకొని వ్రాస్తే పెన్నులు వ్రాయవు. పెన్సిలుతో వ్రాయవలసి వచ్చేది. వ్రాసిన తరువాత అవి నాకే తెలిసేవి కావు. అట్టి స్థితిలో నాకు సహాయకులుగా ఉండే కుర్రవాళ్ళు తోడ్పడు తూండేవారు. ముఖ్యంగా పాన్నాడ రవిచంద్ర ఎక్కువ ఆసక్తి కనబరచి ఈ పద్యాలన్నిటినీ సావు రాసుకొని, తన మిత్రుల ప్రెస్సులో ఇస్తూ వచ్చాడు. అవి ఎప్పటికప్పుడు ప్రింటు అవుతూ వచ్చాయి.

ఈ గ్రంథాన్ని తాను అంకితం తీసుకోగలననీ ముద్రణ ఖర్చుల విషయంలో బెంగ పెట్టుకోవద్దనీ డా. ఎస్.ఎన్.బూసిగారు అన్నారు. ఆయన సతీసమేతంగా ఆసుపత్రికి వచ్చినప్పుడు ఈ మాట చెప్పారు. ఈ విషయంలో జస్టిస్ పున్నయ్యగారి ప్రయత్నం చాలా వున్నదని పించింది. ఎందుకంటే నా గ్రంథాల ముద్రణ విషయంలో నాకంటే ఎక్కువ ఆసక్తిని పున్నయ్యగారు కొంతకాలంగా కనబరుస్తూ వస్తున్నారు. కనుక చూస్తూ చూస్తూనే ప్రెస్సుకు వెళుతున్న పద్యాలు మితిమీరుతూ వుండటంవల్ల నేనే వాటికి ఒక పరిధిని, ఒక పరిమితిని నిర్ణయించుకోవలసి వచ్చింది. అప్పుడొక పద్యం ఇలా చెప్పాను.

లేదు గతము, భవిష్యత్తు లేదు నాకు
నాకు గల వర్తమానము నాల్గు నెలలు

దీనితో ఈ కావ్య సంపుటి పేరు ''నాల్గు నెలల నా వర్తమానం'' అంటూ మార్చేశాను. భీమన్న పేరడీలు అనే పేరు చిన్నదైపోయి, ఈ పేరే పెద్దదైంది.

దీనితో నా కావ్య పరిధిని జనవరి 18 మొదలు మే 18 వరకు కుదించానన్న మాట. ఈ నాల్గు నెలల వ్యవధిలోని నా జీవితానుభవాలే ఈ గ్రంథంలో వుంటాయన్నమాట. నేను తూలిపడ్డ గాయంతో ఆసుపత్రిలోనూ ఇంటిలోను నేను తీసుకొన్న పూర్తి బెడ్‌రెస్టు కాలం ఇది.

ఇక్కడొక విషయం చెప్పాలి. పద్యాల సంఖ్య పెరిగిపోతున్నదనీ అందులో నెల్లికంటె పాల్లు ఎక్కువవుతున్నదనీ మా ఆవిడ హైమవతి విమర్శించ సాగింది. అప్పుడీ పద్యం చెప్పాను.

ఈ రచన ఇంత పెరిగిన కారణమ్ము
అదను కందిన పోషకాహార బలమె
కన్న వారలు పెంచ లేకున్న గాని
పెంచువా రున్న వారైన పెరగకేమి?

ఇంత ధైర్యంగా ఈ పద్యాన్ని చెప్పగలిగానంటే, అదనుకు పోషకాహారాన్ని అందజేసిన డా.ఎస్.ఎన్.బూసి గారి ఔదార్యమే అందుకు కారణం. అలా పెరుగుతూ వచ్చిందీ గ్రంథం.

నాలుగు నెలల వర్తమానం

ఈ నాలుగు నెలల్లోనూ నా సన్నిహితులు ఎందరో పోయారు. నాకు ఏదో సహాయం చేస్తామని, ఏ తైలమో తెస్తామని వెళ్ళిన వాళ్ళు చాలా మంది తిరిగి రాలేదు. తెలిసిన పాతవాళ్ళు వంచించారు. తెలియని కొత్తవాళ్ళు సహకరించారు. ఎన్నో అనుభవాలు. విచిత్ర సంఘటనలు. ముసలితనం, ఒక సారిగా నాపై విరుచుకు పడ్డట్టైంది. ఇదంతా పద్యాలలో వ్రాయడం అపూర్వం అన్నారు సి.నా.రె. ఆ సమయంలో నాకు వచనం కంటే పద్యాలే ధారాళంగా వచ్చిపడ్డమరి.

నేను నిమ్స్‌లో చేరిన రెండవ రోజునే, జనవరి 28న నన్ను చూడడానికి వచ్చిన డాక్టర్లలో ఒకరు.

''రోజులు బాగులేక పడిపోయారు'' అన్నారు.

''కాదు, రోజులు బాగుండే పడిపోయాను'' అన్నాను. విస్తుపోయారక్కడి వాళ్ళు. ఏది జరిగినా మంచి కోసమే అనుకొనే మనస్తత్వం కలవాణ్ణనీ, నాకు బాధ కలిగినా, మరెవరికైనా మంచి జరిగే వీలుండవచ్చుననీ అన్నాను. నేనక్కడ వున్నన్ని నాళ్ళు ఆసుపత్రి నిర్వహణ లోని లోపాలను ఎత్తి చూపుతూ అభివృద్ధికి సూచనలను చేస్తూ వచ్చాను.

డాక్టర్లలో చాలా మంది నన్నెరిగిన వాళ్ళే. మొత్తం ఆసుపత్రికే ఆపరేటరు అనదగిన వాడు డా. శాంతారామ్. వైద్య శాస్త్రానికి సంబంధించి, ఏ చిన్న విషయం మీదమైనా గంభీరంగా ఉపన్యసించగల సామర్థ్యం గలవాడు. "GOD THE DRUG" అనే నా ఆంగ్ల కవితా గ్రంథాన్ని చదివి ఎంతగానో అభినందించాడు. ప్రతిరోజూ నా వద్దకు వచ్చి పరామర్శించి అనేక విషయాలపై చర్చిస్తూ వుండేవాడు. ఆయన ఆసుపత్రికే ఒక అస్సెట్ అనవచ్చు. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నాకు తరచూ మా చిరకాల మిత్రుడు డా. రఘునందన్ రాజ్ జ్ఞాపకం వచ్చేవాడు. చికిత్సతోపాటు ఆధ్యాత్మికతను చేర్చగలమేధావి ఆయన. ఈ ఆసుపత్రికి నాకు సంబంధించినంతవరకు నాకు నచ్చిన విషయం ముఖ్యమైనదీ ఒకటుంది. నాకేసు బొక్కలకు (ఆర్థోపెడిక్సు) సంబంధించింది. ఎక్సరేలలో కనిపించక పోతే స్కానింగులో కనిపించిందట. వెన్నెముక తుంటి భాగంలోని బొక్క వొంగిపోయిందట. దానికి చికిత్స చేయకపోగా, నన్ను న్యూరాలజీ డాక్టరు కృష్ణారెడ్డిగారి ఆధీనంలో వుంచారు. అలా ఎందుకు చేశారో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. నాది బొక్కల కేసు. ఆయన నరాల డాక్టరు. ఆయన మంచివాడే, గొప్ప డాక్టరే. నన్ను పూర్తి బెడ్ రెస్టులో ఉంచడంకన్నా మరింకేం చెయ్యగలడు? నోరు మూసికొని పడి వుండడం తప్ప నేను మాత్రం చేసేదేముంది?

బొక్కలకు సంబంధించిన జూనియర్ డాక్టరు అంతకుముందు ఒకసారి చూసి వెళ్ళాడు అంతే. నేనేమడిగినా సమాధానం చెప్పిన డాక్టర్లే లేరు. వాళ్ళ సమాధానం ఒక్కటే "Time is your Doctor, Bed Rest is your Treatment" అంతే.

హిప్నాటిజం - గత జన్మలు

నేను ఆసుపత్రిలో చేరిన మూడవ రోజున బెడ్ రెస్టులో పెట్టబడ్డ మొదటి రోజున మరొక రూమ్‌లోకి మారే ప్రయత్నం చేశాను. వి.ఐ.పి. రూములు పది ఉన్నై. ఏ రూమ్ అయినా ఖాళీగా ఉన్నదేమో అని వెతకడానికి వెళ్ళిన ఒక కొత్త మిత్రుడు అడపా గణేశ్ కుమార్, ఒక యువ డాక్టర్ని పట్టుకువచ్చాడు. ఆ డాక్టరు పేరు న్యూటన్. మరేదో మంచి పేరు వుందిగానీ (మోహన వంశీకృష్ణ), న్యూటన్‌గానే ఆయన ప్రసిద్ధి. ఆయనొక మంచి హిప్నాటిస్టు. ఆ తర్వాత నా 'GOD THE DRUG' చదివి, ప్రభావితుడై నాకు ఆత్మీయుడైన వాడు. గత జన్మల గురించి ఆయన చేసిన పరిశోధనలకు నా జవాబు చక్కగా సరిపోయినందువల్ల ఆయన నాకు ఒక శాశ్వత మిత్రుడైనాడు.

వాస్తవ సంఘటనలకు వలెనే కలలను ఆలోచనలను, ఊహలను, ఆశయాలను కూడ మెదడు రికార్డు చేసుకుంటుందనీ, హిప్నోటిజం ద్వారా ట్రాన్సులోకి పంపబడిన వ్యక్తి అట్టి రికార్డులన్నింటిని సొంత అనుభవాలుగానే పేర్కొంటాడనీ నేను వివరించాను. అంతే తప్ప గత జన్మలనేవి లేవనీ, మృత్యువు లయకారకమనీ, లయ తర్వాత మరేమీ ఉండదనీ పేర్కొన్నాను. కొంత చర్చ తరువాత ఆయన నాతో పూర్తిగా ఏకీభవించాడు. ఈ గ్రంథంలోని ''గత జన్మలు'' అనే కవిత అలా పుట్టిందే.

నేను మూడవ నెంబర్ రూము నుంచి 8వ నెంబరు రూమ్‌లోకి మారడానికి డాక్టర్ న్యూటన్ సహాయపడ్డాడు.

నాకు మూడు వారాలలో నయమౌతుందన్నారు. ఆలోగా మరొక ప్రధానమైన స్కానింగు జరిపారు. దాని ఫలితాలు ఏమిటో ఎవరూ చెప్పలేదు.

నిమ్స్ డైరెక్టరు డాక్టర్ కాకర్ల సుబ్బారావుగారు. ఆయన అంతర్జాతీయ ఖ్యాతి గల గొప్ప రేడియాలజిస్టు. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ వుండే గంభీరమూర్తి. ఆయన ప్రతిరోజూ వచ్చి, నా యోగ క్షేమాలు కనుక్కొని వెళ్తుండే వారు. అయినా నాకు ట్రీట్‌మెంటు అనేది ఏమీ జరగలేదు. తాను టూరు వెళ్తున్నాననీ, ఈలోగా ఈ పుస్తకం

చదవమని 'జ్వర తరంగిణి' అనే కావ్యాన్ని యిచ్చారాయన. అది దుత్తా బాబూ రావుగారి రచన. ఒక వ్యాధి చరిత్ర.

ఈలోగా ఒక రోజున అనుకోని విధంగా నాకొక కుమార్తె లభించింది. ఆవిడ పేరు డాక్టర్ రూత్ ఏంజల్. నిమ్స్‌లో సైకియాట్రిస్ట్. తన డ్యూటీ ప్రకారం నన్ను చూడడానికి వచ్చి, క్షణంసేపు నిలబడి చూసి 'అయ్యో డాడీ!' అంటూ నా పక్కన కూర్చుంది. వాళ్ళ డాడీ (తండ్రి) అచ్చం నాలాగే ఉండే వాడట. సఖినేటిపల్లి హైస్కూలులో టీచరుగా పనిచేసాడట. తమది నర్సాపురం అట. అన్ని వివరాలూ చెప్పి, ఇక నుండి నన్ను డాడీ అనే పిలుస్తానన్నది. నాలో అనారోగ్యం ఏదీ లేదన్నది. ఎంతో విజ్ఞత, సమయజ్ఞతతో కూడిన పరమౌషధీయ సంభాషణతో నన్నెంతో ఉత్తేజపరిచింది. ఉపశమనం కలిగించింది. తరువాత ప్రతి రోజూ వచ్చేది. నేను యింటికి వచ్చిన తదుపరి కూడ ఫోనులో పరామర్శిస్తున్నది. ఒకసారి వచ్చి చూచి వెళ్ళింది. నిమ్స్‌లో ఉపయోగకరమైందేదీ జరక్కపోయినా, అక్కడ నాకు లభించిన అపూర్వ రత్నాలు రెండు. ఒకరు డాక్టరు న్యూటన్, మరొకరు డాక్టర్ ఏంజల్.

''మీ మనస్సును వెల్డింగ్ నీడిల్‌గా మార్చుకోగలిగితే దానితో దెబ్బ తిన్న మీ తుంటి ఎముకలను వెల్డింగు చేసేయ్యవచ్చు కదా!'' అన్నారు డా. న్యూటన్ లోగడ ఒకసారి నాతో మాట్లాడుతూ.

అప్పుడు నేనన్నాను...

''డాక్టరు గారు! నా మనస్సు సంగతి మీకు తెలియదు. అది నా మాట అస్సలు వినదు. నాకు ఊహతెలిసినప్పటి నుంచి ఏకాగ్రత కోసం నేను చెయ్యని ప్రయత్నాలు లేవు. చెయ్యని ప్రయోగాలు లేవు. అయినా సాధ్యం కాలేదు. అది నా మాట ఎప్పుడూ వినలేదు. దానిని కుక్కను, గొర్రెను, గాడిదను మొదలైన సాధు జంతువులనువలె

మచ్చిక చేసుకోవాలను కున్నాను. కనీసం పంజరంలో, బోనులో పెట్టి బంధించాలను కున్నాను. లాభం లేకపోయింది. అదెప్పుడూ అడవి మృగం లాగే ఇష్టం వచ్చినట్టు లోకాలోకాలన్నీ తిరుగుతూ వుంటుంది. ఏవేవో రకరకాల వూహా మధువుల్ని తెచ్చి నా మస్కిమ్మ్‌లో కూడబెడుతుంది. అందులో నుండి కొంచెం కొంచెంగా సంగ్రహిస్తున్నట్టివే ఈ కావ్యాలు.

అందువల్లనే నా మనస్సు వివనందుకు నేనెప్పుడూ విచారపడలేదు. అందుకే నేనెప్పుడు ఒక పరికరంగా వాడుకోడానికి ప్రయత్నించలేదు. ''అది నా నౌకరు కాదు''.

''మీరు హిప్నటిస్టు కదా! ఆ పని మీరు చెయ్యవచ్చు'' అన్నాను.

''అందుకు మీరు సహకరించాలి కదా'' అన్నాడు ఆయన.

''నేను అంటే నా మనస్సే కదా'' అన్నాను నేను.

నన్ను తన డాడిగా దత్తత చేసుకొన్న డా. రూత్ ఏంజల్ ఒకసారి అన్నది – మానవ మస్తిష్కంలో నాలుగు భాగాలుంటాయట. 1. Thinking, 2. Feeling, 3. Behaviour, 4. Cognition.

మొదటి మూడూ సాధారణ మైనట్టివి. మొత్తం మీద మానవులందరూ ఆ మూడు స్థాయిలలోనే తమ జీవితాలను గడుపుకొంటూ వుంటారు. నాలుగవది మహా మేధావుల, ప్రవక్తల స్థాయి. ''మీరు ఆ స్థాయిలోని వారు, డాడీ!'' అన్నది.

ఇటువంటివన్నీ ఎప్పుడెప్పుడో, ఎక్కడెక్కడో నేను చదువుతూ వస్తున్నట్టివే. అయితే ఈ వాస్తవాన్ని నేను అతి సన్నిహితంగా అనుభూతి పొందింది, నాకు నిమ్స్‌లో దొరికిన ఈ పెద్దమ్మాయి నా మీద చేయివేసి చెబుతున్నప్పుడే.

బెడ్ రెష్టులో నాలుగు వారాల వరకూ చూసి, చికిత్స అనేది ఏమీ లేకపోవడంవల్ల తుంటిలోని గాయం మానకపోవడంవల్ల అదేవిధమైన బెడ్ రెష్ట యింటిలో కూడ

తీసుకోవచ్చన్న వాస్తవాన్ని గుర్తించి నాలుగు వారాల అనంతరం నిమ్స్ నుంచి యింటికి వచ్చేసాను. జనవరి 27న ఇంటి నుంచి అంబులెన్సులో కూర్చుని వెళ్ళాను. ఫిబ్రవరి 23న నిమ్స్ నుంచి ఇంటికి అదే అంబులెన్సులో స్ట్రెక్చర్ మీద పడుకొని వచ్చాను. ఆసుపత్రిలో ఉండగా అక్కడ నాకు సన్నిహితులైన అనేక మందికి, నిత్యమూ నన్ను చూడటానికి వచ్చిన అనేక మందికి, నాకు సేవలందించిన అనేక మందికి నేను సర్వదా కృతజ్ఞుడ్ని. అందులో కొందరి గురించి పద్యాలు కూడ రాశాను. వాటిని ఈ గ్రంథంలో చూడవచ్చు. వ్యక్తుల గురించి మంచిగా చెప్పవలసిన విషయాలున్నప్పుడే వారి పేర్లు రాస్తాను. చెడును జ్ఞాపకం పెట్టుకోను.

ఇంటికి వచ్చిన తర్వాత కూడా అదే పూర్తి బెడ్‌రెస్టు మరొక ఆరువారాల పాటు కొనసాగించాను. ఆసుపత్రిలో రవిచంద్ర, నర్సులూ, ఆయాలూ, వార్డుబోయ్‌లూ చేస్తూ ఉండిన సేవలన్నీ యింటి దగ్గర మా ఆవిడ హైమవతి, మా అమ్మాయి పల్లవీ చేస్తూవచ్చారు. ఈ గ్రంథంలోని అనేక పద్యాలు వాళ్ళ నుంచి కలిగిన అనుభవయోగాలే.

ఇంటికి వచ్చిన తరువాత బెడ్‌రెస్టును పాటిస్తూనే పద్యాలు రాస్తూనే చిరకాల మిత్రులు డాక్టర్ మిత్రాగారితో ఆక్యుపంచర్ చేయించాను. ఆయన సహజంగా దేనినీ సీరియస్‌గా తీసుకోడు. లేచి కూర్చోమన్నాడు, నడిచెయ్యమన్నాడు. కంప్రెషన్ తప్ప మరేమీ లేదన్నాడు. ఆయన సూచనలు నేనంతగా పట్టించుకోలేదు గాని లేచి కూర్చున్నాను. క్రమంగా నిలబడ్డాను. కొద్ది కొద్దిగా నడవసాగాను. గాయము నొప్పి అలాగే వుంది. అయినా ఇంట్లోనే నడవగలుగుతున్నాను. నా పనులు నేను స్వయంగా చేసుకుంటున్నాను.

జనవరి 18 నుండి మే 18 వరకు నాల్గు నెలల నా బెడ్ రెస్టు జీవితాన్ని ఒక చట్రంలో బిగించి, ఈ గ్రంథంలోని అనుభవాలను ఆ నాలుగు నెలలకే పరిమితం చేసాను. ''నాల్గు నెలల నా వర్తమానం'' అనే శీర్షికను ఈ గ్రంథానికి పెట్టాలనుకున్నాను.

అయితే చివరి నిముషంలో ఆ శీర్షికను కొట్టేసి

''చివరి మెట్టు మీది శివుడు'' అనే శీర్షికతో ఇప్పుడీ గ్రంథాన్ని ప్రకటిస్తున్నాను.

ఆది జాంబవుడు

''భారత జాతికి జాతీయ ఆధ్యాత్మిక సంపదనంతా ఇచ్చినవాడు, వేద విభజన చేసినవాడు, అష్టాదశ పురాణాలను, ఉపనిషత్తులను, వ్రాసి జాతిని ఉత్తేజ పరచినవాడూ అయిన వేద వ్యాసుడు, ఈ పెద్ద మాదిగ వాడే కదా'' అని మీరు రాగ వాశిష్టం నాటకం పీఠికలో వ్రాసారంట. ఆ పెద్ద మాదిగ వాడే ఆది జాంబవుడు, అతడే చిందు కళకు మూల పురుషుడు, సంగీతానికి ఆది పురుషుడు, అతని గురించే ఇప్పుడు పరిశోధనకు పూనుకొన్నాం.'' అంటూ చెప్పుకుపోయాడు అందెశ్రీ మొన్న నన్ను చూడటానికి వచ్చి.

అందెశ్రీ గొప్ప భావుకుడు, వాగ్గేయకారుడు. ఎంత గొప్పగా వ్రాస్తాడో అంత ఉన్నత సంగీత సరళిలో పాడతాడు. రెండు పాటలు పాడాడు. పంచభూతాలు గురించిన పాట, గద్దరు గురించిన పాట నన్ను ముగ్ధుడ్ని చేశాయి.

ఈ గ్రంథములోని ఎవడు దళితుడు అనే నా పాటలో ఆది జాంబవుడెవ్వడు అనే ప్రశ్న కూడా ఉన్నది. మతంగుడు, ధర్మవ్యాధుడు ఈ ఇద్దరూ హరిజనులకు మూలపురుష లన్న నా ఉద్దేశ్యాన్ని రాగ వాశిష్టంలోను, జన్మాంతర వైరం కావ్యంలోను నేను విపులంగా చెప్పి ఉన్నాను.

ఆది జాంబవుడి గురించి నేను ఆలోచించలేదు. ఆది జాంబవ పురాణం అనేది ఒకటి ఉన్నదని, ఒక ప్రత్యేక కులం కథకులు ఆ పురాణాన్ని రకరకాల జానపద బాణీలలో చెపుతూ ఉంటారని ఎంతో మంది మిత్రులు చెప్పగా విన్నాను. చిందు ప్రదర్శనను కూడా నేను చూడలేదు. అట్టి అవకాశం నాకు కలుగలేదు.

అందెశ్రీ వెళ్లిపోయిన తరువాత నక్కా అమ్మయ్య వచ్చాడు. చిందు గురించి తనకు తెలుసునన్నాడు.

''చిన్నకత్తి పెద్దకత్తి నాదేనయ్యా
చిందేసే మాదిగోడ్ని నేనేనయ్యా''

అంటూ ఈ చిందు ప్రదర్శనను ఎంతో మధుర మనోహరంగా సాగిస్తారట. నక్కా అమ్మయ్య అందమైన పద్యాలు రాసే కవి. తాను వచ్చినప్పుడల్లా ఇలాంటి సాంస్కృతిక విషయాలేవో చర్చిస్తూ ఉంటాము. చిందు కళలో మాదిగలు ప్రవీణులైతే

నేత కళలో మాలలు ప్రసిద్ధులని, ''సాలినేత పలచన, మాలనేత చిక్కన'' అనే సామెత ఉందని నక్కా అమ్మయ్య అన్నాడు.

భారతదేశానికి భాగవత కాలంనాటి పేరు అజనాభం అయితే, అంతకు పూర్వముండే పేరు జంబూ ద్వీపం. జంబూద్వీపంలో వుండే వారు జాంబవులు. జాంబవులు అంటే భారతీయులన్నమాట. మనకు రామాయణ కాలం నాడు జాంబవంతుని గురించి, మహా భారత కాలం నాడు జాంబవతి గురించి తెలుసు. జాంబవ జాతి గురించి వేదాలలోను, సంస్కృత గ్రంథాలలోను ఏమైనా వున్నదేమో తెలియదు. ఈ విషయంలో పరిశోధనలు జరిగినట్లు కూడా తెలియదు. భారతజాతి గత చరిత్రను గురించి పట్టించుకున్నవాడు లేడు. ఇప్పుడు పట్టించుకుంటున్నవాళ్లూ లేరు.

మొదటి అస్పృశ్యుడు చెండుడు మతంగుడు అనే సత్యాన్ని వాల్మీకి, వ్యాసుడు బయట పెట్టినప్పటి నుంచి అస్పృశ్యులలో తెలివైన వాళ్లు తమ మూలపురుషుల్ని గురించి ఆలోచిం చటం మొదలుపెట్టినట్టున్నారు. తాము జాంబవజాతి వాళ్లు కనుక, అస్పృశ్యత అప్పటి నుంచీ వున్నదేమోననుకొని, తాము ఆది జాంబవులం అనుకున్నారు. ఈనాటి ఆది ఆంధ్ర, ఆది హిందు పేర్ల వంటిదే బహుశా ఆది జాంబవ కూడా కావచ్చు. ఇది నా ఊహ మాత్రమే. వాస్తవాలపై ఆధారపడినట్టిది.

భరత మహా చక్రవర్తి పాలించిన భూమి కనుక భారత భూమి అయింది. అనాది నుంచి ఈ భూమి పేరు జంబు, ఈ జాతి పేరు జాంబవజాతి, ప్రజలు జాంబవులు. ఇంత వరకు నిర్వివాదమే.

నా పరిశోధన ప్రకారం హిమాలయ ప్రాంతవాసియైన శివుడు హరిజనుడే, శివుడే ఆది జాంబవుడంటున్నారు కొందరు మిత్రులు. చిందు నృత్యానికి మూలపురుషుడు శివుడే కదా! అంటే, ''చిందేసే మాదిగోడ్ని నేనే కదా''! అనే గేయపాదం సత్యమే చెబుతుందన్నమాట.

శివుడు గిరిజన కన్యను (పార్వతిని) పెండ్లాడటం మతంగ ధర్మవ్యాధుల వియ్యానికి సాంప్రదాయకంగానే వున్నది కూడా! ఈ విషయంలో నిశితమైన పరిశోధన జరగవలసి వుంది.

అంకితం గురించి

1969లో హరిజనోద్ధరణ కోసం దిట్టమైన యువకులకు ఒక (Militant Organisation) అవసరం అన్న భావనతో ''భీమసేన''ను ఏర్పాటు చేసాము. ఈ ఏర్పాటు చెయ్యడంలో ప్రముఖుడూ, ఈ సేనకు నన్ను సేనాధిపతిగా చేసిన వాడూ, మిత్రుడు యమ్.యన్.బూసి. అంటే బూసి మాచరయ్య. టెలిఫోన్స్ శాఖలో ఒక అధికారిగా ఉంటూ, దానికి రిజైను చేసి పూర్తిగా సాంఘిక సేవకు జీవితాన్ని అంకితం చేసుకున్నవాడాయన. ఆనాటి నుంచీ, మధ్య మధ్య ఎన్నో ఎడబాట్లు ఏర్పడినా, యమ్.యన్.బూసితో నా మైత్రి కొనసాగుతూనే వచ్చింది. వాళ్ళ ఇంటి పేరు బూసి. ఈ బూసి అనేది ''భూషి'' అనే పదానికి తెలుగై ఉంటుందని, అందుచేత భూషి అనే వ్రాసుకోమని నేను తరచూ చెపుతూ ఉండేవాడిని. సందర్భం వచ్చినపుడు నా గ్రంథాలలో భూషి అనే వ్రాసేవాడిని. ఇప్పటికీ అలానే వ్రాస్తున్నాను కూడా.

ఈ యమ్.యన్.బూసి గారి తమ్ముడే, ఈ గ్రంథాన్ని అంకితం తీసుకుంటున్న సాహితీ పోషకుడు ఈ Dr. S.N.Busi. వీరు నలుగురు సోదరులు. సత్యం, గన్నెయ్య, మాచరయ్య, సుభామణి. పేరుతోపాటు తండ్రి పేరును కూడా చేర్చుకునే సాంప్రదాయాన్ని అనుసరించి ఈ నలుగురు సోదరులు తమ పేర్లకు తండ్రిగారు పేరు చేర్చుకుని, ఇంటి పేరును చివర ఉంచుకుని వ్రాసుకుంటూ వుంటారు.

వీరి తండ్రిగారు నాగన్నగారు, తల్లిగారు చిత్తమ్మగారు. ఈ దంపతులు నలుగురు కొడుకులను విద్యావంతుల్ని చేయడానికి అన్ని కష్టాలను భరించి సఫలీ కృతులైన వారు. అందులో అత్యున్నత శిఖరాలకు ఎదిగినవాడు మన డా. సుభామణి నాగన్న బూసి.

పినమళ్ళ గ్రామం గౌతమీ గోదావరికి ఎడమ గట్టున ఆలమూరు మండలంలో ఉంది. ధవళేశ్వరం వద్ద గౌతమి గాను, వశిష్టగాను, చీలిపోయిన గోదావరి మీద రెండు వంతెనలు కట్టబడ్డాయి. ఆలమూరు నుంచి రావులపాలెం వరకు గౌతమి మీద నిర్మించబడ్డ వంతెనలివి. గౌతమి ఎడమ తీరంలోనే ద్రాక్షారామం, కోటిపల్లి ఉన్నవి. ఈ గౌతమి యానాం దగ్గర సముద్రంలో కలుస్తుంది.

గోదావరి కాలువలు ప్రవహించినంత మేర గోదావరి డెల్టాగానే చెప్పుకొంటారు.

కోనసీమ సెంట్రల్ డెల్టా అయితే ఈ గౌతమి ఎడమవైపు అంతా తూర్పు డెల్టా. అందుకే వివరాలలోకి పోకుండా పినపళ్ళను కోనసీమగా పేర్కొన్నాను. మొత్తం మీద ఆ ప్రాంతం అంతా పూర్వ కాలంలో ఋషి వాటికలతోను మునిపల్లెలతోను నిండి ఉండేది. అగస్త్యుడు, వేదవ్యాసుడు మొదలైన పూర్వ ఋషులు తమ వృద్ధాప్యాన్ని ఈ ప్రాంతంలోనే గడిపి ఇక్కడే నిర్యాణం చెందారు.

అంతటి పవిత్ర భూమిలో పుట్టిన మేధావి, విద్యావేత్త, వదాన్యుడు, ప్రజాసేవాతత్పరుడు, ఈ కృతి భర్త డా. ఎస్.ఎన్.బూసి.

ఒక పద్యానికి కథ

ఈ కావ్య సంపుటిలోగల మూడు వందల తొమ్మిది పద్యాలకూ, గేయాలకు ఒకొక్క కథ వుంది. పద్యానికొక కథ చొప్పున అన్ని కథలు వ్రాయవచ్చు. ఉదాహరణకు ఒక్కటి మాత్రం చెబుతాను.

ఈ గ్రంథం ముద్రణ ముగింపుకు వచ్చిన తరుణంలో, ఒక రోజున జస్టిస్ పున్నయ్యగారడిగారు ''మన డెమోక్రసీ గురించి ఏమన్నా వ్రాశారా?'' అని. ''వ్రాసే వుంటాను. జ్ఞాపకం లేదు'' అన్నాను నేను. ''జ్ఞాపకం లేదంటున్నారు. ఎందుకైనా మంచిది మరొక పద్యం వ్రాయవచ్చు కదా?'' అన్నారాయన.

ఆ రాత్రి నిద్రాలేని, మెలకువా లేని మగతతో ఆలోచిస్తూండగా, నా ఆలోచనలలో సడన్‌గా ఒక పద్యం వచ్చి చిక్కుకుంది. అదే ఇది.

కుక్కలు చింపిన విస్తరి,
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా, మిగిలిన
బొక్క నుమీ జాతి ఈ డెమోక్రసి లోనన్

పద్యం స్పష్టంగా వుంది కనుక మరిచిపోవడం జరగదు.

బ్రహ్మలోకంలో వీణ శబ్దించగా సరస్వతి అందుకుని వేళ్ళు కదపసాగింది. ఒక్క క్షణం తర్వాత ఫకాలున నవ్వింది. బ్రహ్మ తక్కిన మూడు ముఖాలూ సరస్వతికేసి తిప్పి ''ఏమిటి కథ?'' అన్నాడు.

''మనవాడు భలే పద్యం వ్రాశాడండీ'' అంది. ఈ పద్యం వీణ మీద పలికించి వినిపించింది. బ్రహ్మ ముఖాలు గంభీరంగా మారిపోయాయి. వీణ విశ్వమంతా వినిపించింది.

''కుక్కలు చింపిన విస్తరి'' అనే మాటకు అక్కడ విష్ణువు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. విస్తరికి అధిపతి కదా ఆయన? దానిని కుక్కలు చింపాయా?

''ఏనాడో చింపాయి, ఇంకా చింపుతూనే వున్నాయి, మీరు నిద్రపోతూనే వున్నారు'' అన్నది లక్ష్మి.

''నక్కల పాలైన నంది'' అన్న మాటకు గభాలున లేచి నిలబడ్డాడు శివుడు. పక్కనున్న నంది మీద చేయివేసి నిమిరాడు. హాస్య ముఖం పెట్టింది పార్వతి. మెలకువ వచ్చి నేను లేచి కూర్చున్నాను.

ఒక్క భారతదేశంలోనే కాదు, మొత్తం భూ ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ డెమొక్రసీ లన్నీ ఇలానే వున్నై. రాజరికాల కంటే, నియంతృత్వాల కంటే కూడా డెమొక్రసీలు ఘోరంగా వున్నై. త్రిమూర్తులు జాగరూకులయ్యారు మరి! మానవ పరిపాలనా వ్యవస్థలో మార్పేదైనా వస్తుందేమో వేచి చూద్దాం.

సాహిత్య పోషకులకును,
సాహిత్యోపాసకులకు, సాహిత్య కళా
స్నేహితులకు, కే ల్మోడ్తును!
శ్రీ హితముగ విరిసి జగము శ్రేయస్కృతిగా!

❋ ❋ ❋

1

మన అమ్మ

అమ్మలగన్న యమ్మ, ముగు
రమ్మల మూలపుటమ్మ, చాల పె
ద్దమ్మ, సురా సుర ప్రకృతి
కంతకు జీవఘనమ్మ, తన్ను లో
నమ్మిన లోకులందరి ము
నమ్ముల నేలెడి యమ్మ, దుర్గ మా
యమ్మ యొసంగు మాకు విజ
యమ్ము, యశమ్ము, శుభమ్ము, సౌఖ్యముల్ !

(పోతన్నగారి పద్యానికి)

2. భారతీ

శ్రుతి నీవు, ధ్రుతి నీవు
భ్రుతి నీవు భారతీ!
స్థితి నీవు, నా సదా
స్మృతి నీవు భారతీ! ॥శ్రు॥

ఏ పలుకు పలికినా
నీ నామ కరణమే
చెవి కేది సోకినా
నీ హృదయ నాదమే ॥శ్రు॥

ప్రకృతి పురుషైక సం
స్కృతి నీవు భారతీ!
నాకృతులలో నమ
స్కృతి నీవు భారతీ! ॥శ్రు॥

నను బోయి ఫ్రెండనుచు
నవ జనత కందించి
అమృతు చేసిన తల్లి, భారతీ!
నా బాష్పజలముతో
నీ పాదకమలాలు
కడిగి పూజించేను భారతీ! ॥శ్రు॥

(బోయిఫ్రెండు = Boy Friend,
శ్రుతిలయలలోని పాటకు)

3. కాలక్షేప బఠాణీలు

నా పేరడీలు కాల
క్షేప బఠాణీలు, ఇవియె చివరివి, ఇక మీ
కీ పంటవి దొరకవు, ఇవి
గో పట్టుడు, నములు కొలది క్రొంజవులూరన్!

4. రొయ్య మీసాలు

ఇయ్యను ఇప్పించను గల
అయ్యకు మీసమ్ములేల, అస్మిత చాలున్;
రొయ్యకె కావలె మీసము
కయ్యమునకు కాలుద్రువ్వ; కవి చౌడప్పా!

5. వలపుల వలలు

తొలి వలపులమృత మధువులు
కల బోసిన కళలు, కలలు, కలహంసలు; ఆ
వల వలలు, గాలి వానలు,
అలకలు, పంచాయితీలు, అమవశ నిశలున్!

6. భక్తుల పీడ

ఓ ప్రభూ! నీ కృపాంబోధి నోల లాడ
ఉరుకు చున్నది మనసు తా నోప లేక,
అభయ హస్తము సాచినన్నాదు కోవె
సంకట వినాశ! తిరుపతి వెంకటేశ!

ఇదయ్యా, భక్తుడి ఆకాంక్ష!
ప్రతి భక్తుడి ఆకాంక్షా ఇదే!
ఒంటరిగా నీ నుండి విడిపోయాడు
ఒంటరి గానే నిన్ను తిరిగి పొందాలంటాడు!

ఎవడి భక్తి వాడిది
ఎవడి కోరికలు వాడివి
ఎవడి దారి వాడిది
ఎవడి సుఖం వాడిది!

వ్యక్తిగా ఎవడికి వాడే
ఉమ్మడిగా అందరూ నీ అతిథులే!
నీ ఇంట తింటూ నిన్ను విమర్శిస్తారు
వంకలు పెడతారు
డొంకలు కదుపుతారు

నీవే స్వయంగా వడ్డించాలని
ప్రతి అతిథీ ఆశిస్తాడు!
ముఖానికి బొట్టు పెడతారు
వీపున బురద చల్లుతారు!

భార్యల నేలుకోవడం నీకు చేతకాదన్నట్టు
ఏ భార్యనెలా చూచుకోవాలో
నీకు బోధిస్తాడు ఒక మహాకవి!
ఎలాంటి సమయంలో మీ ఆవిడ
నీకు తమను గూర్చి సిఫారసు చేయాలో
ఆమెకు సూచిస్తారామె భక్తులు!

కింద ఆమె భక్తులు
పైన నీ భక్తులు
మధ్యలో ఏడుకొండలు!
ఎక్కలే నంటున్న దెవరో చూడు!
ఎత్తుకో, చేసేదేముంది!

7. రేసులకు పోతావా

రేసులకు పోతావా కిట్టమ్మా ? ఆ
రేసు వార్తలేమి ? కిట్టమ్మా !
పోయే టప్పుడు పర్సు పుల్లు, తిరిగి
వచ్చేటప్పుడు పైన నిల్లు!

అంతా గుర్రాలే తింటాయా ? మనకు
అంతో ఇంతో పంచి యీవా ?
అదృష్ట వంతు లుంటారు, వాళ్ళు
హల్వా పుల్వాలు తింటారు !

పోగొట్టు కుంటావా, కిట్టమ్మా ? పైస
పోతే యేడుపు రాదా ? కిట్టమ్మా !
పోతే పోనీ ముండ పైస, పసిడి
కొండె వస్తుందన్న ఆశ !

(కంచికి పోతావా అనే సినిమా పాటకు)

8. ఎవ్వడు దళితుడు

ఎవ్వడమ్మా దళితుడు ?
ఎందులోన దళితుడు ? ॥ఎ ॥

వేద విభజన చేసెనొకడు
రామ చరితము వ్రాసెనొకడు
మాన వేంద్రునె కొనియె నొకడు
ఇంద్ర సుతు భీ కొట్టె నొకడు ॥ఎ ॥

శంకరుని కద్వైత మొసగిన
చండ దేవుడు దళితుడా ?
స్వరములకు రూపము ఘటించిన
హరిజ నాఖ్యుడు దళితుడా ? ॥ఎ ॥

విశ్వజననికె జనకుడై, తన
వీణ నిడిన మతంగుడెవ్వడు ?
ఆది జాంబవుడెవ్వడు ?
వేద కారకుడెవ్వడు ? ॥ఎ ॥

భారతకు రాజ్యంగ మిచ్చిన
బాబా సాహెబు దళితుడా ?
కె. ఆర్. నారాయణ దళితుడా !
బాలయోగి దళితుడా ? ॥ఎ ॥

(ఎక్కడమ్మా చంద్రుడు అనే సినిమా పాటకు)

9. పత్నీ ధర్మం

జల జాతాసన వాసవాది సుర భో
జ్యం బై మజా గొల్పు సో
మ లతా సారము గ్రోలి, చాలక గుడం
బా త్రాగి ఇల్జేర - రో
కలి బండన్ గొని మొత్తె పత్ని, అదె ని
క్కంబైన ధర్మంబు ! మూ
ర్ఖులు దుష్కర్మలు చేయ ఊరక సతుల్
కూర్చుందురే ఏడ్చుచున్ ?

(పారిజాతాపహరణం లోని పద్యానికి)

10. కారే మంత్రులు

కారే మంత్రులు ? కార్లనున్ కలుగవే ?
గర్వోన్నతిన్ చెందరే ?
వా రేరీ ? సిరి మూట కట్టుకొని పో
వన్ జాలిరే ? భూమిపై
పేరున్ కల్గెనె ? ధీమతుల్ గాంధి అం
బేడ్కర్‌లు జాత్యర్థమై
ఈరే ప్రాణము ? ఏల చేకొనవు వా
రిన్ జంట దీపాలుగా ?

(పోతన గారి పద్యానికి)

11. ఉప్పు కప్పురంబు

ఉప్పు కప్పురంబు ఉపయోగకరములే,
పుణ్య పాపములతొ పోల్చ లేదు !
జనత గుడ్డిదైన జను షండుడే నేత !
విశ్వసత్య మెరుగ వేమి, వేమ !

12. రామ చంద్రా

తిరుమాల కుల తిలకా
తెరువేదో తెలపావా ? రామ చంద్రా !
బ్రతుకంతా జెయిలేనా
బెయిలైనా దొరికేనా ? రామ చంద్రా ॥ తి ॥

యెంకి పిల్లకు తెస్తే
యెండీ వడ్డాణమ్మూ, రామ చంద్రా !
వడ్డాణముకు పట్టె
నొక యేడు చెరసాల, రామ చంద్రా ! ॥ తి ॥

రాములమ్మకు తెస్తే
రతనాల హారమ్ము, రామ చంద్రా
హారమ్మునకు పట్టె
ఆరేండ్ల చెరసాల, రామ చంద్రా ! ॥ తి ॥

ఎన్నో కొంపలు దోచి
కొన్నాను కద జీపు ? రామ చంద్రా ! ఆ
జీపే కదా మనకు
పిర్జీని చూపింది ? రామ చంద్రా ! ॥తి॥

అన్నపూర్ణలో మొన్న
డిన్నరిచ్చిన దెవరు ? రామ చంద్రా ! భద్రా
చల రామదా సతడె
సర్వ సమతావాది, రామ చంద్రా! ॥తి॥

సీట్లమ్ముకొని కాదె
కోట్ల కెత్తితి జెండా ? రామ చంద్రా! ఆ
జెండాయె అధికార
దండాము మన కిచ్చే ? రామ చంద్రా! ॥తి॥

(రామదాను కీర్తనకు)

13. కనక సింహాసనాలు

కనకపు సింహాసనములు
శునకమ్ముల కేల ? ఏల శుభ లగ్నములున్ ?
గుణములు జాతి పరమ్ములు,
కనకమ్ములు కావు, తిండి కావలె సుమతీ!

14. బాల రసాల సాల

బాల రసాల సాల నవ
పల్లవ కోమల కన్యకా మణిన్
కూళల కైన నిచ్చి ఒక
కొంపకు చేర్చుట నీతి, కానిచో
బాలిక లక్ష్య నైపుణుల
బట్టి కొనన్ వలె నిష్ట విద్యలన్!
హాలికులన్ మనుష్య లప
హాస్యము దోషము, పోతన ప్రభూ!

(పోతన గారి పద్యానికి)

15. తుది బాల్యం

ఒడలు తెలియకుండ వెడలె శైశవ మెల్ల,
తెలివి వచ్చు సరికి తెల్లవారె!
ఎట్లు గడచు ఇపుడు ఈ తుది బాల్యమ్ము!
కలదు గాని తెలివి, కదల దొడలు!

(ఆస్పత్రి బెడ్ మీద నుంచి)

16. జిరాక్సు యంత్రం

పికములు పాడు నన్న అది
పేరడి, తారక లెల్ల చంద్ర నా
యిక లన పేరడీ, ర వుద
యించుట పేరడి, మంచు బొట్లు మౌ
క్తికము లనంగ పేరడి, ప్ర
తీ కృతియున్ ఒక పేరడీయె ఈ
ప్రకృతికి; సృష్టియే ఒక జి
రాక్సు మెషీను, హసేను సాగరా ?

17. పంది బురద

పంది బురద మెచ్చు, నంది పచ్చిక మెచ్చు
పిల్లి ఎలుక మెచ్చు ప్రీతి తోడ,
జీవ నైజ మెరిగి చెప్పాలి కవితలు
చిలుక పలుకు కేమి విలువ ? వేమ!

18. కళంకిత అన్నారా ?

కళంకిత అన్నారా, నిన్ను ?
గాయపరుస్తున్నారా ?
గవ్వ విలువ చేయని పలుగాకులు ?
పువ్వుల నెరుగని గుడ్లగూబలు ? ॥క॥

కళంకిత అన్నారా
కాని మనుషు లున్నారా ?
పంకజాలయను కొలిచే వాళ్ళు
పరభృతముల కొనియాడే వాళ్ళు ॥క॥

అంజనేయుని అవ్వ యెవ్వరు ?
అవనీ జాతకు అమ్మ యెవ్వరు ?
భరతమాత గాంధర్విణి కాదా
సెక్యులరు లో శీలము కలదా ? ॥క॥

భూదేవికి మాలిన్యము లేదా
బురదయె లేని బీచి కలుగునా ?
కౌరవ పాండవ వంశ మెట్టిది ?
కురుక్షేత్రమున ధర్మ మెట్టిది ? ॥క॥

(ఈ టీవీలో ఒక పాటకు)

19. ఎందరో మహా నృశంసులు

ఎందరో మహా నృశంసులు
అందరికీ వందనాలు !
స్వాతంత్ర్యానంతర ప్ర
జా స్వామిక రాజ్యంలో ॥ ఎం ॥

వేదావని పుట్టినాము
విద్యలేవో నేర్చినాము,
కూడు కోసమే యేమో
పాడుకుంటూ బ్రతికేము,
మా జోలికి రావల దని
మనవి చేయుచున్నాము ॥ ఎం ॥

ఆట పన్ను, పాట పన్ను
అమ్మ పన్ను, కొన్న పన్ను
మింగ మెతుకు లేని మాకు
మీ కీయగ ఏమున్నది ?
మా ప్రార్థన మన్నించి
మా జోలికి రాకండి ॥ ఎం ॥

(త్యాగరాజు కృతికి)

20. వందే మీ తరం

వందే మీ తరం
మందే ఈ తరం!

దాస్య భారతం మీ తరం
స్వతంత్ర భారత్ మా తరం
సుజలాం సుఫలాం మీ తరం
విఫలాం విరసాం మా తరం ॥వం॥

ధూమ జ్యోత్స్నా కలుషిత యామినీం
దోమల బాధా పీడిత జీవనీం
క్షుధార్తినీం స్వకుక్షి మాత్రిణీం
రౌడీం గూండాం దోపిడీం మా తరం ॥వం॥

నూరు కోట్ల దుర్వీర్య మూర్ఖ దుర్బలే
కోటి కోట్ల రూపాయలు స్వాహా దుర్వ్యయే
మెరిట్ నిషేధే క్రెడిట్ నిషాదే
అసమర్థ నర నారీ మాతే గత ఖ్యాతే మా తరం ॥వం॥

21. నీ కొండను నీవే

నీ కొండను నీవే రక్షించుకో
నీ హుండీ నీవే లెక్కించుకో
ఓ తిరుమల వెంకటేశ, ఓ శ్రీనివాస,
నీ గంటను నీవె వాయించుకో ॥నీ॥

నీ కొండకె గుండు కొట్టు
పుండాకోర్లున్నారు,
నీ పైసలు కాజేసే
టోపీ దొర లున్నారు,
అమాయకుని జేసి నిన్ను
విమాన మెక్కిస్తారు ॥నీ॥

ఆపద మొక్కులతో నీ
అప్పు తీర దెన్నటికీ
నల్లధనం పాతరలను
పెల్లగించుకోవలెను
సాటి దొరల కోరికలను
సాయ ముంచుకో ॥నీ॥

కార్లలో వచ్చే దొరలకు
కావలసిన పను లుంటై,
మా దేమిటిలే - క్యూలో
చీదేసిన బీదోళ్ళం,

దొడ్డి తలుపు తెరచి యుంచి
దుడ్డు తీసుకో! ॥నీ॥

కోశాలను నింపుకొనే
దేశభక్తు లున్నారు,
వచ్చిన దాంట్లో నీకూ
వాటా ఇస్తుంటారు
అస్పృశ్యం కాదు డబ్బు
అంది పుచ్చుకో, నీ
మూసుకొన్న కను లట్లే
మూసి ఉంచుకో కాని
క్రీగంటను అపుడప్పుడు
క్రింద చూచుకో! ॥నీ॥

ఒంటి గంట దాటినా
ఒదలరు నిను భక్త జనులు
అంతలోనే సుప్రభాత
ముత్తిప్మా అంటుంది!
నిలబడియే నిద్రిస్తూ
నీ భక్తుల కరుణిస్తూ
శ్రీ కరుణా స్వర్ణధార
చిరకాలం మాకిస్తూ ॥నీ॥

(నీకొండకు నీవే రక్షించుకో-అనే పాటకు)

22. చదువు లెందుకు

చదువు కొన్నవాడ వనీ
పొగరు చూపకు !
పదవు లొసగు పైస లేని
చదువు లెందుకు ?

పైస లున్న వాడ వని
పైత్యకారి కాకు!
ప్రజ్ఞ ఒక్క టేని లేని
పైస లెందుకు ?

ప్రజ్ఞావంతుడవు కనుక
పర్వాలే దనుకోకు!
ఈర్ష్యా ద్వేషాలు పడగ
లెత్తి చూచు నిను నిత్యము!

(ఒక సినిమా పాటకు)

23. పోట్ల గొడ్డు

గడ్డివేయ పోట్ల గొడ్డు కొమ్మాడించు
పగిది, హితము గనడు పామరుండు!
భరత పామరుడికి ప్రతినిధి వోటరు,
గొడ్డె మన సమాజ హెడ్డు, వేమ!

24. మరో ప్రపంచం

మరో ప్రపంచం, మరో ప్రపంచం
మంచం వేసి పిలిచింది !
పదండి ముందుకు, పదండి తోసుకు
పంక్తి గట్టి కదలండి !!

చేతుల నిండా పని ఉందక్కడ
చేలు పండి వున్నాయి
నిరుద్యోగమే లేదండి
పరాన్న రాశుల విందండీ !!

ఎముకలు కుళ్ళిన, వయస్సు మళ్ళిన
సోమరులారా చావ రేమండి ?
చస్తే గాని స్వర్గం లేదను
సత్య మెరిగి పరిగెత్తండి !!

అదిగదిగో కనబడటం లేదా
అమర లోక భోగాలు !
సారాపాత్రలు, రంభోర్వశులు
కోడి లేడి వేపుడులు !!

సలసల కాగే చమురా, కా దది
ఉష్ణ రక్త కాసారం
దూకండి, దూకండి బిర బిర
నాకాని కదే దారండి!!

(శ్రీశ్రీగారి పాటకు)

25. గప్ చిప్

అమ్మో, పోలీసులు !
పడుచువాళ్ళు గప్‌చిప్-

అమ్మో, నాన్న !
పారుగు వాళ్ళు గప్ చిప్ -

అమ్మో, గురువులు!
ఇంట్లో కోళ్ళు గప్‌చిప్-

అమ్మో, ఆఫీసరు!
టేబిలు మీద ఫైళ్ళు గప్ చిప్-

26. ఏ దేశ మేగినా

ఏదేశ మేగినా ఎందు కాలిడినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని!
లేదురా మనకున్న కుల గజ్జి యెందు
లేదురా మన వంటి బాంచ లింకెందు!!

కుల మొక్క జాతిగా పంచ జాతుల గుంపు
కుత్తుకలు కోసుకుని నెత్తురోడే భూమి
మాదనీ, లోకాన
మరి యొకటి లేదనీ ?

సొంతగోవుల నంట రాదంచు గెంటేసి
పొంత పులులను గోకి ముద్దు చేయుననీ
మా తాటి చెట్లను మంటలకు పారేసి
స్కాచి సారా త్రాగి బ్రతుకు చుండిన దనీ ॥పొగ॥

(రాయప్రోలు వారి గేయానికి)

27. తక్కువేమి మనకు

తక్కువేమి మనకూ, రాముం
డొక్కడుండు వరకు ?
భద్ర గిరీశుడు ప్రవాస రాముడు
అసలు రాముడా అయోధ్య రాముడు ॥త॥

పరశు రాముడు, బాబ్రీ రాముడు
మల్కిభ రాముడు, ముల్కీ రాముడు
మనీ రాముడు, సినీ రాముడు
సిక్కు రాముడు, బిక్కు రాముడు ॥త॥

అడవి రాముడు, ఆత్మా రాముడు
దొంగ రాముడు, దోబీ రాముడు
పంట రాముడు, సెంటు రాముడు
పిరికి రాముడు, మురికి రాముడు

అంతా రామమయం, జగ
మంతా రామ జయం ॥త॥

(రామదాసు కీర్తనకు)

28. రామ చంద్రుడి కినుక

రామ చంద్రుడు తిరిగి
రాను పొమ్మంటాడు
సీతమ్మా, చెప్పవమ్మా!
రామ నామము విడిచి
చంద్రుడైనాడు
వీర బాణం విరిచి
విసిరేసినాడు! ॥సీ॥

జన్మ భూమిని మించి
స్వర్గమే లే దనడా?
భువి లోన నిన్నొదిలి
దివి కెందు కెళ్ళాడో! ॥సీ॥

రామ రాజ్యమే కాదు
రామ చంద్రుడె లేని
భరత భూమి తో తనకు
పని యేమి టంటాడు ॥సీ॥

(రామదాసు కీర్తనకు)

29. ఈ జగత్పరిణామ గతి

ఈ జగత్పరిణామ గతి ఎపు
డెందు పాడై నిలిచి పోయెనో !
ప్రగతి శకటం ఆగిపోయెను
పరిసరమ్ములు కుళ్ళ సాగెను !

నరుని బుద్ధికి నివురు గప్పెను
నాచు గట్టెను, నీచు పట్టెను
ముచ్చు దోమలు పుచ్చి మనుజుని
పచ్చి నెత్తురు పీల్చ సాగెను !

ఎవడి దేవుడి పేర వాడు
ఇరుగు పొరుగుల దోచ సాగెను
హింస ఆయుధ మయ్యే, గూండా
యిజమె మానవ నైజ మయ్యెను !

ఈ బృహత్ భారత జడ మ్మెపు
డెట్లు బాగై సాగు ముందుకు ?
ఈ జగత్పరిణామ విధికి
ఏది గమ్యమో ! ఏది రమ్యమొ !

(బాపురెడ్డి గారి పాటకు)

30. మా భరత మాతకు

మా భరత మాతకు మల్లె పూదండ
మా జాతి చరితకు మంగళారతులు !

కడుపులో స్వార్థాగ్ని
కను చూపులో కులము
పంక్తిలో తనవారి
కంచాలకే రక్ష ! ॥మా॥

గలగలా గంగమ్మ
కిలకిలా కావేరి
మధ్యగౌతమి, కృష్ణ
మణులు పండుతు వుంటె

మా దొరల కడుపులే నింపేటి మాతకు
మా బడుగు బ్రతుకుల తో ముడులు కట్టిన దండ ॥మా॥

(ఒక దేశభక్తి గేయానికి)

31. కిట్టమ్మ కథ

యమునలో ఆడితివి, కిట్టమ్మా! ఆ
యమున సంగతు లేమి, కిట్టమ్మా ?
రేపల్లె లో రాసలీల, నేడు
న్యూఢిల్లీ లో రాచగోల!

జైలులో పుట్టావు కిట్టమ్మా, ఆ
జైలు పుణ్యమేమి, కిట్టమ్మా ?
స్వాతంత్ర్య యోధులకు బాపూ, నేడు
జార చోరుల వర్కు షాపు !

అవతార మూర్తిని నీవు, మాకు
ఆదర్శ మే మిచ్చి నావు ?
సహజ సుందర లీల వ్రజపురి, దాని
సత్య సాధన కేల గజపురి !

(కంచికి పోతావా అనే సినిమా పాటకు)

32. రాలి పోయే పువ్వా

రాలి పోయే పువ్వా, నీకు
రంగు లెందుకే ?
గూకి పోయే పొద్దా, నీకు
గూర్ఛా లెందుకే ?

జారి పోయే వయసా, నీకు
జాగీ ర్లెందుకో ?
ఊడి పోయే పదవీ, నీకు
హోదా లెందుకో ?

చచ్చి పోయే మనిషీ, నీకు
సౌధా లెందుకో ?
ఆరి పోయే మంటా, నీకు
ఆక లెందుకే ?

(ఒక సినిమా పాటకు)

33. తుది బాల్యం

ఒడలు తెలియకుండ వెడలె శైశవ మెల్ల
తెలివి వచ్చు సరికి తెల్లవారె !
ఎట్లు గడచు ఇపుడు ఈ తుది బాల్యమ్ము !
కలదు గాని తెలివి, కదల దొడలు !

34. తాజ్ మహల్ అందం

తాజ్ మహల్ అందం కాదోయ్
రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు ?
భారతం ఎవరు రాస్తే యేమిటి
తాళ పత్రాలు నరికిన కార్మికు డెవ్వరు ?

వంకాయ కూర ఎలా వుంటే నేం
వంగ చెట్టుకు వేసిన పెంట ఏ పందిది ?
ఆవు నెయ్యి కమ్మదనం మా టెందుకు
ఆవుకు క్షయరోగం వుందేమో చూడు !

అమ్మాయి ఇస్తున్న వరకట్నం కంటె
ఆమె తెస్తున్న నరకం గొప్పదట !
బంగారం చూచి సంబర పడకు
గని కూలీ ఆకలి అంగారం ఖరీదెంత ?

(శ్రీశ్రీ గేయానికి)

35. ఏ దేశ చరిత్ర చూచినా

ఏ దేశ చరిత్ర చూచినా
ఏ ముంటుంది గర్వ కారణం ?
పర పీడన లేకుండా యే
ప్రాణి కూడ మన లే దన్నా !

గరికను చంపి తినదా గొర్రె ?
గొర్రెను చంపి తినడా మనిషి ?
మనిషిని చంపి తింటుంది పులి
సృష్టినే పీక్కు తింటున్నది ఆకలి !

మని షంటే సంఘం కాదా ?
సంఘ మంటె ఘర్షణ కాదా
జనన మరణ చరిత్ర అంతా
తనను తాను తినేసు కొనుటే !

(శ్రీశ్రీ గేయానికి)

36. నీ కొడుకు బ్రహ్మదేవుడు

నీ కొడుకు బ్రహ్మదేవుడు
కాకికి బంగారు రెట్ట కల్పించినచో
నా కేశ రాశి మేరువు
కాకుండునే ? లక్ష్యం లేదు, కవి చౌడప్పా !

(చౌడప్ప పద్యానికి)

37. మాతృ భూమి అందరిదీ

మాతృభూమి అది అందరిదీ, అది
మాత లందరికీ మాత కదా !
ఎందుకె ధాత్రీ, స్వపర భేదములు ?
లచ్చీ, లక్ష్మీ ఒకరు కాదటే ?

వందేమాతర మంటూ ఎందరు
అసువులు నీడిరో ఎరుగ మటే ?
స్వరాజ్య మందరికీ సమమే కద ?
కలిమి లేములకు కారణమేమి ?

స్వాతంత్ర్య సమర వీరులు తెచ్చిరి
స్వరాజ్య లక్ష్మిని పోరాడి!
నాటి విలనులే హీరోలై చెల
రేగుదు రిప్పుడు, చూడవటే ?

(బృందావన మది అదే సినిమా పాటకు)

38. జుట్టు కింద ఏముంది ?

గోదారి గట్టుందీ
గట్టు మీదా చెట్టుందీ
చెట్టు పైనా పిట్టుందీ
పిట్ట కడుపులో ఏముందీ !!

పిట్ట కడుపులో రెట్టుందీ
రెట్ట కిందా జుట్టుందీ
జుట్టు కిందా మట్టుందీ
మట్టి కడుపులో ఏముందీ ?

మట్టి కడుపులో పుట్టుందీ
పుట్ట లోనా చీ ముందీ
చీమ కడుపులో పాముందీ
పాము నోటిలో ఏముందీ !!

పాము నోటిలో విషముందీ
విషము కొండిలో మనిషుందీ
మనిషి గుండె లో స్వార్థముందీ
స్వార్థ బుద్ధిలో ఏముందీ ??

(ఒక సినిమా పాటకు)

39. సర్వం పేరడీ మయం

రాతి బండకు చెట్టు పేరడీ
చెట్టుకు జంతువు పేరడీ
జంతువుకు మనిషి పేరడీ
ప్రవక్తకు సైతాను పేరడీ
సైతానుకు దేవుడు పేరడీ
దేవుడికి భక్తుడు పేరడీ-

40. తులసీ దళ మాల

దళితు డవు కావు, తులసీ
దళ మాలవు నీవు, అంధతమసున నెపుడో
దళితము లై పోయిన వి
ద్యల నెల్లన్ పొంది, ముందు కడు గిడు, భీమ్నా !

41. దేవుని ప్రేమ ఇదిగో

దేవుని ప్రేమ ఇదిగో, జనులారా
తృప్తిగా భోంచేయరే !
సంతృప్తిగా తినక పోతే, మీ రెట్లు
స్వర్గాని కెక్క గలరు ?

తిండి గలిగితె కండ గలదు, జనులారా
కండ గలవాడె ఇభ నిభుడు !
ఇభమునే రంభ వలచు, రంభ
ఇచ్చునదె స్వర్గ సుఖము !

దేవుని ప్రేమె రంభ, హల్వాలు
పుల్వాలు రంభ అందాలే !
రంభా ఫలాలు తినుడీ, అమృతమే
రంభ బింబోష్ఠ మండీ !

(ఒక భక్తి గేయానికి)

42. అన్యాయ కాలంబు

అన్యాయ కాలంబు దాపరించిం దివుడు
అందరము మేలు కోవా లండీ !
గరిమెళ్ళ నాటి కంటే నేడు ఇది ఘోర
విష వృక్షమై విరిసె చూడండి !

మాన్యాలు ధాన్యాలు మనుషు లందరకూ స
మానముగ పంచుతా మన్నారు,
స్వాతంత్ర్య లాభాలు దాదాలె పంచుకొని
ముష్టి మూకుడు జాతి కిచ్చారు !

తెల్ల దెయ్యాలై తె తోక ముడిచెను కాని
నల్లనివి ఎందు పోగల వండి ?
చీకటి గోదాముల్లో, స్విస్సు బేంకుల్లో
పొంచి యుండును, వెదకి పట్టండి !

అన్యాయ కాలంబు అతిశయించిం దివుడు
అందరము ప్రతిఘటించా లండీ !
మొగమాట పడవద్దు, స్వపర భేదము వద్దు
న్యాయ పథమే ప్రగతి రథ మండి !

(గరిమెళ్ళ వారి పాటకు)

43. గరిమెళ్ళ దండాలు

దండా లండోయ్, బాబు, దండా లండోయ్ !
ఉండ లే మండోయ్, మే ముండ లే మండోయ్ !
బుల్లెట్ల తూటాలకు దండా లండోయ్
తెల్లోళ్ళ పాలనలో ఉండలే మండోయ్ !

చిన్న చిన్న రాజ్యాలను
చేత బట్టు కొన్నారు,
భారత దేశం మొత్తం
ఏక రాజ్య మన్నారు! ॥దం॥

అంటరాకు డని మేము
గెంటేసిన మాలోళ్ళకు
తెల్ల బట్ట లిచ్చారు
చదువు నేర్ప వచ్చారు ! ॥దం॥

ఓడలలో వచ్చారు
రైళ్ళను నిర్మించారు
మా పవిత్ర ధర్మాలను
మంట గలిపి వేశారు ! ॥దం॥

44. ధర్మన్న దండాలు

దండా లండోయ్, దండా లండోయ్
ఉండ లేమండోయ్ బాబు, ఉండ లేమండోయ్ !
సమత లేని సంఘంలో ఉండ లేమండోయ్
జాతి వర్ణ ధర్మాలకు దండాలండోయ్ !

మాల మాదిగ లంటే
మండి పడి చస్తారు,
చస్తూ కూడా మమ్ము
చంపుకు తింటారు! ॥దం॥

వర్ణాలంటే బాబు,
వృత్తులని అన్నారు
నాల్గు వృత్తులను తామే
స్వాహా చేసు కున్నారు !

పంచము లని మమ్ము వూరు
వంచకు తరి మేశారు
హిందువు లంటే సోదర
హింసకు లండీ బాబు! ॥దం॥

కాళ్ళకు మొక్కే మమ్ము
కడుపు మీద తంతారు,
తన్నే కాళ్ళకు మొక్కే
దా సత్వం నెరపు తారు ! ॥దం॥

అధికారం చేతికొస్తే
అమ్ముకు తింటారు, బాబు
ఇంత నీచ సంఘం లో
ఎన్నాళ్ళుంటాము, బాబు ? ॥దం॥

(కుసుమ ధర్మన్న గారి గేయానికి)

45. చండ దేవుని వంశం

చండదేవుని వంశ వృక్షమ్ము ద్రేళ్ళు
నరికీ, జాతి ని దళిత మొనర్ప నేల ?
జాతి మూల మెరుంగని కోతులార !
చదువు కుని యేడ్వగా రాదె శర్మ నైన ?

(శర్మ= మంగిపూడి వెంకట శర్మ)

46. మా కొద్దీ తెల్ల/నల్ల దొరతనం

గరిమెళ్ళ:

మా కొద్దీ తెల్ల దొరతనము, బాబు
మా సంపదను దోచి
మమ్ము జంపు దొర తనము !
మా కొద్దీ తెల్ల దొరతనము ॥మా॥

ధర్మన్న :

మా కొద్దీ నల్ల దొరతనము, బాబు
మానవత్వమె లేని
దానవుల దొరతనము !
మా కొద్దీ నల్ల దొరతనము ॥మా॥

గరిమెళ్ళ :

ఏడాది కేడాది కెక్కువ పన్నేసి
ఈ భూమి నాదే నన్నాడు, మమ్ము
కూలీకి దున్న మన్నాడు, కడుపు
మంట తో చావు మన్నాడు, మమ్ము
బానిసలను జేసి ప్రభు వై కూర్చున్నాడు ॥మా॥

ధర్మన్న :

భూమి, నీరు, గాలి ఎవడబ్బ సొమ్మండి ?
అందరికి భాగ ముందండి, సర్వ
భూ స్వామి సర్కారే నండి, తెల్ల
దొరలకు న్యాయ ముందండి, వర్ణ
భేదాలు పాటించు నేటివులు మాకొద్దు ॥మా॥

గరిమెళ్ళ :

అగ్ర కులము లార, అజ్ఞానము వీడి
అందరము ఒకటే ననండి !
బ్రాహ్మణా బ్రాహ్మణ, పంచము బ్రాహ్మణ
భేదాల తెగు లేల నండి, తెల్ల
వాడు పోవాలంటే కలిసి పోరాడాలి ॥మా॥

ధర్మన్న :

వేల యేండ్లనుంచి వెలివేసి, కుక్కల
కంటే పెంటగా చూచినారు, అంట
రాదని గెంటి వేశారు, మేము
ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తుంటిమి, పూర్తిగ
తెల్లారె దాకైనా తెల్లోళ్లుండాలి, బాబు ! ॥మా॥

47. అదిగో హరిజన వాసం

అదిగో, అల్లదిగో
హరి జన వాసము !
పది వేల గుడిసెల
ఇడుముల మయమూ ॥అది॥

ప్రతి యేడూ స్వామి బ్ర
హ్మోత్సవాల పంటల వలె
గుడిసె లంటుకు పోయి
మిన్నంటే మంటల మయము ॥అది॥

చద్ది గంజి కూడే
తీర్థ ప్రసాదాలు
గుడి గంటలే మా
పని గంటలూ
సుప్రభాతము లెరగని
పవళింపులే లేని
నిత్య కార్మిక బస్తీ
పస్తుల మయము ॥అది॥

(అన్నమాచార్య గారి గేయానికి)

48. కాటుక రంగు తల్లి

కాటుక కంటి నీరు చను
కట్టు పయిన్ బడి నల్లనైన నీ
హాటక శిల్ప మూర్తి అరు
దైనది! ఆకటి కమ్ము కొందురే ?
మాటలు రాని పోతన అ
మాయకు డంతియ ! నన్నయాదు లా
పాటి యెరుంగరే ? ధరణి
పాలుర కావ్య రసజ్ఞు లుండరే ?

(పోతన్న గారి పద్యానికి)

49. దివాళా కోరుతనం

పలికెడిది మహా కవియై
పలికించెడి వాడు రామ భద్రుం డగు చో
పలుక వలె సొంత మేదో !
తొలి నెవరో పలుక, దాని దొంగిల నేలా !

50. పైరవీ శక్తి

పైస ఖర్చు పెట్టి, పైరవీ లొన రించి
పదవి గొనిన తప్పు పట్టరాదు ;
శక్తి కలుగు వాడె సాధించు నేదైన,
ఈసు శక్తి హీను శ్వాస, భీమ్నా !

శక్తి యనగ కార్య సాధనమ్మే శక్తి
దాని ఆయుధములు ధనము, విద్య ;
పైరవీలు దాని ప్రజ్ఞా విశేషాలు
ప్రజ్ఞ లేని వాడు పంద, భీమ్నా !

పేరడీలు వ్రాయ పిత్రార్జితము పోవు,
స్వార్జితమ్ము కవిత వ్రాయ పోవు !
గారడీలు చేసి గడపాలి బ్రతు కెల్ల
నరుని మనసు రంగు నలుపు, భీమ్నా !

(భీమన్న శతకం నుంచి)

51. పేరడీ సిద్ధులు

భగవద్గీతను కృష్ణుడే నుడివెనో,
వ్యాసర్షి భావించెనో ?
భగవద్వాణి ని దేవుడే పలికెనో,
ప్రజ్ఞాను లూహించిరో ?
భగవ ల్లీలలు దేవుడే సలుపునో,
భక్తుల్ ప్రపంచింతురో ?
భగవత్సిద్ధులు పేరడీలు ప్రకృతి
స్థైర క్రియా క్రీడలన్ !

52. పనే జీవితం

కూటి కొరకు కొడుకు కొంపకు పోరాదు
వృద్ధ ఆశ్రయాలు వేలు కలవు ;
చివరి శ్వాస దాక చేయాలి పని యేదో,
బ్రతు కనంగ చేయు పనియె, భీమ ?

53. రాతిని నాతిని జెసెనె ?

రాతిని నాతి జేసెనో కొ
రాముడు ? నమ్మెనో కో గుహుండు ? శ్రీ
సీతను పుట్టినింటి కని
చే కొని పోయెనో రావణుండు ? ప్రా
చేతను రామగాథ నిటు
చీల్చి భుజింత్రు మషాళ లద్ది ! ఈ
స్వాతి శయా లుదాహరణ
లౌ గద భక్తుల పేరడీలకున్ !

54. తల్లి దండ్రులు

తల్లి దండ్రి మీద దయ కాదు ముఖ్యమ్ము,
తిండి పెట్ట వలయు తిట్ట కుండ !
తిండి గలుగ తిట్లు తినవచ్చు నెన్నైన
వినుగు చూప బోకు, ముసలి వేమ!

55. ఏమున్నది గర్వ కారణం

ఏ గవర్నమెం టాస్పత్రి కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
పే రున్న ప్రతి డాక్టరూ
ఇంటికి రమ్మనే వాడే
సొంత క్లినిక్కులున్నవాడే !

ఏ ప్రభుత్వ ఆఫీసు కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
ప్రతి ఉద్యోగీ తన ఉద్యోగాన్ని
డబ్బిచ్చి కొనుక్కొన్న వాడే,
తన బిడ్డలకూ కొనివ్వ వలసిన వాడే !

ఏ సర్కారీ స్కూలు కెళ్ళినా
ఏ మున్నది గర్వ కారణం ?
పరపతి గల ప్రతి టీచరూ
స్కూటరెక్కి తిరిగే వాడే
సొంత పనులు చేసుకొనేవాడే !

(శ్రీ శ్రీ గారి గేయానికి)

56. బాధా పారము

బాధా వేదన పారా వారము
పారము లంటగ చూచి వచ్చితిని
అమృత వరము లొక రెండే ఉన్నవి
అసహాయు లైన మనుజులకు,
ప్రేయసి ప్రేమా శ్లేషము మొదటిది
మృత్యు పరీరంభము రెండవది,
అది నా యవ్వన కాల మనస్థితి
ఆ ఇద్దరు ఇప్పుడు కుడి, ఎడమ !

57. ముసలి లక్షణం

ముసలి వాడు, మంచమును పట్టి యుండిన
వాడు, నిత్యసేవ పలయు వాడు
విసుగు కొనును, తిట్టు, విసిగించు, నాతడు
చివరి మెట్టు మీద శివుడె, భీమ్నా !

58. అంతా మంచి కోసమే

నా పూర్వుండు యయాతి భగ్న రథుడై
నా రీతి చింతింప, నే
దో పుత్రాకృతి నుద్ధరించె ! అది యే
దో నేడునున్ కల్గెడిన్ !
ఆపద్బాంధవి నా సరస్వతి సదా
నా చెంతనే లేదే ? ఈ
తాపం బే పరమార్థ మెంచి నను బా
ధా వహ్ని పాల్జేసెనో !

59. ప్రేమ x పెళ్ళి

ప్రేమించుట సుఖ మైనను
ప్రేమించిన వారి నెపుడు పెళ్ళాడకుమీ !
ప్రేమకు పెండ్లికి వైరము !
ప్రేమయు ప్రేయసియు పోవు పెండ్లి తొ, భీమ్నా !

60. రఘుపతి రాఘవ

రఘుపతి, రాఘవ రాజా రాం
రావణ హంతక సీతా రాం
ఈశ్వర నాముడ వెపు డైనావ్ ?
అల్లా కెప్పుడు జోడైనావ్ ?

అయోధ్య లో నీ సింహాసనము ను
అల్లా భక్తుల కెపు డిచ్చావ్ ?
అజేయమౌ నీ కోదండమును
తాడు తెంచి ఎటు విసిరేసావ్ ?

తూర్పు పడమరల దోపిడి మూకలు
పొంగి పొంగి నీ పై పడుతుంటే
వంగి సలాములు చేసావో
క్రుంగి పారి యెట దాగావో !

(గాంధీజీ ప్రార్థన గేయానికి)

61. BROKEN ^X FALLEN

కానని వాని నూత గొని
కానని వాడు అభీష్ట మార్గమున్
కానని భంగి, ''బ్రోకె'' నను
నాయకు మాటకు ''పాలె'' నంచు అ
జ్ఞానులు శిష్య లెంతయు ప్ర
చారము చేతురు, జాతి నున్నత
స్థానము నుంచి హీన దళి
త స్థితికిన్ పడ ద్రోచి రక్కటా !

(పోతన్న గారి వద్యానికి)

62. మెదకు లో మంజీర

ఏడు పాయల గంగా జనీ, భవాని !
జీవనాధార, మెదకు మంజీర ధార !
గైకొనుము మా నమస్సులు లోక వంద్య !
రాజ మౌళీశు నీ నేటి పూజ కొరకు !

(మెదకులో మంజీర తీరములోని
ఏడు పాయల గంగాభవానీని ఉద్దేశించి)

63. పెద్దపులి - ఎద్దు

పెద్దపులీ, పెద్దపులీ ! ఎద్దా, ఎద్దా !
మీ తండ్రొకడే అంటే, అందు నిజం కద్దా ?

మీ ఇద్దరికి ఒకడే తండ్రయితే,
ఒక కొడుకు మరొక కొడుకుకు తిండైతే,
తండ్రి వద్దు తిండ్రి వద్దు
ముష్టి సృష్టి మన కొద్దు !

తెలుగు నేల అయ్యలెల్ల
దానకర్ణ లయితే !
తెలుగు గడ్డ అమ్మలెల్ల
అన్నపూర్ణ లయితే !

దుష్ట చతుష్టయం లోని కర్ణుడే
దుర్గమ్మకు మగ డయితే
అమ్మ వద్దు, అయ్య వద్దు,
అనుచిత కవితలూ వద్దు !

తెలుగు కవిత్వ హంతకులు కవులే అని
అన్నా డంట అజంతా,
నిజమేనోయ్ అది కొంత !
ఆదినుంచి నేటి వరకు
అందరికీ అదే వింత, అదే చింత !

(నారాయణ, నారాయణ, అల్లా, అల్లా అనే కృష్ణ శాస్త్రి గారి గేయానికి)

64. వంకాయ వంటి

వంకాయ వంటి రాణులు,
పంకజముఖి సీత వంటి పనిపిల్లలు, మా
టెంకాయ వంటి దైవము
లింకెక్కడ దొరుకు తెలుగు యింటన్ తప్పన్ ?

(వంకాయ వంటి కూరయు అనే చాటువుకు)

65. గాలిపటం తోకవు

నాల్గు వర్ణాల జన పతంగమ్ము చివర
పంచమ మ్మగు తోకవు, పరభృతమువు ;
వరమనోహర పంచమ స్వరము నీది !
ఇష్టమో రీతి పాడు కోవే పికేంద్ర !

(ఏకాంత సేవలోని ఒక పద్యానికి)

66. దేవుడు - బిగ్ బ్యాంగ్

సృష్టికి కర్త దేవుడు అనడం
ఎంత అసంబద్ధమో
బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం కూడా
అంతే అసంబద్ధం !

దేవుడ్ని ఎవరు సృష్టించారు ?
అంతకు ముందేముంది ?
దా స్నెవరు సృష్టించారు ?
లాంటి ప్రశ్నలన్నీ
బిగ్ బ్యాంగ్ కూ వర్తిస్తాయి.

ఈ సిద్ధాంతా లన్నీ అజ్ఞానులైన ప్రవక్తలూ
అవిశ్రాంత పరిశోధకులైన సైంటిస్టులూ
కల్పించినవి, కల్పిస్తున్నవీ !

సృష్టికి మూలం కాలగమనం
కాలగమనం లోని నిత్య సంచలనమే
గోళ చలనాలకు సాపేక్ష ధర్మం !

67. ధర్మక్షేత్రే కురుక్షేత్రే

కురుక్షేత్రం ధర్మ క్షేత్రం ఎలా అయ్యింది ?
ధర్మం అంటే ఏ ధర్మం ?
సహజ మైన ప్రకృతి ధర్మమా ?
కృతక మైన మానవ ధర్మమా ?
ఇక్కడ ఉద్దేశ్యం మానవ ధర్మం అయితే
కురుక్షేత్రం నిజంగా అధర్మ క్షేత్రం !

వ్యాసుడు కానీనుడు
వివాహ వ్యవస్థకు వెలుపల కన్యకు పుట్టిన వాడు
అక్రమ సంతానం !

తనకోసం కాక
పనికి మాలిన తన తమ్ముల కోసం
స్వయంవర కన్యకలను
బలవంతంగా ఎత్తుకు రావడం
భీష్ముడికి ధర్మ మేనా ?

వితంతువులకు పర పురుషుడి ద్వారా
కలిగిన అక్రమ సంతానమే కదా
ధృతరాష్ట్ర పాండు రాజులు ?

జూదం ఆడవచ్చు, తప్పు కాదు
ధర్మ రాజు ఆడవలసింది దుర్యోధనుడితో, శకునితో కాదు.

ప్రశ్నించే నోరు ధర్మరాజుకు లేక పోతే
ఆనాడు కర్ణుడ్ని ప్రశ్నించిన ద్రోణుడి నోరు
ఇప్పు డేమైపోయిది ?
ఇలా చెప్పుకుంటూ పోతే
మహా భారత కథే
ఒక అబద్ధాల పుట్ట !

యుద్ధం ఎలా జరిగింది
పాండవులు ఎలా గెల్చిందీ
అందరకూ తెల్సిన కథే !

మానవ నీతి నియమ ధర్మాలన్నీ
ధిక్కరించ బడ్డ చరమాంకం కురుక్షేత్రం
బహుశా వ్యాసుడు ధర్మక్షేత్రం అన్నాడంటే
అది సహజ ప్రకృతి ధర్మం అని !

(గీత లోని ఒక శ్లోకానికి)

68. గత సాహిత్యం

శోధింపన్ బడె సర్వ శాస్త్రములు, ర
క్షో వీర నాశం కృతుల్,
గాధా బద్ధ పురాణముల్, నృపుల రా
గ ద్వేష కావ్యాలు, దు
ర్మే ధోన్మత్త ప్రవక్త లల్లినవి లా
రీ లుండె ! ఇన్నింట నా
బాధల్ తీర్చెడి దొక్క టైన కలదా ?
బావా ! నిజం చెప్పవా ?

(పోతన్న గారి వద్యానికి)

69. అమర ప్రోక్తం

మన పూర్వుడు బ్రహ్మణ సుతు
డని అమర నిఘంటు వనును, అదె సత్యము చె
ప్పు నిరుద్ధ భారతమ్మును ;
మన చరితలు చదువ రేల మామా యువకుల్ !

70. రూట్సు

త్రవ్వె నాఫ్రికానె తన జాతి రూట్సు కై
తెల్ల నేల నల్ల పిల్ల డొకడు
భరత జాతి నీది, భారతమే నీది
చదివి చూడు వ్యాస చరిత, దళిత !

71. లంచ లక్ష్మి

ఇందు గల, దందు లేదను
బెందుకు లంచమ్ము ? రాముడే గొనె చంద్రున్ !
అందరును లంచ లక్ష్మికి
అందలమున్ బట్టు, డేల అవమానింపన్ ?

(పోతన్న గారి పద్యానికి)

72. బకాసురులు

అకవులు కుకవులు పైబడి
సుకవిన్ అస్పృశ్య డంద్రు శుభముల కెల్లన్ !
బకుల వలె తామె తిందురు
సకల పురస్కారములును, సత్కారములున్ !

73. బెదురు గొడ్డు మనసు

నాలో కలిగే ప్రతి నొగులూ గుబులు పుట్టించి,
ప్రతి అనారోగ్యమూ ప్రాణాంతకమే అనుకొంటూ
దిగులు పడిపోతుంది నా మనస్సు !
దిగంతాలకు పారి పోతుంది మతి చెడి
వట్టి చెదురు గొడ్డు నా మనస్సు !

74. కుక్క మనసు

కుక్క బోలు మనసు కోరిన పని చేయ
నేర్పు వలయు ముందె ఓర్పు తోడ,
లేని యెడల సంతకై నను పోదది
రంతు చేయుచుండు రాత్రి పగలు !

75. పైరవీ ప్రైజులు

పైరవీలకు తప్ప ఏ ప్రైజు రాదు
పలుకుబడి తోడ తప్ప అవార్డు లేదు
వ్యక్తి గతములు రాజకీయమ్ము లెల్ల !
కవితకును, సృష్టికిని కలుగదు విముక్తి !

76. తాతా మనమల తీర్థ యాత్ర

తాతయ్యా ?

ఏమిట్రా గాడిదా ! మళ్ళేమయ్యింది ?

తాతయ్యా ! నీకు విసుగెక్కువ, కోపం మరీ ఎక్కువ !

ఏడ్చావు గానీ, ఏమిటో చెప్పు ?

తాతయ్యా ! మనిద్దరం కలిసే ప్రయాణం చేస్తున్నాం కదా ?

అవును !

అదెలా ?

మన గమ్యం పడమటి తీరంలోని

పుణ్యక్షేత్రం, అక్కడి జాతర !

నువ్వు జాతర చూసుకొని తిరిగి పోతున్న వాడివి

నేను జాతర చూడడానికి ముందుకు పోతున్న వాడిని

మరి, మనం ఇద్దరం కలిసే ప్రయాణం చేస్తున్నాం ఏమిటి ?

అదంతేరా,

అది కాలగమనంలోని సహజ లక్షణం !

77. రౌడీ చేతి కత్తి

తోకే కుక్కనాడిస్తున్నది
పులిమచ్చ లద్దుకుని !
రౌడీ చేతి కత్తే రాజ్యాలు కొల్ల గొడ్తున్నది
చంపుతా నని బెదరించి, తాను చావడానికి సిద్ధపడీ !

78. అక్కరకు రాని హితులు

దిన మెల్ల వచ్చి పోయెడి
ఘనులం దిపు డొక్కడేని కనపించడు, షా
పున కేగ, మందు లేవో
కొని తేవగ నెవడు లేడు, కూతురు తప్పన్ !

79. పంది అవార్డులు

నంది అవార్డులు వలెనే
పంది అవార్డులును కూడా ప్రజ లిచ్చినచో
నందులు పందుల ఉమ్మడి
సుందర బందర సమాజ సుధ పుట్టదొకో !

80. హక్కులు

హక్కులు మైనార్టీలకె,
కుక్కలు యజమాన్ల దొడ్డి గుమ్మమ్ములకే,
బొక్కలు గుడిసెలకే, ఈ
లెక్కలు బుక్కులకె, ముష్టి లీలలు భీమ్నా !

81. ఆశే ఈశ

దేశ మేలు నాశ దిల్లీకి గొంపోయి
పార్లమెంటు చేర్చి పదవి నొసగె
అన్ని సంపదలకు ఆశయె మూలమ్ము
నేల బారు కవిత లేల ? వేమ !

(నీళ్ళలోని చేప అనే వేమన పద్యానికి)

82. మాస్కులు

అగ్ని దేవు భార్య అన్ని మోములు మార్చి
భర్త నెట్లు తృప్తి పరచ గల్గె ?
కామ రూప విద్య కా, దవి మాస్కులే !
నేడె కాదు, నాడు కూడ కలవు !

83. జీవితం లో స్థిరపడడం

ఒక గ్రామంలో నల్గురు మిత్రులు
నల్గురూ ప్రాథమిక విద్య పూర్తి చేసారు.

అందులో ఒకడు అక్కడే ఉండిపోయి
చిన్న దుకాణం పెట్టుకున్నాడు
తక్కిన ముగ్గురూ హైస్కూలులో చేరారు.

అందులో ఒక్కడు అక్కడే
ఏదో ఉద్యోగంలో చేరగా
తక్కిన ఇద్దరు కాలేజీకి పోయారు.

ఆ ఇద్దరిలో ఒక్కడు అక్కడే
ఒక కలవారి అమ్మాయిని పెళ్ళాడి
పట్నంలో ఉండి పోగా, మిగిలిన వాడు
నగరం పోయి యూనివర్సిటీలో చేరాడు.
అలా ఆ నల్గురూ స్థిర పడ్డారు.

యూనివర్సిటీలో చేరినవాడు
చదువుల చివరంటా చూచి

చివరకు వైస్ చాన్సలరుగా రిటైరు అయినాడు,
ఒక మేడ కట్టుకున్నాడు,
ఒక పాత కారు కొనుక్కుని కాలక్షేపం చేస్తున్నాడు.

మధ్య లోని ఇద్దరి అడ్రసులూ
మనకు తెలియవు, బాగానే ఉండి ఉంటారు.

గ్రామంలోనే ఉండి పోయిన వాడు
వ్యాపారం వృద్ధి చేసుకుని లక్షాధికారి అయ్యాడు,
లక్ష్యాలను పెంచు కుంటూ పోయాడు,
ఎన్నికలలో గెలిచాడు, మంత్రి అయ్యాడు.
సాంస్కృతిక బృందాలతో కలసి విదేశాలకు
కూడా పోయి వస్తున్నాడు !

జీవితంలో స్థిరపడడం అంటే ఇదీ !
జీవ శక్తీ లక్ష్య శుద్ధీ తప్ప
పల్లె పట్టణ భేదా లుండవు.

84. సైరా చిన్నప రెడ్డి

సైరా, చిన్నాప రెడ్డీ ! నీ
పేరే బంగారూ కడ్డీ ! ॥సై॥

ప్రజలను దోచే దొరలను
పట్టుకు బంధించావు !
బంధా లిక తెగ వనుకుని
భద్రత ప్రకటించావు ॥సై॥

మునిసిపాలిటీ వీధు లయినా
రాజ రాజుల మేడ లయినా
రోజు కొక సారయిన గాని
బూజు దులపక తప్పదన్నా ॥సై॥

మానవులు సృష్టించు మురికి యె
దానవులు రా తమ్ముడా !
తుడిచి పోసే చెత్త కాదది
విడిచి పెడితే తీయు ప్రాణం !
కాల్చి బూడిద చేయవలె రా
కనికరము విడనాడవలె రా ॥సై॥

నూటిగా పలికావు, ముక్కుకు
నూటిగా పోయావు కానీ
నరులు ఖలులని, నర నరాన
విషము కలదని మరచినావు ॥నై॥

మనిషి మారడు, స్వార్థపరుడు,
తలలు తీసి, తలలు మార్చి
తానే ముందుకు పోవువాడు !
కొట్టి పదలకు తమ్ముడా అని
అంతగా చెప్పితిని కదరా ॥నై॥

85. ఇద్దరూ మహాకవులే

రాశులను మ్రింగ నన్నాడు రాళ్ళు వేమ్మ ;
మ్రింగు నన్నాడు, దేశ దారిద్ర్య మెల్ల
అది యె నన్నాడు జాష్వ ! ఎయ్యది నిజమ్మో ?
ఏది వ్యంగ్యమొ ? ఎవడు శోధించువాడు !

86. విడి విడి కంచాలు

నలిన భవ ప్రభాత, మజ
నాభము, హైందవ; మందు ఎవ్వరే
కులమెు వచింప, రందరును
కూడి మెజారిటి కాన ; ముస్లిముల్,
దళితుల మాత్ర మేల తమ
దైన్యము చాటుచు మొత్తుకొందురో !
కలసి భుజింప మేలు, విడి
కంచము లుండుట కష్ట మీ పయిన్ !

87. ఓడి గెల్చిన వాడు

పరమ శివు రొమ్ము నాటితి శరము లైదు ,
భగ్గు మన్నది ఒడలు ఎవ్వరిదో ? నాదే !
బాణముల గూడి నా పంచ ప్రాణములును
బ్రతికె నారీతి, తను వొండె భస్మమయ్యె !

అతను డనె అయ్యు గెల్చితి నతని నేను
గెల్చియును ఓడిపోయిన కీల అతడు !
నా కథయె కాదు, ఇది యెల్ల నీ కథయును,
మా కుమారుడ నేను, ఉమా కుమార !

88. నక్షత్ర శోభ

ఎల్ల యెడల కరెంటు పోయిన తమస్సు,
కనుల పండువ చేయు నక్షత్ర శోభ,
ముద్ద బంతులు, మందారములు, గులాబ్లు
రాశులుగ పూచి తగులు కరాగ్రములకు !

నందన వనమ్ము కిందకో, బృంద పైకో
యాత్ర కదలి వచ్చినవో ఉగాది కొరకు,
రంభలును, రాధలును పూర్ణ కుంభములతో
రస వసంతము లాడుదు రన్ని యెడల !

ఫాల్గున కుహువు, చైత్ర ప్రభాత వధువు
ప్రథమ సంయోగ మధు రోత్సవమ్ము లోన
నేను బహుధాన్యనై పరువు లెత్తినాను
తారకేశ్వర శోభ నోద్యానమెల్ల !

89. పదవి విలువ

ధన మిచ్చి పుచ్చు కొందురు,
చన విచ్చియు పుచ్చు కొందురు, స్వ సుఖోన్నతికై !
మనుజుల నమ్మకు పూర్తిగ
ప్రణయమ్ము కంటే విలువ పదవిది, భీమా !

90. గత జన్మలు

సృష్టి లోని ప్రతి సవ్వడి ఒక భాష
ప్రతి శబ్దమూ ఒక భాష
ప్రతి స్వరమూ ఒక భాష

ఏదో ఒక చెట్టు భాష
పక్షి భాష, జంతువు భాష
నాద బ్రహ్మ కదలికలే భాషలు

సర్వ భాషా సమన్వయ నిఘంటువే మనిషి మెదడు !
పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్మే ఏ మనిషై నా
తన గత జన్మను గురించి ఆలోచిస్తాడు
గత జన్మలో తాను ఏమిటి అయి ఉండవచ్చునో

ఊహిస్తూ ఉంటాడు.
ఈ ఆలోచనా సరళి అంతా పునశ్చరణ మౌతూ
అతని మెదడులో ముద్రిత మవుతూ ఉంటుంది.

ఒక మనిషిని ట్రాన్సు లోకి తీసుకు వెళ్ళి నపుడు
వెనక్కి బాల్యం లోకి, తల్లి గర్భంలోకి,
ఇంకా అవతల వైపుకు తీసుకు వెళ్ళినపుడు
తాను అప్పుడు ఆ భాషను కూడా మాట్లడతాడు.

తాను పిచ్చుక అనుకుంటే కిచ కిచ అంటాడు.
కుక్క అనుకుంటే భౌభౌ అంటాడు.
రష్యన్ అనుకుంటే రష్యా భాష మాట్లాడతాడు.
జర్మన్ అనుకుంటే జర్మను భాష మాట్లాడతాడు.

ఇదంతా తాను ఊహించు కొన్నదే
మెదడులో ముద్రించు కొన్నదే.

మనో విలాసం, ఇంద్రజాలం.
వాస్తవంగా ఇవి గత జన్మలు కావు.

గత జన్మల భావన దేవుడు లాంటిదే
ఒక ఊహ !

91. పత్తి తోట రాజకీయం

ఆకటి కన్నపు లోటా,
లేకికి కట్నాల మూట, లేబరు బస్తీ
మూకకు జనతా కోటా,
కాకుండిన, పత్తి తోట ! కవి చౌడప్పా !

(ఒక కవి చౌడప్ప వద్యానికి)

92. తోడేలు - గొర్రె పిల్ల కథ

బల వంతులు వెంట్రుకను పూజిస్తే
అది ఒక పవిత్ర దైవ పూజ;
బలహీనులు స్వర్ణ విగ్రహంలో దైవాన్ని దర్శించినా
అది అపవిత్ర నీచ కార్యం.
మానవ చరిత్ర పొడుగునా ఇదే కథ
ఈ తోడేలు - గొర్రె పిల్ల కథే !

93. వలపుల వలలు

తొలి వలపు లమృత మధువులు
కల బోసిన కళలు, కలలు, కల హంసలు ; ఆ
వల వలలు, గాలి వానలు,
అలకలు, పంచాయితీలు, అమవస నిశలున్ !

94. దేహ ముండేనా ?

తినిన అరగ కుండు, తిన కున్న నీర్సమౌ,
పూర్తి బెడ్డు రెస్టు పుణ్య మిదియె !
దెబ్బ మాను సరికి దేహ ముండునో లేదో
ముఖ్య అతిథి నయ్యు మూల బడితి !

చూడ వత్తు మనుచు సొంత చారుల చేత
మాట పంపి నట్టి మహితు లకును
జ్ఞాపకమ్మె లేని జన నాధులకు కూడ
శుభము లిందు కలవు, చూచు కొండు !

95. గాయం x ఆయం

గాయ మింతె అయిన కల కాల మున్నచో
ఆయ మెంత దైన ఆరి పోవు,
దాట వేసి పోవు ధన్వంతరియె యైన
విశ్వ జనని కూడ విసిగి పోవు !

96. అంతా తప్పే

వద్దనిన తప్పు, తప్పు కావలయు ననిన
పిలువ తప్పాను, ముప్పాను పిలువ కున్న
నిస్సాహాయత పడి యున్న నిర్ధనునకు,
యోగ నిద్రేశు డెరుగ డీ రోగి పాట్లు !

97. సహజ వైరము

నక్క నూత బడిన నలుగురు నాలుగు
రాళ్ళు రువ్వి పోదురనుట నిజము,
గోవుగోత బడిన గోమాయువులు నట్లె !
సహజ వైర మెట్లు చచ్చు ? భీమ్నా !

98. నోటి తీట

మంచి నీరు కాని, మజ్జిగ యే కాని
ఐసు క్రీము గాని, జ్యూసు గాని
నోటి తీట తీర్చు ఊటేదో అందిమ్ము !
లేవ లేను, నీవే లేపు కొమ్ము !

99. నోరు -ఊరు

నోరు మంచి దైన ఊరు మంచి దౌను
అనెడి మాట బిచ్చ కొనెడి మాట !
ఊరు తీరు బట్టి నోరు తీరును నుండు,
ఊరు నేలు నొక్క నోరె , భీమ్నా !

100. భజామ్యహం

ఆపదాం అప హర్తారం
దాతారం సర్వ సంపదాం
సత్యం సుందరం శివం తాం
భూయో భూయో భజామ్యహం !

101. కవిని నేను

కవిని నేను , నా చుట్టును కలుగు వారు
నాగరీకులు , నవ్వరు , నవ్వు కోరు !
అందుకే కంద కూన లానంద మీయ
ఆట వెలదుల గూడి నే నాడుకొందు !

102. కాంత లే అర్థులు

నిండు మనంబు నవ్య నవ
నీత సమానము , పల్కు దారుణా
ఖండల శస్త్ర తుల్యము , జ
గజ్జన వంద్యులు కాంతలందు , ఈ
రెండును పుర్వు లందు విప
రీతము కావున , నేటి భగ్న భూ
ఖండము నేల నర్థు లొక
కాంతలె , పుర్వులు వ్యర్థులన్నిటన్ !

(వన్నయ గారి పద్యానికి)

103. బంకనేలలు

రామ నవమి నాడు రామ దండొక యేడు
విశ్వ జనకు డిడిన విందు గుడిచి
పానకము తాగి పరిగెత్తె గంగకు
గంగ నాటి నుంచి గౌతమి గా మారె

104. కావ్య నాయకులు

కావ్య నాయకులకు దివ్యత్వమును గూర్చి ,
దేవ గణము జేర్చి , దీప ముంచి
బలులు పెట్టి తామె భక్షింత్రు కడుపార
ఈశ్వరత్వ గాధ ఇదియె భీమ్నా !

105. చుక్క బొట్టు

అడ్డ బొట్టు దారి నడ్డి ధర్నా చేయ
నిలువు బొట్టు బస్సు నిలిపి కాల్చె
చుక్క బొట్టు చుట్టు చూచి దోచుకు పోయె
సూర్య చంద్రు లెల్ల చుక్క బొట్లె !

106. యుద్ధము

ఆయ మధికార పక్షము ,
గాయము ప్రతి పక్ష , మెంత కాలమొ ఈ గూ
డాయుధ సమరము నా ఈ
కాయము పై ? స్వర్థ కేమి కతమో , భీమ్నా !

107. వోట్లు గొడ్లు

పదుగు రాడు మాట పాడియై ధర జెల్లు
నేటి ప్రజల రాజ్య నీతి అదియె !
గొల్ల వా డొకండు , గొర్రెలు పదివేలు
గొర్రె లనగ వోట్ల గొడ్లు , వేమ !

108. ప్రజల వోట్లు

అవని నే ప్రవక్త యైన నొక్కొక్కడె
ఒక్కడాడు మాట ఎక్కె నెందు ?
ప్రజల వోట్ల రాజ్య పదవులే మొదవులు
పాలు వెన్న జున్ను చాలు , వేమ !

109. సెక్సు కారణం

శాంతి ఛిద్రమై కొట్టుకు చచ్చి రనిన
ఛిద్ర హేతువు తరచుగా సెక్సె అవును ,
కుల మతమ్ముల బురదను పులిమి దొరలు
శాంతిని సమాధి చేతురు శాశ్వతముగ !

110. కలి కాలమా ?

కుల మతములు , కుడి ఎడమలు
కలుములు లేములును కలవు కల కాలముగా
కలిసుండరె నరు ? లంతఃు
కలహము లిపుడేల పెరిగె ? కానవె , భీమ్నా !

111. రవి చంద్ర

కవిత చెప్పగ వచ్చు లేఖకులు గలుగ ,
ప్రెస్సు కాపీ తయారీ నాపెను ముఖారి
నా యదృష్టము రవిచంద్ర , వ్రాయ గలిగె !
అతడు రాకున్న ఈ గ్రంధ మచ్చు కాదు !

112. కటి క్షతము

తగిలిన వెన్నో క్షతములు
నగు మోమును మార్చ లేదు నఖ దంతాదుల్
వగలాడి కటి క్షత మిది
సగ మైతిని మూడు నెలల సాంగత్యముతో !

113. విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిభ గల్గు వాని భరియింప రెవ్వరు ,
హత్య చేసి విగ్రహముగ నిల్పి
అగ్ర పంక్తి ఫలము లారగించుచు నుండ్రు
సంఘ నీతి సర్వ సమతె , భీమ్నా !

114. మేటి మణులు

రాజకీయ రంగరాజు సంజీవయ్య
ప్రాభవ ప్రధాని మాధవుండు
బోయి భీమ్న కావ్య భూస్వామి , ముగ్గురు
నేటి భారతమున మేటి మణులు

115. తల నొప్పి

స్త్రీలు, దళితులు, మైనారిటీలు నేటి
భారతమ్మ కు తలనొప్పి కారణములు,
సుగుణములె మారి దోషము లగును, కాన
కటు కముల కషాయములె అన్నిటికి మందు !

116. నరకంలో విందులు

ఆత్మకాల దనెను ఆ కృష్ణ దేవుడు,
కాలు ననిరి తన్మతాల వారు !
మంట లందు కాల్చి, వంట నూనెల వేల్చి
నరక విందులందు నంజు కొందురు !

117. అంబేడ్కరు శిష్యులు

అంబేడ్కర దిన కార్యము
లంబేడ్కర జనులె చేయు, డరి పక్ష ప్రభు
త్వంబులు చేయుట తగునే ?
అంబేడ్కరిజంబు దాన నంతము కాదే ?

118. అంబేడ్కరు పై హక్కు

ముంబై కి మాత్రమేనా,
అంబేడ్కరు మీద హక్కు అవనికి లేదా ?
అంబేడ్కరు మాటల క
ర్థంబులు మార్చంగ తగున తత్ శిష్యులకున్ ?

119. పెన్సిలు పైకెత్తి

వెల్లకిల పండుకొని, పైకి పెన్సిలూని
తేనె తీయుదు, ఇది మీకె, తీసుకొండు !
గొప్పవారి వంటల కేగు గొర్రెలార !
జీవ గమ్యము గూర్చి యోచించు కొండు !

120. కూర బ్రతుకు

పూట కూళ్ళ తిండి, హోటళ్ళ ఘన విందు
గొర్రె కేది యైన కూర బ్రతుకె !
నమ్మి వెంట బడుట, నంజుకు తిన బడుటె
వారసత్వ మింక వదలు, భీమ్నా !

121. మెర్సీ కిల్లింగ్

మెర్సీ కిల్లింగ్ అను నొక
వెర్సింపులు సూత్ర ముండు వెజ్జులు ! నా పై
మెర్సీ చూపగా లేరా ?
పర్సెంతయో లేదు గాని, ప్రాణము లిత్తున్ !

(వెర్సింపుల్ = వెరీ సింపుల్)

122. సీతా రాముల కొడుకు

సీతమ్మా మా అమ్మా
శ్రీ రాముడు మా తండ్రీ !
ఎవరు నాయనా అదీ ?
నేను, తల్లీ
అడుక్కొనే వోణ్ణి !
సీతా రాముల కొడుకువా,
మరి, అడుక్కు తింటున్నావేమి ?

123. పున్నయ్య గారి ఆజ్ఞ

రోజులు బాగుండియే జారి పడితి నే
మో అంటి పప్పు, ఏమో కాదు, సత్యమే !
తెలుగు కవితకు కొత్త వెలుగిమ్ము, భీమనా
అనిరి పున్నయ గారు ఆజ్ఞ అంటిని నేను !

124. బ్రహ్మ జిజ్ఞాస

బ్రహ్మ జిజ్ఞాస ఫలితమే బ్రహ్మ విద్య,
తెలుసుకోవలె నను కుతూహలమె అద్ది,
తత్వ నైజము గూర్చి ఇంతటి రిసెర్చి
లేదు ఆనాడు, ఈనాడు లేదు జగతి !

125. నక్క నాయకత్వం

నరుడు పేడి అయ్యె, నక్క నాయకుడయ్యె,
చీకు బొక్కలయ్యె క్షేమ నిధులు,
త్యాగ ధనుల విగ్రహపు రాళ్ళె రాశులు
మ్రింగుచున్న, వేమి ట్రిక్కొ ? వేమా !

126. బెంగ - భయము

ఉనికి జేర భయము, ఉద్యోగమున కేగ
బెంగ, నడుమ నెంత ప్రెషరు, ట్రెస్సు !
బాధకంటె నన్ను పల్లవి గూర్చిన
చింత వంత లెంతొ ఛిద్ర పరచు !

127. పల్లవి

చింత దాచు కొన్న చిరు నవ్వు దేవత,
నిత్య సేవ లొసగు నేల తల్లి,
శ్రీ సితారు పైనె సింధూర పల్లవి
త్యాగ రాశి, హిమ సుతా కుమారి !

128. ఒకే తల్లి

అందరికే ఒకే తల్లి
భారత మాత !
అని చెప్పిన మహా కవీ
చెప్ప వేమీ తండ్రు లెవరో ?
తల్లి ఒకతె అన్నావు
తండ్రు లెందరో చెప్పవు,
మతాని కొక డున్నాడా ?
భాషకు నొక డుంటాడా ?
పతి వ్రతల జాతి నెంత
పతితను గావించావు !
బాస్టర్లుగ సిగ్గు మాలి
బాంచవు గా బ్రతికేవా ?

129. నేనూ మనిషినే

నరుడ నేను, నైజ గుణాలు నాకు నుండు,
అహము సింహము, తిని వేయు నాగ్రహింప !
రాకు డెవ్వరు నను బిల్వ, బ్రతికి యున్న
నేనె వత్తును బిల్వ కుండినను, భీమ్నా !

130. ముద్దిచ్చే భార్య

కోప తాపాల కంతు లేకున్నగాని
ఒట్లు తిట్లును హింసించు చున్నగాని
మరచి యైనను ముద్దిచ్చు మగువ గలుగు
భర్త భరియించ గల డెన్ని బాధ లైన !

131. ఆడి తప్పడం

నను వీడిన వారికి తమ
పను లుండవె తమకు ? తప్పు పట్టను ; ఎవరై
నను మాట తప్పనేలా ?
నను మోసము చేయ నేల ? న్యాయమె ? భీష్మా !

132. కాకర కాయల గంప

సాత్వి కేతర గుణ మెంత శాత మున్న,
కొంప కాకర కాయల గంపె అయిన,
గుండె ప్రమిదలో ఆర్ద్రత యుండె నేని
పత్ని యగు నిరంతర రసాద్వైత మూర్తి !

133. అందరితో పోలిక

అందరితో నను బోల్చుట
సందులతో రాచబాట సరి పోల్చుటయే
కుందనపు బొమ్మ కీడే
బెందులు పది వేలు ? ప్రజలు బిక్కులు, భీమ్నా !

134. తల్లి దండ్రుల తలపులు

తలి దండ్రుల కుండు నెవో
తలపులు, తీర్చుకొనునెంత్రు తనుజుల ద్వారా ;
సెలగకుడు వెర్రి తలలని
మలి సంధ్యకు పోవ తొలియు మలగును, భీమ్నా !

135. ఎనభై దాటిన

ఎనభై దాటిన వృద్ధుడు
చని పోవలె కాని, బ్రతికి జగమేలు నుకో ?
అనుకోకు నన్ను గూర్చియు
అనుభవములు నావి గ్రోలు మమృతము, భీమ్నా !

136. పనిలో పని

తానే చేయక తప్పని
హీనపు పను లెన్నో కల్గు, నేడ్వకు మీ ! నా
కే నేను చేసు కొనుచు
న్నా ననుకొన నెల్ల నయమగు, భీమ్నా !

137. గుత్త రాజకీయం

కల్లు సార నేర గాడికి వోటిచ్చి,
(అధి) కార మిచ్చి, కొత్త కారు నీయ
ప్రాజ్ఞు లైన వారి పడ గుద్దు కొని పోవు !
కొత్త రాజ నీతి గొప్ప భీమ్నా !

(1966 ప్రాంతంలోని కారే మంత్రులు అనే పద్యంతో పాటు)

138. కృతఘ్నత

ఆపదలోలోన నా సహాయము బ్రతికి,
ఇపుడు ననుచూచి బెదురుదు రే లో సఖులు ?
నా సరస్వతి కోస మే నగనో తెచ్చి,
ఊడ బెరుకుక పో నెంతు రున్నదియును !

139. పైపై మాటలు

దూర మందుండి, నను గూర్చి దుఃఖ పడుచు
ఫోను చేతురు ; వత్తురె పో, క్షణమ్ము
చూచి పోదురు, పని చెప్ప లేచి పోదు,
రతి విచిత్రము కొందరి మతము, భీమ్నా!

140. ఏ పనైనా బ్రతకడానికే

ఏ పుణ్యము, లే పాపము,
లే పనులకు ఫలములగునొ యెరుగను ; పశ్చా
త్తాపము లే దే పనులకు,
ఏ పని చేసినను మనుటకే కద ? భీమ్నా !

141. నిద్ర లేపడం

నిన్ను నిద్ర లేపుట ఒక చిన్న యుద్ధ
రంగమే, కాన నీ జోల్కి రారు ఎవరు
మేము నంతియ ! కాని నీ మోము చూడ
ఉదయ రవి చంద్రికలు వచ్చి, రిదిగో, లెమ్ము!

142. కవితా చోరులు

బైబిలు సూక్తులు పేర్కొని
నోబెలు ప్రై జొకడు పొందు, నూత్నము లని ఏ
వో బాసల విలువల తో
జేబులు నింపుకొను మరొక సిద్ధుడు, భీమ్నా !

143. హృదయమున్న వాళ్ళు

తనదు బావ మాట తప్పిన, తా నెంతో
కలత పడెడు వాడు కలడె నేడు ?
ఒక నరేంద్ర నాము డుండెను ! ఎపు డైన
నుంద్రు మంచి మనుషు లుర్వి, భీమ్నా

144. ఎవరో ఉంటారు

కాయ ముండియు లేనట్లె గాయ పడుట !
కవిత చెప్పెద, వ్రాయు వా రెవరు తల్లీ !
లేరే ఎవరును ? రవిచంద్ర లేడే నీకు ?
వ్రాయుటయే కాదు, అచ్చును వేయ గలడు !

145. భయ మెందుకు

లేడికి పులి భయమున్నది,
కోడికి యజమాని భయము ; కోకిల కేమో ?
పాడుకొను నేదో నిత్యము
ఆడుట పాడుటయే బ్రతుకు కర్థము, భీమ్నా !

146. నాది తిన్న వాళ్ళే

నీ కెందుకు తోడ్పడ వలె ?
మా కేమిటి లాభ మనెడి మహితులు, తామే
దో కొంచె మైన గతమున
నా కలిమిని తిన్న వాళ్ళే, నవ్వకు, భీమ్నా !

147. బ్రతికి లేనా ?

బ్రతికి యుండగనే నన్ను బ్రతికి యున్న
వారి లిస్టు నుండియె కొట్టి వైచినారు !
రావు ఇన్విటేషనులు సర్కారు వేని,
లేవు అంబేడ్కరు జయంతి లేఖ లేని !

(14. 4. 98 అంబేడ్కరు జయంతి)

148. నా గొప్పతనము

పనికి రా నేను నాకైన నగ వలదు ,
ఆస్ట్రియా నుంచి ఆహ్వాన మదిగో చూడు !
రమ్మనగ వచ్చు స్వయముగా రంభె రేపు !
చెప్పు కొని ఏడ్వ గలరు నా గొప్ప తనము !

149. అంతా నాదే

శ్రీ కాకుళము నుండి చిత్తూరు మీదుగా
మెదకు దాక నాదె , మిత్రు లార !
ఈ త్రిలింగ దేశ మెల్ల నాదే, నేను
బోయి భీమ్ను, సిన్రె భాయి భీమ్నా !

(భీమ్ను= భీమన్న, సిన్రె=సి.నా.రె)

150. అమ్మ, కొమ్మ , రెమ్మ

బాల్య మెల్లను అమ్మ, ఆపైని కొమ్మ
కొమ్మ పై రెమ్మ, రెమ్మల గుమ్మ లొసగు
బృంద గానమ్ము ఇది, పల్లవీ స్వరోక్తి !
నా పున శ్చక్తి, తుది బాల్య నవమ తల్లి !

151. అం ధేం దూదయముల్

అం ధేం దూదయముల్, మహా బధిర శం
ఖా రావముల్, మూఢ సత్
గ్రంథాఖ్యానముల్, నపుంసక వధూ
కాంక్షల్, కృతఘ్నావళీ
బంధుత్వంబులు , భస్మ హవ్యములు , లు
బ్ధ ద్రవ్యముల్ , మూక సత్
గంధంబుల్, మనుజత్వ వర్జితుల గు
ప్త స్వార్థ సౌభాగ్య ముల్ !

(పోతన గారి వద్యానికి)

152. నా సర్వస్వం

నా సేవకె పుట్టిన యటు ,
నా సర్వము తామె యగుచు , నా స్వస్థత యే
నా సాహితిగా మెలగెడి
నా సతియును సుత లు నాకు నానార్థ కృతుల్ !

153. బర్రె కథ

(బుర్ర కథను ముగ్గురు వ్యక్తులు చెపుతారు, ఇక్కడ నేను మూడు పాత్రలనూ విడివిడిగా పేర్కొనడం లేదు . స్వర భేదాలను బట్టి గుర్తించాలి.)

వినరా , భారత బీర కుమారా
విజయం నీదేరా !

బీర కాదురా బాబూ , సై
బీరు అనాలిరా , తందానా !
నీదే అన గూడదురా , బాబూ
మనదే అనవలె రా !

వినరా, భారత బీరు కుమారా
విజయం నీదేరా !

నాది అనుటయే సబబురా, సై
నీది సెక్యులరు పార్టీ రా, సై
గెల్చిన పార్టీయే నీదిరా, సై
నీకు ఓటమియె లేదురా, సై
అందుకె , విజయం నీదేరా ! ॥విన॥

2

అనగనగా ఒక దేశ మున్నదీ
దాని పేరు బురద
దాని నేలెడు రాజొక డుండె
అతడి పేరు దురద ॥విన॥

అదేం పేరురా భాయి ?
అసలు పేరు చెప్ప వోయీ !

భళా భళా నోరి తమ్ముడా !
మేలు భళా నోరి తందాన,
అడిగావు కాబట్టి చెపుతున్నారా
అసలు పేరు ఆషాఢ భూతిరా ! ॥భళా॥

బురద లోన జన్మించెరా, సై
బుద్ధి కలిగి వర్తించెరా, సై
రాజు కొలువులో చేరెరా, సై
రక్షక దళపతి ఆయెరా, సై
రాణీ గారిని వలలో పట్టి సై
రాజే అయి కూర్చుండెరా ॥భళా॥

రాజు కొలువులో చేరినాడు
రాజే కావడ మంత సులభమా ?

3

దురద బిరుదు గల వానికి, సై
దుస్తర మనునది లేదురా, సై
అసలైన ఆషాడ భూపతితకి, సై
అసాధ్య మే ఉండ బోదురా ॥విన॥

పంచ తంత్రములు తెలిసిన వాడు
బడా చోరు మన ఆషాడ భూతి,
నిర్విరామ గురు దేవ సేవలో
నిద్రాహారాల్ మానిన వాడు,
విశ్వ నరుల కందరికీ తనపై
విశ్వాసం కలిగించిన వాడు,
గురువు గారి కాసుల కంబళిని
గుట్టుగా కొట్టేసిన వాడు ! ॥విన॥

4

కాకులను కొట్టి గద్దలకు వేసి
మేకలను కోసి మెకములను పెంచి
దొంగలను ప్రోత్సహించెను , సై
తోకకు మేకకు వర్ణ పోరాటం
విదేశాల కెగుమతులు పెంచెరా !
స్వదేశమే లేకుండా జేసెరా ॥భళా॥

బందులు, సమ్మెలు, బాంబు దాడులు
జిందా బాదులు, చితక బాదుటలు
అరుపులు, కేకలు అన్నీ తానై
అందరికీ తానే నాయకుడై
ప్రజా స్వామికపు ప్రభువైనాడు
ప్రతి పక్ష భయంకరు డైనాడు ॥విన॥

5

నిరు పేదలకు అన్న దానాలు
నిండుగ చేయించి, భళా భళి !
నిరుద్యోగులకు ముష్టి పైసలు
మెండుగ యిప్పించె భళా భళి !
గుడిసె వాసులకు చవుక బియ్యము
గొప్పగ అమ్మించె, భళా భళీ !
కోళ్ల ఫారములు, బర్రెల దొడ్లు
బ్యాంకు అప్పులు, వృత్తి పన్నులు
కుల కలహాలు, గూండా దాడులు
రిగ్గింగులతో, బెగ్గింగులతో

జాతిని ముక్కలు చేసీ, ఆ
ముక్కలు మూటలు గట్టీ ,
విదేశాల కెగుమతులు పెంచెరా !
స్వదేశమే లేకుండా జేసెరా ॥భళా॥

6

కథ చెప్పర, బాబు, కథ చెప్పరా
ఖాళి కుర్చీ లిటే కదలి వస్తున్నాయి ! !

కథ లిప్పు డెక్క డున్నాయి రా, సై
కవితలు కూడా లేవురా, సై
పత్రికలు సైతం కాలే కడుపు కు ॥విన॥
మండె బూడిద వేస్తున్నారా

తీరిక సమయం, తిండీ, కొంపా
వుండి నపుడే కదరా బాబూ ,
కమ్మని కలలూ, కళలూ, కాంతులు ?
సుఖ శాంతులు, బహు సౌందర్యాలు ?

ఆకటి చావులె కథలు, నేడు
ఆత్మ హత్యలే కవితలు !
రాజకీయాలు, లంచాలు, అబలల
పై దౌర్జన్యాలు వార్తలు ఏదిర సత్యం, శివం ?
ఎక్కడుందిరా సుందరం ? ॥విన॥

154. జన్మభూమికి జయము

జయము జయము
జయము జయము
జన్మ భూమికి జయము జయము,
జాతి ప్రగతికి జయము జయము ॥జ॥

జహ్ను సుతకు కవేర తనయకు
స్తన్య మొసగిన తెలుగు తల్లికి ,
తెలుగు తల్లికి జయము జయము
వెలుగు వెల్లికి జయము జయము ॥జ॥

తెలుగు వెలుగుల తెలివి పండిన
దివికి జయము, భువికి జయము
సేతు శీత నాగేంద్ర రాజ్య
శ్రీ కి, ఆంధ్ర శ్రీ కి జయము ॥జ॥

155. బహుధాన్య

సిక్కు బెడ్డు పైనుండి చూచితిని, ఆ ర
వీంద్ర భారతి బహుధాన్య వేడుకలను !
వరియు, గోధుమ లేవందు, వరుస నెల్ల
గడ్డి ధాన్యాలె లేచి స్వాగతము పలికె !

(28-3-98, ఉగాది)

156. ఆ రోజులు మరి రావా ?

ఆనందమ్మున, అర్ధరాత్రముల, చం
ద్రా లోకముల్ కాయగ
నానా సైకత వీధులన్ వనములన్
నల్దిక్కులన్ శంభు, గౌ
రీ నాథున్, తరుణేందు శేఖరు, శివున్
శ్రీకంఠునిన్ పాడుచున్
ఆనందించిన రోజు లింక మరి రా
వా ? కోనసీమా మణీ !

157. సారా సంత

విశ్వాసం గల కుక్కలొ
కే స్వామిని నమ్ముకొంద్రు ; కేసరి కొకటే
ఐశ్వర్యము ; నేడున్న ప్ర
జా స్వామ్యము కల్లు సారా సంతర భీమా !

158. లక్ష్మయ్య సూరి

ఇచ్చకము లాడి పోదురు హితులె అయ్యు ,
అవరసరార్థము లేమని అడుగ బోరు ;
సాధు ముదిరాజ మౌళి లక్ష్మయ్య సూరి
పంపిన యునాని కొంత నా బాధ తీర్చె !

159. సుగరు బ్రతుకులు

గుడ్డ ముట్ట రాదు, లడ్డూలు తినరాదు ,
నోట బెట్ట రాదు నూనె వంట !
సుఖము లేని వెతలు, సుగరున్న బ్రతుకులు
మేలు బ్రతుకున్న మృతియె, భీమ్నా !

160. సిపాయిల తిరుగుబాటు

అరయ నాడు సిపాయీల తిరుగుబాటు
గెలిచియున్న, భారతి తుగ్లకే అయెడిది !
సమయమున కే మతంగుడు సాయ పడెనో
ఆంగ్ల హస్తము గెలుపొంది అభయ మిచ్చె !

161. ఆడుతూ పనేమిటి ?

ఆడుతు పాడుతు పని చేస్తుంటే
అలుపూ సలుపే మున్నది ?

కానీ - పైనొక ఖాయం దుంటే
తన్నులకు కొదవే మున్నది ? ॥ఆ॥

భూస్వాముల పిల్లలు సినిమాలలో
గెంతుట కాదోయ్ పని అంటే ! ॥ఆ॥

కండలు పిండి గుండెలలో తిం
డిని పండించుట పని అంటే ! ॥ఆ॥

గడి గడి గండం, నూరేళ్ళాయుసు
కార్మిక బ్రతుకుల నెరుగుదువా ?

ఆటలతోనె కడుపు నిండితే ?
ఆకలి ప్రశ్నే మున్నదీ ? ॥ఆ॥

(ఒక సినిమా పాటకు)

162. మాతంగ తనయ

దాస్యమే సుఖమైన హైందవ కులాలు
చింతిలవు రాజు లే విదేశీయు లైన ;
ఆత్మ గౌరవమే ప్రాణమైన భరత
మాత, మాతంగ తనయ ఏ రీతి నోర్చు ?

163. జాతీయ విధానము

రెండె జాతీయ పక్షము లుండ వలయు ,
నేత నందరు కలిసి ఎన్ను కొన వలయు ,
జాతి కొక దేశమై స్థిర స్థావరముగ !
కావలయు సోషలిజమె లోక వ్యవస్థ !

164. రాజధానికి నీరు

శ్రీ రామ సాగ రోర్మిలు
మా రాజ పురమ్ము చేరు మార్గము లేదా ?
హే రామ ! ఎందు బోతివి ?
క్షీరాబ్ధియు నెండిపోయె, క్షేమ మికేడన్ ?

165. జాతి కొక దేశం

జన్య సంబంధ శిష్ట లక్షణము లున్న
ప్రతి సమాజము జాతియై వరలు గాక
అట్టి ప్రతి జాతి ఒక దేశ మగుత, అట్టి
వెల్లను స్వతంత్రములుగ గణించబడుత !

166. పాదుకల నీడ

పాదములు దాను లనగా
పాదాంగుష్ఠములు కినిసి ప్రళయము తేగా
పాదుకల నీడ బ్రతికెడి
వేదన మా భరత చరిత ; వినవె, నృసింహా !

(నృసింహా శతకం లోని పద్యానికి)

167. గాడిద లెవరో ?

మా కేమి వ్రాసె నని రట
కాకులకును అంటరాని గాడిద లెవరో ?
ఏ కాలపు పాలేళ్ళో ?
ఈ కొంచెపు చదువు కూడ ఎచటిది ? భీమ్నా ?

168. కృతక నీతులు

మ్రొక్కిన వరమిడు దేవత
లెక్కడ నున్నారో చెప్పు, మేగెద నటకున్ !
ఇక్కృతక నీతు లెందుకు ?
క్రక్కెదవో విషపు కన్య కరణిన్, సుమతి !

169. జాతీయ సోషలిజము

పెరగదు కులమ్ము, వర్గ మస్థిరము, కనుక
పనికి రావని జాతీయ పక్షములుగ ;
ఎల్ల కుల వర్గములు కూడి ఎల్ల పనులు
చూడు, డద్దియె జాతీయ సోషలిజము !

170. చిత్త వృత్తులు

వృత్తులే వర్గములు, చిత్త వృత్తు లవ్వి ;
మతములను నంతె ; కావున మనుజులార !
జాతి కొక దేశమై సమస్యలను తీర్చి
విశ్వ మానవ జాతిగా విరిసి మనుడు !

171. యజ్ఞ నారాయణుడు

పూర్వ పరిషత్తు హితుడు, జూపూడి వంశ
యజ్ఞ నారాయణుడు పోయెనన్న వార్త
చదివి, తడి తడిగా తదక్షరము లుడుగ,
చదవ లే నైతి వార్త వట్టి దనుకొంటి !

172. ఎస్.ఎన్. బూసి

శ్రీ సారస్వతు డెస్సెన్
బూసి, సుభాషణి సమర్థ భోజుడు నాకున్
ఈ సూక్తి ముక్త వెలుగును
చూసిన దన తద్వదాన్య శోభయె, భీమ్నా !

173. మూఢులతో వాదం

మూఢులతొ వాద మేల ? న
వోఢలకున్ సరస మేల వృద్ధులతో, ఆ
రూఢ మనస్కుల కేలా
గూఢాచారుల తో పొత్తు ? కూడదు, భీమ్నా !

174. జై జననీ

జై జననీ !
జై భారత జననీ,
జై జై జై జన్మ భూమి,
జన్మ భూమి జయ భూమి ॥జై ॥

నీ చక్రం సుదర్శనం
నీ అస్త్రం పాశుపతం
శివ కేశవ విజయరథం
ప్రకృతి పురుష ప్రాణ పథం ॥జై ॥

నీది ఆది మానవతా
నీది వేద నాగరికత
నడుమ నడుమ ఎడమున్నా
నవ నిత్య జ్యోతి నీవు ॥జై ॥

తూర్పు పడమర వివేక చూడామణీ
ఉత్తర దక్షిణ ధ్రువాగ్ర క్రీడా ఘ్రుణీ
లోక జ్ఞానోదయ రవి కిరణా
ప్రాకృత విజ్ఞాన సర చ్చరణా ॥జై ॥

175. కొందరు ఖలులు

లోకములోన కొందరు ఖ
లుల్ సమతన్ భరియించ లేక అ
స్తోక బలాఢ్యు లైన దళి
తుల్ తమ ఆస్తుల బొంద కుండ, తా
టాకుల లోన వ్రాసిరి ప
రార్థము దొంగిల దోష మంచు ! ఆ
ఆకుల పాట నాపి, సక
లావని కిమ్ము శశాంక సౌఖ్యముల్ !

(తారా శశాంకం లోని ఒక పద్యానికి)

176. నిష్ఠ

కష్టము లందర కుండును ,
కష్టములే తలచు కొనుచు కలగకు, దృష్టా
దృష్టములయ్యవి, కావున
ఇష్టేష్టుల నిష్ఠ నుండు, మెప్పుడు, భీమ్నా !

177. చచ్చినా పైసలీయకు

జరయు, మృతియు లేని జననేత వలె నెల్ల
ధనము కొల్ల గొట్టి దాచు కొనుము !
యముడె వచ్చి ధర్మమడిగిన, ప్రాణమ్ము
లిమ్ము కాని, పైస లీయ వలదు !

(భర్తృహరి పద్యానికి)

178. పున్నయ్యగారి కోరిక

పున్నయార్యు కోర్కె పూర్తి అయినది, రెండు
వందలకును మించె పద్యరాశి,
పరిమళించు నిందు వాసియ రాశితొ,
వంక లెన్ను జబ్బు వలదు, భీమ్నా !

179. భ్రమలు

ఎచటనో చూచినట్లున్నదిది అనంగ
ఎచటనో విన్న యట్లున్నదిది అనంగ
పోలికలు తెచ్చి భ్రమ పెట్టు పూర్వ స్మృతులు ;
భ్రమలపై కట్టకుడు సూత్ర భవనములను !

180. హారతులు

కాలక్షేపము కాదిది,
హేళన కావ్యమును కాదు, హృద్ధిత పద్య
శ్రీ లలితా హారతు లివి !
గ్రోలుము పూర్ణాయు రమృత గుళికలు, భీమ్నా !

181. పద్యమొక కావ్యము

ఈ మహా కావ్య వనములో ఋతువు లెల్ల
బృంద నృత్య గానముల నానంద పరచు,
పద్య మొక్కొక టొక కావ్యముగ విరియు
భ్రమర హృదయము లుండిన భావుకులకు !

182. ఆకటి యాత్ర

ఆయుష్షు పెరిగెనా ? అయి
నా, యెందుకు ? హింస తరిగెనా ? సుఖ సంతోష
శ్రేయములు విరిసెనా ? మరి ,
ఈ యాకటి యాత్ర లక్ష్యమేదిర ? భీమ్నా !

183. ఏమి వ్రాసావు ?

నిరుప హతి స్థలంబు, రమ
ణీ ప్రియ దూతిక తెచ్చి ఇచ్చు, క
ప్పుర విడె, మాత్మ కింపైన
భోజన, మూయల మంచ, మొప్పు త
ప్ప రయు రసజ్ఞు, లూహ తెలి
యంగల లేఖక పాఠకుల్ సదా
దొరికిన నీవు ఎన్ని సుకృతుల్
రచియించితి వయ్యా ? పెద్దనా !

184. కొడుకు కోసము

కొడుకు కోస మంచు కూడ బెట్టుచు నుండ్రు
భూమి ధనము యిరుగు పొరుగు దోచి !
పోరు విస్తరిల్లె, పోటీలు మిన్నంటె
కూటి కోస మెంత గోడు ! భీమ్నా !

185. సెక్స్ సినిమాలు

చోసేతి బంధములతో
తీసిన సిన్మాలు కొంప తినివేయ నెయిడ్స్
మేసేసె యువక ధాతువు !
పైసలె నిరయాగ్ని పూల పరుపులు, భీమ్నా !

కుక్క సంత కెళ్ళి కూలిన దాస్పత్రి,
నరులు పుట్టి కూలె నరక మందు !
సింహ పీఠమెక్కి, సెక్స్ సిన్మా తీసి
రెడ్డు లైటు జేరె రేడొకండు !

నివురు కోక గట్టి నిప్పు సంతకు పోవ
సిగ్గు చెదరి సంత భగ్గు మనియె!
వర్తమాన యువ ప్రవర్తన మిట్లుండె,
బొగ్గులగుచు నుండె బుద్ధి, శుద్ధి !

186. రాజ్యలక్ష్మి

కుసుమ రాజ్యలక్ష్మి కువలయమును వీడి
బైటపడుట వింటి, బాధపడితి ;
సుబ్బరావు భార్య , సోదరి మూర్తికి,
బయ్యవారి బిడ్డ, బంధు నాకు !

(మూర్తి = బి.ఎన్. మూర్తి)

187. సద్య స్ఫూర్తి

ఎవ్వడెవ్వ డెప్పుడే పనులను చేసి
ఖ్యాతి గనును చెప్పగాదు, కనుక
ఇష్టమైన దాని నేమర కుండుము !
చేతి కందు దాని జేసు కొమ్ము !

188. పాత పెరడు

పేరడీల కొరకు పెల్లగించితి పాత
పెరడు కొంత, వింత పిచ్చి రేగి ;
రాగి బిందె లందు రత్నాలు దొరికెను !
పెరడు నిండ కొత్త సిరులు విరిసె !

189. సనాతన అణుశక్తి

పాశు పత చక్ర ముఖ్య దివ్యాస్త్ర చయము
మాయమయ్యె కురుక్షేత్ర మైన పిదప
నాటి కీనాడు తిరిగి సనాతనాణు
శక్తి భారతి అభయ హస్తమున కెక్కె !

నింగి నేల నీట నిత్య యానము చేయు
నెల్ల వాహనముల ఇంధన మిది !
ఇంటి మింటి కంటి చంటి పాప అణువు
విక్రమింప, దెసల విరియు బ్రహ్మ !

అణు మహా సూర్యు డుదయించె, హద్దు మీరి
చొచ్చు కొని వచ్చు చీకట్లు విచ్చి పోయె
మానవ చరిత్ర నావర్తమాన చరిత
చివర విరసిన భారత శ్రీ ప్రకీర్తి !

(13.5.98 అణు పరీక్ష)

190 ఆరుద్ర పురుగులు

మోసగించె డబ్బు, మోసగించెను మబ్బు
మోస పోతి నంచు మొత్తు కొనకు !
ఆర్ద్ర కైన రావె ఆరుద్ర పురుగులు ?
పద్మ రాగ మణులు, పచ్చ నోట్లు ?

191. ఇల్లు x పెళ్ళి

ఇల్లు కట్టుటయును, పెళ్ళి చేయుటను,
నరుని రెండు జీవ నాడులివ్వి
చేసి తీరు నరుడు, గాసిల్లు చును నుండు
బ్రహ్మ వ్రాత లోని పంక్తులివ్వి !

192. హిప్నాటిజం కంటే

తాగు బోతు చేత తప్ప తాగించిన
కడుపులోని కుళ్ళు కక్కి వైచు
హిప్నాటిజము కంటె ఇది మేలు, న్యూటనూ !
ట్రాన్సు బదులు భంగు త్రాపి చూడు !

193. హింస నైజము

గిల్ల కజ్జాలు సహజము పిల్లలందు,
పెత్తనపు పోరు లుండును పెద్దలందు,
రాజ్య విస్తరణలు కల్గు రాజులందు,
హింస కెవడును తొలగి జీవించ లేడు !

హింస హింస యటంచు ఏమొ ఏమొ వగచి
మల్లె పువ్వునె త్రుంచుట మానినావు,
కాని, అది నేల రాలుట మానలేదు !
పూవు బ్రతుకెంత వృధ చేసినావు, సఖియ !

(నా మధుగీత కావ్యమునుంచి)

194. డాక్టరు మిత్ర

గురు కులమ్ము కాని, గోకులమో కాని
ఇంటి పేరులోనె ఎంతొ కలదు
అశ్వినులకు సాటి ఆక్యు - హోమియొ డాక్టు
మిత్ర, నాకు ప్రాణమిత్ర, భీమ్నా !

195. విశ్వసాహితి

చెలిమిలోన సాంబశివరావు చెలి నాకు
పోతుకూచి విశ్వ ధాతు సూచి
సతము ఫోను చేయు, సంక్షేమ మారయు,
విశ్వసాహితులకె విలువ, భీమ్నా !

196. తల్లి ఋణము

గర్భము ధరించి మోయుట, కనుట,బాల్య
మెల్ల పెంచుట నైజమే తల్లి కైన !
తల్లి పట్ల ప్రత్యేక బాధ్యతయు లేదు
తల్లి ఋణమను మాట కర్థమును లేదు !

197. పద్ధెనిమిది

ఎంటి యారు మింటి కేగిన నెల, తేది
భారతేతిహాస పర్వ సంఖ్య,
నేను తూలిపడ్డ నెల డేటు నొక్కటే
యగుటలోన గల రహస్య మేమొ !

198. పనిమాలిన పనులు

గొణుగు కొనుచు, మూల్గు కొనుచు, అదృష్టము
తిట్టు కొనుచు, నెత్తి కొట్టు కొనుట
ప్రజ్ఞ లేని వాని పనికి మాలిన పన్లు !
విశ్వయోగ ధామ, వినుర భీమ్నా !

199. భార్య భర్త

భార్య చిన్నదైన భర్తను సేవించు,
భర్త చిన్న యైన భార్య గొల్వ
తప్ప, దట్టి దాని తప్పించు కొనుటకై
వధువు చిన్నగుండ వలయు నండ్రు !

200. ఎవర్ని గొలిచినా

ఒకడు తండ్రి గొల్చు, ఒకడు కొడుకును గొల్చు
అకల వికల సకల నొకడు గొల్చు !
కొలుపు లెన్ని ఎవరి కొరకైన కానిమ్ము
కూడొకండె మనుజు గుణము, భీమ్నా!

201. శశిరేఖ

లేఖక పాఠకులను శశి
రేశా శేఖరుడు నాకు ప్రీతి నొసగె ; ఈ
లేఖన ఈ అభ్యుదయ సు
రేఖలు ఫాలమున నిడుత శ్రీ భారతికిన్ !

202. శ్రీ మిశ్రా

భీమన్న దళ మనన్ విని,
భీమన్నను నను దలంచి, ప్రీతిన్ యోగ
క్షేమము లరసె కలెక్టరు
శ్రీ మిశ్రా హృదయ మెంత మృదువో ! భీమ్నా !

203. పాడేటి జాన్సను

పాడి పోదు నంచు పాడేటి జాన్సను
పాడ దొడగె మేటి పర భృతముగ !
పికమె ఏల నయ్య ? శుక శారికలు – లేవె ?
పంచమమును విడిచి పాడు మంటి !

204. లక్ష్మీ కామేశ్వరులు

గంటి ఇంటి లక్ష్మి కామేశ్వరీ దేవి
అన్న పూర్ణ మాకు అమ్మ తల్లి !
చిన్న వాణి తల్లి శ్రీలక్ష్మి మరియొక
తల్లి మాకు తినెడి వెల్ల పుంపు !

205. కుమార స్వామి బాబా

మరచి పోవ లేదు, వరలక్ష్మి సావిత్రి
క్షణము క్షణము మాకు సాయ పడుట;
ప్రేమ జల్లు జల్లి శ్రీరామ మూర్తి ది,
స్వాదు హృత్కుమార స్వామి బాబ !

206. వాస్తు

వాస్తు అనగ వస్తు సంబంధి, వ్యక్తి స్వాభి
రుచిని బట్టి గేహము నమర్చు కొను రీతి !
వ్యక్తి గత మయ్యు మారగ వచ్చు నదియు
కాల చక్రాను వర్తు లే క్రమములైన !

207. భూత భయము

హే భగవాన్, హే భగవాన్
హే భగవాన్ అనుచు హుంకరించిన నంతన్
ఏ భూతమైన మన్నో !
ఏ భీతియు తొలగి, అభయమే పల్లవిలున్ !

208. భీతే భూతము

దయ్య ముండిన వెను వెంట దైవముండు,
భీతిచెందిన మనసె ఏభూతమైన ;
ఉన్నదేని నిన్నెదొ యేచు చున్న భీతి
అంత హే భగవా నంచు అరచి పిలువు !

209. మునియప్ప

నీవు ఫోనులో చేసెడి సేవ లెల్ల
చేసెదను నేను భావ వీచికల తోడ ;
నీవు మునియప్ప, ముని నేను భావలయకు !
కేబులున్నది నీకు, నాకేమి కలదు ?

210. నిప్పులతో కాపురం

ఎప్పుడు కాల్చుక తినియెడి
నిప్పులతో కాపురంబు నిర్మలమె సుమీ !
సప్పముల నీడ బ్రతికెడి
కప్పల స్వర్గములు చూచి కలగకు, సుమతీ !

211. రాళ్ళ వడలు

పూరీల పిల్ల బూరెలు
గారెలు తెచ్చినది, ఎంత కని ఆ లడ్డూల్
ఆ రాళ్ళ వడలు నమిలెదు ?
లేరా ఇక తిందు గాని, లేటేల ప్రభూ ?

212. నిన్ను చంపే అవకాశం

చంప దగిన యట్టి శత్రువు నీచేత
చిక్కెనేని కీడు చేయ బోకు,
అతనికిచ్చి వదలు ఆ అవకాశమ్ము !
అన్న మదియె, సున్న మదియె, వేమ !

213. స్మృతి x విస్మృతి

గతము జ్ఞప్తి యుండటయె జీవితము, జ్ఞప్తి
పూర్తిగా లుప్త మగుటయె మృత్యు వగును ;
స్మృతికి విస్మృతి పగటికి రేయి ; నాట్య
దేశ మొకటైన, పాత్రలు దేని కదియె !

214. భగవాన్ అంటే

ఈశా వాసము సృష్టి క్రి
యా శీలక శక్తి, పలుకు నంతన విను నా
కాశము భగవా ననగ ; ప్ర
కాశించును, అణచు నంధకారము, భీమ్నా !

215. ఎవరిదృష్టి వారిది

పురుషుడటు చూచి దైవము పురుషుడనియె,
స్త్రీయు పరికించి దైవము స్త్రీయె అనియె,
వ్యాసుడు వచించె అది పరమాత్మ అనుచు
ప్రకృతి పురుషైకతా సమైశ్వర్య మద్ది !

216. సర్వం స్మృతి మూలం

స్మృతియే శ్రుతులకు ప్రాణము,
స్మృతియే ప్రేమాను రాగ జీవిత మెల్లన్,
స్మృతియే సంస్కృతి, చరిత్ర,
స్మృతి లేనిది ఏమి లేవు సిద్ధులు, భీమ్నా !

217. బడుగు వెంకటు రెడ్డి

బడుగు వెంకట రెడ్డి నాబాల్య సఖుడు
పోయెనను వార్త ఇప్పుడె ఫోను చెప్పె ;
సంద్ర మొక్కటి, అలల మందరము, నైన
కలిసి నడిచిన స్మృతి తెచ్చు కంట నీరు !

(1.5.1998)

218. చింతా X నిశ్చింత

చింతా శ్రీరామమూర్తి
సాంతము అంబేడ్కరైటు, సర్వ జనైక
స్వాంతుడు, సివిలింజనీరు,
ధ్వాంతము పోగొట్టి వెలుగు బరపును నాపై !

219. చిరునీడల చీకటి

అరుణోదయ రవి ఆజ్ఞకు
తిరుగే లేకుండు; కాని, దశ మారు తరిన్
చిరునీడలె పెరిగి నిశా
చరమాబ్ధిని ముంచివేయు జగమునె, భీమ్నా !

220. చరమాంక తపకులు

పరువమును తలుచు కొనుచున్
దుర పిల్లకు, హింస పడకు దుర్ వ్యాఖ్యలకున్,
చరమాంక తళ తళలవి
కరవైనన్ బ్రతుకు పూర్తి కాదుర, భీమ్నా !

221. జ్ఞాపకము రారు

అంతవరకు నజేయులౌ అతి రథులకె
సమయమున కస్త్ర మంత్రముల్ జ్ఞప్తిరావు ;
అట్లె కావచ్చు ఎంతటి ఆప్తులకును
జ్ఞాపకము రారు మిత్రులు, శంక లేల ?

222. అమ్మ

అమ్మ ప్రేమను బిడ్డల కంద జేయు
వీలు లేదు నేడని విలపించ వలదు
వీలు లేకనె ఈ పాటి మేలు కలిగె,
చెత్త వారసత్వము నుండి స్వేచ్ఛ కలిగె !

అమ్మ ఉన్నది దొంగకు, హంతకునికి,
సూత సుతునకు, శుకునకు మాత కలదు
ధరణిలో ప్రతి వెధవకు తల్లి కలదు
ప్రకృతి కర్మల కాడంబరమ్ము లేల ?

పాలు గలయంత కాలమే పసువు తల్లి,
పక్షములు వచ్చువరుకునె పక్షి తల్లి,
తల్లి చాటు బిడ్డగ జీవితమ్మునెల్ల
నాశనము చేసుకొను వాడు నరు డొకండె !

(10.5.98, అంతర్జాతీయ మాతృదినం నందర్భంలో)

223. సత్యము X మిథ్య

స్మృతియె సత్యము, స్మృతి లేని దెల్ల మిథ్య
స్మృతికి విస్మృతికి ని భేదమేమి లేని
స్థితియె నా రసాద్వైత సంబుద్ధి, అదియె
యోగ రాగ పాదాత్మ్య సంసిద్ధి, భీమ్నా !

224. శ్రీ కరుణ

చిత్ర సీమకు, దూరదర్శినికి వెలుగు,
కార్య సాధన కళలోన ఘటికురాలు,
తన పనులు మానుకొనియు నాపనులు చేయు
శ్రీకరుణ, మా ఆవిడ శిష్యురాలు !

225. పంపన సుమిత్ర

కాలెజీలో మా పిల్లల క్లాసుమేటు ;
చిత్ర నక్షత్ర వనములో చిగురు తార,
పంపన సుమిత్ర అపుడప్పు డింస్సు కొచ్చి
అన్నమును తినిపించిన దాదరమున !

226. స్మృతి పథంలో

రేఖ, సూర్య, రూదేంజిల్, నరేన్, నృసింహ,
పద్మ, పద్మజ, తేజ సుభామణి బూసి,
న్యూట నాదులు నాస్మృతి ద్యో వనాన
చంద్ర తారకలై వెల్గు చుంద్రు సతము !

227. జనవరి 18 x మే 18

గతము లేదు, ఎరుంగ నాగామి ఏమొ
నాకు గల వర్తమానము నాల్గునెలలె !
జన్యువరి లోన పర్వాల సంఖ్య మొదలు
సరిగ మే నెలలో అదే సంఖ్య వరుకు !

228. తారకం

రాజకీయము నకును ఆర్ధతకు పడదు
సరస జీవిత మార్ధత సాధు జనత,
బొజ్జ తారక మిందుకు మూర్తి నేడు !
ఏలను రసజ్ఞులకు రాజకీయ రభస !

229. హత్య

ప్రాణ మాన విత్త భంగ త్రయము నందు
బొంక వచ్చు మానవుండు, కాని
ఔషధమును తెత్తు నని చెప్పి రాకుంట
హత్య కన్న తక్కువగునె, భీమ్నా!

230. మాధవరావు

కాకి మాధవరావు సత్కార్య దీక్ష
నా ప్రకృత కావ్యమునకు ప్రాణ ప్రతిష్ఠ
మాధవత్వము మానవతా ధరిత్రి
కవికి చేసిన మేలెల్ల భువికి మేలు !

231. వడ్డి శాస్త్రి

వెంకన్న, శాస్త్రి, తదుపరి
వెంకట శివరావు ; న్యాయ విద్వాన్, అయినన్
శంఖేదో చంద్రు నిన్ ఒలె
గ్రుంతిచెను గాక, రవి యగున్ కద కవులన్ !

232. జ్వర తరంగిణి

నిమ్స్ డైరెక్టరు మహా మనీషి, లోక
సుప్రసిద్ధుడు కాకర్ల సుబ్బరావు
జ్వర తరంగిణిని నాకిచ్చి చదువు మనియె
దుత్త బాబ్రావు దొక రోగి దుఃఖ చరిత !

(జ్వర తరంగిణి దుత్త బాబూరావు గారి రచన)

233. ధర్మన్న గారి ఫోటో

జయ భేరి పాత ప్రతులే
మై పోయెనో, కుసుమ ధర్మ నార్యు ఫొటోయే
దియు దొరకక వగవగ, పు
న్నయ గారే వెదికి పట్టినా రొక దానిన్ !

234. అణువు x హనుమ

అణువు పెట్రేగి హనుమ యై అడర, నేను
తత్ భుజాలెక్కి రామ భద్రత వహింతు
మూఢ విశ్వాసముల నెల్ల ముంచి వేసి
భూమి సేవింతు సుఫల సుశ్యామ జేసి!

235. మన్ను x వెన్న

మన్ను తిన్న నోట వెన్నను తిను టెట్లు ?
వెన్న దొంగ అనుట వెర్రి కాదె !
కూడు తినెడి నరులు కూసెద రారీతి
అనుచు గొణుగు కొనును ఆవుదూడ !

236. సినారె

గతములో ఎవ్వ రెందరు కలరో ఏమొ !
నవ యుగాకాశ మందు సినారె ఒకడె
నిత్య వైశాఖ సూర్యుడై నిల్చినాడు
ప్రగతి వాణీ ప్రవీణా ప్రపంచమునకు !

237. చంటి భూమయ్య

న్యాయమె తోడుగ పుట్టెను
ప్రాయమ్మును దళిత సేవ పర మొసరించెన్ ;
ఆయనయె చంటి భూమయ
గేయమె తత్ చరిత వీరగీతమె, భీమ్నా !

238. జస్టిస్ పున్నయ్య

ఘన్ను న్యాయమూర్తి జస్టిస్ పున్నయ్య
వీర గాధ లెన్నో వేలు కలవు ;
శైశవమ్ము నుండి సప్తతి వరకవే !
వినుటలేదు వ్రాసి పెట్టు మనిన !

న్యాయ పాలనమున, న్యాయ నిర్ణయమున
పరిధులుండు, నుండు పద్ధతులును ;
ఉపరి గంగ తెచ్చి ఉర్విని పండించె
పండినంత తెచ్చి ప్రజల కిచ్చె !

కులము లేదు, వర్గములు లేవు ప్రభుతలో
సమత చూప వలయు సర్వ దిశల ;
ఉన్న పరిధిలోనె ఉపకారములు చేయు
ప్రజ్ఞ కలుగు వాడె ప్రభువు, భీమ్నా !

239. ఊట్ల కొండయ్య

బావగారూ అనుచు నన్ను పలకరించు
పద్యకవి ఊట్ల కొండయ్య పరము చేరె
అందు శ్రీనాథుడున్న ఆనంద పడుచు
భావ కవి మిత్రులకు చాకిరేవు పెట్టు !

(చాకిరేవు ఊట్ల కొండయ్య గారి కావ్యం)

240. మచ్చా శ్రీరాములు

మచ్చా శ్రీరాములు కన
వచ్చు ననున్ తరచు, మానత్వము గల శ్రీ
మచ్చరితుడు, ఏదో ఒక
టిచ్చుచునే యుండు విందు లిల నందరకున్ !

241. గతమే నయం

రమ్య మున్యాశ్రమముల, ఆరణ్యకముల
బుక్కులను పాడు కొనుచు జీవించు నాడు
నేటి కంటెను సుఖము లుండి నని కావె ?
నరకమున కంటె ఘోరమీ నాగరికత !

242. నాల్గునెలల సాహిత్యము

లేదు గతము, భవిష్యతు లేదు నాకు,
నాకు గల వర్తమానము నాల్గునెలలె !
ఇందుగల గేయ పద్య సాహిత్య మెల్ల
నాల్గు నెలల సిక్ బెడ్ కే అంకితమ్ము !

243. మా ఊరి నూకాలమ్మ

నూకలమ్మకు దూడలు,
మేకలు మాన్పించి పాలు మీగడ లీయన్
చే కొన్న జగన్నాథము
నాకిపుడు జ్ఞప్తి వచ్చి నైనా లదిరెన్ !

(సంవత్సరాది నాడు మాఊరి నూకాలమ్మకు జరిగే జాతరలో జంతు బలులను మాన్పించటానికి నామిత్రుడు నైనాల జగన్నాథం చేసిన ప్రయత్నం జ్ఞప్తికి వచ్చి)

244. సంజీవ రెడ్డి వర్ధంతి

సంజీవ రెడ్డి వర్ధం
తిం జేయుచు నన్ను పిలిచె కృష్ణకుమారీ
సంజీవని డాక్టరు ; నే
నంజలి ఘటియిస్తి సభకు నాల్గు నెలల కున్ !

(1-6-98)

245. వీర ద్రౌపది

కర్ణుపైని మనసు కలదన్న ద్రౌపది
పోర నతని గెలుపె కోరు కొనదె ?
ఎవడు మోపె నట్టి హీనాప నిందను
విజయు చేతి వీర విశిఖ పైనె !

అన్న భార్య తమ్ము లందరి భార్యగా
వరుస వావులున్న తరము లవ్వి !
పంచ భర్తృక అని పాంచాలి నెవడను
అంధ కవుల నటుల యావ తప్ప ?

246. బ్రతికున్నపుడే

బ్రతికి యున్నపుడే ఎంత వానికైన
గౌరవమ్ములు, విందులు, కవులు, రవులు;
ఆగిపోయిన ప్రతివాని నధిగమించి
పోవు లోకము, గంజియు పోయలేదు !

247. నియంత్రితము

రవి కుటుంబమునకు నేత రవియె, కాని
గ్రహ గతులు వ్యక్తి గతములు ; కాల గతియు
దేనికదె ; దేని మనుగడ దానిదె యగు ;
నిత్య నియమానుకత నియంత్రితము సృష్టి !

248. రోజు చచ్చేవాడు

నిత్యమును చచ్చు నరు కేడ్వనేల నంచు
ఏడ్వ మానిరి అను నిత్య మేడ్చువారు ;
ఏడ్వ మానిరి ఇక చావ నేల నంచు ;
చావ మానెను నావంటి జడుడు, భీమ్నా !

249. ముగ్గురు ప్రొఫెసర్లు

యడ్ల సింహాద్రి, ఈనాకు, ఆపదరావు
ప్రాభవము గల ప్రొఫెసర్లు, వా క్సుమణులు ;
వత్తు రపుడప్పు, ఫోనులో పలకరింత్రు
వాణి పలుకుటయే నాకు వారిపలుకు !

250. పర్మనెంటు అడ్రసు

జీవ లవ మొక ముక్త , కించిత్తు మెరుపు ,
దాని చుట్టు అనంత బ్రహ్మాణు శక్తి ;
ప్రతి అణువు కేంద్రమే, దేని పరిధి దాన్ది ;
పర్మనెం టడ్రసదియె యే ప్రాణికైన !

251. పురిటి గది

వర్త మాన మేదొ బాధించు నప్పుడు
గతము శాంత పరచు స్మృతికి వచ్చి ;
వ్యక్తి బ్రతుకులోన వర్తమానము భార్య
గతము తల్లి, పురిటి గదియె బ్రతుకు !

252. సూర్య విశ్వనాథు

సూర్య విశ్వనాథు, సూపరెంటెక్బెజు ,
దివికి చేరె నెపుడొ దీప సభకు ;
అన్ని పండగలును ఆతడే, మాహాలు
నిండ మెరయు నాతని కెమెరాయె !

253. రుద్ర భూమి

గత ఎనుబదేండ్ల ఎపిసోడ్ల శత పథముల
దూర దర్శిని కథనంబులై లమించు !
భూమి తనదన్న ఆ రుద్ర భూమి యెల్ల
నాదిగా వచ్చు చున్న దీనాడు వలచి !

(అరుద్ర భూములన్ని నాకే అన్నాడట అరుద్ర ఎప్పుడో)

254. మోహన

పాడుతా తీయగా అను బాలు రాగ
ఝరికి జడ్జిగా చిత్తరంజనుడు వచ్చి
మోహనకు లక్ష్య మనుచు నుదాహరించె
నా లలిత గేయమును, ఆయనకు నమోస్తు !

(చిత్త రంజనుడు = ఆకాశవాణి సంగీత దర్శకుడు)

255. కవి ప్రత్యేకత

కవి, రవి, భువి, దివి నాలుగు
ఇవి అవి, అవి ఇవిగ జీవ సృష్టికి మూల
చ్చవులగుట, రవి దివిగ ,
కవియె భువిపై చరించు కాలము లెల్లన్ !

256. ఇల్లు కడగడం

కవికి సంఘసేవ కర్తవ్య మనరాదు,
కవిత లోక సేవికయును కాదు
పసిడి పాలతోడ పాయసమ్ములు గాక
ఇల్లు కడుగు కొంద్రె ఎవరైన

257. దైనిక కార్యక్రమం

నా దైనిక కార్యక్రమ
మేదైన సదా నినున్ స్మరించుటయె యగున్ ;
నాదైన దెల్ల నీదే ,
నాదైవము నీవే క్షణ క్షణమ్మును, వాణీ !

258. సహన దేవత

నాకున్ కూతుం డ్రెందరో,
లోకమె ఒక పెద్ద కూతురుగ సేవించున్ ;
మేకొన్న సహన దేవత
ఈ కూతురు, విజయ వీణకే పల్లవి యౌ !

259. హింస X అహింస

హింసకులని తిట్టకుము, అ
హింసకు లెవ్వరును లేరు సృష్టి చరిత్రన్ ;
కంసుని హింసకు ఆత్మ
ధ్వంస భయంబొకటె హేతువౌ కద, భీమ్నా !

260. నిగమసీమ

జన్మతో నిరుద్ధుడను, నైజమ్ము తోడ
నేను అనిరుద్ధ డను, నాది నిగమ సీమ ;
గౌతమీ ద్వీపమున సామ గానములతో
వేద వేదాంత రచన జీవితము నాకు !

(నిరుద్ధుడు = నిరోధించబడిన వాడు)

261. పోలీసులు

పోలీసుల పట్ల నెదో సానుభూతి నాకు,
ఆయు వెన్నేళ్ళో, గండాలె రేయి పగలు ;
కొట్ట గూడదు, కొట్టక గుట్టు రాదు !
ధర్మ రాజులు బ్రతికింత్రు తాము చచ్చి !

262. ఎవరు నగ్గల్సు ?

ఎవరు శాంతి కాము, లెవ్వరు నగ్గల్స్ ?
దొడ్డ వార లెవరు, దుష్టు లెవరు ?
వారె వీరు గాలి వాటమె నిర్ణేత
కోటి వృత్తులైన నోటి వరకె !

264. కుటుంబమే లోకం

తన కుటుంబమె లోక మెవ్వనికి నైన,
తానె కేంద్రము, దానికి తానె బ్రహ్మ !
అఖిల బ్రహ్మాండ భాండమ్ములందు తానె
బహు విధమ్ముల భాసించు భాస్కరుండు !

264. మంచాల నిజం

మంచమున పడక ముందే
మంచిగ పోవలయు నంద్రు మందులు ; అసలీ
మంచాల నిజము గానక
పంచత్వము నందు టేమి ఫలమౌ, భీమ్నా !

265. దిక్కు లేని విధులు

కథ లెల్ల కంచి కేగును,
వ్యథ లెల్లను కాశి కేగు, ఆపద మొక్కుల్
నిధులెల్ల అలక కేగును,
విధులే ఒక దిక్కు లేక వీధుల తిరుగున్ !

266. ఎలుకలు

ఎన్ని వంటిళ్ళ నేమేమి తిన్న గాని
ఎలుక ఎలుకయె సరిగాదు ఏనుగునకు ;
నెరసు లెన్నయిన, అసువు లెన్నిటిని తిన్న
సాధు సంసార రసనకు సాటికావు !

267. సర్వ జనీనత

దళితోద్ధరణకు తామున్
దళితులు కారాదు కవులు, నాయకు లెవరున్ ;
దళితులొక వర్గమో, ఒక
కులమో కారాదు ; కోట గోడలె తామున్ !

268. నెల్లి x పొల్లు

సంస్కృతము కన్న హీబ్రు విశ్వ జనని యగునె ?
ఉపనిషత్ చింతనల మించు నుర్వి నేది ?
సీత వంటి ఐశ్వర్య మేసీమ గలదు ?
మేలు నెల్లి మునిగి, పొల్లు తేలె గాక !

269. వృద్ధ శయ్య చుట్టూ

ఎంత తిట్టిన ఫీల్గారు, సుంత చేసి
విసుగు కొందురు, శపియింత్రు ; వేళ లెరిగి
ప్రియ పదార్థములను తినిపింత్రు ; ఇట్లు
వృద్ధ శయ్యను సేవింత్రు వివిధ హితులు

270. హక్కులు

ఇచ్చునవి కావు హక్కులు
పుచ్చు కొనెడివియును కాదు ; పోరాడి మరీ
తెచ్చు కొనవలసి నట్టివి !
చచ్చులురా హక్కులడుగు జాతులు, భీమ్నా !

271. పేడ కడులు

నల్ల దొరల స్వరాజ్య బృందావనమున
దూడ లుండవు, ఎల్లెడ పేడ కడులె !
నలుపు వద్దన్న ధర్మన్న నల్ల బడెను
తెలుపు వద్దన్న గరిమెళ్ళ తెల్ల బడెను !

272. వణుకుతున్నా

ఒడ లెల్ల వణకుచున్నను
నడలదు వ్యామోహ మేదొ సభలకు పోవన్ ;
నడిపింతు రెవరు నన్నిక
కడు గూర్చెడు నీవు గాక గణ యతి ప్రాసా !

273. గణేశ కుమారు

అడపా దడపా వచ్చును
అడపా గణేశ కుమారు ఆప్రాదులతొ
ఎడనెడ నుందురు జగతీ
జడతను తొలగించు ఇట్టి జ్ఞానేశు లిలన్ !

274. అడిగితేనే ఆదరణ

ఆశ్రయించిన వారినే ఆదరించు
శ్రీనివాసు డైనను, కల్ప వృక్షమైన ;
పైరవియే లేని ఏపూర్ణ ఫాల్గుణమ్మో
అడగకే నాకు అందించు అవసరములు !

275. చింతలే చింతనలు

గొంతెత్తి పాడ దలతును,
గంతులతో ఆడ దలతు, కదలవు ప్రాణాలు
చింతలె మిగిలెను, ఇవె తుది
చింతనలై కలిసి పోవు సృష్టి స్థితులన్ !

276. కవిత ఛందస్సు

వస్తువును బట్టి, వస్తు తత్వమును బట్టి
వివిధ ఛందస్సు లమరు కవిత్వ మందు
వచన కవితయు తగు కొన్ని వస్తువులకు
తేనె ముఖ్యము పూలు వేరైన గాని !

277. నిత్య యత్నం

ప్రశ్న దేని కైన ప్రత్యుత్తరము గల్గు
శవము కైన బ్రతుకు ఛాన్సు గలుగు ;
ముడులు కలవె ఎందు విడదీయ రానివి ?
నిత్య యత్న మొకటె సత్య పథము !

278. మూటే మారణాయుధం

ఇన్ని భాషలేల, ఇంత వాంగ్మ యమేల ?
మౌన సుఖమె గమ్యమైన మహిని
మాట మాట కన్న మారణాయుధమేది ?
పిక నిఘంటు వొక్క పేజి కాదే ?

279. పాలక ప్రజ్ఞలు

జుట్టు చేత బట్టి చుంబించ వలె మోము
తిండి చూపి పొదుగు పిండగ వలె !
చేత గదను బట్టి స్వాతంత్ర్య మీ వలె
ప్రభుత చేయ గల్గు ప్రజ్ఞ లివియు !

280. భీమ్న నామము

భీమ నాము మేని, భీమన్న పేరేని
కవిత కీడు జోడు కాదు నిజము !
అంద గించ విట్టి అభిదానములు నాకు,
పిసరు మేలు కాదె భీమ్న అనుట ?

పేరు మార్చు కొమ్మని నన్ను పెక్కు మంది
చెలులు కోరిన నాటికే చేరు కొనెను
అన్న లందు నాపేరు భీమన్న అనుచు !
భేద మేమిటి భీమన్న భీమ్న యైన ?

281. నీ గుణమె సృష్టి గుణం

తల్లి తండ్రి, గురువు, దైవంబు అని గాక
పాప మనుచు జాలి పడియు గాక
అనుసరించవలయు ఆత్మీయ ధర్మంబు !
గుణము నీదె సృష్టి గుణము, భీమ్నా !

282. పోషకాహారము

ఈ రచన ఇంత పెరిగిన కారణమ్ము
అదును కందిన పోషకాహార బలమె !
కన్న వారలు పెంచ లేకున్న గాని
పెంచువా రున్నవారైన పెరగ కేమి !

283. పదును

నా రచన లెంత యేని మా నారి నిత్య
నిర్దయా వ్యాఖ్యలకు పదునెక్కి నవియె !
తిట్టు కొలదియు మొండి కెత్తెడి గుణమ్మె
ధనియమ్మై, కొత్తిమీరయునై తనుపు నన్ను !

(మా నారి=మా ఆవిడ)

284. కొబ్బరి నీరు

తాగుమనె నొక డాక్టరు ; తాగ గూడ
దనె మరొక్కడు, కిడ్నీకి హాని అనెను ;
చర్చ కొబ్బరి బొండాల చర్య గూర్చి !
అమిత మపకారము దేని కైన, నిజము !

285. మూడు కన్నుల పురాణం

శ్రీ మహావిష్ణు వొక సారి శివుని కొండ
కేగె వైశాఖ మాసపు టెండల బడి,
స్వాదు శీతల వారితో సేద దేరి,
అడిగి మరి త్రాగి మురిసె తదమృతరుచికి !

ఆ పరమ సన్నివేశపు జ్ఞాపికలను
నాటు కొనె తెచ్చి తన పాల తోట లోన ;
కల్పతరు లవ్వి, ముక్కంటి కాన్కలయ్యె
కొబ్బరియు, తాటి చెట్టును కువలయముకు !

286. పనికి తిండి

బ్రతక లేడు మనిషి పని యేదొ చేయక
చేయు పనికి మంచి చెడ్డ లేల ?
పనికి తిండి రాని బ్రతుకెండి పోవును !
ఎండనున్న బ్రతుకులే దుండగీండ్రు !

287. నాపై జాలి ఉంటే

నాలుగు మాసముల్ నరక
నందన వాసము ; నిత్య పంక శై
వాలము లోన పాల్కడలి
వైనము ; బ్రహ్మముఖాన కచ్చ పీ
లీలల రాసమున్ ; పెనిసి
లిన్ పయికెత్తిన నావిచార ధా
రాలస తారకా మృదుల
హాసము ; నీ కిపుడేనినా పయిన్
ఏలవమేని జాలి గల
దేని విదల్ప గదమ్మ, భారతీ !

288. తగ్గని నొప్పి

ఎన్ని నెలలకైన, ఎన్ని మందులకైన
తూలి పడ్డ నొప్పి తొలగ లేదు ;
బైటి కేగ గలను, బల్ల గుద్ద లేను !
ఏగనేల ? ఏల నేగ కున్న ?

289. మహా భూపతి

భూపతి రాము మోహనుడు
మోరి పాలమ్ము తదాది, బళ్ళవం
శీ పురుషోత్త మాదులగు
మిత్రులగూడి పటించు వాడు,
నేనాపద జిక్కి పడ్డ కబు
రందిన వెంటనె జాబు వ్రాసె ! నా
జ్ఞాపక వర్తులంటె గత
చైత్రము లర్వది ఆరు దివ్వెలన్ !

290. మ్లేచ్ఛ

అద్దంకి వారి బిడ్డడు,
విద్దెల కాణాచి, పేరు వేస్లీ ; నన్నే
పొద్దు పరామర్శించును ఎద్దెన
నుండిననను, దూర మెంతుండిననున్ !

291. వ్యాస ప్రోక్తం

వ్యాసు డనగ నెవడు ఆనాటి మనుజుడే
తనకు తెలిసినంత మనకు తెలిపె ;
వ్యాస ప్రోక్త మెల్ల పరమ సత్యము కాదు
పరమ సత్యమెదియు ధరణి లేదు !

292. కర్మ అనుభవించే దెవ్వరు ?

దృష్టి మందగించె, ధీశక్తి చల్లారె
చెవులు వినుట మానె, చవులు చచ్చె
ప్రాణ మేగ సిద్ధపడి యుండె ; మిగిలిన
కర్మ బాధ్యులెవరు ? కర్మ లేవి ?

293. అవసరానికి

ఉన్న వెన్నో పెన్ను, లొకటియు వ్రాయదు
అందరకును నాది అవసరమగు ;
కొత్త భావమేదొ కోరివచ్చిన వేళ
స్వీకరించ బోయి సిగ్గుపడుదు !

294. బృంద హత్య

శంఖమూడదీయ శంఖ చూడుడు చచ్చు
సతిని మోసగించి చంపనేల ?
దేవ దేవుడైన దేవేంద్రుడే యైన
అన్య కాంత పట్ల అడవి మృగమె !

295. మూర్ఖ మహిమలు

కన్య కొకడు పుట్టె, గాలి కొకడు పుట్టె
చేపకొకడు, లేడి పాప కొకడు
ఎపుడొ పుట్టి నంద్రు ఇపుడేల పుట్టరో
లేవు నాటి మహిమలిపుడు, భీమ్నా !

296. పెండ్లి వయస్సు

ఇరువదేండ్ల పెండ్లి ఇంటికి దీపమ్ము
పాతి కేండ్ల పెండ్లి పాలవెల్లి ;
ముప్పదేండ్ల పెండ్లి ముల్లోక విజయమ్ము
నలుబదేండ్ల పెండ్లి నాగములి !

297. వస్తు వేదైన

సహజ చాపల్యముల నెల్ల సంస్కరించి
తనయులను పెంచు తండ్రి విధాన కవియు,
బండరాతిని కావ్యశిల్పముగ మలచు
వస్తు వేదైన సరస కావ్యముగ తీర్చు !
శ్రావణము నీవు, నేను భాద్రపద ; మిర్వు
రమును దివిమూసి, భువి ముంచు ప్రాణ ధార
ప్రకృతి కంతకు నిత్య పోషకులు మనము
నాల్గు మేఘాల దౌత్య కేంద్రమ్ము మనము !

298. కవీ మనిషే

ఫేను వేయ మరతు, వేసి తీయ మరతు,
యతిని మరతు, పద్య గతిని మరతు
పరిచయులను మరచి పడుచుందు మాటలు
కాల కేళి లోన కవియు మనిషె !

299. చాలు అనకు

సరకు చేయగ వలె వృద్ధ జనుల ననుచు
చాల సార్లు చెప్పితి, వింక చాలు ననకు
వృద్ధులే లోక మన, మెజార్టీయు వారె ;
పిల్ల కాకుల బ్రతుకులు పిట్ట కథలె !

ఉడుకు నెత్తురు రోడ్లపై కురికి పారు
ఓట్ల మంటలు సలసల పొంగి పారలు
ప్రొద్దు వాలిన మీదనే బుద్ధి పొడచు
నైజమిది కాన, వృద్ధుల నాదరించు !

300. అన్నపూర్ణమ్మ

అన్నపూర్ణమ్మ ఒక పద్య మాలకించి
అడరి, అక్షర లక్షలంచు అభినుతించె ;
తాను అక్షర నూర్లు ఇచ్చు దాననినియె ;
మెచ్చుకొన చాలు, పదిలక్షలిచ్చినట్లు !

301. సారస్వత కాక్‌టెయిల్

గోపాలుడు నిను వలచి
నీపాటను మదిదలచి
ఏ వంచను పొంచిపొంచి
విను చున్నాడని ఎంచి
పాడవేల రాధికా
ప్రణయ నిశా గీతిక

(సంగీత సాహిత్యాలు కలిపి కాక్‌టెయిల్ చేసి రసిక లోకానికి అందిస్తున్న ఈగేయం ఎవరి రచన ? ఎంతోమందిని అడిగి అడిగి ఇంటికి వచ్చిన నాకు మా ఆవిడ జవాబిచ్చింది - ఆ రచయిత శ్రీ శ్రీ అని ఓహో సారస్వత మూర్తి)

302. ఇల్లు కడగడం

కవికి సంఘ సేవ కర్తవ్య మనరాదు,
కవిత లోక సేవికయను కాదు,
పసిడి పాలతోడ పాయసమ్ములు గాక
ఇల్లు కడుగు కొంద్రె ఎవరైన ?

303. మన డెమోక్రసి

ప్రభు వొకండె భూమి పతియైన కాలాన
వ్యక్తి ఒకడె బాధ్యుడన్నిటికిని
ప్రజల రాజ్యమందు ప్రతివాడు భూపతె
తలొక ముక్కకొరకు తన్ను కొంద్రు !

కుక్కలు చింపిన విస్తరి,
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసి లోనన్

304. లేదు వంటమనిషి

పొన్నగంటి, అరటి పూవు, తెలగ పిండి
కందిపప్పు లోన కలిపి వండి
ఆవగాయ నూనె నద్దుక తినవలె !
వంట మనిషి లేదు వస్తువున్న !

305. వృద్ధ ప్రయోగశాల

తిరిగి చిన్న నాటి తిండి పెట్టుదురేని,
ముద్దు చేతురేని, ముసలి వాడు
బాలు డగుట నిజము, ప్రౌఢుడు నగు నేమొ ;
వృద్ధ యోగ శాల పెట్టి చూడు !
వృద్ధులకు బాల్య రుచులపై బుద్ధి పోవు,
పిచ్చి కోరికలని చిన్న బుచ్చ వలదు ;
చిన్నప్పుడు తల్లి చేసెడి జొన్న పిసరె
నేటి చాక్లెట్ల కంటె సంతృప్తి పరచు !

306. చివరి గూడు

గతము లేదు నాకు గర్వింప దగినది,
ఊహ చేయలేము ఉపరి గతిని ;
శీతకాల మిద్ది చివరిది, శివరాత్రి ;
చిత్త వృత్తు లెల్ల చేరు గూడు !

307. యజ్ఞ ఫలం

జంగురెడ్డిగూడెమున, ఏజన్సిలోన
లవ కుశల ఏక రూపమై అవతరించె
రవియు చంద్రుడు, రవిచంద్ర ; రాత్రి పగలు
వచ్చి లాలించినాడు నా వాగ్విపంచి !

నాకొరకె పుట్టి నట్టు పొన్నాడ వారి
ఇంట బుట్టిన ప్రేపల్లె కొంటెవాడు
ముద్రణకు పూనుకొనకున్న నిద్ర లేచి
అడరి ఈవాణి వెలుగు చూచెడిదికాదు !

308. క్రొత్త పెన్ను

తిరిగి కూర్చుండి వ్రాయు శక్తి సమకూరి
నందు కట మా సవిత్రి నా కంద జేసె
క్రొత్త పెన్నిది, కవితకు క్రొన్నిధి ఇది !
ఇప్పుడీ లేఖినిదియె ఈకృతి ముగింపు !

309. గళ మెత్తవే

గళ మెత్తవే, కోకిలా !
లేచి, గళ మెత్తవే కోకిలా
దళిత మావల ద్రోసి
దళ వాయిగా లేచి ॥గళ॥

కుహు కుహు అంటావు
కుహు వెక్కడుం దిపుడు ?
చిమ్మా చీకటి కుహువు
ఛిద్రమై పోలేదా ? ॥గళ॥

అరుణో దయ మ్మయ్యె
తరుణో దయ మ్మయ్యె
సరిగమల బృందం తో
గురు వొచ్చి వున్నాడు ॥గళ॥

కో అంటె నీ వెనుక
కోటి మం దున్నారు
ప్రజ్ఞాన కాంతులతో
పరవళ్ళు ద్రొక్కేరు
పంచమ స్వరముతో
ప్రతిభా భారతివై ॥గళ॥

❋ ❋ ❋

ఉన్నోదయ ప్రవక్త

ఒంటరి గాంతు

బోయి భీమన్న

ఆత్మీయులు, యువ కవితా కౌముదీశులు
ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖా మంత్రి వర్యులు
మాన్యశ్రీ పోడపాటి చంద్రశేఖర్ గారికి

కోకిలకు చెప్పు కొంటున్నా
ఆత్మాశ్రయ కావ్యం ఈ ఒంటరిగొంతు
కోకిలను ప్రవక్త అన్నాను.
ఉన్నవోదయ ప్రవక్త అనీ అన్నాను.

కావ్యం ఏదో ఒక ప్రాపును
ఆశ్రయించుకొని పైకి ప్రాకే
లలిత మంజుల మనోజ్ఞ లతిక కదా!

కావ్యం ఉన్నవోదయ ప్రవక్త అయితే
దానికి ఆశ్రయమయ్యే స్వీకర్త
అంతటి తేజస్వి కావాలి!

కాక, ఘూక, భేక ఖీంకారాలను
అదుపుచేసి ఆహ్లాదపరచే
ప్రకృతి ధర్మవేదికపై
శుక పిక శారీ మయూరీ
బృంద నాట్య గాన విన్యాసాలతో
క్షణ క్షణే సాధించబడుతున్న ప్రగతి అంతా
ఈ కోకిల తెస్తున్నదే, మన కిస్తున్నదే!

ఇంతటి కావ్య భారతికి
అంతటి ధీరోదాత్త స్వీకర్త
ఎక్కడ ఎలా లభిస్తాడు,
సులభంగానే లభించాడు
శుభోదయ సుప్రభాత రవిచంద్రుడిలో

రవి చంద్రనేత్రుడు
చంద్రశేఖరుడే కదా !
యువకవి చంద్రశేఖరుడుగా
సాక్షాత్కరించాడు నా ఎదుట
అందుకే నా అన్వేషణ
సులభంగానే ఫలించింది
మంత్రి చంద్రశేఖర్ గారి ఆమోదంతో
సినారే పాటలోని పగలే వెన్నెల
నన్ను ఆనందంలో ముంచెత్తగా
జగమే ఊయలగా
ఊగా నా ఋణం
ఈ చంద్రశేఖరుడు ప్రస్తుతం
ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మంత్రి
ఆధునిక యువకవులలో
అమృత రస నిక్షేపం
సహృదయుడు, సకల కళా విద్యాధరుడు
మాకు ఆత్మీయుడు, అందరికీ ఆత్మ బంధువు

అట్టి మహితాత్ముడికి
ఇట్టి నవకావ్యాన్ని
సమర్పించగలుగుతున్నానంటే
నేనెంత అదృష్టవంతుణ్ణో
వేరే చెప్పాలా !

ఇతోధిక ప్రాభవ దీప్తి దాయకంగా
ఈ కావ్యాన్ని సమర్పిస్తున్నాను
చిరునవ్వుతో అందుకొంటున్నందుకు
ఆయనకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

– భీమన్న.

ప్రత్యూషం

ఓ.... ఓ..., కో.... ఓ.., కో... .. ఓ....

అంటూ ఎవరో పిలుస్తున్నట్లు వినిపించి, కళ్లు తెరిచి చూశాను. తెల్లవారుఝామున నాలుగున్నర గంటలు.

అలాగే పైకి చూస్తూ పడుకున్నాను. లేవబోతున్నాను, లేవలేదు. అది వృష నామ సంవత్సరాది. ఉగాది. ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నది ఒక కోకిల - బహుశా తూర్పుదిశలోని మా మామిడి చెట్టు నుంచి.

ఒక గంట సేపు అలాగే పడుకుని వున్నాను - దానికూత వింటూ మా ఆవిడ ఇక లే అంటూ లేవదీసే వరకూ.

ఉగాది, ఉగాది పచ్చడి, మిత్రులు, కబుర్లు మామూలే అయినా ఆ కోకిల గొంతు వినిపిస్తూనే వుంది.

మా దొడ్లో ఒక చిన్న కొండ. దానిని ఆనుకుని నేను పెంచిన ఒక పెద్ద రావి చెట్టు. దానికి ఆసరాగా నేనే నాటిన ఒక చిన్న వేపచెట్టు. ఆ పక్క ఒక మామిడి చెట్టు. కొన్ని కొబ్బరి చెట్లు. మా విజ్జు మెదక్ నించి తెచ్చి పాతిన అగ్నిపూల చెట్లు, అరటి చెట్లు, చెంబేలి పొద, బొప్పాయి చెట్లు, మల్లె చెట్లు వగైరాతో అదంతా ఒక చిన్న అడవిలా వుంటుంది. ఆ చెట్ల మీద నుంచి కొన్ని కోకిలలు ఋతు జ్ఞానం లేకుండా ఉదయం మొదలు సాయంత్రం వరకూ పలకరించుకుంటూనే వుంటై. పిలుస్తూ, పలకరిస్తూ, తర్కించుకుంటూ, వెక్కిరించుకుంటూ, వాదాలతో, వివాదాలతో సందడి చేస్తూనే వుంటై.

అయితే, ఈ సారి అలాంటి సందడేమీ లేదు. ఒకే ఒక్క కోకిల ఉగాదికి స్వాగతం పలుక సాగింది. ఒకొక్కసారి ఒకొక్క చెట్టు మీద నుంచి స్వాగతం పలుకుతున్నది. స్వాగతం పలుకుతున్నదని నే ననుకోవడమే తప్ప అది ఎందుకలా అరుస్తున్నదో, దానికి మరో కోకిల ఎందుకు ప్రతి పలకడం లేదో వాస్తవం తెలియదు కదా!

కోకిల వసంత ఋతువుతో వస్తుందనీ, వర్ష ఋతువుతో వెళ్ళిపోతుందనీ కవి సమయం. అది నిజం కాదని అందరికీ తెలుసు. అయినా, చాల కవి సమయాలవలెనే ఇది కూడా ఒక లోక వాస్తవం అయింది.

ఏది ఏమైనా, లోకానుభవానికి నా అనుభవానికి ఈ సారి విపరీతంగా ఘర్షణ జరుగుతూ వుంది. ఉగాది నుంచి చూస్తున్నాను, వింటున్నాను. అదొక్కటే కూస్తూ వుంది. మరో గొంతు వినిపించటం లేదు. దాని కూ... ఊ..కి అలవాటుగా నేనూ కూ.. ఊ అని పలకబోయాను. వయస్సు ముదిరినా మనస్సు పచ్చిగానే వుంది. కోకిలకు ప్రతి పలకాలనే తప్ప, పలికే వయస్సు దాటి పోయిందన్న జ్ఞానమే లేదు.

అప్పుడనిపించింది నాకు - ఈ కోకిల ఎవరో ఒంటరిగా అరుస్తున్న దని, దాని గొంతు కూడా నా గొంతు లాగే ఒంటరిగా స్పందిస్తున్నదని, ఇదంతా నాకేదో విశేషం చెప్పడానికో, జ్ఞాపకం చెయ్యడానికో ఇలా జరుగుతున్నదనీ!

నేను పుట్టినప్పటి నుంచీ కోకిల నా సహచరి. దానిలో ఇలాంటి ఒంటరి తనం నే నెప్పుడూ చూడలేదు. వెంటనే నాకు ప్రవక్తలు జ్ఞాపకం వచ్చారు. నా జీవిత ఘట్టాలు ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి. ఒక సమగ్ర కావ్యానికి అంకురార్పణ జరిగింది. కోకిల ఒంటరి గానే అరుస్తూ వుంది. నేను నా కావ్యాన్ని పలుకుతూనే వున్నాను.

అటు ఎక్కడో కోకిల, ఇటు ఇక్కడ నేను... ఈ ఉభయ సంధ్యల మధ్య నడుస్తున్న నిరంతర జీవన వాహినీ తరంగాలే ఈ కవితలు, ఈ కవితా బృందగానం, గాన స్రవంతి, కావ్య వాసంతి.

ఒంటరి గొంతు

వసంత కోకిల

సూర్య నమస్కారాలు చెయ్యడానికి
సూర్యుడి అనుమతి కావాలా ?
నదీ జలాన్ని పొలానికి మళ్ళించడానికి
నది అంగీకారాన్ని పొందాలా ?
అక్కర లేదు కదూ !

కోకిలా.....
నే నంటే కిట్టని
పొరుగు వారి తోటలో నుంచి
వస్తున్న నీ మధుర గానాన్ని
సదరు పొరుగు వాడు నిరోధించగలడా ?
ప్రయత్నించవచ్చు !
సాధ్యం మాత్రం కాదు !

రోజా మొగ్గ వికసించింది
అది దాని స్వభావం
దాని చుట్టూ తుమ్మెద తిరుగుతున్నది
దానిని తుంచి జడలో పెట్టుకొన్నదొక పిల్ల

అందని చంద్రుడు
అద్దంలో తనను పట్టుకోవద్దని
శాసించగలడా ?
అందని వారి ఔన్నత్యాలు అలాంటివి
ఆకాంక్షల కైమోడ్పులు ఇలాంటివి
కోకిలా ! ఈ పోలికలు నీవీ, నావీ !

పుట్టినప్పటినుంచీ నీ గానాన్ని వింటున్నాను,
నీ అనురాగాన్ని ఆస్వాదిస్తున్నాను.
అందుకు నీ అనుమతి ఏదీ అక్కర లేదు !

నీవు నీరవ నిగూఢ రసాలినీ కిసాలయాలలో
సమున్నత స్థాయిలో విహరించే విశ్వ గాయనివి !
నాకు అందవు, నేను అందుకోలేను !
విశ్వ మానవ పరిధులు
విశాల తరాలు, విషమ గమనాలు !

అయితే, కోకిలా....
నా గొంతు లాగే నీ గొంతు కూడా
ఒంటరి దెందు కయింది ?

ఉగాది ఉదయం నుంచీ చూస్తున్నాను
చూస్తున్నా నంటే వింటున్నాను
వింటూ ఆలోచిస్తున్నాను
ఆలోచిస్తూ ఊహిస్తున్నాను
ఊహాతీతంగా ఏమిటీ ఒంటరి గొంతు ?

2. గుంపు లేమయ్యారు !

నేను పుట్టి బుద్ధెరిగి నప్పటి నుంచీ
ఏనాడూ ఒంటరిగా లేను.
నా ఈడు కుర్రాళ్ళను వెంటబెట్టుకొని
తోటంతా తిరిగేవాణ్ణి.

ఒక్క మా తోటే కాదు,
మా వూళ్ళోని తోటలన్నీను !
మా చేతుల్లో బాణా కర్ర లుండేవి
కంకర రాళ్ళుండేవి.

మామిడి కాయలూ, ఉసిరి కాయలూ
వెలక్కాయలూ, జామకాయలూ వంటివి మాత్రమే కాక
కొబ్బరి కాయలు కూడా రాళ్లతో పడగొట్టే వాణ్ని
మోచేతితో కుమ్మి పేళ్ళు వలిచే వాణ్ని.

నా గొంతు ఎప్పుడూ ఒంటరిది కాదు.
నేను కో అంటే కోటి మంది చుట్టూ చేరేవాళ్లు.
అప్పుడు నీవూ అంతేగా!
నీ చుట్టూ కోకిలలు గుంపులుగా వుండేవి.
ఇప్పుడేదీ ఆ శోభ?

3. మరకత శ్యామ

చాలా కాలం వరకూ నీ స్వరం వినడమే గానీ
నీ ఆకారం నే నెప్పుడూ చూడలేదు.

ఒక రోజున మా బొప్పాయి చెట్టు మీద
పళ్లు తింటున్న మీ జంటను చూశాను.
ఎంత అందమైన జంట!
నీ వెలానూ మరకత శ్యామవే
నీ జంట నవరత్నాల కుప్ప!

వెండి బంగారు తీగలకు నవరత్నాలు గుప్పినట్లు
ఎంత సుందరమైంది పుంస్కోకిలం!
కవులు చెప్పితే వినడమే తప్ప
నే నెప్పుడూ ఏత ద్గానం వినలేదు.
విన్నానేమో జ్ఞాపకం లేదు.
శుక పిక శారికలలో
నీవు మాత్రమే చేతికి చిక్కేదానివి కాదు
గోరింక పిల్లలను, చిలకలను పెంచే వాణ్ని
మిడతలను కొట్టి మేపే వాణ్ని

రకరకాల పళ్ళు తినిపించేవాణ్ణి.
శ్రీ కృష్ణుడి మురళి
నీవుగా వచ్చి పిలిచేదో, ఏమో!
ఆ రోజులు ఎంత మనోజ్ఞంగా వుండేవి!

4. నవోదయ సభలు

''కోకిలా నీ గానమేదో
కూర్చరాదా సంపుటమ్ముల
ప్రణయ రాగ రహస్యమేదో పట్టుకొందునుగా''
అనే పాట రాసింది నేను ఆ రోజులలోనే!

మత్తకోకిల ఛందస్సునే
మాత్రలలో చెపుతున్నా ననుకోలే దప్పుడు!
ఇప్పుడు గుర్తించాను,
నా గేయాలు చాలావరకూ
మత్తకోకిళ్లే అని!
అకాండ తాండవం మొత్తం
మత్తకోకిళ్ల సమావేశమే కదా!

వసంతోదయానికి స్వాగతం పలికే వాళ్లలో
ఎవరిది ప్రథమ స్థానం?
కాకి, కోకిల, గోరింక, చిలుక, ఈల పిట్ట
గువ్వ, పిచ్చుక, తుమ్మెద
అదొక వసంతోత్సవ సభ!
ఎవరి ప్రత్యేకతలు వారు చెప్పుకొనే వాదాలు!

ఈ కవిత లన్నీ నేను పాడుకొంటూ తిరిగేవాణ్ణి
అనాటి నా పరిసరాల లాగే నా కవితలు

ఉద్యాన వనాలే కాదు,
కీకారణ్యాలు కూడా !
నిన్ను అనుకరించడంతోనూ, వెక్కిరించడంతోనూ
గడిచి పోయా యా రోజులు !

5. కాకిది తప్పా ?

నీకు జ్ఞాపకం వుండే వుంటుంది, కోకిలా !
తోటలోని నా పర్ణ కుటీరం ప్రాంగణంలో
చెట్టు మీద నుంచి ఒక పసికూనను
క్రిందికి తోసేసి, రెండు కాకులు దాని మీద వాలి
పొడిచి చంపడానికి ప్రయత్నించాయి.

అదంతా ఏమిటో నా కర్థం కాలేదు.
జరుగుతున్నది హింసే కనుక
నేను కాకుల్ని తరిమేసి, పసికూనను
కోళ్ల గంప క్రిందకు చేర్చాను.

అప్పుడొచ్చావు నీవు,
అప్పుడు చూశాను నిన్ను దగ్గరగా,
అది నీ కూన !
కోకిల కూన !

హింసకు పాల్పడ్డాయని కాకుల్ని నిందిస్తున్న నాకు
నీ మీద కోపం వచ్చింది !
కాకి గుడ్డును తోసేసి
దాని స్థానంలో నీ గుడ్డును పెట్టావు కదూ !
నీ మోసం తెలుసుకొన్న కాకులు
ప్రతీకారానికి పాల్పడితే తప్పా ?

ప్రతీకారం ఏ రూపంలో ఎక్కడున్నా తప్పే !
జీవిత యాత్రలో కొట్లాడుకుంటూ
ముందుకు పోవడం ఆనందకరమా ?
అదే అభ్యుదయకర మంటున్నారు శాస్త్రజ్ఞులు
ప్రతీకార చర్యకు ఘర్షణ అనే పేరు పెట్టి !
చర్యకు ప్రతిచర్య సహజమైతే
సృష్టిలో అసహజ మైనదేదీ లేదు !

కోళ్ల గంపను చేరి, చుట్టూ తిరుగుతూ
ఏడ్చావు నువ్వు,
శిలువ మీది ఏసును చూస్తూ మేరీ ఏడ్చిన ఏడ్పు !

కోళ్ల గంపను తీసేసి
నీ పిల్లను నీ కప్పగించేశా నప్పుడు !
నాకు జ్ఞాపకం వుంది.
నీకూ వుండే వుంటుంది !

6. కామందు - కాకులు

నీ పిల్లలను, కోకిలా,
పరభృతాలుగా ఎందుకు చేశావు ?
నీవు చేశావా ? ప్రకృతి చేసిందా ?
నీకు గూడు లేదు,
కట్టుకోవడం చేత కాదు,
గుడ్లు పెడతావు కానీ,
పొదగడం అసలే చేతకాదు !

నీ కున్న దొక్కటే, మధుర స్వరం !
నీ పంచమ స్వరం లేకపోతే
అసలు సంగీతమే లే దనవచ్చు !

అదీ నీ అహంకార కారణం!
నీ ఉన్నత స్థాయి హేతువు!

ఒక్క సుగుణాన్ని పురస్కరించుకొని
మొత్తం జీవిత బాధ్యతలను పరాక్రాంతం చేసి
తేరగా బ్రతకడం ఎంత కాలం?
ఎంత కాల మేమిటి?
ఎంత కాలమైనా సాగుతుంది,
ఎంతో కాలంగా సాగుతున్నది!

మనిద్దరి జీవిత పరిస్థితీ ఒక్కటే!
నేను కామందుల పొలంలో గుడెసె వేసుకొని
వాళ్లు పెట్టేది తింటూ
వాళ్లకు సేవ చేస్తూ బ్రతికాను,
నాకు కామందులు, నీకు కాకులు!

7. ఎడమ చెయ్యి వేర్పాటు

మనిషి లోని ప్రతి అవయవమూ
రెండేసి ఎందు కుంటున్నై?
అందం కోసమూ, ఆసరా కోసమూ,
ఆకార సౌష్ఠవం కోసమూ!
అవునా? అవును కదా!

మరి, కుడి చేతి పట్ల
ఎడమ చేతి కెందుకీ అసూయ?
సహాయ పడుతూనే ఏడుస్తుం దెందుకు
మంచి పనులన్నీ
కుడి చేతికే చెప్తారనుకొంటూ!

రచయితకు వచ్చే మమూలు వణుకే
నాకూ వచ్చింది కుడి చేతికి!

ఇప్పుడు, కుడి చెయ్యిని మించి
ఎడమ చెయ్యి వణుకుతోంది!
కుడి చెయ్యి పడకేస్తే
దాని పనులు కూడా
చెయ్యవలసిన ఎడమచెయ్యి
తాను కూడా పడకేయ వచ్చునా?
ఇది బాధ్యతా రాహిత్యం కాదా!

ఇది సానుభూతి లక్షణ మంటున్నారు వైద్యులు!
సానుభూతి ఇలా వుండదు, వుండకూడదు,
చచ్చేవాడ్ని బ్రతికించడం సానుభూతి,
తాను కూడా చావడం అపకృతి, అవజ్ఞత!
తాతాచార్యుల వారి బిళ్ల గోచీ
మార్గదర్శకత్వం ఇదే నేమో!

8. రచనా పచనం

నిన్ను గురించి పాటలూ, పద్యాలూ
చిన్న చిన్న కావ్యాలూ, నృత్య నాటికలూ
ఎన్నో వ్రాశాను,
మనిద్దరి గురించీ ఒక కావ్యమే
రాయాలనుకున్నా నిప్పుడు.
చేతులు వణుకుతున్నై,
ఎలా వ్రాయను?
మా విజ్ఞను కాస్త వ్రాసి పెట్టమన్నాను.
సరే అని, ఒక నెల సెలవు పెట్టి వచ్చింది.

ఆఫీసరు సెలవు పెట్టడ మంటే
ఏమిటో తెలుసా?

సగం రోజులు పెండింగ్ ఫైళ్లు
పరిష్కరించు కోవడంతో పోతై.
తక్కిన రోజులు పోస్టింగు కోసం
ప్రయత్నించడంతో గడుస్తై.

అయితే, మధ్య మధ్య
నా పని కూడా చేసి పెట్టిం దనుకో
లేకపోతే,
ఈ కావ్యం ఎలా తయారైంది ?

9. ఊహ తెలిసిన లేఖిని

కావ్యం అంటే జీవితం
నాయికా నాయకులు, భావానుభావాలు
రసాదులు, అనుచర సహచర వర్గం
అంతా ఒక నిండు జీవితం !

వాక్యం రసాత్మకం కావ్యం
అనే నిర్వచనం నిజమేనా ?
ఒక్క వాక్యం రసాత్మకం అయినంత మాత్రం చేత
కావ్యం కాదు నా దృష్టిలో !
ఒక కప్పుడు మధువు, ఒక గ్లాసుడు పాలు
లడ్డు, జిలేబి, పచ్చడి, పాయసం
ఎన్ని కలిపినా ఒక పూర్తి భోజనం కాదు !

కావ్యం విందు భోజనం,
చిన్న చిన్న కవితలు చిరు తిళ్లు !

కోకిల గురించి రాయని కవి లేడు !
ఆరుహ్య కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలం అంటూ

వాల్మీకి నే కోకిలం అన్నారు.
కవికోకిల అనే బిరుదు లేని కవులే లేరు!
అయితే, ఆ కవిత లన్నీ
శ్రీనాథుడన్నట్టు
చిన్న చిన్న గుళ్లు చిల్లర దేవుళ్లు!

నే నిప్పుడు నీవు ఇతివృత్తంగా
ఒక కావ్యమే వ్రాస్తున్నాను
వ్రాయడం కాదు, చెపుతున్నాను.
ఊహ తెలిసిన, మన సెరిగిన
ఒక లేఖకురాలికి చెపుతున్నాను
ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తములు
దొరికి నప్పుడే మహా కావ్యాలు
వ్రాయగలమన్నాడు పెద్దన!

లేఖక పాఠకోత్తముల మాట ఎలా వున్నా
కావ్యం వ్రాయాలంటే
అందులోని పాత్రల గురించి క్షుణ్ణంగా తెలియాలి
జీవితాలలోని రహస్యాలన్నీ తెలియాలి.

నీ గురించి వ్రాయడ మంటే
నీ జీవిత మంతా తెలియాలి కదా!
ఇప్పుడు చెప్పు - నీవు
ఒంటరి దాని వెలా అయ్యావు?

10. లలితా లాలిత్యం

సహజమైన కవి ప్రతివాడూ కవికోకిలే!
కవికి ప్రతిభతో పాటు పాండిత్యం వుండవచ్చు
ప్రధానమైంది ధర్మ జ్ఞానమూ, లోక జ్ఞానమూ!
అన్నిటికీ మూలం బ్రహ్మ జ్ఞానమే!

పండిత కవులు కవులు కారు
ప్రచార కవులు కవులు కారు
ఉద్యమ కవులు కవులు కారు
వాళ్లు కవుల కంటే గొప్పవాళ్లు !

కోకిల కంటే గరుడ పక్షి గొప్పది !
మల్లెతీగ కంటే మర్రిచెట్టు గొప్పది !
అందుకే ...
మల్లెమొగ్గ లనూ, మధుప్రియలనూ
మధువునూ ప్రేమించే నేను
చక్రవర్తుల పట్ల భయ భక్తులనే తప్ప
చనువునూ, సరదానూ అనుభవించ లేను !

11. పొలికలు

ఓంకారం నీ నాదం
ఎక్కడ నుంచి వస్తున్నది ?

ఓంకారం బ్రహ్మ స్వరూపం అన్నారు,
నీ గానం కూడా అదే కావచ్చు !
మరి నీవెవరి స్వరూపం ?

ఉదయ మధ్యాహ్న సాయాహ్నాలు
త్రిమూర్తుల రూపాలైతే
నీవు చీకటి రాత్రివి కావచ్చు !
రాముడు, కృష్ణుడు, వ్యాసుడు లాగే
పరమాత్మ స్వరూపం కావచ్చు !
అదే నీ పట్ల నా ఆరాధన !

తాత్విక మతాలలో
శుద్ధాద్వైతం పేరు వినే వుంటావు కదూ !

వల్లభాచార్యుల మధురభక్తి అది!
దీని వంటిదే సూఫీ మతం కూడా!

ఆత్మ పరమాత్మలకు
ప్రేయసీ ప్రియుల సంబంధం కల్పించబడింది.
దానికీ, నా రసాద్వైతానికీ కొంచెం తేడా వుందనుకో!
సంబంధం అదే అయినా,
నేను ఆత్మనే అయినా,
ఖచ్చితంగా నేను ప్రియుడ్ని!
పరమాత్మ నా ప్రియురాలు!
పోలికలు నాకు కిట్టవు గాని
పోలికలు లేకుండా మానవ జీవితం సాగదు మరి!

12. పురుషాహంకారం

నేను పురుషుడిగా పుట్టాను కనుక
పురుషాహంకారం నన్ను వదలదు!
పరమాత్మ ముందు కూడా
నేను స్త్రీ ననుకోలేను!
స్త్రీవలే ప్రవర్తించ లేను!

పుంస్త్వంలో సుందర గంభీరత వుంది,
మధుర లాలిత్యం స్త్రీ దే కదా!
అందుకే మధుర భక్తి, సూఫీ ప్రేమ
నాకు సరిపడవు!
నేను పురుషుడ్ని,
నిన్ను స్త్రీ మూర్తిగానే ఆరాధిస్తాను!

ఇంతకూ నీ గానం
ఎక్కడ నుంచి వస్తున్నట్టు?
నా చుట్టూ, నాలోన అంతటా

నీ గానమే వినిపిస్తున్నది !
నిన్ను వెతకడం
పరమాత్మను వెతకడమే !
నేను నేనే !
నేను కానిదంతా నాదే !
నా లోపల నన్ను నేను వెతుక్కోలేక
బైటు వెతుకుతున్నాను నీ కోసం !

13. భ్రమణనాదం

ఎక్కడున్నావు నీవు ?
చిత్రకూటంలోనా ! చికాగోలోనా ?
మాస్కోలోనా ? మడగాస్కర్ లోనా ?

బ్రహ్మకు నాలుగు ముఖాలు !
నాలుగు వేదాలకూ అవి ప్రతీకలు !
సంగీతం, సాహిత్యం, విజ్ఞానం, లోకజ్ఞత
నాలుగూ కలిసిందే కదా జీవితం !

జీవితాభ్యుదయ జ్యోతి సరస్వతి,
అది నీవే !
నీవు పాడుతూనే వుంటావు,
అది నీ స్వభావం !
నేను నీ వెంటబడి వింటూనే వుంటాను,
అది నా స్వభావం !
స్వభావం మారదు,
వికసిస్తుంది అంతే !
భూభ్రమణం స్వభావం !
భ్రమణ వేగ నాదం ప్రణవం !
ఆ ప్రణవమే ప్రణయం కావడం దాని స్వభావం !

14. జన్యు వ్యక్తిత్వం

నా కళ్ల ముందు పుట్టి పెరిగిన
తొంభై మంది ప్రవక్తలు నీవు
నవోదయ ప్రవక్తవు,
నిత్య నూతన ఉన్నవోదయ ప్రవక్తవు!
నాపై నీ ప్రవక్తృత్వం కనిపిస్తూనే వున్నది!

నేను ఎడ్లబండి తోలాను
సైకిలు తొక్కాను
బస్సెక్కాను, రైలెక్కాను
కారులో తిరిగి ఎన్నికల ప్రచారం చేశాను.
కాశ్మీరు వరకూ విమానంలో వెళ్లాను
ఇదంతా నీ ఉన్నవోదయ ప్రవక్తృత్వమే!
జ్ఞానమను, విజ్ఞానమను, సైన్సు అను
ఋణ ఋణాభివృద్ధి ప్రకృతి నైజం!
దానిని నీవు తెస్తున్నావు
నా కిస్తున్నావు
లోకానికి పంచిపెడుతున్నావు!

జన్యువు జీవనది
లోకము ఉపనది
వీటి సంయోగమే నేను అనేది
దాని ఎదుగుదలే వ్యక్తిత్వం
అన్నాడు ఆధునిక విజ్ఞాని అట్లూరి వెంకటేశ్వరరావు
ప్రకృతి పురుష సంయోగ నైరంతర్యం సృష్టి అన్నాను నేను.
యవ్వనమే జీవితం
నీవే జీవితం!
జీవిత మంటే యవ్వనమే!
అంతకు ముందుంది మొగ్గ,
ఆ తర్వాతది పండు!

జీవిత మంటే నీవే,
కాకులూ, గుడ్లగూబలూ !
ప్రకృతి శక్తి ద్వయంలో
నీవు పాజిటివ్, అవి నెగిటివ్!
పాజిటివ్, నెగెటివ్ లేకుండా
ప్రోగ్రెస్సే లేదు కదా !

15. హంపీ నిర్వేదం

'' ఈ కొమ్మపై నుంచి నీవు కోకో యంచు
ఆ కొమ్మపై నుంచి ఆమె కోకో యంచు
ఏమి బాసలు చేతురే, కోకిలా
ఏమి బాసలు చేతురే ?''
అన్నాడు బసవరాజు అప్పారావు.
రాయప్రోలు సుబ్బారావైతే
పొదల పొంత చేరి
నిన్ను పిలుస్తూ కూర్చునేవాడు.

''పాడు చున్నది రిచ్చవడి కోకిలాంగన
అష్ట దిగ్గజము లేమైరి, రారు ?''
అంటూ విచారించాడు కొడాలి వెంకటసుబ్బారావు
తన ''హంపీ క్షేత్రం'' లో !
నిజానికి, కోకిలా,
మన జాతి చరిత్రలో
సుందర సంస్కృతీ చైతన్యం అంతా
హంపీ క్షేత్రమే అవుతూ వచ్చింది కదూ !
సాటిలేని సాంస్కృతిక వైభవ మంతా
స్మశానమై పోతూ వచ్చింది !

కారణా లేమైనా
కల్యాణ వీరణాలు మృత్యు మృదంగా లవుతూ వచ్చాయి!
అష్ట దిగ్గజాలు ఏమైపోయారంటూ
దుఃఖిస్తూ వుంది హంపి!

ఉపజ్ఞా కోకిల

కృష్ణా పత్రిక లోని నా 'ఉపజ్ఞా కోకిల' కవితను
నాకు బిరుదు గానే ఇచ్చాడు జరుక్ శాస్త్రి.

కావ్య కుసుమాలు, దీపసభ, రాగోదయం,
మధుబాల, మధు గీత వంటి
ఆనాటి నా రచన లన్నీ
రకరకాల రూపాలలో నిన్ను వర్ణించేవే కదా!
నా పాత రచన దేనిని విప్పి చదివినా
నీవే పలుకుతావు,
నీవే కులుకుతావు!

నా కవిత వెలుగైతే, నీవు దాని నీడవు!
లోకంలోని ఇతర చోట్ల కూడా
నైటింగేల్ వంటి నామాంతరాలతో
నీవు ఆరాధించ బడుతూనే వున్నావు కదా!
ఓడ్ టు ఏ నైటింగేల్ అంటూ
ఆంగ్ల కవి మిత్రుడు ఎంత బాగా వర్ణించాడు నిన్ను!

చిలకలు, గోరింకలు వున్నాయంటే
అవి ఘనాపాఠీలు మాత్రమే!
చెప్పింది చెప్పినట్లు నేర్చుకొని
అదే మళ్లీ మళ్లీ చెపుతూ వుంటై.

17. ఉగ్రవాదం

చల్లగా, శాంతంగా వుండవలసిన వైశాఖి
ఉగ్రంగా వాదిస్తూ నిప్పులు చెరుగుతున్నది
ఇంతకంటే ఉగ్రవాదం ఏముంది ?
నీ స్వరంలో మార్పు కనిపిస్తున్నా,
వసంతాంతంలో కూడా
ప్రశాంతంగానే పాడుకొంటున్నావు !

నాకు మాత్రం ఒళ్ళు మండిపోతుంది.
తల చిట్లి పోతుంది.
ఉడికొలోన్ తో ఉగ్రవాదం చల్లారుతుందా ?
పట్టి పేళ్ల తడకలలో
ఎంత కాలం తలదాచుకుంటాం ?

మరి, చేసే దేముంది ?
వైశాఖపు ఎండలకు
ఫ్రిజ్జులో భద్రపరచుకొన్న
కొబ్బరి బొండాల నీళ్ళే మందు !
లేత ముంజెలు కూడా !
సందకల్లు సంగతి ఇప్పుడెందుకులే !
వైశాఖాన్ని గ్రీష్మంలో చేర్చి
మధువనీ విన్యాసాలకు
దూరంగా వుంచడం మంచి దేమో !

18. మారని సంప్రదాయం

నీ మధుమాస ప్రభాత భేరి
చైత్రోదయంతో ప్రారంభమైనా
వాస్తవ వసంతోదయం

ఫాల్గుణోదయం నుంచే కదా!
నీ స్వాగత వచనాలు కూడా!
ఫాల్గుణోదయంలోనే ప్రారంభమవుతై!

లోకులు గుర్తించ లేదు!
నేనూ లోకుల్లో ఒకణ్నే కనుక
వింటూ కూడా వినినట్టే వుండిపోయాను!
సంవత్సరాది, ఉగాది, వసంతోదయం
నిజానికి ఫాల్గుణారంభం తోడివే!

కరడు గట్టిన సంప్రదాయం
మార్పును గుర్తించనీయదు!

కాలం ఉన్నవోన్నవంగా మారుతున్నప్పుడు
తదనుగుణంగా సంప్రదాయం కూడా మారాలి కదా!
ఒక్క ఋణం మార్పులో
వేల సంప్రదాయాలు మారాలి!
ఒక్క ఋణం నిప్పులో
లక్షల లంకా దహనాలు జరగాలి!

మానవుడు మహా మహితుడు కాకపోవడానికి
మార్పును సహించని గతమే హేతువు!
హేతువును తొలగించ గలది
నీ ధాతువు ఒక్కటే!

19. లోకులు కాకులు

లోకులు కాకులు!
కాకులు నిన్ను నిషేధించినా
నీ స్వరాన్ని నిషేధించలేవు కదా!

తమ మర్రి చెట్టు మీదికి
నిన్ను రానివ్వక పోవచ్చు
ఒక్క మామిడి చెట్టుకే
నిన్ను పరిమితం చేసి
పరుల కంట పడకుండా
పరదాలు బిగించవచ్చు.
అయినా....
నీవు కుహూ అంటే, లోకం
కుహూ అంటున్నది కాదా!
నీవు కో అంటే, లోకం
కోకొల్లలుగా మేల్కొంటున్నది కాదా?

కాగా, లోకుల్ని ఎందుకనాలి?
కాకుల్ని ఎందు కనాలి?
మేధావులూ, పండితులూ, కవులూ
లోకుల నుంచి వస్తున్న వాళ్లే!
కోకిలవు నీవు కూడా
కాకి గూటిలో పుట్టి పెరిగిన దానివే!

20. ఒంటరి చావులు

నీవు మధుమాస ప్రవక్తవు,
నేను మానవ లోక ప్రవర్తనా ప్రవక్తను!
మానవు లెక్కడున్నా, ఏ ప్రవక్త మాటా వినరు!

సహజ జడత్వం నుంచి
మానవుడ్ని ఉద్ధరించాలని
ప్రతి ప్రవక్తా అరిచి చచ్చిన వాడే!
స్వజనం చేతనే శిక్షింపబడ్డ వాడే!
ప్రతి ప్రవక్తదీ ఒంటరి గొంతే,

ఒంటరి బ్రతుకే, ఒంటరి చావే!
నా ఒంటరి గొంతు
అందుకే అపూర్వం కాదు!

నీది క్రమ వికాసం కనుక, చావు లేదు.
నేను చస్తాను కనుక, వికాసం లేదంటారు
అందరూ ఆత్మలే కనుక
పరమాత్మలలో ఎవరి చావు వారిదే!

21. పోలిక నిజం కాదు

ప్రవచనా లంటే
నీ పాటల వంటివి కావు!
నీ పాటలు
జీవిత మధుకోశంలోని
సుఖ దుఃఖ మధు బిందువులు!

సుఖమూ మధు బిందువే!
దుఃఖమూ మధు బిందువే!
పగలు ఆనంద కరం
రాత్రి ఆనంద భరితం!
రెండూ స్వభావ సిద్ధాలే
ఆత్మీయతా ప్రవర్ధకాలే!

అందుకే నీతో పోల్చడానికి మరొక రెవరూ తగరు!
కొండను ఢీ కొన్నంత మాత్రాన
తగరు కొండ కాదు కదా!

పోలిక నిజం కాదని తెలిసీ కూడా
పోల్చుకోకుండా వుండడు మానవుడు!

22. గాన గోదావరి

కాలం ముందుకు పోతూ వుంది.
మన సుఖ సంతోషాలు చంద్రగమనం తోడిపే అయినా
మన కాలం సూర్య గమనం తోడిది.
కాలం ఒకొక గ్రహం మీద ఒకొక విధంగా వుంటుంది.
అది ఆయా గ్రహాల ఆవర్త గతి తోడిది.

భూమి మీద కాలం
భూ సూర్య సంబంధి!
ఇది ఎప్పుడు ప్రారంభమైందో?
స్పష్టంగా భూమి పుట్టినప్పటి నుంచే!

భూమి ఎప్పుడు పుట్టిందో?
మనకు జ్ఞాపకం లేనంతటి గతంలో!
కాళరాత్రి బ్రహ్మ ముహూర్తంలో!
అదే ఉషోదయం!

అప్పుడే నీవు తొలిసారిగా గొంతెత్తావు
ప్రతి ఉషోదయమూ నీవు తెస్తున్నదే
నీవు గానం చేస్తున్నదే
నీతో వికసించి ఫలిస్తున్నదే!

నీ గాన గోదావరి త్రిస్థాయిలో
గౌతమీ వశిష్ఠా వైనతేయాలు కాగా
ఏతత్ వర్షా జలధిలో మునిగి
మాయమై పోయే నీవు
మళ్ళీ ఉషోదయంలో నవోదయంలో తేలి వస్తావు
వెలుగు తెస్తావు!

23. తిరగడమే తిరగడం

భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నది కదా
సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతున్నది కదా
సూర్యుడు కూడా బ్రహ్మ చుట్టూ తిరుగుతున్నాడు కదా
బ్రహ్మ కూడా మరెవరి చుట్టూనో తిరుగుతూ వుంటే
ఈ తిరగడాలకు అంతెక్కడ ?
నిజానికి విశ్వమే తన చుట్టూ తాను తిరుగుతున్నది.
సృష్టే తన చుట్టూ తాను తిరుగుతున్నది.
ప్రకృతి పురుష భావం
ఈ తిరగడం నుంచి వచ్చిందే !

నా అకాండ తాండవం కావ్యంలోని
శివ తాండవం భంగిమలన్నీ
సృష్టి స్థితి లయాల భంగిమలే !
అకాండ తాండవ గానం
ఆకాశవాణి భక్తిరంజనిలో
విన్యసిస్తున్నది, వింటున్నావు కదూ !

24. నిత్యోన్నవం

కాలగమనంలోని ఆవర్తాలు
యథావర్తాలా ? శంఖావర్తాలా ?
యథావర్తాలైతే అవన్నీ నిరుపయోగాలే
నిష్ప్రయోజకాలే !

సృష్టికీ దాని స్థితి లయాలకూ
ప్రయోజకత్వం వుండాలంటే
ఆవర్తాలు శంఖావర్తాలే అయి వుండాలి
ఒక దాని కంటే ఒకటి మెరుగైనదై వుండాలి

ఉన్నతమై వుండాలి, ఉన్నవమై వుండాలి
ఈ వాస్తవం నీకు తెలుసు, నాకు తెలుసు
అందుకే నిన్ను ఉన్నవోదయ ప్రవక్త అన్నాను.
నా కళ్ల ముందు తొంభైమంది ప్రవక్తలు నీవు!
తొంభై ఉన్నవ నవోదయాలను తెచ్చావు,
వినిపించావు, వెలిగించావు!

తొలి నుంచీ ప్రకృతి నాయకులం మనం
ప్రజా తంత్ర చోదకులం మనం
మన ఆంగీకమే శివ తాండవం,
మన వాచికమే విశ్వ వాఙ్మయం!

అతిశయంలో పుట్టాం
అహంకారంతో పెరిగాం!
ప్రతి కవీ అహంభావకుడే
ప్రతి కోకిలా ఆత్మాతిశయమే!
అందుకే ముందుండి నడిపిస్తున్నాం
లోకాన్ని!

సామాన్యులు చక్రావర్తులైనా
బండి సాగుతున్నదంటే
మనం చోదకులం కనుక!

25. ప్రగతి హేతువు

మా మానవ ప్రవక్త లంతా
యథావర్తులే!
చెప్పిన సూక్తులే చెపుతారు
ఒక్కటీ ఆచరణ యోగ్యంగా వుండదు!
మా మతాలు వ్యాపారం చేస్తున్నది
ఆ అసాధ్య సూక్తులతోనే!

నీ వొక్కటివే
శంఖావర్త మూర్తివి
అదే ఈ క్రమ వికాసానికి హేతువు
ప్రగతికి మూల ధాతువు!

పరమాత్మ నుంచి ఆత్మకు
సముద్రం నుంచి అలకు
అల నుంచి సముద్రానికి
పడుతూ, లేస్తూ, మునుగుతూ, తేలుతూ
పయనించే చైతన్య లక్షణం జీవాత్మది!

జీవాత్మే ప్రాణాత్మ సృష్టికి,
అదే పురుషాత్మ ప్రకృతికి!

26. తెలియని గతం

సృష్టిలో మొదటి వాస్తవం ఏమిటి?
ఏదీ స్థిరం కాదన్నది!
ఏ వస్తువైనా ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు
ఏమై పోతుందో తెలియదు
ముందూ తెలియదు, తరువాతా తెలియదు
ఈ నడుమ జీవితం
ఎంత కాలమో తెలియదు
ఎలా నడుస్తుందో తెలియదు!

కర్త లేకుండా కర్మ జరుగదు కనుక
సృష్టి కంతకూ ఒక కర్త వుండాలన్నది
మానవుడు చేసిన మొదటి ఊహ!
సంబంధ బాంధవ్యాలు లేకపోయినా
స్వభావం సర్వత్రా ఒక్కటే కనుక
సమస్త మానవుల తొలి ఊహ

సృష్టి కర్తను గురించి నట్టిదే!
ఆ తొలి ఊహ
పెద్ద అపోహ అయింది
చిలవలు వలవలు తొడిగింది
వెర్రితలలు వేసింది
కుక్కమూతి పిందెలు కాసింది
ఇప్పటి కింకా పరస్పరావగాహన మృగ్యం చేస్తూ
స్వప్రయోజక నాయకత్వం నిలుపుకొంటున్నది!

అట్టి ప్రవక్త నామధేయంతో
నీకూ నాకూ పోలికే లేదు!

27. గతానుగతి

ప్రవక్త అనే పదం మేం సృష్టించినది
అంటే మానవులం సృష్టించినట్టిది
ప్రవక్త, దైవజ్ఞుడు, పైగంబరు, ప్రాఫెట్టు
ఇటువంటి పదాలన్నీ సమానార్థకాలు!

గతాన్ని సంస్కరించి
వర్తమానాన్ని సమున్నత పరచి
సమున్నవం చేసి
భవిష్యత్తును సూచించే ప్రజా నాయకుడ్ని
ప్రవక్త అన్నారు. పైగంబరు అన్నారు.
సామాన్యుడికి వుండే భావాలే
నాయకుడికీ వుంటై,
సామాన్యుడు చెయ్యలేని పనిని
నాయకుడు చెయ్యగలడు.
సామాన్యుడంటే గతాన్ని అంటిపెట్టుకొని వుండేవాడు
గతంపై ఆధారపడి బ్రతికేవాడు

గతాన్ని అనుసరించి నడుచుకొనేవాడు
గతంలోని లోపాలను సహించేవాడు
ధిక్కరించే ధైర్యం లేనివాడు !

నాయకుడలా కాదు,
కాలాన్ని తన కనుకూలంగా
మలుచుకోగలవాడు నాయకుడు
కార్యసాధకుడైన నాయకుడ్నే ప్రవక్త అన్నారు !

అట్టి మానవ ప్రవక్తతో
ఉషోదయ ప్రవక్తవైన నిన్ను
పోల్చవచ్చునా ?
ప్రవక్త అనే పేరు
నీకు సరిపడుతుందా ?

28. ప్రవక్తలూ - సమాజాలూ

భూమి పైని గల
వాస యోగ్య ప్రాంతాలలో
ఒక ప్రాంతానికీ, మరొక ప్రాంతానికీ
సంబంధ బాంధవ్యాలు లేని సుదూర గతంలో
మానవుడు సమాజాలుగా ఏర్పడి
జీవించ సాగిన కాలం నుంచీ
ప్రవక్తలు పుడుతూనే వచ్చారు !
ఊహలు చేస్తూనే వచ్చారు !
దేశ కాల పరిస్థితులను బట్టి
తమ తమ సమాజాలను మలుస్తూనే వచ్చారు !
ఊహలు వాస్తవాధీనాలు,
వాస్తవ పరిధులను దాటి వెళ్ల వవి !

అయితే....

పంచభూతాధీనమైన వాస్తవాలు
నిలకడ కలవి కావు
ఊహలూ అంతే!

మానవ సమాజం కుమ్మరి మన్ను
కుమ్మరి వాడి ఊహలను బట్టి
పాత్రలు తయారయినట్లు
ప్రవక్తల ఊహలను బట్టి
సమాజాలు రూపొందుతై!

ఎందరో ప్రవక్తలు,
పరస్పర అవగాహన లేని ప్రవక్తలు!
ఎన్నో సమాజాలు
పరస్పర సంబంధాలు లేని సమాజాలు!
అది గత చరిత్ర!

గతానుగతికంగా సాగిపోవడమే
స్వభావమైన సమాజాలు
ఇప్పటికీ అలాగే సాగుతున్నై!
గతాన్ని పట్టుకొని వేలాడుతూ
వర్తమానాన్ని ముందుకు పోనివ్వడం లేదు
భవిష్యత్తు క్రమ వికాసం పట్ల
ఆసక్తి లేదు, అవగాహన లేదు.

29. దుంప తెంచే భ్రాంతులు

లోకంలోని అన్ని ప్రాంతాలూ నీవే
అన్ని మతాలూ నీవే
అన్ని భాషలూ నీకు వచ్చు.

ఇంగ్లీషులో రెండు మాటులున్నాయి,
అందులో బ్లాస్ఫెమీ అనేది ఒకటి

జనరేషన్ గేప్ అనేది మరొకటి.
తెలుసు కదా !

ఈ రెండు మాటలూ నా దుంపే కాదు
మానవ జాతు లన్నిటి దుంపా తెంచుతున్నాయి
ఈ రెండూ వట్టి భ్రాంతులు
కేవలం అపోహలు !

పవిత్ర యుద్ధాలంటూ
అపవిత్ర హత్యలు చేసేది
బ్లాస్ఫెమీ !
ఆచారం, సంప్రదాయం, అనువంశికం
అంటూ పాత సరుకునే
కొత్త సీసాల్లో పోసేది
జనరేషన్ గ్యాప్ !

అక్కడ పవిత్రతా లేదు.
ఇక్కడ అంతరమూ (గ్యాపూ) లేదు !

మత్త కోకిల

నిన్ను ప్రవక్తా అన్నాను,
అవును, నీవు ప్రవక్తవే !
నా కిప్పుడు తొంభై ఏళ్లు !
గత తొంభై ఏళ్ల లోనూ
తొంభై వసంతాలు వచ్చి పోయినై
వసంతానికి ప్రవక్త కోకిల, నీవే !

తొంభై వసంతాలకూ తొంభై మంది ప్రవక్తలు !
ప్రతి కోకిలా తెస్తున్నది వసంతాన్నే,
ప్రతి వసంతమూ ఇస్తున్నది
యవ్వన మాధుర్యాన్నే !

యవ్వనం వస్తున్నది, పోతున్నది
మళ్లీ వస్తున్నది, పోతున్నది
మళ్లీ మళ్లీ అదే, అదే మళ్లీ మళ్లీ!
ఇందులో జనరేషన్ గ్యాప్ ఏమున్నది?

పిన్నలను వెక్కిరించడం, శాసించడం
పెద్దలను నిరసించడం, ధిక్కరించడం
ఇందులో జనరేషన్ గ్యాప్ ఏమున్నది?

31. రాజపిత

తమ తమ తల్లిదండ్రులే ఆదర్శంగా
మానవజాతి బ్రతుకుతున్నప్పుడు
ఒకానొక డైనోసరస్సు మహారా జయ్యాడు
ప్రజలు తమ తల్లి దండ్రులను, పూజించకూడదని
రాజొక్కడినే తల్లిదండ్రిగా ఆరాధించాలని
శాసించాడు, నిర్బంధించాడు
అదే ఏకేశ్వరోపాసనగా స్థిరపడింది.

ప్రజ లెవ్వరికి తల్లిదండ్రులు లేరట,
తల్లీ తండ్రీ రా జొక్కడే నట.
ప్రజలకు వ్యక్తిత్వం పోయింది.
రాజ శరణాగతి మిగిలింది.
రాజ శాసనం భయపెట్టగా దాని నీడలో
భక్తి పెరిగి వెర్రితలలు వేసింది.

రాజును ధిక్కరించ కూడదు
రాజ శాసనాన్ని ప్రశ్నించకూడదు
అవి రెండూ ఘోర నేరాలు
అదే బ్లాస్ఫెమీ!
బ్లాస్ఫెమీకి భయపడ్డ జనం

కట్టుబానిసలుగా బ్రతకడమే
అయింది ఘనం!

32. తోడు దొంగలు

తాను ఒక్కడే జగద్గురువు ననుకొన్న నాయకుడు
గురువే దైవ మన్నాడు.
దైవాన్ని త్రిమూర్తులుగా విడగొట్టి
త్రిమూర్తులూ తానే నన్నాడు.
తానొక్కడే మహేశ్వరుడుగా
చలామణి అయ్యాడు.

ప్రజలు శిరసా వహించారు.
శిరసా వహించని వాళ్ల
శిరస్సులు ఖండించ మన్నాడు.
కొందరు శిక్షకు గురయ్యారు.
ఎక్కువమంది భయంతో భక్తు లయ్యారు.

ఆ విధంగా, భయ భక్తులు
తోడు దొంగ లయ్యాయి
ఈ భయ భక్తులే నేటి మతాలు,
నేటి సామాజిక గురువులు,
నేటి ప్రవక్తలు, వాళ్ల ప్రవచనాలు!

33. శుక్ర నీతే నీతి

బృహస్పతి, శుక్రాచార్యుడు, మహావీరుడు, బుద్ధుడు
శంకరాచార్యుడు, చండాలుడు, సుమతి, వేమన
ఇటువంటి ఎందరో, ఎంద రెందరో ప్రవక్తలు!
ఒకడు అబద్ధం ఆడవద్దంటాడు
దొంగతనం చెయ్యవద్దంటాడు.

తల్లి దండ్రుల మాట వేద సమానం అంటాడు
గురువే దైవ మంటాడు ఇంకొకడు !
హింస చెయ్యవద్దంటా డొకడు
అయితే, మాంసం తినవచ్చు అంటా డతడే !
మనిషిని నెలి వేస్తా డొకడు
శరీరాన్నా, ఆత్మనా అని అడుగుతా డింకొకడు !

నాకు నచ్చిన ప్రవక్త శుక్రాచార్యుడు !
బొంక వలసిన ప్రతి సందర్భంలోనూ
బొంకడం తప్పు కాదన్నాడాయన !
వాస్తవమైన ప్రవచనం !

అందుకే శుక్ర నీతి
అందరికీ అనుసరణీయమైంది,
అమలు జరుగుతున్నదీ అదే !

34. నమ్మకమూ - బుద్ధీ

నమ్మకానికి రూపమూ లేదు,
బుద్ధికి నిలకడా లేదు !
అది నా దయినా గాని, మరొకరి దయినా గాని
నేను నమ్మేదంతా నాకు నిజమే
మరొకడికి అది నిజం కాకపోవచ్చు
నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలే !

బుద్ధి పూర్తిగా వ్యక్తిగతం !
అది పామరుడికీ వుంది, పరమ జ్ఞానికీ వుంది !
తేలిందేమిటంటే...
ఎవడి నమ్మకం వాడిది, ఎవడి బుద్ధి వాడిది !
వాటికి సామూహికత లేదు,
సార్వత్రిక లేదు !

అందుకే నేను చెపుతున్నాను,
సృష్టికి కర్త ఒకడే అనడం నిజం కాదని!
ఏకేశ్వరం శాసనం ఏక పక్ష నియంత్రత్వ మని!

32. వికలాంగులు

కోకిలా.....
గొప్పవాళ్లకు తలంటి పోసే
అదృష్టం నీ కెప్పుడైనా కలిగిందా?
నీకు కలగదు!
అది కాకులకు మాత్రమే రిజర్వుడు!
గొప్పవాళ్లకే కాదు,
వాళ్ల విగ్రహాలకు కూడా
తలంటి పోస్తా యవి!
నీ వెపుడైనా
లిబర్టీ శిల్పాన్ని చూశావా?
ముళ్ల కిరీటంతో, ఒక చేతితో కాగడా పైకెత్తి
మార్గ దర్శకంగా
మధ్య వీధిలో నిలబడ్డ విగ్రహం!

చెడు నుంచి విముక్తిని కోరే మంచివాడు
ఎల్లప్పుడూ ముళ్ల కిరీటం ధరించ వలసిందేనా?
కళ్ల గంతలు లాగి పారేసి
న్యాయదేవత సూటిగా లోకాన్ని చూడలేదా?
చెడు అనను, కనను, వినను అనే కోతులు
వికలాంగులుగా వుండి పోవలసిందేనా?

ఈ వేటినీ ప్రవక్తల దోషాలనడం లేదు నేను!
వాళ్ల అహంకారమే ప్రజలను
నిత్య మూర్ఖులుగా అణచి పెడుతున్నది!

అందుకే ప్రజలు మారడం లేదు.
లోకం ఇంకా దిగజారి పోతున్నది!

36. అనంతావకాశాలు

పితృ దేవతలకు తద్దినాలు పెట్టేవాళ్లు
వాళ్లు నిజంగా వచ్చి తింటే పెడతారా?
దేవతలకు నైవేద్యం పెట్టేవాళ్లు
వాళ్లు వచ్చి వాటిని ఆరగిస్తే?
యజమానిని విందుకు పిలిచిన వాడు
అతడు ఎక్కువ సేపు కాలక్షేపం చేస్తే
తలక్రిందులై పోడా?
లోక మర్యాదలకు చేసే కొన్ని పనులు
స్వప్రయోజనాల సరిహద్దు దాటవు!

పండగలు అలాంటివి కావు
అవి ఆనందోత్సాహాలకు నెలవులు
ఆనందోత్సాహాలు
ఆయుర్వేద నిధులు!

అయితే మనకు సరిహద్దులు లేవు!
మనవి ఒంటరి గొంతు లైనా
అవధులు లేని పంచమ స్వరాలు!
అనంతావకాశాలలో ప్రపంచ పూర్ణ కలశాలు!

37. కాకులూ, కోకిలలూ, ప్రజలూ

సుఖ శాంతులకు కోకిల ప్రతీక,
వార్తా విన్యాసాలకు కాకి ప్రతీక!
జీవితంలో సుఖశాంతులు అరుదు,
నీ దర్శనం కూడా అరుదైనదే!

లోకంలో కాకులు కోకొల్లలు!
ఊళ్ళలో వీధుల నిండా అవే,
పితృ కార్యాలలో అదే వాటి ప్రాముఖ్యం!
పితృ దేవతలు కాకుల రూపంలో వచ్చి
పిండాలను తినిపోతారట!
కాకులు రూపం లోనే ఎందుకు వస్తారు?
మరో రకం పక్షులు అందుబాటులో వుండవు కనుక!

నిజానికి.....
కాకీ, కోకిలా ఒకే జాతివి
కోకిల అంతఃపుర కాంత,
కాకి రోజు కూలీ!
తేలిగ్గా దొరుకుతుంది,
కాలుష్యాలను శుభ్రపరిచి పోతుంది!

38. నీతి సాంఘికం

కోకిలా!
చారిత్రకంగా బుద్ధుడు మొదటి ప్రవక్త
అతడ్ని అహింసా జ్యోతి అన్నారు,
ఏదీ అహింస?

అతడ్ని ఆరాధిస్తున్న దేశాలన్నీ
ప్రధానంగా మాంసాహార దేశాలే!
దండనీతి రాజరికాలే!

మానవ స్వభావానికి వ్యతిరేకంగా
సామాజిక నీతులు చెప్పేవాళ్లు!
అతీత శక్తులు గల ప్రతి వాడ్నీ
దైవావతారంగా ప్రకటించేసి
తాము హాయిగా తలుపులు బిగించుకుని

మెత్తగా బ్రతికేసే వాళ్లే!

ప్రకృతి నైజాన్ని ఉన్నతీకరిస్తూ
ఉత్సాహ పరిచే ప్రవక్తవు నీ వొక్కతివే!
అందుకే నీవు నా మార్గదర్శివి!
అయితే, ప్రవక్తల్ని నేను విమర్శించడం లేదు
వాళ్లు అసామాన్యులు,
ప్రజల మేలు కోరిన వాళ్లు!
మానవతను ఉన్నతీకరించడానికి
శాయ శక్తులా పని చేసిన వాళ్లు!
వీర పూజ స్వభావమైన మానవులు
వారిని ఆరాధిస్తారు!
తృప్తి నిచ్చే మార్గం ఇంతకన్నా ఏముంది?

39. అజ్ఞాత ప్రవక్తలు

ఏకాంత సేవ తెలుసు కదూ,
వెంకటు పార్వతీశ్వర కవుల కావ్యం!
ఏకాంత సేవ నీ సేవే!
అందులోని నీవే
నన్ను ఉద్బోధించిన ఏకైక ప్రవక్తవు!

''వర మనోహర పంచమ స్వరము నెత్తి
పాడవేమమ్మ కోకిలా, పాడవేమే?''
అనే పిలుపే నా పంచమ స్వర కావ్యానికి శ్రీకారం!

అంతటి మహాశక్తివి
అంతే వాసివా?
ప్రభాత భేరీవి
పరభృతానివా?
ఉన్నవోదయ ప్రవక్త

ఉపేక్షింప బడడమా !
కాదు, కాగూడదు !

మన ప్రవక్తలలో వందలు వేలు వత్సరాలు
అజ్ఞాతంగా వుండిపోయిన వాళ్ళు
చాలమందే వున్నారు !
శంకరాచార్యుడ్ని ప్రసిద్ధికి తెచ్చిన
చండాలు డంతటి అద్వైత ప్రవక్తకు
పేరూ ఊరూ కూడా లేదు !
బెంగ పెట్టుకోకు,
భవిష్యత్తు మనదే !

40. రాజకీయం కాదు

కుడి నుంచి ఎడమకు వ్రాసినా
ఎడమ నుంచి కుడికి వ్రాసినా
వాక్యం అదే !

ఏ సంప్రదాయమైనా
అనుకూలతను బట్టి అమలవుతుంది
ప్రజామోదాన్ని బట్టి ప్రచార మవుతుంది
సహజత్వాన్ని బట్టి సంస్థిత మవుతుంది !
సహజత్వం నిలుస్తుంది,
అసహజత్వం అంతరించి పోతుంది !
అబద్ధాలు అనే కానేకం,
చౌర్యం శతాధికం !
ఈ రెండూ లేకుండా
ప్రభుత్వమూ లేదు, ప్రజాస్వామికమూ లేదు !

ప్రభు సమ్మితమైన వేదాలను చేపట్టి
ప్రజాస్వామికం పేరుతో
ప్రజలను పాలిస్తున్నారు ప్రవక్తలు,

వాళ్ల సహచరులు, వాళ్ల అనుచరులు!
సహజ జీవన ప్రతిపాదకం నీ గొంతు
రాజకీయ అవకాశ వాద ప్రవక్తం కాదు!

41. పేరులోనే వుంది

పేరులో ఏముంది పెన్నిధి
అనే లోకోక్తి విన్నావు కదూ!
లోకోక్తు లన్నీ సర్వ సత్యాలు కాదు!
పేరు లోనే వుంది వ్యక్తిత్వం!
అన్య జీవరాశులకు అక్కర లేకపోవచ్చు,
గుర్తింపు కోసం పేరు కావాలి మానవుడికి!
మనిషి పేరు పెట్టని దేదీ లేదు సృష్టిలో!

జంతు జాలానికి జాతుల పేర్లు చాలు,
పెంపుడు జంతువు లైతే
వ్యక్తి గత పేర్లుంటై!
వాల్మీకి పశుల మందలో
కల్యాణి తెలుసు కదా!

మానవ జాతిలో అయితే
ప్రతి మనిషికీ ఒక పేరుంటుంది
గాంధీజీ అంటే ఒక ప్రత్యేకమైన పేరు
అంబేడ్కర్ అనేది మరొక పేరు
ఏ పేరు కా పేరే ప్రత్యేకం,
విశిష్ట గుణ శీలాలు కలిగినట్టిది!

ప్రసిద్ధుల పేర్లు నాలుగై దశరాలకు మించవు
పేరు ఎంత పొట్టిగా వుంటే
వ్యక్తిత్వం అంత పొడుగ్గా వుంటుంది
నామ రూప రహితమైన విశ్వశక్తిని కూడా

పరమాత్మ అంటున్నాం
పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్ఠలు
పేరు తోనే ప్రవర్తిస్తై!
విశ్వ శక్తిలో ప్రతి అలకూ పేరుంది.
సామాన్య వ్యవహారంలో
ఏ పేరైనా ఒకటే కానీ
విశిష్ట స్థానంలో పేరే ప్రధానం!
పేరులోనే వుంది
ప్రతిష్ఠ, పదవి, అధికారం, పెన్నిధి సమస్తమూ!

42. నేరం ప్రవృత్తి కాదు

''అప్పు చేసి యైన పప్పన్నమే తిను
కాపి కొట్టి యైన క్లాసు పొందు
దొంగిలించి యైన దొరలాగ బ్రతకరా
సహజ ధర్మ మిది ఇహ పరాల!''

ఆధునిక మానవ ధర్మానికి ఇలా
రూపం దిద్దాను పూర్వం ఒక సమ్మేళనంలో!
సదస్యులు హర్షధ్వానాలు చేశారు
సర్వకాలాలలోనూ
ఇవి నగ్న సత్యాలే కదా!

మనమూ మన ప్రభువులూ తింటున్న పప్పన్నం
ఎలా వస్తున్నది?
పెద్ద పెద్ద పదవులలో వున్న దొర కుమారులంతా
ఎలా సంపాదించారు ఆ పదవులు?
ఈనాటి నవాధునిక కోటీశ్వరు లందరూ
ఎలా అధిరోహించారు ఆ శిఖరాలు?

ధర్మ విరుద్ధమైన, ఆచరణ సాధ్యం కాని

నీతులు చెప్పే ఏ ప్రవక్త అయినా
చేతులు నలుపుకుంటూ కూర్చునే వాడే!
తమకు దక్కని సుఖాలన్నీ
అవినీతు లవుతాయా ?
అవుతాయంటే వినే దెవరు ?
పట్టించుకునే దెవరు ?
అందుకే నేర ప్రవృత్తి అనేది
సహజ ప్రవృత్తి కాదు అంటున్నాను!

43. అంతా తనకే

''కుక్కలు చింపిన విస్తరి
నక్కల పాలైన నంది, నాయకులు తలో
ముక్కను తినగా, మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసీ లోనన్''

అంటూ డెమోక్రసీ వర్ణించాను
చాలాకాలం క్రితమే!
అందమైన వివరణ కూడా ఇచ్చాను ఆనాడే
ఇదీ నగ్న సత్యమే కదా!
నగ్న సత్య మంటే పరబ్రహ్మ అన్నమాట!
పరబ్రహ్మ మౌలికం కావచ్చు
జీవితానికి మూలం కావచ్చు
వికాసానికి ఆధారభూతం కావచ్చు
ఆత్మ ఆత్మగా జీవించడానికి
పరమాత్మ ఎందుకు పనికి వస్తుంది ?

అందులో నా రాగోదయం గేయాలలో అన్నాను...
''సారాహార సమార్జన వేళ్లది,
సన్మానము పూవులది!

కష్ట మొక్కరిది, సుఖ మింకొకరిది
కాంతా, నైజము సృష్టి కిది ! ''

ఈ సత్యాన్ని చెప్పేదే
అందరూ అందలం ఎక్కే వాళ్లే అయితే
మోసే వాళ్లెవరు అనే సామెత !
సృష్టి స్వభావమే అంత !

పోరాడి పదవిలోకి వెళ్లే కార్మిక నాయకుడు
కఠిన నియంతగా మారిపోతాడు
తోసుకు వెళ్లి రైలెక్కే ప్రయాణీకుడు
తా నెక్కేసి ద్వారం బిగించేస్తాడు.
జీవకోటి ఏ రాశిదైనా
ప్రకృతి ధర్మం మాత్రం ఇదే !
ఈ ధర్మం మారాలంటే
మరొక ప్రళయం రావాలి
ప్రళయం రాకుండానే ప్రగతి సాధ్యపడాలంటే
నీ ఉన్నవోదయ ప్రవచనం ఒక్కటే మార్గం !

అందుకే అంటున్నాను
నీ వొక్కతెవే ప్రవక్తవు అని !
నీది ఒంటరి గొంతు కాదు అని !

44. బృంద నాయకత్వం

నీ దెప్పుడూ బృంద నాయకత్వమే !
ప్రస్తుతం నీతో నీ వాళ్లు లేకపోవచ్చు,
నీతో నేనున్నాను కనుక
నీవు ఒంటరి దానివి కాదు !
ఏకాంతంగా నాకేదో చెప్పవచ్చిన
పరాత్పర వైతాళికవు నీవు !

నాదీ ఒంటరి గొంతు కాదు!
కవికోకిల జాషువా అన్నట్టు
''గవ్వకు సాటిరాని పలుగాకులు మూకలు
అసూయచేత'' నాకు దూరమయ్యారు
అలా - నాది ఒంటరి గొంతయింది.
నే నెప్పుడూ నా కోసమే పాడుకొన్నాను
నా కోస మంటే నీ కోసం
నీ కోస మంటే లోకం కోసం
లోకాభ్యుదయమే నా ధ్యేయం!
దానిని సాధించడానికే నా గేయం!

నా సొంత వంట
లోకానికి సరిపడే భోజనశాల!

శ్రావణ కోకిల

కోకిలా....
నీవు వసంతానికి సంకేతం అన్నారు కవులు,
అది వాళ్ల ఊహ!
కవి సమయాలు ఎక్కువగా వాస్తవాలే!
అయినా నీవు అన్ని కాలాల లోనూ పాడతావు!

కాలాన్ని పునర్విభజన చేయాలి
ఇప్పుడున్న ఆరు ఋతువులూ సరిగా లేవు
మన పల్లెటూళ్ల ననుసరించి
నే నిలా విభజిస్తున్నాను....
ఎండ కాలం, వాన కాలం, చలి కాలం!
మార్చి నుంచి మొదలై
నాలుగేసి నెలల మూడు కాలాలివి!
నీవు అన్ని కాలాలలోనూ పాడతావు!

కొర్రవెన్నూ, తాటి తొక్కా పట్టుకొని
అత్తింటికి పోయే శ్రావణ కోకిలను
నేను వర్ణించిన సంగతి నీకు తెలుసు కదా!

ఆకాశవాణిలో వినిపించిన ఆ కవిత
ఎంత ప్రజామోదం పొందింది!
అత్తింటికి పోతూ, నీవు కూడా
ఆనందించే వుంటావు!

46. శృంగారమే రసం

శృంగార రసం ఒక్కటే రసం అన్నాను
ఏకో రసః కరుణ ఏవ
అన్న ఏ జీవితం పరిపూర్ణం కాదు!

కరుణం ఒక రసమే కాదు!
భగ్న శృంగారం కరుణం
నిరుద్ధ శృంగారం వీరం అన్నాను కదూ!
శృంగారం రస రాణి
ఏత దనుచర సహచర బృందం
తక్కిన రసోపరసా లన్నీ!

అందుకే నీ వొక్కతెవే వాస్తవ ప్రవక్తవు
తక్కిన మా ప్రవక్త లందరూ
ఊహాపోహల వీధి గారడీలు!

47. మత గ్రంథం కాదు

వాల్మీకి రామాయణం వ్రాశాడు
వాల్మీకి కవి, అతని కల్పన రామాయణం!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించి చేసిన సృజన అది!
జనంలో రకరకాలుగా వున్న కథను

సంస్కరించి, భారతీయం చేసిన
మానవ సృజనకు పరాంకోటి అది!

మానవ జీవితానుభవంలోని
సర్వావస్థలూ అందులో వర్ణితాలు!
సుఖదుఃఖాలూ, జయాపజయాలూ
విజయ యాత్రలూ, విఫల యత్నాలూ అన్నీ!

మా వాళ్లు ఏం చేశారు దాన్ని?
వాల్మీకిని కోకిల అన్నారు.
పితృవాక్య పరిపాలనమే
రామాయణంలోని కేంద్ర బిందువన్నారు
మరి కొందరు భక్తి మైకంతో
రాముణ్ని దేవుణ్ని చేశారు.
దేవుణ్ని అమహితుణ్ని చేశారు.

రామాయణంలో పితృవాక్య పరిపాలన ఎక్కడుంది?
సవతి తల్లి నిర్దేశమే పితృవాక్యమా?
పితృ వాంఛా ధిక్కారం కాదా
రాముడి వనవాస యాత్రకు ప్రాతిపదిక?

రాముడు మానవు డయినప్పుడే
రామాయణం మానవుడికీ పఠన యోగ్యం!
సర్వశక్తి మంతుడైన భగవంతుడే
మాయావేషంలో మనుషుల మధ్యకు వస్తే
అది మాయ సీతలా ఉపేక్ష్యం,
మాయ లేడిలా నిరపేక్ష్యం!

రామాయణం కావ్యం,
మత గ్రంథం కాదు!

48. చరిత్రే పంచమ వేదం

పృథివి రూపమే పృథ, కుంతి!
పృథ కొడుకు పార్థుడు,
పంచ భూతాలే పంచ పాండవులు
పృథ వాటి తల్లి!

పంచజనుడి వంశం వాళ్లే
పంచము లన్నాను నేను,
వాళ్లే పంచ పాండవు లన్నాను కూడా!
పంచముడిచే వ్రాయబడిన పంచముల చరిత్రే
పంచమవేద మయింది అన్నాను!
మహా భారతం పంచమ వేదమే కదా!

దీనికి కూడా అపార్థాలు కల్పించి
జాతిని అస్వతంత్రం చేశారు
అగ్ర స్థానా లధిష్ఠించిన వాళ్లు!

వాస్తవాలను నే నెంత అరచి చెపుతున్నా
ఉచ్ఛ స్వరంతో ఉద్బోధిస్తున్నా
వినపడనంతగా ప్రజల మెదళ్లను
బ్రెయిన్ వాష్ చేసి వుంచింది వర్గం!

లోకానికి నాది ఒంటిరి గొంతే,
ధర్మానికి మాత్రం సత్యార్థ ప్రకాశిక!

49. నదీ తీరం

సూర్యుడు, చంద్రుడు, మేఘం, వర్షం
నది, దాని ఒడ్డున ఒక చెట్టు
చెట్టు నీడన నేను,
చెట్టు పైన నీవు!
ఇదీ జీవితమంటే!

చుట్టూ విస్తరించింది అరణ్యమైతే
అది ప్రకృతి ధర్మం,
ఉద్యానమైతే మానవ జీవితం!

అరణ్యాన్ని ఉద్యానవనంగా మార్చడానికి
మానవుడు చేస్తున్న అవకతవక లెన్ని?
సృష్టిస్తున్న అయోమయత ఎంత?

అంత వరకూ పర్వాలేదు, కానీ
తన సుఖం కోసం, తాను మాత్రమే బ్రతకడం కోసం
మొత్తం అరణ్యాన్నే నాశనం చెయ్యడం
క్షమార్హం కాదు!
అడ్డుకొనే దెవరు?
అందరూ పరమాత్మలే!

50. స్వేచ్ఛ

తన ఇచ్ఛ కొనసాగడమే
సుఖ జీవితం!
భయ భక్తులు దానికి సంకెళ్ళు!
భయ భక్తులతో బ్రతకడం
బానిసత్వమే కదా!
ఏమి చేస్తే ఎవరికి కోపం వస్తుందో
అనే భయమే భక్తికి మూలం!
కులం పేరుతో, మతం పేరుతో
పౌరసత్వం పేరుతో, సంఘనీతి పేరుతో
వివిధ నాయకులూ ప్రజల్ని పరిపాలిస్తున్నది
ఈ భయం భక్తుల ఆయుధాలతోనే!

ఈ ఆయుధాలు ప్రగతి నిరోధకాలు!
నాయకుల చేతుల్లో అవి వుంటే

ప్రజలకు స్వేచ్ఛ లేదు, సుఖశాంతులు లేవు!
నిజంగానే ఈ ఆయుధాలు లేకపోతే
అల్లకల్లోలం కాదా లోకం?

అందుకే ఈ భయ భక్తులు
తప్పనిసరి పీడలుగా
సహించబడుతూ వున్నై,
శిరసా వహించ బడుతూ వున్నై!
భ్రాంతి... లోనే కాంతి, శాంతి!

51. అధర్మం

''నిన్ను నిబద్ధ చేయు
నీ భీకర శత్రు లార్వుర ప్రభిన్నుల చేసిన మీద
ధాత్రిలో నీకు విరోధి లే డొకడు''
అంటూ పోతన గారు భాగవతంలో
ఏ ఆర్వురి గురించి చెప్పాడో
ఆ ఆర్వురి నే అరిషడ్వర్గం అన్నారు.
నిరసించారు, అందువల్ల నీరసించారు,
మన నడమంత్రపు పెద్దలు!
ఉద్రేకాలను చంపుకొని
కోరికలను అవాచుకొన
అసమర్థులైనారు
అధః పతితులైనారు!
స్మృతుల యుగమే మన
నడమంత్రపు కాలం!
భీకర శత్రువులుగా నిరసించబడిన
ఈ ఆరు గుణాలే
మానవుడికి రక్షా కవచంగా
ప్రకృతి ఇచ్చిన సెక్యూరిటీ గార్డులు!

ఈ ఆరు ఉద్రేకాలూ లేకపోతే
మానవుడు బ్రతకనే బ్రతకడు

అయితే.....
అవి ఎప్పుడూ
యజమాని అదుపులో వుండాలి!
ఇందులో మూడు
కామ లోభ మోహాలు పాజిటివ్!
క్రోధ మద మాత్సర్యాలు నెగిటివ్!
మానవుడు ఎదగడం లేదు.
విస్తరిస్తున్నాడు!

రామాయణంలో శూర్పణఖను విరూపను చేయడం
భారతంలో ద్రౌపదీ వస్త్రాపహరణం
అలాగే నిన్న మొన్నటి
నేపాల్ రాజకుటుంబం హత్య
చెన్నైలో మాజీ ముఖ్యమంత్రి హింస
ఆలోచిస్తున్నావా, కోకిలా?

52. స్వార్థ బంధం

ఋణానుబంధ రూపేణా
వసు పశూ సుతాలయ
అనే పూర్వ ఋషుల సూక్తిని విన్నావు కదూ!
పూర్వ ఋషుల ''పశుపత్నీ'' ని
''వసు పశూ'' అని మార్చాను నేనే!

మానవులలో పతి గాని, పత్ని గాని
అనుకొనే మాటలివి!
అందుకని వాళ్లిద్దరినీ వదిలేశాను!
ఋణానికి సంబంధించిన ఉభయ పక్షాలూ

ఒకరి నొకరు హింసించుకోవడం చూసి
దానిని ప్రారబ్ధ కర్మకు ముడిపెట్టిన సూక్తి ఇది!
దేవుడు లాంటిదే ఇది కూడా!

నిజానికి మానవుడిని హింసించేవి ఈ నాలుగే!
ధనం, పశువులు, పిల్లలు, ఇల్లు!
అనుకూలంగా వుంటే మిత్రులు,
ప్రతికూలంగా వుంటే శత్రువులు!

నేపాల్ రాజకుటుంబ హత్యలే ఎందుకు?
అలాంటివి మొత్తం మీద
ప్రతి కుటుంబంలోనూ జరుగుతున్నట్టివే!
కృత్రిమ నైజం పెంచుకొన్న మానవ జాతికి
ఇది ప్రత్యేకం!
నీవు అదృష్ట వంతురాలివి!
నేను మానవుడ్ని,
కృతక స్వార్థంలో కూరుకు పోయిన వాడ్ని!
సోమరిపోతు లైన వాళ్ళు
స్వతంత్రంగా బ్రతకలేని వాళ్ళు
వారసత్వపు ఆస్తులకై
హత్యలు చేసే క్రిమికీటకాలు!
అట్టిది కృతక స్వార్థం,
సహజ స్వార్థం కాదు!

53. ఎవడికి వాడె

గతం నుంచి నేర్చుకోడు మనిషి
మనిషే కాదు, ఏ జీవి నేర్చుకోదు,
నేర్చుకోవడానికి గతంలో ఏముంది కనుక?

గతం నిండా ఎందరో

మార్గ దర్శకులు ఉన్నారు కదా అంటే !
గతం నిండా మేధావులున్నారు
వాళ్ళంతా తమ దారిన తాము పోయిన వాళ్ళు.
ఎవరికీ మార్గ దర్శకులు కారు.
గతంలోని ఒక్క మేధావిని
అనుసరించిన వ్యక్తి ఆ తరువాత ఒక్కడూ లేడు

గతంలోని గొప్ప వాణ్ణి మేధావి అన్నారు
గురువు అన్నారు
ప్రవక్త అన్నారు
దేవుడు అన్నారు
అంత గొప్పవాళ్ళను అనుసరించగలమా అనుకొంటూ
తమ దారిన తాము పోయే వాళ్ళే అందరూ !
అది స్వభావం, అది నైజం !
ఎవరికి వారే యమునా తీరే
అనే సూత్రం ఇదే కదా !
ప్రతిజీవికి తన సుఖ దుఃఖాలు తనవి
తన బ్రతుకు తనది అంతే !

54. రాజు తప్పు చేయడు

రాజు తప్పు చెయ్యడు అనేది ఒక ఆంగ్ల సామెత
రాజే కాదు, కవి కూడా తప్పు చేయడు !

కవి, చిత్ర శిల్పి, పరిపాలకుడు వగైరా
ప్రజా సంబంధీకు లెవరూ తప్పు చెయ్యరు
వాళ్ళు ఏమి చేసినా ప్రజల కోసమే !

ప్రజలంటే మెజారిటీ ప్రజలు
మైనారిటీ ఎప్పుడూ ప్రతి పక్షమే !
మెజారిటీ ముందుకు పోతుంటే
మైనారిటీ అడ్డుకొంటూ ఉంటుంది.

రాజుకు, కవికి, చిత్ర శిల్పికీ శత్రువులుండ కూడదు,
మదోన్మత్తులు మాత్సర్యం పెంచుకొంటారు
మాత్సర్యం జీవ లక్షణం కాదు.

అందుకే
నేపాల్, చెన్నై సంఘటనలు
అమానుషాలే కాదు,
ప్రకృతి విరుద్ధాలంటున్నాను.

నీ సుఖం నీవు చూసుకో,
మరొకరి పై పగ పట్టు వద్దు !
పగ ప్రకృతి విరుద్ధం !
చర్యకు ప్రతి చర్య తక్షణ కాలికం,
దీర్ఘ కాలికం కాదు !

55. మానవ నైజం

ఆకలి, దాహం, కామేచ్ఛ
వీటిని తీర్చుకోవడానికి పడే పాట్లు
ఇదే కదా మానవ జీవితం !
దైవభక్తి, పాప భీతి, స్వర్గాశ,
అన్నీ ఈ మూడింటికీ లోబడినవే !
ధ్యానమూ, ప్రార్థనా కూడా అందుకే !

నిష్కారమైనా నిజం చెప్పేవాడ్ని నేను !
మానవుడెంత దురదృష్టవంతుడు !
కోరిక తీర్చుకోవడం తప్ప
మరొక విలువేదీ ఎరగని వాడు !

కోరిక తీర్చుకోవడం కోసం
ఎన్ని ప్రయత్నాలైనా చేస్తాడు
ఎన్ని అబద్ధాలైనా ఆడతాడు,

ఎన్ని అకృత్యాలకైనా పాల్పడతాడు !
అనుకూల పరిస్థితులలో అందరూ మంచి వాళ్ళే !
పరిస్థితుల్ని అనుకూల పరచుకోవడం కోసం
ఎలాంటి నేరాల నైనా చేయగల వాళ్ళే !

అందుకే అన్నాను-
మంచి చెడ్డల గురించి ఆలోచించ వద్దని !
నీవు కళా మూర్తివి,
మానవుల కుండే భ్రాంతులు నీకు లేవు !

56. మూర్ఖత

పరమాత్మ లోని మూడు గుణాల లోను
సత్వ గుణం శిలలు వంటి అచేతనాలది.
రజో గుణం మానవేతర జీవరాశు లన్నిటిదీ.
తమో గుణం కేవలం మానవులది.

మానవులెంత తామసు లంటే
మూడు గుణాలూ తమవే ననుకొనే మూర్ఖులు !
బొమ్మలుగా చెక్కి రాళ్ళను పూజిస్తారు.
స్థావర జంగమాదులను తిండికై వేటాడుతారు.
మూఢ విశ్వాసాలను సృష్టించి
సృష్టికి అవే కారణం అంటూ ప్రచారం చేసి
తమను తామే మోసగించుకొనేటుంత మూర్ఖులు !

ఈ తామసానికి రాజసం తోడయితే
వీళ్ళే రాజులూ, చక్రవర్తులూ,
ప్రబోధకులూ, ప్రవక్తలూ !
ఆకలి తీరక

సృష్టినే మింగేస్తున్న ఆశపోతులు
అంతక రూపులు వీళ్లే!

నీకు తెలియనిది కాదు,
చెప్పడం నా అలవాటు!

57. లక్ష్మీపతులూ - పృథ్వీపతులూ

మనసూ, మెదడూ వికసించిన మానవుడు
తదితర జీవరాశుల కంటే హీనంగా
బ్రతుకుతున్న ఈనాడు
జీవితానికి అర్థం రాజకీయం!
అభ్యుదయానికి అర్థం వ్యాపారం!
వ్యాపార రాజకీయాలు తప్ప
మానవ జీవితంలో మరింకేమున్నది?

లక్ష్మిని చంచలంగా చేసి
బలవంతులంతా లక్ష్మీపతులయ్యారు
పృథివిని మూగదానిని చేసి
లక్ష్మీపతులంతా పృథ్వీ పతు లయ్యారు.
లక్ష్మీపతులూ, పృథ్వీపతులూ కలిసి
ధన స్వామిక భూస్వామిక కూటాలను ఏర్పర్చుకొని
తామే విష్ణుస్వరూపుల మన్నారు
నా విష్ణుః పృథివీ పతిః అన్న సిద్ధాంతం
అలా పుట్టిందే!

సంగీత సాహిత్యాలు, నృత్య శిల్ప కళాదులు అన్నీ
ఈ శ్రీపతుల, పృథ్వీ పతుల వినోదం కోసం,
కాలక్షేపం కోసం!

58. ప్రజా పాలన

రాజు, నియంత, ప్రజా నాయకుడు
ప్రజా పాలకు లెవరైనా గాని
ప్రజలకు శత్రువులైపోతూ వుంటారు
అధిక సంఖ్యాక ప్రజల కోరికలు
గొంతెమ్మ కోరికలుగానే వుంటూ వుంటై.

కరవ మంటే కప్పకు కోపం
విడవ మంటే పాముకు కోపం!
రెంటినీ సంతోష పరచడం ఎలా సాధ్యం?
పరిపాలకుల కుండే ఇబ్బంది అది!
కాగా, పాలకుల పట్ల మదంతో
క్రోధంతో మాత్సర్యం పెంచుకోవడం
పగ తీర్చుకోదలచడం న్యాయమేనా?
అన్యాయమూ, అధర్మమూ కాదా?
రాముడు కామ మోహాల నెరుగని మూర్ఖుడు!
దుర్యోధనుడు అరసికుడైన అజ్ఞాని!
వాళ్లవి రాజకీయాలు కాక పోయినా
ఉద్రేకాలను అధీనంలో
వుంచుకోలేక పోయిన చరిత్రలు అవి!

మానవుడు విస్తరించే కొలది
కుక్క బుద్ధి పెరిగింది!
ఆత్మ రక్షకులే తోకలుగా తయారై
తోకలే కుక్క నాడిస్తున్నై!
ఈ వాస్తవా లన్నీ
నీకు తెలుసు, నాకూ తెలుసు!
చూస్తూ మౌనం వహించడం తప్ప

నీవూ ఏమీ చేయలేవు,
నేనూ ఏమీ చేయలేను!

రాజరికంలో పనికిరాని మద మాత్సర్యాలు
ప్రజాస్వామికంలో పనికి వస్తాయా, కోకిలా?
మానవ లోక గమనం
ముందుకా, పెడలకా?

59. తిరిగి పట్టాలపైకి

పట్టాలు తప్పిన ఈ మానవ శకటాన్ని
తిరిగి పట్టాల మీద పెట్టడం
సాధ్యం కాదా, కోకిలా?
రాజ్యపాలన రౌడీలకు వదలి
కళాక్షేత్రంలో కాలం గడిపే మేధావులు
ఏమీ చెయ్యలేరు, నిజమే!
వాళ్ళ చేతికి తుపాకి ఇచ్చి
బైటి రోడ్డు మీద నిలబెడితే
ఎలా వుంటుందంటావు?

తుపాకుల్ని రౌడీలు లాక్కొని
మేధావుల్ని కాల్చి చంపేస్తా రంటావా!
ఆబాల గోపాలం సమస్త ప్రజలకూ
సైనిక శిక్షణ నిర్బంధం
చెయ్యమన్నా నందుకే!
''చేతగాని మగవాడవు
స్త్రీ జోలికి పోనేలా'' అన్నాను
'మానవుని మరొక మజిలీ' కావ్యంలో!

చేతగాని తనం వుండ కూడదు,
చేతగాని తనాన్ని నిషేధించాలి!
శిక్షించి సంస్కరించ లేకపోతే
ముళ్ల డొంకలను వలే నిర్మూలించి
ముందుకు దారి సుగమం చెయ్యాలి!
ఇది నా నినాదం
నీ గాన స్రవంతికి నిదానం!

60. వర్ణ సమ్మేళనం

ఇంద్ర ధనస్సులో ఏడు రంగులు
సంగీతంలో సప్త స్వరాలు
ఓషధులలో షడ్రుచులు
రాళ్ళలో నవ రత్నాలు
చంద్ర బింబంలో షోడశ కళలు -
ఇలా ఎన్నైనా చెప్పవచ్చు.
సృష్టిలోని సమస్త గుణాలూ
ప్రకృతి నిండా కనిపిస్తై
అన్నీ ప్రకృతి సిద్ధాలే!
ప్రకృతికి ప్రియమైనవే!
పైకి కనిపించే వైరుధ్యాలు కూడా
ఆత్మీయ మైనవే, అన్యోన్యత కలవే!

ఈ సత్యం నీకూ, నాకూ తెలుసు
తదితర జీవ కోటి కంతకూ తెలుసు!
మరి, కోకిలా,
మనుషుల కెందుకీ వర్ణ భేదాలు?
వర్ణానికీ, వర్ణానికీ నడుమ
ఎందుకీ ఉద్రిక్తతలు?

కర్రలతో కొట్టుకోడాలు,
కత్తులతో నరుక్కోడాలు ?
మానవుడిలోకి ఈ అధమత్వం
ఎలా వచ్చిందంటావు ?

61. మానవత్వం

మానవత్వం అంటే హ్యూమనిజం !
ఇతర జీవరాశులకువలెనే
మానవ జీవికి కూడా
ఒక విశిష్ట జీవ లక్షణం వున్నదనుకొని
మానవత్వం అన్నాను.
నిజంగా మానవుడి కొక విశిష్ట లక్షణం వున్నదా ?
లేదనే నా ఉద్దేశం !

గోవు గడ్డి తింటుంది
వ్యాఘ్రం మాంసం తింటుంది
ఈ రెండూ తినే గోముఖ వ్యాఘ్రం
మానవు డొక్కడే అన్నా నందుకే !

ప్రకృతి ధర్మాన్ని అనుసరించని వాడు
ఒక విశిష్ట నైజం లేనివాడు
ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో తనకే తెలియని వాడు
మొత్తం సృష్టికే ప్రమాదకారిగా పరిణమించినవాడు
మానవ జీవి ఒక్కడే !
ప్రకృతి సూక్ష్మాలను గ్రహించే
శక్తి గల మెదడుంది.
నడవడానికి రెండు కాళ్లు సరిపోగా
రెండు చేతులు స్వేచ్ఛగా పని చేస్తై.
ఈ ప్రత్యేక శక్తుల ద్వారా
ప్రపంచానికే ప్రమాదకారిగా

పరిణమించ గలిగాడు మానవుడు !
స్వార్థం, ధనార్జన, వ్యాపారం, లోభ మద మాత్సర్యాలు
అధికంగా పెంచుకొని
ప్రకృతిపై ఆధిపత్యం వహించిన మానవుడ్ని
ఉత్తమ జీవిగా నేను స్వీకరించలేను.

అందుకే...
మానవత్వం అనేది
ప్రత్యేకంగా ఏమీ లేదంటున్నాను !
ప్రత్యేకత వుంటే
అది సర్వ నాశక గుణం మాత్రమే !
ప్రేమిస్తాడు, చంపుతాడు, దొంగిలిస్తాడు
పెంచుతాడు, త్రుంచుతాడు
అవసరానికి మించి నిలవ చేసుకొంటాడు
నిలవల రక్షణ కోసం యుద్ధాలు చేస్తాడు
అన్నీ మానవ గుణాలే, మానవ లక్షణాలే !

ఏవో దైవీయ గుణాలను ఊహించి
వాటిని మానవత్వం అనడం
పామరుల వీర పూజా తత్వం మాత్రమే !

ఉన్నోదయ కోకిల

కోకిలా....
నీతోపాటు కాల జ్ఞానం గల జీవి
మరొకటుంది కదూ !
అది కోడి పుంజు !
బ్రహ్మ ముహూర్తంలో లేచి
లోకాన్ని మేలు కొలిపే కాల జ్ఞాని !
పల్లె పల్లెకూ, పట్టణ జనానికీ కూడా
అది తోడు నీడగా వుండేది !

మన స్వతంత్ర భారత వృద్ధ ప్రభువులు
కోడి పందాలను నిషేధించి
కోడి పుంజులను అంతం చేశారు!
విదేశీ దొరల మీది కోపంతో
స్వదేశీ గణ తంత్రాలను నిషేధించి
ఎంత ప్రగతిని సాధించారో తెలుసు కదా!
అక్కరలే దనుకొన్న విషయాన్ని నిషేధిస్తే
అది విశుద్ధ స్థానానికే ముప్పు తెస్తుందన్న జ్ఞానం
మన నూతన ప్రభువులకు లేక పోయింది!
ఇప్పటికీ అదే అజ్ఞానం!
ఏం చేస్తాం?
కోడి పందాలు పోతే
కొట్లాటలు ఆగాయా?
కాల జ్ఞానంలోని ఒక విశిష్ట ప్రకృతి
నశించి పోయిందంతే!

63. ఘర్షణే ప్రగతి

ఘర్షణ సహజ సిద్ధమే, కానీ
అది అభివృద్ధి నిరోధకం కాగూడదు!

వేదన ఘర్షణ ఫలితమే!
వేదనకు ప్రసవ వేదనే ఉదాహరణ!

మరణవేదనగా కనిపించేది
మరొక స్థితికి ప్రసవ వేదనే!
వేదన అభివృద్ధికరం, అభ్యుదయకరం, ఆనందకరం!
ఆనందో బ్రహ్మ అన్నారు ఋషులు!

పరబ్రహ్మంలోని రెండు శక్తుల ఘర్షణే సృష్టి
అది నిరంతరం, నిర్విరామం, నిత్యానందకరం!

అందులో నీ సభ్యత్వం స్థిరం,
నా ప్రాతినిధ్యం శాశ్వతం !

64. లక్ష అపస్వరాల భరించి

కోకిలా !
అనాదివీ నీవే, అనంతత్వమూ నీవే !
లక్ష అపస్వరాలను భరించి
ఒక్క పాటైనా పాడుకొందాం
అని నేను ప్రాసింది
నీ పాట వింటూనే !
పూవుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో !
అందుకని -
ముళ్ల తోట అననా దీన్ని ?
అని ప్రాశాను.

కోకిలలు నాలుగే,
తక్కిన పిట్టలు అసంఖ్యాకం
ఈ నా మధు వనంలో !
అందుకని -
పెరికి పారవేయనా దీన్ని ?
అని కూడా అన్నాను అక్కడే !

మనం మంచి అనుకునే దాని కంటే
చెడు అనుకునేదే అత్యధికం సృష్టిలో !
అందుకని -
సృష్టినే నిరాకరించగలమా ?

65. జాతీయ సోషలిజం

కులం ఒక జాతిగా, మతం ఒక వర్గంగా
నిత్య పోరాటాలతో అంతరించిపోతున్న జాతిని
సమైక్య పరచి ఏకీకృతం చెయ్యాలని
పట్టుణీకరణను ప్రతిపాదించాను.

కత్తి సాముతో కదం తొక్కుతున్న వారి నుంచి
సామాన్యులను రక్షించడం కోసం
నిర్భంధ సైనిక శిక్షణ ప్రతిపాదించాను.

సంస్కృతుల ప్రాతిపదికపై
జాతులను జాగృతం చేసి
జాతి కొక దేశంగా
లోకాన్ని పునర్మించడం కోసం
జాతీయ సోషలిస్టు పద్ధతి ప్రతిపాదించాను.
మేధావులు సాయుధులై
వీధి రౌడీయిజాన్ని నిర్మూలించాలన్నాను.
జ్ఞాన విజ్ఞానాలూ, ప్రతిభా ప్రాభవాలూ
అట్టి సోషలిజాన్ని నిఖిల దేశాలలోనూ
నిర్వహించా లన్నాను.

రాజకీయ పార్టీ లుండ కూడ దన్నాను.
నిరసనలకు, నినాదాలకూ
సమ్మెలకూ, ధర్నాలకూ తావుండ కూడదన్నాను.

నా ప్రతి పాదనలు స్వార్థపరులకు కిట్టవు
స్వప్రయోజకులకు పనికి రావు!
పదవీ ప్రాభవాలన్నీ తమ చేతుల్లోనే కల
ప్రజా నాయకు లెవరికీ
నా ప్రవచనాలు రుచించవు.

ప్రచార సాధనాధిపతులు పట్టించుకోరు!
అందుకే నాది ఒంటరిగొంతు అయింది!

66. నాది నీ రాజకీయం

నేను ప్రవక్తను కాదు,
ప్రవచనాలు పలుకుతున్న కవిని!
నాది గతాన్ని సొమ్ము చేసుకునే వ్యాపారం కాదు,
వర్తమానాన్ని భవిష్యత్తుకు మలుస్తున్న కర్షకుడ్ని!
వర్తమానం ఎంతగా గతుకుల రోడ్డులా వున్నదో చూపుతూ,
ఎంత ప్రవక్తల అపోహలతో, రాగద్వేషాలతో, స్వార్థ రాజకీయాలతో
కుతకుత లాడిపోతున్నదో దర్శింప చేస్తూ,
మానవుని మరొక మజిలీకి మార్గం వేస్తున్న ధార్మికుడ్ని!
దారిబత్తెం సమకూరుస్తున్న మధుపాయిని!
సుఖ సంతోషాలు సూత్రీకరిస్తున్న
యాత్రా స్పెషలిస్టును!

నాది రాజకీయం కాదు,
ప్రజా జీవన సరళి!
వ్యాపారం కాదు,
విశ్వ జనాస్వాద్య సుధా కలశం!

67. జీవిత నాట్యం

కోకిలా!
నాది ఒంటరి గొంతు కాదు,
నీదీ ఒంటరి గొంతు కాదు!
నీవు ఉన్నవోదయ ప్రవక్తవు,
నేను ఉన్నవోదయ ప్రవర్తకుడ్ని!
నీది ప్రకృతి విజ్ఞానం,
నాది మానవాభ్యుదయం!
మనిద్దరం కలిసిందే జీవితం,
మనిద్దరం కలిసి పాడిందే వికాసం,

మన బృందగానమే సుందర బృందావనం!

కోకిలా....
నీవు చిలకలా పలకగలవా
గీతా శ్లోకాలూ, ఉపనిషత్ సూక్తులూ?

గోరింకలా గోకుల కృష్ణుని
నామజపం చేయగలవా?

ఒక లక్ష్యం లేని ఆత్మలకు
ఎటు పోతే అదే మార్గం!
ఏది ఆకర్షిస్తే అదే లక్ష్యం!

నీవలా కాదు!
నీ ప్రతిభ నైసర్గికం,
నీ లక్ష్యం స్వభావ సిద్ధం!
నీ సందేశం ఒక్కటే,
లేవండి, ఉన్నతులు కండి అని!
లేచి పురోగమించడమే జీవితం!

68. రాధా తత్వం

నీవు మధు ప్రియవు,
మాధవ మిత్రవు!
లోక మిత్రుడ్నే నిరంతరం
నీ వెంట తిప్పుకునే ఉషస్సువు, రాధవు!

లోక మిత్రుడే నీ వెంటపడి పరిగెత్తుతుంటే
తత్కుటుంబంలోని మేమంతా
అతని వెంటబడి నీ చుట్టూ తిరుగుతున్నాం!
నీవు రాధవు!
భువనా లన్నీ నీ విహార విపినాలు!

భౌతిక రూపం కరిగి పోగా
నా మనస్సు నీ అడుగు జాడలలో విహరిస్తూ
నీవే అయిపోతున్నది !

అన్ని వేదాలకూ
రాధా వేదమే బీజం !
జీవ కోటి కంతకూ
రాధా నామాణువే జన్యువు !
అట్టి నీవు నా కిప్పుడు కావ్య నాయికవు !
నీది పంచమ స్వరం,
నాది తత్ స్వర సమ్మేళన సమానుు లేఖిని !

69. పురా విశ్వాసం

కోకిలా...
నీ వేదో చెపుతున్నావు
నే నేదో వింటున్నాను
నీ వేమి చెపుతున్నావో,
నే నేమి వింటున్నానో !
అంతా భ్రాంతి !

ప్రజలు నమ్మేది భ్రాంతినే !
వాళ్లకు తెలియదు కనుక నమ్మేస్తారు
నమ్మకం మీదే నడుస్తున్నది లోకం !

నీవు విశ్వ ప్రవక్తవు !
ఏమైనా చెప్పగలవు !
నీవు చెప్పేదంతా వాస్తవం, సత్యం, ధర్మం !
ప్రకృతి నైజమే ధర్మం
అందుకే నీవు ధర్మ ప్రవక్తవు !

నీ ధర్మాన్ని అర్థం చేసుకొని
ప్రజలకు వినిపించే నేనూ ప్రవక్తనే!
నాపై విశ్వాసం గల ప్రజలే
నిజమైన మానవులు!
అందుకే విశ్వాసం పరమ ధర్మం అయింది!

70. రంగులు

అన్ని రంగులూ అందమైనవే
అన్ని రాళ్ళూ ప్రశస్తమైనవే
అన్ని జీవులూ ప్రయోజనకరమైనట్టివే
అందరు మానవులూ వ్యక్తిత్వం కలవాళ్ళే!

మరి, తేడా లెక్కడుంటై?
మన దృక్కోణాలను బట్టి వుంటై!
తెల్లని కాకిరెట్ట అసహ్యకరం,
నల్లని కృష్ణుడు జగన్మోహనుడు!
పసుపు పచ్చన మనిషిలో ప్రమాదకరం!

అందాలూ, ఆనందాలూ, అనురాగాలూ
పరస్పర ప్రయోజనాలను బట్టి వుంటై,
ఆకర్షణలను బట్టి అలరిస్తై!

ప్రకృతిలో స్వచ్ఛత సాపేక్షకం,
సమదృష్టి సర్వేశ్వరం!

71. ఉన్నోదయ ధర్మం

ఉన్నోదయ ధర్మాన్ని
మానవుని మరొక మజిలీ అన్నాను కదూ!
మానవుడు మరొక మజిలీకి చేరాలంటే

ఏం చెయ్యాలి ?

నీవు చెపుతూనే వున్నావు,
ప్రవక్తలు వింటూనే వున్నారు !
అయితే...
తలొక విధంగానూ
ప్రజలకు చెపుతున్నారు !
వారు చెప్పింది వారి అనుచరులు వింటున్నారు,
అదే ధర్మమని విశ్వసిస్తున్నారు !

నేను ప్రవక్తను కాను కనుక
నా మార్గంలో నేను చెప్పాను,
ఇప్పుడు చెపుతున్నాను !
వినే వాళ్ళు పుణ్యాత్ములు,
విశ్వసించే వాళ్లు ధర్మాత్ములు !

72. సమోషః కిరణాలు

ఇంతకూ.....
నీవు చెపుతున్నదీ
నేను వివరిస్తున్నదీ ఏమిటి ?
సర్వ మానవ సమతా ధర్మం !
జాతీయతను ప్రాతిపదికగా తీసుకొని
దేశాలు ఏర్పడాలి !
ఎన్ని జాతీయతలు వుంటే
లోకం అన్ని దేశాలుగా
విభజింప బడాలి !
ప్రతి దేశమూ తన జాతీయత ప్రకారం
సర్వ మానవ సమతను
ప్రభుత్వ ధర్మంగా స్వీకరించాలి !
దానినే జాతీయ సోషలిజం అంటున్నాను.

అన్ని దేశాలూ చిన్నవైనా, పెద్దవైనా
జాతీయ సోషలిస్టు దేశాలుగానే వుంటై!
ఎవరి జాతీయతను వారు అనుసరిస్తూ
అభివృద్ధి పొందుతారు
పురోగమిస్తారు, ప్రగతిని సాధిస్తారు!
అన్ని దేశాల సమాఖ్య
ప్రపంచ ప్రభుత్వం అవుతుంది!

ఇందుకు అనుసరించవలసిన ప్రణాళిక...
పట్టణీకరణా, నిర్భంధ సైనిక శిక్షణా,
సహకార వ్యవసాయమూ, పరిశ్రమలూ,
ప్రజలంతా కలసి ఎన్నుకోసే అధ్యక్షుని పాలనా,
రెండే పార్టీల పద్ధతీ,
కుల మత చిహ్నాలు తొలగించుకొని
మానవుడు మానవుడిగా వికసించడం,
అన్ని రంగాలలోనూ స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం,
మరణ శిక్ష రద్దూ, జైళ్లను వ్యవసాయ
పారిశ్రామిక క్షేత్రాలుగా మార్చడం....

ఇలాంటి ఎన్నో పథకాలు
నా పంచమ స్వర కావ్యంలో వున్నై.
అవి నీ స్వరాలే కదా!

73. ధర్మ వీరం

''న న్నెవ్వరాప లే రీవే ళ
నా ధాటి కోర్వలే రీవేళ''
అన్నాడు బసవ రా జనుకొంటాను!
అదీ నిజమైన కవి అనవలసిన మాట!

కవుల మాటలు నీటి మూటలుగానే
నిమ్మ గాము లైపోతున్నై!
అవి కార్య రూపం ధరించి
హింసా రాజకీయాల పట్లు
తూటాలు కావలసి వుంది!
వేములవాడ భీమకవి మాటలు తూటాలై
రాజరికాలనే మార్చినై కాదా!

బలవంతుడు రాజు
బలహీనుడు బానిస,
బానిసగా బతక లేవా!
బలం సంపాదించుకో
అన్నా నొక చోట!

ప్రపంచ శాంతికి మార్గం
ఒక పౌరుష జీవిత మేనోయ్
కత్తికి కత్తి, కర్రకు కర్ర
కలిపిన నాడే సంధి కుదురునోయ్
అంటూ ఉద్బోధించాను!

చేత విల్లు కలవాడే
గీత నందుకోగలడు
అంటూ నిదర్శనం చూపాను!

ఇలా శతాధికంగా ప్రవచనాలు పలికాను,
సహస్రాధికంగా నినాదాలు చేశాను!

నేను సాహిత్య వ్యవసాయకుడ్ని!
నా కృషి సమస్తమూ
ప్రజాభ్యుదయాన్ని పండించి
రాశులుగా పొయ్యడమే!

నీవు నా సహచరివి, సహకారిణివి,
నా సరస్వతివి!
నీది ఒంటరి గొంతు కాదు,
నాది ఒంటరి గొంతు కాదు!

74. మేధా నైరంతర్యం

బ్రహ్మ, పరబ్రహ్మ, పరమాత్మ, శక్తి
ఈ మాట లన్నింటికీ ఒకటే అర్థం....
సృష్టికి కారణమై నడిపిస్తున్న
జీవశక్తి అని!

జీవశక్తికి భౌతిక రూపమే మెదడు, మేధ!
సృష్టి సమస్తమూ
చరాచర స్థావర జంగమాదు లన్నీ
మేధామయ ప్రకృతి రూపాలే!
జీవ రాశుల శరీరాలు మొత్తం
మేధాణు సంచితాలే కదా!
మానవ శరీరం మొత్తం మేధాణు ధారా శిల్పం!

పరమాత్మ నుంచి ఆత్మగా
ఆత్మ నుంచి తిరిగి పరమాత్మగా
యాతాయాత నిత్య నిరంతర ప్రవాహమే
నిత్య జీవిత ప్రవర్తనం!
ఈ పరమ ప్రవాహంలో
వివిధ రూపాల, ప్రమాణాల అలలం మనం!
నీవు కూస్తూనే వుంటావు,
నేను వ్రాస్తూనే వుంటాను!
పరమాత్మలోకి నిరంతరంగా
పోతూ వస్తూ వుంటాం
మేధావులం, మేధా మయులం
కళారూపాలం, కళ్యాణ కింకిణులం!

75. నా పీఠికలు

నా కవితలు పూల చెట్లైతే
నా పీఠికలు పూల కుండీలు,
నీళ్ల పాదులు, రాళ్ల గుట్టలు!

నా పద్యాలు దీప జ్యోతులైతే
నా కావ్యాలు దీప సభలు!

నా కావ్యాలు ఫల వృక్షాలైతే
అవి రాధాకృష్ణుల విహార వనాలు,
సీతా రాముల దండ కారణ్యాలు,

కోకిలా...
నా ప్రతి రచనకూ ఒక ప్రోత్సాహకం,
ఒక రసావేశ గుళిక,
ఒక ప్రేమశక్తి వుంటుందంటే
అది శతాధిక రూపాంతరాలలో ప్రకృతే,
ఏకైక రూపంలో అది నీవే!

నీవు దీపాని వైతే
నా పీఠికలు ప్రమిదలు!
నీవు రవి బింబాని వైతే
అవి సుప్రభాత భేరీలు!

76. కృతజ్ఞతా నమస్సులు

నా పీఠికలు పూలకుండీ లన్నాను కదూ!
అందులో నా రచనలు పూల చెట్లైతే
వాటి లతాంతాల ఉషస్సులు
నా కృతజ్ఞతాభి నమస్సులు!

నా ప్రతి రచన వెనుకా

ఒక ప్రోత్సాహక ప్రియశక్తి వున్నట్టే,
నా ప్రతి రచన ముద్రణ వెనుకా
అనేక ప్రోత్సాహక వదాన్య శక్తులుంటై!
అందులో ముఖ్యమైన కొందరికైనా
కృతజ్ఞతలు చెపుతూ వుండడం నా అలవాటు!

ఈ కావ్యానికి ప్రోత్సాహక ప్రియవైన నీకు
ముందుగా కృతజ్ఞతలు చెపుతున్నాను!

తరువాత...

కావ్య నిర్మాణ భావాంకురానికి హేతువు
ఢిల్లీలో పద్మభూషణ్ అందుకొని
ఆ ముందు రోజే ఇల్లు చేరిన ఉత్సాహం!
పద్మభూషణ్ రావడానికి
మేం ఢిల్లీ వెళ్లడానికి మూల హేతువులైన
రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి,
సాహితీ బావగారు కాకి మాధవరావు గారికి,
కృతజ్ఞత లెన్ని చెప్పినా చాలవు!

నా కూడా ఢిల్లీ వచ్చిన ఎస్కార్టులు
మా ఆవిడ హైమవతికీ
మా అమ్మాయి విజయ పల్లవికీ
మమ్ము విమాన మెక్కించిన
మా మరో అమ్మాయి విజయేందిరకూ
ఢిల్లీలో తిరిగి విమాన మెక్కించిన
ఐ. ఏ. ఎస్. అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా గారికీ
కృతజ్ఞతలు చెప్పకపోతే ఎలా?

నేను చెపుతూ వుంటే

లేఖకురాలుగా వ్రాస్తూ
ఈ కావ్యానికి ఈ రూపం తెచ్చిన
విజయేందిర (విజ్జు) కూ,
ముద్రించి సిద్ధపరచడానికి తోడ్పడిన
ఖండాంతర విద్యా దర్శకా చార్యులు
ఆంధ్ర విశ్వ విద్యాలయ ఫిజిక్సు ప్రొఫెసర్
ఆచార్య రత్నరాజు గారికి
కృతజ్ఞతా రసాంజలి నివేదించుకోవలసి వుంది!

విద్యార్థి దశ నుంచీ పరిచయస్తులుగా
మిత్రులుగా, ఆత్మీయులుగా
సాహితీ పోషకులుగా
నాకు చేదోడు వాదోడై వికసించిన
జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య గారికి,
సాహితీ భూషణి వాసిరెడ్డి సీతాదేవి గారికి
కృతజ్ఞతలు ఎప్పుడూ చెపుతున్నవే!

ఇంకా...
రకరకాలుగా సహాయ పడుతూ వస్తున్న
అడ్వకేటు గొల్లపల్లి రమేష్ బాబు,
డాక్టరు రమేష్ చంద్ర,
ఆర్టిస్టూ, కంప్యూటరిస్టూ అయిన
పొన్నాడ రవిచంద్ర,
టీవీ కళాకారిణి పంపన సుమిత్ర
మున్నగు యువతీ యువకు లెంతో మందికి
నా అక్షరాశీస్సులు!
పైగా....

నాకు ప్రియ సచివుడైన
పొన్నాడ రవిచంద్ర
నా సాహితీ దర్బారులో
ఆస్థాన చిత్రకారుడు
ముఖ పత్ర రచనా ధురీణుడు
ముద్రణ కళలో క్షణక్షణం వికసిస్తున్న చతురుడు !

కోకిలా ...
ఇది వృష నామ సంవత్సరంలో
నీ తొలి గాన సందేశానికి
పీఠికా ముక్తాయింపు !
నా తొంభై ఒకటవ జన్మోత్సవ సందర్భ మిది !
జన్మ తేదీ పంధొమ్మిదిని తిరగవేస్తే
తొంభై ఒకటి అవుతుంది కదా !
నీ కోసం ఇదొక సాహితీ చమత్కార పురస్కారం !

COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 3 : VACHANA KAVITHALU PART - III

డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితా సంపుటాలు : భాగం 1 & 2
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

ఇతర రచనలు

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)